ఆగస్టు 2021

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి: 49 సంచిక: 5 383 పేజీలు: 52 రూ. 20/-

నిషేధపు సంకెళ్ల నుంచి
భావ సంఘర్షణా ప్రపంచంలోకి



అరుణతార కథలకు
కరుణాకర్ వేసిన బొమ్మలు

KLVA101M196

సంపాదకీయం

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి:49 ◆ సంచిక:5 ◆ 383 ◆ ఆగస్టు 2021 ◆ వెల: 20/-

ఇక మన హృదయ స్పందనలపై నిఘా

పాణి

భారతదేశంలోని ప్రగతిశీల, విప్లవ శక్తులు కశ్మీర్ వలె పాలస్తీనా స్వేచ్ఛా స్వాతంత్ర్య పోరాటాల గురించి విరివిగా మాట్లాడుతూ వచ్చాయి. అట్లాగే భారత్, ఇజ్రాయిల్ పాలకుల దుర్మార్గాలను ఎండగడుతూ వచ్చాయి. ఈ రెంటికీ ఉన్న సామ్యంలో ముస్లిం వ్యతిరేకతను అంతర్జాతీయ రాజకీయార్థిక చిత్రపటం మీద విశ్లేషిస్తూ వచ్చాయి.

ఈ మొత్తానికి రుజువుగా ఇవాళ ఇజ్రాయిల్‌లోని ఎన్‌ఎస్‌వో అనే కార్పొరేట్ సంస్థ తయారు చేసిన పెగాసస్ అనే సాఫ్ట్‌వేర్ భారతదేశంలోని బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు రాజ్యానికి ఎంతగా అందివచ్చిందో గమనించవచ్చు. సాంకేతిక రంగంలో సాధించే విజయాలు ప్రపంచ మానవాళి పాలిట ఉరితాళ్లుగా కూడా మారుతాయని, రాజ్యపు దుర్మార్గాలకు అంతులేని అవకాశాలను ఇస్తాయని; ప్రజలను ఆదుపు చేసి పాలకుల నిరంకుశ పాలనకు దోహదపడాయని చెప్పడానికి కూడా ఈ పెగాసస్ తాజా ఉదాహరణ.

పెగాసస్ ఒక దుర్మార్గమైన గూఢచర్యపు సాఫ్ట్‌వేర్. గూఢచర్యాన్ని చట్టబద్ధం చేసి అధికారికంగా కొనసాగించగల ప్రజాస్వామ్యం మనది. ఈ విషయంలో కూడా వలస కాలంలోని గూఢచర్య చట్టాలను అధికార మార్పిడి తర్వాత కొనసాగిస్తున్నారు. వాటికి మరింత పదును పెడుతూ వచ్చారు. కొత్తవి చేరుస్తూపోయారు. భారత ప్రజల సర్వసత్తాక సార్వభౌమ దేశంలో రాజ్యం చట్టబద్ధంగానే ప్రజలపై నిఘా పెట్టడంలోని నిసిగ్గుతనం మన ప్రజాస్వామ్యానికి తగిన విషయమే. దీనికి ఇప్పుడు ఈ పెగాసస్ తోడైంది.

గూఢచర్యం పేరుతో భారత పాలకులు డెబ్బై ఏళ్లుగా చేస్తున్న దుర్మార్గాల మీద ఎంతో చర్చ జరిగింది. ఎంతో నిరసన వచ్చింది. గూఢచర్యం వల్లనే, అందులో కూడా అనేక తప్పుడు సమాచారంతో, తప్పుడు ఆరోపణలతో, కుట్రపూరిత దురుద్దేశ సమాచారం ఆరోపించడంతో వేలాది, లక్షలాది మందిని హింసించిన ఉదాహరణలు ఉన్నాయి. వాటిబారినపడి వారి ఆక్రందనలు చాలా వరకు గాలిలో కలిసిపోయాయి. వాళ్ల అనుభవాలు చరిత్రకెక్కకుండాపోయాయి. అవన్నీ ప్రజల, ప్రజాస్వామికవాదుల, ఉద్యమకారుల విమర్శలుగానే మిగిలిపోయాయి. ఈ పని కేంద్రంలో అధికారం వెలగబెట్టిన పార్టీలన్నీ చేశాయి. రాష్ట్రాలను ఏలినవాళ్లందరూ చేశారు. ఈ గూఢచర్య దుర్మార్గాలపై వచ్చిన నిరసనలను సహితం అందరూ అణిచివేశారు.

వీటన్నింటి కొనసాగింపుగానే భారత రాజ్యం ఫాసిస్టు దశలోకి చేరుకున్నది. మిగతా పాలకులకు ఇప్పుడు అధికారంలో ఉన్న బ్రాహ్మణీయ హిందుత్వ పాలకులకు కొంచెం తేడా కూడా ఉన్నది. ఇవాళ పెగాసస్‌ను పార్లమెంట్‌లో వ్యతిరేకిస్తున్న వాళ్లంతా తమ కిందికి ఇట్లా నీళ్లు వస్తాయని ఊహించలేదు. అందుకే అరిచి కేకలు పెడుతున్నారు. చివరికి ఈ చర్చ, ఆందోళన ఎక్కడికి చేరుకుంటుందో జాగ్రత్తగా గమనించాలి. 'ఉన్నత' స్థానాల్లో ఉన్న వారి ఫోన్ల మీదికి పెగాసస్‌ను ప్రయోగించడం అనుచితమనే చోటికి ఇది తప్పక చేరుకుంటుంది. దాని అర్థం 'సంఘ వ్యతిరేక' శక్తులపై కొనసాగించమని. ఎవరు ఈ సంఘ వ్యతిరేకులు? 'ఉన్నత' స్థానాల్లో ఉన్న వాళ్లను ప్రశ్నించేవాళ్లు, చికాకుపెట్టేవాళ్లు, ఉద్యమాలు చేసేవాళ్లు. ఆ రకంగా పాలకులకు నచ్చనివాళ్లు, అసమ్మతివాదులు అందరూ పెగాసస్ ప్రయోగానికి 'అర్హు'లవుతారు. వాళ్లు సంఘపరివార్‌కే కాదు, రేపు అధికారంలోకి రాబోయే పాత, కొత్త పార్టీలకు కూడా కంటగింపు అయ్యే వాళ్లు.

ఫాసిజం మన దగ్గర ఎట్లా ఉంటుందో అర్థం చేసుకోడానికీ ఇదీ ఉదాహరణే. ఫాసిస్టు రాజ్యం ప్రజలను ఎంతగా భయంలోకి తోసివేస్తుందో, అంతగా ప్రజలను చూసి భయపడుతుంది. అందువల్లే అణచివేత తీవ్రం చేస్తుంది. ఇందులో భాగంగా ఇప్పుడు మోదీకి పెగాసస్ అవసరమైంది. ఇది ఇజ్రాయిల్ పాలకులకు, భారత పాలకుల ఉమ్మడి అవసరం కావడం ఆలోచించాలి.

పెగాసస్ గత గూఢచర్యాలకంటే పూర్తి భిన్నమైనది. అనేక గూఢచర్య సంస్థలు చేసే పనిని ఈ సాఫ్ట్‌వేర్ చేస్తుంది. దీన్ని ఎలక్ట్రానిక్ పరికరాల్లోకి ప్రవేశపెట్టి సకల సమాచారాన్ని, మనుషుల కదలికలన్నిటినీ రాబడుతుంది. ప్రజల సంభాషణలను, ఆలోచనా వినిమయాన్ని కొల్లగొడుతుంది. గతంలో ల్యాండ్ ఫోన్ ట్యాపింగ్ కంటే ఇది అత్యంత ఆధునికమైనది. ప్రమాదకరమైనది. మనుషులంటే పాలకులకు ఓటర్లు, మార్కెట్‌కు వినియోగదారులు మాత్రమే కావచ్చు. కానీ మనుషులు సృజనాత్మక జీవులు. పెగాసస్ సాఫ్ట్‌వేర్ ఒకసారి మన ఎలక్ట్రానిక్ పరికరాల్లోకి జొరబడిందంటే అది మన హృదయ స్పందనలను సహితం ట్యాపింగ్ చేస్తుంది. మన ఆంతరంగిక జీవితంలో సహితం గూఢచర్యం చేస్తుంది. ప్రైవసీ అనే ఆధునిక విలువకు భంగకరంగా తయారవుతుంది. నిత్యం ప్రజల మీద గూఢచర్యపు కత్తి వేలాడుతూ ఉంటుంది. ఇది ఎన్ని రకాల అభద్రతలకు లోను చేస్తుందో ఊహించడం కూడా కష్టమే. దీన్ని పాలకవర్గంలోని ముఠాలు ఎందుకోసమైనా వ్యతిరేకించవచ్చు. కానీ ప్రజలు మాత్రం ప్రజాస్వామిక విలువలను ఆధారం చేసుకొని సూత్రబద్ధంగా వ్యతిరేకించాల్సి ఉంది.

సంచిక - 383

కెవిఆర్, శారదాంబ స్మారక కమిటీ మిత్రులు అరుణతార నిర్వహణకు
25 వేలు విరాళం ఇచ్చారు. వారికి విప్లవాభివందనాలు.

ఎడిటర్
అరసవిల్లి కృష్ణ

వర్కింగ్ ఎడిటర్
పి. వరలక్ష్మి

రచనలు పంపించాల్సిన చిరునామా :
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు-516360

లే అవుట్: సునీతాగ్రాఫిక్స్, విజయవాడ, సెల్: 9490099059

* email : arunatara1977@gmail. com

Like Page:
//viplava rachayitala sangahm arunatara

facebook :
//viplava rachayitala sangahm virasam

Virasam websites : www.vasanthamegham.com
www.virasam.org

చందాలు, విరాళాలు పంపాల్సిన చిరునామా

అరసవిల్లి కృష్ణ, 6-1/16-7ఎ/1, పెద్దిరాజు స్ట్రీట్, ప్రైజర్‌పేట, విజయవాడ-520001.
చెక్‌లు/డ్రాఫ్టులు/ఆన్‌లైన్‌లో పంపడానికి
A. Krishna, Bank : State Bank of India, A/c. No. 52018355595, IFSC : SBIN0020714,
Branch : Vagu Center, Vijaywada.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల - రూ. 20: సంవత్సర చందా - రూ. 240/-
రెండు సంవత్సరాల చందా - రూ. 450/-; మూడు సంవత్సరాల చందా - రూ. 680/-
ఐదు సంవత్సరాల చందా - రూ. 1100/- ; దశాబ్ది చందా - రూ. 2200/-

వసంతమేఘం

www.vasanthamegham.com ★ సాహిత్య, రాజకీయార్థిక పక్షపత్రిక

వసంతమేఘం అంతర్జాల పక్ష పత్రిక చదవండి. గతంలో విరసం.ఆర్గ్‌లాగే వసంతమేఘాన్నీ ప్రోత్సహించండి. రచనలు పంపించండి. మీ రచనలతో, విమర్శలతో, సూచనలతోనే వసంతమేఘం విప్లవ, ప్రజా సాహిత్య సాంస్కృతికోద్యమంలో తన కర్తవ్యాలను నెరవేర్చగలుగుతుంది. - **వసంతమేఘం టీం**

కామ్రేడ్ కరుణాకర్‌కు అరుణతార నివాళి

కా. కరుణాకర్ విప్లవ, విప్లవ సాహిత్యోద్యమ అభిమాని. విరసానికి చిరకాల మిత్రుడు. ఆయన రచనలు అరుణతారలో అచ్చయ్యాయి. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా ఆయన అరుణతార కథలకు అర్థస్ఫోరక చిత్రాలు అందించారు. విరసం@50 సందర్భంగా అద్భుతమైన లోగో తయారు చేసి ఇచ్చారు. ప్రతి నెలా ఈ పేజీలో ఆయన పేరు తప్పక కనిపించేది. ఆయన అకాల మరణం తీరని లోటు. కరుణాకర్ నివాళి వ్యాసాలు ఈ సంచికలో ఉన్నాయి. ఆయనకు అరుణతార కన్నీటి నివాళి ప్రకటిస్తోంది

- అరుణతార సంపాదకవర్గం

ఈ సంచికలో..

నిషేధం ఎత్తివేత ఉత్తర్వు

తెలంగాణ ప్రభుత్వం (7)

పత్రికా ప్రకటనలు

ఇది ప్రజా విజయం (8)

ఇది మనందరి విజయం (9)

వ్యాసం

సాహితీసంస్థల ఉనికిని నిర్ణయించాల్సింది ప్రభుత్వ యంత్రాంగం కాదు

- సి.యస్.ఆర్. ప్రసాద్ (10 - 11)

ప్రకటనలు

నిషేధానంతరం మళ్లీ ఇలా (11)

నిరసన స్వరాలు(12 - 16)

లీగల్ నోటీసు (17)

కరుణాంతరంగం

'నన్ను తీర్చిదిద్దిన కరుణన్న' - శిరోమణి (18 - 22)

కరుణశీల రాజకీయ హృదయం - పాణి (23 - 24)

ప్రసంగ పాఠం

మన సంస్కృతులను బ్రాహ్మణీయ భావజాలం నుండి విముక్తి చేద్దాం

- కె. మురళీధరన్ (25 - 30)

సాహిత్య లేఖ (30)

నివాళి

రాయలసీమలో సాహసిక మూర్తిమత్వం (31)

పెద్ద కథ

బాలి - నిత్య (32-40)

వ్యాసం

సాహిత్య చరిత్రలో ఇరవై ఏళ్ళ 'నల్లపొద్దు' - నాగేశ్వరాచారి (41 - 42)

కవితలు

ఎక్సోడస్ - మహమూద్ (43- 44)

ఆమె - విజయ (44)

పత్రికా ప్రకటన

ఇంత దుఃఖం ఉంటుందా? - అరసవిల్లి కృష్ణ (45)

వ్యాసం

కులం - కుటుంబం - తెగ - రమేష్ పట్నాయక్ (46-50)

వసంతమేఘం అంతర్జాల పత్రికలో...

వసంతమేఘం మే 15, 2021 సంచిక

సంపాదకీయం:

మన హృదయం, ఆలోచనలు, చేతులూ పాలస్తీనా కోసమే: సాగర్

కవితలు:

నాగరికత గుండెలమీద చావుపాట - జసింతా కెర్ కెట్టా

మీ యుద్ధం ఎవరి కోసం - క్రాంతి కిరణ్

వర్తమానం - గిరి ప్రసాద్ చెలమల్లు

ఈ చీకటి ముఖమ్మీద - వడ్డెబోయిన శ్రీనివాస్

దేశం శవయాత్ర చేస్తోంది - వడ్డెబోయిన శ్రీనివాస్

మన ప్రేమ అజరామరం - క్రాంతి కిరణ్

పోరుపతాక హోరును నేను..!! - ఇక్బాల్

సంభాషణ: పులి - ఎం. కె. కుమార్

వ్యాసాలు:

ఆ తల్లుల త్యాగాలు గుర్తున్నాయా? - అరుణ్

సాహిత్య విమర్శలో చారిత్రక పాత్ర - పాణి

దండకారణ్య సమయం: కరోనా కాలంలో పోలీసు కాల్పులు

- సాగర్

మమత ఫాసిజం మాటేమిటో! - పాణి

కథలు:

దొర్లు దొర్లు పుచ్చకాయ్ - శ్రీనివాసమూర్తి

అడవి నేర్పిన అమ్మతనం - పుష్ప పద్దా

లోచూపు: అస్తిత్వాలు, ఆధునికత, ప్రగతిశీల సామాజిక పరివర్తన

- మెట్టు రవీందర్

సంభాషణ: అక్షరాలపై నిషేధం ఆలోచనలపై నిషేధమే

- పలమనేరు బాలాజీ

ఆర్థికం: ఉపాధి దమాల్ - ఎ. నరసింహారెడ్డి

సంభాషణ: నిషేధంపై విరసం అభ్యంతర పత్రం - విరసం

ఇంటర్వ్యూ: మమత ఫాసిస్టు వ్యతిరేకి కాదు - సౌరవ్ బెనర్జీ

వసంతమేఘం జూన్ 1, 2021

సంపాదకీయం:

లక్ష ద్వీప్ కోసం మాట్లాడదాం - సాగర్

వ్యాసాలు:

దండకారణ్య సమయం: దండకారణ్యం అప్‌డేట్స్ - పాణి

సాహిత్య విమర్శలో జేసీ - పాణి

ప్రతి విపత్తూ పెట్టుబడికి వరమే - పి. సాయినాథ్,

అనువాదం అరుణ్

SOLIDARITY WITH THE PALESTINIAN PEOPLE

VICTORY TO THEIR STRUGGLE

- Communist Party of Greece [Marxist - leninist]

Let Oppressed Identities and Class struggles be united Against Fascism

- Revolutionary Writers' Association

సమీక్ష: అనేక ఎరుకలు – మా సత్యం

కొత్త కవిత్వం: మానవుడే కవితా వస్తువు– అరసవిల్లి కృష్ణ

అలనాటి రచన: యుద్ధ కాలపు మానవీయ కథనం– వెంకటరావు

అంతర్జాతీయ చిత్ర సమీక్ష: చివరి ఆరు రోజులు! – శివలక్ష్మి

సమకాలీనం: తబ్లీగీ జమాత్ కరోనా జిహాద్ అయితే మరి కుంభమేళా? – సతీష్ బైరెడ్డి

కథావరణం: "దుఃఖానికి ఆసరా మనిషే!–అంటున్న కథ –పలమనేరు బాలాజీ

కథ..కథయ్యిందా! : రాబందు – గాలివాన: వెంకటకృష్ణ

లోచూపు : అంటరానితనం గాయాలకు అక్షరభాష్యం 'అకడమిక్ అన్ టచ్ బులిటీ' – మెట్టు రవీందర్

కవితలు

బస్తరు నా బడి..!! – సంతాల్

నేనే మీ కవిత్వం – మహమూద్

దీపాల వెలుతురు నీడలో – మహమూద్

ఏది ప్రజాస్వామ్యం – క్రాంతి కిరణ్

లైబిసన్ – గిరి ప్రసాద్ చెలమల్లు

పరాకాష్ట – ఉప్పెన

వసంతమేఘం జూన్ 15, 2021

విశాఖ ఉక్కును కాపాడుకుందాం – సూర్యం

ఆర్థికం: భావ స్వేచ్ఛకు డిజిటల్ సంకెళ్లు – ఎ.నర్సింహారెడ్డి

రాష్ట్రబడ్జెట్–రాయలసీమ – అరుణ్

వర్గకసిని సిరా చేసుకున్న కో.ప్ర – వి. చెంచయ్య

డిజిటల్ పాఠాలు పేద విద్యార్థులకు చేర్చడంలో పాలకులు విఫలం – కె.ఆనంద్

కవితలు:

కనుపాపల్లో నుండి – కిరణ్

కదిలే కాలం – కెక్యూబ్

కథల తాతయ్య – శ్రీనివాసమూర్తి

కాలమ్స్

కథా తెలంగాణ – ఊడలమర్రిలో విధ్వంస మూలాలు – కోడం కుమారస్వామి

లోచూపు – గుండెల్నిమండించే మంటో కథలు – మెట్టు రవీందర్

కారా స్మృతిలో...

వ్యాసాలు

కారా కథలు ఎందువల్ల నిలుస్తాయి? – ఎన్ వేణుగోపాల్

కథతో ప్రయాణం – పి చిన్నయ్య

జీవిత దృక్పథమే కథా.. కథల నిలయమే.. కారా మాస్టార్ – కుప్పిలి పద్మ

సాహిత్యంలో ప్రాసంగికత: కారా ఉదాహరణ – పాణి

తెలుగు కథకు కారా చేసిందేమిటి ? – వై. కరుణాకర్

కారా కథా దృక్పథం – కాత్యాయనీ విద్మహే

కారా కథలో స్త్రీ కోణం – బి. అనూరాధ

డాక్యుమెంటరీలో మాస్టారు – తుమ్మేటి రఘోత్తంరెడ్డి

కుల సమస్యను చిత్రించడంలో కా.రా. సఫలమా? విఫలమా? – జి.లక్ష్మీనరసయ్య

సంభాషణ

మీలా బతకడం మీకే సాధ్యం – గంటేడ గౌరునాయుడు

అవుట్ బరస్ట్! – బమ్మిడి జగదీశ్వరరావు

లోచూపు! – బమ్మిడి జగదీశ్వరరావు

చదువు! – బమ్మిడి జగదీశ్వరరావు

వసంతమేఘం జూలై 1, 2021 సంచిక

సంపాదకీయం : జూలై 4: చీకటి రోజుల వెలుగు గానం – పాణి

వ్యాసాలు

ఆధునిక తెలుగు కవిత్వంలో భాష – చెంచయ్య

ప్రకృతి, ప్రజల ఎంపిక – విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం – ఎం. లక్ష్మి

కాకోరి నుండి నక్సల్బరి దాకా – సీమా ఆజాద్

అంబానీ రాజ్యంపై ముంబాయి విద్యుత్ కార్మికుల పోరాటం – ముంబయి ఎలెక్ట్రిక్ ఎంప్లాయీస్ యూనియన్

మునికాంతపల్లి కతలు – శ్రీనివాసమూర్తి

నిశ్శబ్దంగా నిష్క్రమించిన రచయిత – పి. వరలక్ష్మి

కాలమ్స్

కథ..కథయ్యిందా! – పీడిత ప్రాంతాల కథ – జి.వెంకటకృష్ణ

లోచూపు – తెహ్జీబ్ జిందాబాద్ ! – మెట్టు రవీందర్

బహుజనం – బ్లాక్ఇంక్‌లో పిల్లల కన్నీరు – అరణ్య

ఆర్థికం – ఎ. నరసింహారెడ్డి

కథావరణం – అభివృద్ధిని ప్రశ్నిస్తున్న కథ – పలమనేరు బాలాజీ

కారా స్మృతిలో

కారా కథల్లో కొన్ని వైరుధ్యాలు – జి. వెంకటకృష్ణ

కారాతో మేము – అల్లం రాజయ్య

మాస్టారితో నా జ్ఞాపకాలు కొన్ని – అట్టాడ అప్పలనాయుడు

ప్రపంచ కథకుడు – ఉదయమిత్ర

కథలు

అమ్మ పాటల పుస్తకం – పాణి

సమరంలో సంబరాలు – సాధన

కవితలు

మానవత్వం చంపబడుతోంది – శాఖమూరి రవి

చేవ – జి.లక్ష్మీనరసయ్య

కాలం తొంగి చూస్తోంది – శ్రీనివాసమూర్తి

(నిషేధ కాలంలో మే తర్వాత అరుణతార రాకపోవడం వల్ల మే 15 వసంతమేఘం సంచిక నుంచి ఇప్పటి దాకా అన్ని సంచికల ఇండెక్స్ ఇక్కడ ఇస్తున్నాం. జూలై 15 సంచిక సాంకేతిక ఇబ్బందుల వల్ల రాలేదు. వర్కింగ్ ఎడిటర్, అరుణతార)

విరసం తదితర ప్రజాసంఘాలపై నిషేధం ఎత్తివేస్తూ ఉత్తర్వు



నిషేధపు సంకెళ్ల నుంచి

రూపొందుతున్న కొత్త పోరాటాల ప్రపంచంలోకి

పార్ట్ -1 అసాధారణ అథారిటీ ప్రచురణ నం. 125

హైదరాబాద్, బుధవారం, జూన్ 23, 2021

ప్రభుత్వ నోటిఫికేషన్

జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్

(ఎస్‌పిఎల్‌డి)

16 కొత్త ఫ్రంట్ సంస్థలను చట్టవ్యతిరేకమైనవిగా ప్రకటించడం - ఉపసంహరణ

తెలంగాణ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్, 1992 (యాక్ట్ నెంబరు 21, 1992) లోని సెక్షన్ 3 లోని సబ్-సెక్షన్ (5) ద్వారా యివ్వబడిన అధికారాలను ఉపయోగించి, తెలంగాణ ప్రభుత్వం తేదీ 30-03-2021నాడు జనరల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్ ద్వారా జారీ చేసిన జీవో సిపిఐ (మావోయిస్ట్) యొక్క 16 కొత్త ఫ్రంట్ సంస్థలను చట్టవిరుద్ధమైన సంఘాలుగా ప్రకటించే నోటిఫికేషన్‌ను జీవో ఎంఎస్ నం 122, జనరల్ అడ్మినిస్ట్రేషన్ ((ఎస్‌పిఎల్.డి) 23 జూన్, 2021 ద్వారా ఉపసంహరించుకొన్నది:

తదుపరి అవసరమైన చర్యలు తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చేపడతారు.

- సోమేష్ కుమార్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

ప్రకటన

విరసం సహా 16 ప్రజా సంఘాలపై నిషేధం ఎత్తేసిన తెలంగాణ ప్రభుత్వం

ఇది ప్రజా విజయం

రాజ్యాంగ వ్యతిరేక ఉపా చట్టాన్ని రద్దు చేసి రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి

స్టాన్‌స్వామి మరణానికి కారకులపై విచారణ జరిపి శిక్షించాలి

తెలంగాణ ప్రభుత్వం 16 ప్రజా సంఘాలపై నిషేధం ఎత్తివేస్తూ 6వ తేదీ సాయంకాలం జీవో 122 విడుదల చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిషేధాలు చెల్లవని, రాజకీయ, భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేత చట్టాల తో అడ్డుకోవడం తగదని రెండు తెలుగు రాష్ట్రాల్లో, దేశ వ్యాప్తంగా వచ్చిన నిరసనకు తలొగ్గి తెలంగాణ ప్రభుత్వం నిషేధం ఎత్తివేస్తూ ఈ జీవోను విడుదల చేసింది.

నిజానికి ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి పాలకులు తయారు చేసుకున్న అత్యంత నిరంకుశమైన తెలంగాణ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్‌లోని నిబంధనలకు కూడా పూర్తి విరుద్ధంగా మార్చి 30న ప్రభుత్వం జీవో 73 విడుదల చేసింది. దీన్ని సవాల్ చేస్తూ కొన్ని నిషేధిత సంఘాలు కోర్టుకు వెళ్లాయి. ఆ పిటీషన్ల మీద జులై మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ వేయాల్సి ఉన్నది. అయితే న్యాయ స్థానంలో వాదించడానికి కనీసంగా కూడా ముఖం చెల్లని ప్రభుత్వం కౌంటర్ వేయకుండా జీవో 73ని వెనక్కి తీసుకుంటున్నట్లు జీవో ఎంఎస్ 122ను జూలై 6 సాయంకాలం విడుదల చేసింది. అదీ జూన్ 23 తేదీతో తీసుకొచ్చింది. నిషేధం విధించిన జీవో కూడా మార్చి 30 తేదీతో తయారు చేసి ఏప్రిల్ 23న పత్రికలకు విడుదల చేసింది.

జీవో 73లో నిషేధం విధిస్తూ చేసిన ఆరోపణలపై ఏ వివరణ ఇవ్వకుండా జీవో 122 తీసుకరావడం ప్రభుత్వ నిజాయితీ రాహిత్యాన్ని తెలియజేస్తోంది. అయితే ఈ రెండు జీవోల్లో ఈ 16 సంఘాలను మావోయిస్టు అనుబంధ సంఘాలనే వ్యవహరించారు. వేర్వేరు రంగాల్లో స్వతంత్ర ఆలోచనలతో, పని పద్ధతులతో కొనసాగుతున్న ఈ సంస్థలను ఇలా మావోయిస్టు అనుబంధ సంఘాలని అనడాన్ని, అదీ నిషేధం ఎత్తివేస్తూ విడుదల చేసిన జీవోలో కూడా వ్యవహరించడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ సంఘాలన్నీ చాలా సంవత్సరాలుగా వివిధ ప్రజా సమూహాల సమస్యలపై చట్టబద్ధంగా, నిబద్ధతతో పని చేస్తున్నాయి.

ఈ సంస్థలన్నీ ప్రజాస్వామిక విలువలను గీటురాయిగా చేసుకొని పని చేస్తున్నాయి. ఇలాంటి రాజకీయ స్వేచ్ఛను భారత రాజ్యాంగం పౌరులందరికీ ఇచ్చింది. రాజకీయ స్వేచ్ఛ అంటే అందరూ టీఆర్ ఎస్ రాజకీయాలనే అనుసరించడం కాదు. సమాజ ప్రగతికి దోహదం చేసే ఎలాంటి రాజకీయాలనైనా విశ్వసించవచ్చు. ఈ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం ఈ సంఘాలను నిషేధించింది.

ఈ నిషేధాన్ని తెలంగాణ సమాజమేగాదు, మిగతా ప్రాంతాల ప్రజలు కూడా ప్రశ్నించారు. ఇది అన్యాయమన్నారు. ఈ సంఘాలు ప్రజా జీవితాన్ని ఉన్నతీకరించడానికి గత కొన్ని దశాబ్దాలుగా చేస్తున్న కృషి కొనసాగవలసి ఉన్నదని అభిప్రాయపడ్డారు. దీంతో ప్రభుత్వం విధిలేక నిషేధాన్ని ఎత్తివేసుకున్నది. దీని కోసం కృషి చేసిన ప్రజాస్వామికవాదులందరికీ మా సంస్థలు ధన్యవాదాలు తెలియజేస్తున్నాయి. మా సంస్థలపై నిషేధం ఎత్తివేసినంత మాత్రాన తెలంగాణలో పౌర ప్రజాస్వామిక హక్కులకు సానుకూల వాతావరణం ఉన్నదని అనుకోడానికి లేదు. ఇప్పటికే ఎన్నో పీడిత సమూహాలు తీవ్రమైన అణచివేతను, హక్కుల ఉల్లంఘనను అనుభవిస్తున్నాయి. వాటన్నింటికీ వ్యతిరేకంగా మనం కలిసి పోరాడాల్సి ఉన్నది. మా సంస్థలపై నిషేధమైతే తొలగించారు గాని వంద మందికి పైగా ప్రజా సంఘాల సభ్యులపై యుఏపీఏ కేసులు సహా అనేక కేసులు ఉన్నాయి. ఒక్కొక్కరి మీద నాలుగు అయిదు కూడా ఉన్నాయి. కేవలం తెలంగాణలోనేగాదు, దేశవ్యాప్తంగా వేలాది మంది పోరాట ప్రజల మీద, కార్యకర్తల మీద, మేధావుల మీద, పాత్రికేయుల మీద ఈ దుర్మార్గ చట్టాన్ని ఆపాదించారు. వందలాది మంది అక్రమ నిర్బంధంలో ఉన్నారు. వాళ్లకు బెయిళ్లు తిరస్కరిస్తున్నారు. యుఏపీఏ పేరుతో నిర్బంధించిన వారిపట్ల రాజ్యం, పోలీసులు, జైళ్లు, చివరికి న్యాయస్థానాలు ఎంత అమానుషంగా ఉంటాయో ఫాదర్ స్టాన్ స్వామి మరణమే ఉదాహరణ. ఆయన్ను మన దుర్మార్గ వ్యవస్థ, ముఖ్యంగా న్యాయవ్యవస్థ హత్య చేసింది. కాబట్టి ఆయన మృతికి కారణమైన వాళ్లందరినీ విచారించి శిక్షించాలని మేం కోరుతున్నాం. దేశ వ్యాప్తంగా భీమా కోరేగావ్ సహా అన్ని అక్రమ కేసుల్లో జైళ్లలో ఉన్నవారందరినీ విడుదల చేయాలని కోరుతున్నాం. మొత్తంగానే యుఏపీఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

(నిషేధం ఎత్తివేశాక జూలై 9న విరసం హైదరాబాదులో మిగతా 15 ప్రజాసంఘాలతో, ప్రజాస్వామికవాదులతో నిర్వహించిన పత్రికా సమావేశంలో విడుదల చేసిన ప్రకటన)

ప్రకటన

ఇది మనందరి విజయం
ప్రజల విజయం

మీ అందరికీ విప్లవాభివందనాలు



మిత్రులారా...

విప్లవ రచయితల సంఘంతో పాటు మిగతా పదిహేను ప్రజా సంఘాలపై తెలంగాణ ప్రభుత్వం నిషేధం ఎత్తివేస్తూ 6వ తేదీ సాయంకాలం జూన్ 23వ తేదీతో జీవో 122 విడుదల చేసింది. దీన్ని . దిద్దు బాటు చర్యగా భావించగలమా? రాజ్య స్వభావం తెలిసిన మనం అనుకోలేం. మార్చి 30న జీవో 73లో చేసిన ఆరోపణలు తప్పని భావిస్తున్నట్లు నమ్మగలమా? అక్షరాల్లో కూడా ప్రభుత్వం అలాంటి స్పష్టత ప్రకటించదల్చుకోలేదు. నిషేధపు జీవోను రహస్యంగా తెచ్చింది. ఏ వివరాలు లేకుండా ఉపసంహారణ జీవో విడుదల చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఈ రెంటిలోనూ 'మావోయిస్టు అనుబంధ సంఘాలు' అనే మాట ఉపయోగించింది. వేర్వేరు రంగాల్లో, భిన్న ప్రజాస్వామిక దృక్పథాలతో పని చేస్తున్న ఈ స్వతంత్ర సంఘాలను సీపీఐ మావోయిస్టుకు అంటగట్టడం మాత్రం మానుకోలేదు. ఇది అత్యంత గర్హనీయం.

అయినప్పటికీ ప్రభుత్వం కాయితం మీదైనా సరే నిషేధాన్ని వెనక్కి తీసుకోక తప్పలేదు. నిస్సందేహంగా దీని వెనుక మీ అందరి నిరసనలు ఉన్నాయి. ఒక సాహిత్య సంస్థను నిషేధించడం ఏమిటనే మీ విశ్లేషణలు పని చేశాయి. అభ్యుదయ, ప్రజా, పీడిత అస్తిత్వ వాద సాహిత్యకారులందరూ ఇది విరసం భావ ప్రకటనా సమస్యగానే కాక సమాజ సమస్యగా భావించారు. సుమారు 750 మంది తెలుగు, భారతీయ సాహిత్యకారులు, కళాకారులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు, ఉద్యమకారులు, ప్రవాసాంధ్ర రచయితలు నేరుగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపిన విజ్ఞప్తి పని చేసింది. రాజకీయ పార్టీలు, వివిధ ప్రజాస్వామిక, విప్లవ సంస్థలు, సాహిత్య కళా సంస్థలు కరోనా కాలంలో కూడా వీధుల్లోకి వచ్చి తెలియజేసిన నిరసనల ఒత్తిడి పని చేసింది. రచనా స్వేచ్ఛకు సాహిత్యకారులుగా మీరు, సమాజం ఇచ్చే అపారమైన గౌరవం వల్లనే ఇంత ఆందోళన సాధ్యమైంది. ఈ పని అంతా మీరు విరసంపట్ల హృదయపూర్వకమైన అభిమానంతో చేశారు. సామాజిక బాధ్యతగా నిర్వర్తించారు. ఈ మొత్తానికి వాహికగా దిన పత్రికలు, అంతర్జాల పత్రికలు, ప్రత్యామ్నాయ పత్రికలు నిలిచాయి. ఆయా ప్రతికల సంపాదకుల, జర్నలిస్టుల పాత్రను మేం గుర్తు చేసుకుంటున్నాం. ఫేస్‌బుక్ మాధ్యమంలో వేలాది మంది విప్లవ, విప్లవ సాహిత్యోద్యమ సానుభూతిపరులు తమ నిరసనను తెలియజేస్తూ విరసం పక్షాన నిలబడ్డారు. మీ అందరికీ విప్లవాభివందనాలు తెలియజేసున్నాం.

నిషేధాలు ఎల్లకాలం చెల్లవు... కళా సాహిత్యాలు పాలకుల ఆంక్షలకు లోబడి సాగవు... వాళ్లు గీచిన గీతల్లో నడవవు... సాహిత్యకారుల సృజనాత్మకతకు ఎల్లలు ఉండవు... దానిని ఎవరూ నిర్బంధించలేరు... నిషేధించలేరనే మీ ప్రజాస్వామిక ఆకాంక్ష ముందు రాజ్యం ఇప్పటికి వెనక్కి తగ్గక తప్పలేదు.

ఇది మనందరి విజయం. ప్రజా విజయం.

యాభై ఏళ్లుగా విరసం కృషి, లక్ష్యం, దృక్పథం రాజ్యానికి పదే పదే కంటగింపుగా మారుతోంది. దీనికి వ్యతిరేకంగా తెలుగు సమాజ, సాంస్కృతిక మేధో రంగాల్లో విరసం కృషికి మీ అందరి అపారమైన మద్దతు దొరుకుతోంది. ఈ రెండు విషయాలు మరోసారి రుజువయ్యాయి. విరసం ఏర్పడిన నాటినుండి నిర్బంధాలు, సృజనాత్మకతపై నిషేధాల విరుచుకపడ్డ ప్రతి సందర్భంలోనూ తెలుగు సాహిత్య మేధో రంగాలు విరసం పక్షాన దృఢంగా నిలబడ్డాయి. ఈ ఏభై ఏళ్ల ప్రయాణంలో అనేక రాజ్య ఆంక్షల మధ్య, అణచివేతల మధ్య సాగిన ప్రయాణం పొడవునా మీ స్నేహ హస్తం ఆలంబనగా దొరికింది.

2005 ఆగస్టులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిషేధపు చీకట్ల నుంచి బైటికి వచ్చినప్పటిలాగే ఇప్పుడూ విరసం తన తాత్విక దృక్పథానికి, చారిత్రక బాధ్యతకు, సాంస్కృతిక కర్తవ్యాలకు పునరంకితం అవుతోందని సగర్వంగా ప్రకటిస్తోంది. ఈ రెండు నిషేధాలు మా తాత్విక, కాల్పనిక శక్తిని ఇనుమడింప జేశాయి. నిర్బంధం, నిషేధం కేవలం నిర్మాణ పరమైన తాత్కాలిక ఇబ్బందులే. తెలంగాణలో, ఆ మాటకొస్తే ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ రెండు నిషేధాలకు ముందు, మధ్యలో కూడా విరసం మీద తీవ్ర అణచివేత కొనసాగింది. తెలంగాణలో ఈ నిషేధానంతరం ప్రజాస్వామిక అవకాశాలు విప్లవ సాహిత్యోద్యమానికి ఉంటాయని ఆశించడానికి ఏమీ లేదు. ఇది మామూలే.

దాన్ని కూడా ఎప్పటిలాగే మీ అందరి సహకారంతో అధిగమించి కొనసాగుతామని ప్రకటిస్తున్నాం. ఈ ఫాసిస్టు చీకటి కాలంలో మనం మరింత పదునుగా రాద్దాం, శక్తివంతమైన సాహిత్యాన్ని సృజిద్దాం. రచన మన ఉమ్మడి కార్యక్షేత్రం. అక్కడ మరింత పరస్పర సహకార, సంఘీభావ చైతన్యంతో కొనసాగుదాం. మన ప్రజల పట్ల మన బాధ్యతను మరింత గాఢంగా నిర్వహిద్దాం.

అరసవెల్లి కృష్ణ
అధ్యక్షుడు
విప్లవ రచయితల సంఘం

7 జులై 2021

సాహిత్య సంస్థల ఉనికిని నిర్ణయించాల్సింది ప్రభుత్వ యంత్రాంగం కాదు

- సి.యస్.ఆర్. ప్రసాద్

"సాహిత్యాన్ని రాజ్యాంగబద్ధంగా వుంచడానికి ప్రభుత్వం బలవంతంగా పూనుకుంటే సత్యాన్వేషణ దెబ్బతింటుందని" త్రిపురనేని మధుసూదనరావు అభిప్రాయం.

ఆధునిక రాజ్యం, 'పౌర సమాజాల ఆవిర్భావానికంటే కొన్ని వేల సంవత్సరాల క్రితం నుండే సాహిత్యం, కళలు ఏదో ఒక రూపంలో మానవ సమూహ జీవితంలో భాగంగా వుండేవన్నది నిరూపణ అయిన చారిత్రిక సత్యం. మనుషులు ఆహార సేకరణ దశలో జీవిస్తూ, సంచార జీవితాన్ని నడుపుతున్న కాలంలో కూడా తమ చుట్టూ వున్న ప్రకృతిలోని జీవజాలాన్ని ప్రకృతిలోని మార్పుల్ని గీతల రూపంలో కొండచరియల్లో, గుహల్లో లిఖిస్తూనే వచ్చారు. అది తొట్టతొలి కళ.

ఆదిమ గణ సమాజంలో కూడా సాహిత్యం అంగికమైన భాగం. గణ జీవితం నుండి గణ సాహిత్యాన్ని విడదీయడం సాధ్యంకాని పని. ఆ దశ నుండి మానవ జీవనం పురోగమిస్తున్న కొద్దీ వస్తూత్పత్తి ప్రారంభమై స్థిర జీవితానికి మానవ సమాజం అలవాటైన తరవాత భాష, లిపి ఏర్పడ్డాయి. అవి అధునిక సాహిత్య, సాంస్కృతిక ప్రక్రియలకు మూలం. అంతేగాక మానవుల సమష్టి జీవనం నుండి, వస్తూత్పత్తి కోసం చేసే సమష్టి శ్రమ నుండి సాహిత్యం, పాట, నృత్యం, చిత్రకళ ఏర్పడ్డాయి. కాబట్టి సాహిత్యాది విషయాలన్నీ సమష్టి స్వభావాన్ని కలిగి వుండేవే.



ఏ సమాజంలోనైనా వివిధ భావజాలాలు వ్యక్తంగానో, అవ్యక్తంగానో చలామణిలో వుంటాయి. వర్గ సమాజంలో పాలకవర్గ భావజాలం అధిపత్యంలో వుంటే, మిగిలిన భావజాలాలు ప్రజాజీవితంలో భాగంగా వుండి వాళ్ళ చైతన్యాన్ని వున్నతీకరిస్తూ పాలకవర్గాల అపచైతన్యాన్ని ఎదిరించడానికి అవసరమైన చింతనను, సమకూరుస్తుంటాయి. ఈ క్రియలో కళారూపాలతోపాటు, సాహిత్యానిది విశిష్టమైన పాత్ర.

ప్రజల మధ్య అన్యోన్య సంసర్గాన్ని పెంచి సామాజిక బంధన శక్తిగా సాహిత్యం పనిచేస్తుంది. ఏ సామాజిక దశలోనైనా సాహిత్యం పూర్తిగా సామాజిక జీవితానికి సంబంధించిన ప్రక్రియగానే వుంటుంది. రచయితలు నిత్యం సమాజంలో జీవించే మనుషులు. ఒక రచన ఒక రచయిత వ్యక్తిగతమైన సృష్టిగా అనిపించవచ్చుగాని మొత్తంగా చూస్తే సాహిత్యం నిర్వహించేది సామాజిక పాత్ర మాత్రమే.

భావజాలాలైనా, సంస్థలైనా సమాజంలో ఉనికిలో వుండడానికి కారణం ఆ సమాజపు భౌతిక పరిస్థితే. అంటే వస్తూత్పత్తి, పంపిణీ, వినిమయాల మధ్య వుండే అన్యోన్య సంబంధమే. ఈ సంబంధాలే అంతిమంగా మానవ సంబంధాలను నిర్దేశిస్తాయి. అలాంటి మానవ సంబంధాలలో వున్న అసమానత్వాన్ని అధిపత్యాన్ని హింసను విమర్శనాత్మక వాస్తవంగా ప్రతిబింబిస్తూ రచయితలు రచనలు చేస్తారు. అది సమాజం వారికిచ్చిన బాధ్యత. సమాజం పట్ల వాళ్ళు ఆవాహన చేసుకున్న బాధ్యత.

సమాజం మౌలిక స్వరూపంలో గుణాత్మకమైన మార్పులు సంభవించి ఒక నూతన ఆర్థిక వ్యవస్థ దానికనుగుణమైన సామాజిక వ్యవస్థ రూపొందుతాయి. అలాంటి సమయంలో సహజంగానే పాత సమాజంలో ఉనికిలో వున్న కొన్ని భావజాలాలకు, అవగాహనలకు కాలం చెల్లిపోతుంది. కొత్త సమాజం తన ఉనికికి, కొనసాగింపుకూ, అభివృద్ధికి అవసరమైన భావజాలాన్ని రూపొందించుకొంటుంది. ఒక వ్యక్తిఎంత గొప్పవాడైనా, ఒక సమూహం ఎంత శక్తివంతమైనదైనా గత సమాజంలోని కాలంచెల్లిన భావజాలాన్ని సాహిత్యరూపంలోనైనా మరొకరకంగానైనా నూతన సమాజంలో ప్రచారంచేయ సాహసించలేదు. అంటే నూతన సమాజంలో గతకాలపు భావజాలానికి కాలం చెల్లిందన్నమాట.

అయినా పాలకవర్గాలు ప్రతి సందర్భంలోనూ తమకు అనుకూలంగా వుండే అ కాలంచెల్లిన భావజాలాన్ని బలవంతంగా ప్రజలచేత ఆమోదింపచేయడానికి ప్రయత్నిస్తాయి. ఆ సమయంలోనే దానికి నూతన సమాజపు సాహిత్య సాంస్కృతిక భావజాలాలతో ఘర్షణ ఏర్పడుతుంది. ఈ ఘర్షణను, తాను రూపొందించుకున్న రాజ్యాంగ చట్టాల ద్వారా బలవంతంగానైనా పరిష్కరించుకోవడానికి రాజ్యం ప్రయత్నిస్తుంది. అందులో భాగంగానే సాహిత్య సంస్థలను, సాహిత్యాన్ని నిషేధించడం.

అయితే అంతమాత్రాన సమాజంలో వున్న ఘర్షణ అంతం కాదు. పైగా క్రమక్రమంగా ప్రజలు మిలిటెంట్‌గా సంఘటితం కావడానికి అది వుపయోగపడుతుంది. సమాజంలో ఒక భావజాలం, సాహిత్యం లేదా కళల అవసరం లేదా ప్రాసంగికత వున్నంత కాలం వాటిని బలవంతంగా తొలగించడం ఏ ప్రభుత్వానికి సాధ్యం కాదని చరిత్ర నిరూపించింది.

నిషేధానంతరం మళ్లీ ఇలా....

తెలంగాణ ప్రభుత్వం విరసం సహా16 ప్రజా సంఘాలపై నిషేధం ఎత్తివేస్తూ 6వ తేదీ సాయంకాలం జీవో 122 విడుదల చేసింది. రెండోసారి నిషేధం నుంచి విరసం బైటికి వచ్చింది. ఏప్రిల్ 23వ తేదీ విరసాన్ని నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం పత్రికలకు ప్రకటన విడుదల చేసింది. దాని ప్రకారం 73 రోజుల నిషేధపు చీకట్లు తొలగిపోయాయి. నిజానికి నిషేధ ఉత్తర్వుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంతకం మార్చి 30 నాడే చేశారు. ఆ ప్రకారం 96 రోజులు విరసం నిషేధాన్ని అనుభవించి తిరిగి తన పునరంకిత కర్తవ్యాలతో ప్రజా జీవితంలోకి వచ్చింది.

2005నాటి నిషేధంతో పోల్చుకుంటే ఇది పూర్తి భిన్నమైన రాజకీయ సామాజిక సందర్భం. అలాగే నిషేధించిన తీరు, ఎత్తివేసిన తీరు కూడా భిన్నమైనదే. ఆనాటి నిషేధంలో అరుణతార మూడు నెలలపాటు రాలేదు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో నిషేధం లేకపోవడం ప్రత్యేకత. దీన్ని ఆసరా చేసుకొని అరుణతార ఏపీ నుంచి తీసుకరావాలని ప్రయత్నించాం. మే సంచిక 'విరసంపై మళ్లీ నిషేధం' అనే ముఖపత్రంతో విజయవాడ నుంచి ప్రచురించాం. కానీ దానికి కూడా సాంకేతిక, చట్టపరమైన సమస్యలు వచ్చాయి. 'ఇట్లా తేవడానికి వీల్లేద'న్నారు. దాంతో మా కొత్త ప్రయత్నం మే సంచికతోనే ఆగిపోయింది. ఈ కాలమంతా వసంతమేఘం అంతర్జాల పక్ష పత్రిక ఒక్కటే నడపగలిగాం. జులై 6 నిషేధం ఎత్తివేశాక అంతక ముందటి సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ ఆగస్టు సంచికతో మళ్లీ విప్లవ, విప్లవ సాహిత్యాభిమానుల ముందుకు అరుణతార వస్తోంది.

నిషేధంలో కూడా మే సంచిక రావడంతో ఆ తర్వాత కూడా వస్తుందని చాలా మంది రచయితలు, పాఠకులు ఫోన్లు చేస్తూ వచ్చారు. అందరికీ అరుణతార ఇబ్బందులు చెప్పడానికే ఈ వివరణ.

అరుణతారకు నిర్బంధాలు, నిషేధాలు కొత్తకాదు. అయితే అవి పత్రిక నిర్వహణను తీవ్రంగానే ప్రభావితం చేస్తున్నాయి. ప్రత్యామ్నాయ ప్రజా పత్రికల ప్రచురణపై కూడా నిఘా, ఆంక్షలు, బెదిరింపులు పెరిగిపోయాయి. అందువల్ల కూడా అరుణతార ఆంధ్రప్రదేశ్‌కు రాక తప్పలేదు. ఇక్కడ ఎంత అవకాశం ఉంటుందో చూడాల్సిందే. అయితే తెలుగు సమాజ సాహిత్య అవసరమైన అరుణతారకు పాఠకులు, రచయితలే కొండంత అండ. ముఖ్యంగా ఎప్పటిలా అభిమానులు విరాళాలు ఇచ్చి ఈ నిర్బంధ కాలంలో సహితం అరుణతార కాంతులీనడానికి సహకరించాలని కోరుతున్నాం.

- సంపాదకవర్గం

తెలంగాణా ప్రభుత్వం విప్లవ రచయితల సంఘాన్ని నిషేధించిన నేపథ్యం ఇది. సాహిత్య సృజనను రాజ్యాంగం ద్వారా లోబరుచుకోవాలనుకోవడం భ్రమ మాత్రమే. ఆ చర్య అంతిమంగా సమాజం ఎదుగుదలకు అవరోధంగా మారుతుంది. పైగా ఒక సాహిత్య సంస్థ అవసరం, ప్రయోజనం ఒక సమాజానికి వుందా లేదా అని నిర్ణయించడానికి అవసరమైన తూకపురాళ్ళు ప్రభుత్వ యంత్రాంగం దగ్గర వుండవు. దానిది యాంత్రికమైన ప్రజావ్యతిరేక ధోరణి.

మానవ హృదయానికి, మేధస్సుకు సంబంధించిన సున్నితమైన అంశాలేవీ రాజ్యానికి అర్థంకావు. సమాజాన్ని ఉన్నతీకరించడంలో సాహిత్యానికివున్న పాత్రను అర్థం చేసుకోగల సున్నితత్వం పాలకుల్లో కలికానికైనా కనపడదు.

ఒక సాహిత్య సంస్థ ఉనికి అవసరమా కాదా అని నిర్ణయించగలిగిందీ, నిర్ణయించాల్సిందీ సాహిత్య సమాజం మాత్రమే. గత యాభై సంవత్సరాలుగా విరసం విస్తృతంగా వైవిధ్యపూరితంగా చేసిన సాహిత్య సృజన తెరచిన పుస్తకం లాంటిది. దీనినంతటినీ పరిశీలించిన జస్టిస్ టి.యల్.యన్. రెడ్డి కమీషన్ గతంలో విరసం మీద అనాటి ప్రభుత్వం విధించిన నిషేధం చెల్లదని ప్రకటించింది.

తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ అవే ఆరోపణలతో విరసాన్ని నిషేధించింది. విరసం సాహిత్య సాంస్కృతిక ఆచరణ నేరపూరితమైతే అలాంటి విప్లవ సాహిత్య సృజనని పరిశీలించడానికి, తెలుగు భాషను, సాహిత్య రూపాలను ఉన్నతీకరించడంలో దాని పాత్రను పరిశీలించి విరసం ప్రాసంగికతను నిర్ధారించడానికి రచయితలతో కూడిన ఒక జ్యూరీని నియమించాలి.

ఒకవేళ ఇది సాధ్యం కాదని తెలంగాణ పాలకులనుకుంటే, తమ ఆస్థానంలోనే వున్న తత్వవేత్తలు, కవులు, కళాకారులు, మేధావులతో ఈపని చేయించవచ్చు. ఇలాంటి సోషల్ ఆడిట్ నిర్వహించడానికి పాలకులు ఒక జ్యూరీని నియమిస్తే వాళ్ల దగ్గరైనా విరసం తన వాదనలు వినిపిస్తుంది. ఈ యాభై ఏళ్ళ కాలంలో విరసం సాహిత్య సృజనే చేసిందా, లేక శాంతిభద్రతలకు భంగకరంగా వుండిందా, ప్రజల్ని రెచ్చగొట్టిందా, లేక చైతన్యవంతుల్ని చేసిందా అనేది అ జ్యూరీ నిర్ణయించాలి. ఇది అత్యంత ప్రజాస్వామిక పద్ధతి.

తెలుగు సమాజం గుణాత్మకంగా మారిపోయిందని, ఉన్నతమైన విలువలు సమాజంలో పాదుకున్నాయని, ప్రజల్ని ఇంకెంత మాత్రం విలువలపరంగా ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం లేదని, కాబట్టి అలాంటి పాత్ర నిర్వహించాల్సిన సాహిత్యానికి కాలం చెల్లిపోయిందని ఆ జ్యూరీ అభిప్రాయపడుతుందేమో చూద్దాం. అప్పుడు కూడా తెలుగు సాహిత్య సమాజంలో దాని మీద కూలంకషంగా చర్చ జరుగుతుంది. అ చర్చ విరసానికే కాదు, నూతన సాహిత్య సృజనకారులందరికీ ఉపయోగంగా వుంటుంది.

రాజ్యాంగం భావప్రకటనా స్వేచ్ఛని ఇచ్చింది కాబట్టి, తమ భావాలను చెప్పుకోడానికి హక్కు ఉన్నదని భావించి విరసాన్ని ఏర్పాటు చేయలేదు. రచయితలు తమ మేధో శక్తియుక్తుల్ని సమాజానికి అందించి ప్రజలలో నూతన ఆలోచనల్ని భావాలను, చైతన్యాన్ని పాదుకొల్పాల్సిన బాధ్యతను గుర్తించినవాళ్లు విరసాన్ని ఏర్పాటు చేశారు. మూడు తరాలుగా అలాంటి అవగాహన ఉన్న రచయితలు, కళాకారులు, మేధావులు విరసంలో చేరి పని చేస్తున్నారు. సాహిత్య మేధో కృషి చేస్తున్నారు. అట్లా విరసం ఉనికి, పని సమాజానికి అవసరమైనంత కాలం విప్లవ రచయితల సంఘం సమాజాన్ని అంటిపెట్టుకొనే వుంటుంది. సమాజానికి విరసం చేసే వాగ్దానం ఇదే.

నిరసన స్వరాలు



విప్లవ రచయితల సంఘాన్ని తెలంగాణ ప్రభుత్వం నిషేధించడాన్ని నిరసిస్తూ సాహిత్య కళా మేధో రంగాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచే గాక దేశ వ్యాప్తంగా, ఇతర దేశాల నుంచీ 780 మంది నిరసన సంతకాలు చేశారు. విరసంపై నిషేధం భారత రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీకి విజ్ఞప్తి చేశారు.

విరసంపై నిషేధం తన యాభై ఏళ్ల సాహిత్య సాంస్కృతిక ఆచరణను తెలియజేస్తోంది. విరసం ప్రజా నిబద్ధతకు, సమకాలీన భావజాల, రాజకీయ ప్రపంచంలో విరసం ప్రభావాన్ని, పాత్రను తెలియజేస్తోంది. రాజ్యంపై, సామాజిక, సాంస్కృతిక ఆధిపత్య శక్తులపై విరసం ధిక్కారానికి , ప్రత్యామ్నాయానికి నిదర్శనమే రెండోసారి నిషేధం.

అలాగే విరసం సామాజిక శక్తికీ, సాంస్కృతిక నైతిక శక్తికీ నిదర్శనం ఈ అపార స్నేహపూరిత సంఘీభావం.

విరసంపై నిషేధాన్ని కేవలం ఒక సాహిత్య సంస్థపై నిషేధంగానేగాక మావన అభివ్యక్తిపై, కాల్పనిక శక్తిపై, సమాజ నాగరికతా వికాసంపై దాడిగా భావించి నిరసన తెలిపిన వారికీ, ఈ సంతకాల సేకరణకు పూనుకున్న సాహిత్యకారులకు విప్లవ రచయితల సంఘం ధన్యవాదాలు చెబుతోంది.

తేది 26- 5 -2021

శ్రీ సోమేష్ కుమార్ గారికి,
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,
తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాదు.

విషయం: జీవో ఎం ఎస్. నెం. 73, తేదీ 30.3.2021, జనరల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌పిఎల్‌డి) శాఖ - తెలంగాణ ప్రజా భద్రతా చట్టం -1992 ప్రకారం విప్లవ రచయితల సంఘాన్ని చట్ట వ్యతిరేక సంస్థగా ప్రకటించి నిషేధించటం తగదని రచయితలు, కళాకారులు, మేధావుల విజ్ఞప్తి.

సర్,

విప్లవ రచయితల సంఘం యాభై ఏళ్లకుపైగా తెలుగు సాహిత్య మేధో రంగాల్లో పని చేస్తున్న సంస్థ. సమాజంలో మార్పును కోరి సంస్కరణోద్యమ కాలంలో కందుకూరి , గురజాడ , కుసుమ ధర్మన్న, దేశానికి బ్రిటిష్ వలస పాలన నుండి స్వతంత్రాన్ని కోరి జాతీయోద్యమ కాలంలో ఉన్నవ లక్ష్మీనారాయణ, గరిమెళ్ళ సత్యనారాయణ, దామరాజు పుండరీకాక్షుడు, గుఱ్ఱం జాషువా, కనుపర్తి వరలక్ష్మమ్మ వంటి వాళ్ళు వ్యక్తులుగా చేసిన సాహిత్య సృజన కలాపాన్ని మరింత ఉన్నతంగా ముందుకు తీసుకువెళుతున్న సంస్థ. ఆర్థిక అసమానతలు లేని నవ సమాజ నిర్మాణం లక్ష్యంగా అభ్యుదయ కరమైన భావజాలం కలిగిన రచయితలు సంఘాలుగా ఏర్పడి చేసిన కృషిని మరింత నిర్దిష్టంగా, సముజ్వలంగా కొనసాగిస్తున్న సంస్థ విరసం.

తెలుగు సమాజాన్ని, భాషా సాహిత్య రంగాలను ప్రజాస్వామిక విలువల దిశగా వికసింప చేయటంలో గొప్ప చారిత్రక పాత్రను నిర్వహించిన సంస్థ ఇది. సాహిత్య చరిత్రలో ప్రముఖంగా ప్రస్తావించబడే శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, సత్యమూర్తి, రావిశాస్త్రి, కాళీ పట్నం రామారావు వంటి కవులు, రచయితలు విరసంతో సంబంధం ఉన్నవాళ్లే. విరసం ఆళ్వార్ స్వామి, కాళోజి తదితర తెలంగాణా రచయితల సాహిత్యానికి పెద్ద పీట వేసింది. ఈనాడు తెలంగాణ రాష్ట్ర కవిగా గుర్తించి గౌరవించుకొంటున్న కాళోజి కడ దాకా విరసంతో ఉన్నాడు. ఇక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సాధనలో విరసం నిర్వహించిన సాంస్కృతిక పాత్రను ఈ సందర్భంగా తప్పక గుర్తుచేసుకోవాలి. అటువంటి విప్లవ రచయితల సంఘాన్ని తెలంగాణ ప్రభుత్వం చట్ట వ్యతిరేక సంస్థగా ప్రకటించడం ప్రజాస్వామ్య విలువలకు, ఆదర్శాలకు భంగకరం అని మేం అభిప్రాయపడుతున్నాం.

భావ వినిమయం లేకుండా మానవజాతి వికాసాన్ని ఊహించుకోలేం. సాహిత్యమంటే భావ వినిమయం. మానవీయ విలువల ఉన్నతీకరణ దిశగా సాహిత్య సృజనలో రచయితల పాత్ర కీలకమైంది. రచయితలు, మేధావులు తమ సృజనాత్మక కృషిద్వారా, విమర్శనా వ్యాసంగం ద్వారా సమాజ సంస్కృతుల ప్రజాస్వామికీకరణకు దోహదం చేస్తారు. విరసం చేసింది అదే .

ప్రజలు తమ ఆకాంక్షలను వ్యక్తీకరించుకోడానికి, న్యాయమైన హక్కులు సాధించుకోడానికి సంఘాలు పెట్టుకొని ఉద్యమించటం ఆధునిక ప్రపంచ చరిత్ర. అలాంటి పోరాటాల నేపథ్యంలోనే అత్యున్నత ప్రజాస్వామిక విలువలు అతి సహజంగా భారత రాజ్యాంగంలో భాగం అయ్యాయి. ఆ క్రమంలోనే మన రాజ్యాంగం భావ ప్రకటనా స్వేచ్ఛను, సంఘం పెట్టుకొనే హక్కును ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదంగా గుర్తించింది.

విప్లవ రచయితల సంఘం సభ్యులు తమ సాహిత్యం ద్వారా గత యాభై ఏళ్లలో తెలుగు సమాజ సాహిత్య రంగాలలో ప్రజాస్వామికీకరణకు దోహపడుతున్నారని మేం భావిస్తున్నాం. ప్రజా

చైతన్యాన్ని అక్షరబద్ధం చేసే క్రమంలో ఆ సంస్థ అన్ని చట్టబద్ధ అవకాశాలను వాడుకొని పని చేస్తున్నది. కాబట్టి విరసంతో సహా 16 సంఘాలను చట్ట వ్యతిరేక సంస్థలుగా ప్రకటించిన మీ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతున్నాం.

ఇట్లు

1.దాట్ల దేవదానం రాజు 2. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 3. ఖాదర్ మొహియుద్దీన్ 4. ఓల్గా 5. కుప్పిలి పద్మ 6. ఆర్వీ రామారావు, ఎడిటర్, విశాలాంధ్ర 7. నందిని సిధారెడ్డి 8. మేడిపల్లి రవికుమార్ (ఎస్. వి యూనివర్సిటీ) 9. అరుణాంక్ లత 10. సంగిశెట్టి శ్రీనివాస్ 11. ఎస్ ఆశాలత (యాక్టివిస్ట్) 12.బజరా 13.అన్వర్ 14. అంజయ్య (నాగార్జున యూనివర్సిటీ) 15. వినోదిని మాదాసు 16. కె.రామచంద్రమూర్తి (సీనియర్ జర్నలిస్ట్) 17. పసునూరి రవీందర్ 18. మాడభూషి శ్రీధర్ 19. పెద్దింటి అశోక్ కుమార్ 20. ఒమ్మి రమేష్ బాబు 21. అట్టాడ అప్పలనాయుడు 22. కె.వరలక్ష్మి 23. స్కైబాబా24. కే. శివారెడ్డి 25. సత్యగోపి 26. శాంతి నారాయణ 27. జి. త్రివిక్రమయ్య (బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం, వారణాసి) 28. దాదా హయత్ 29. కె.ఎన్ .మల్లీశ్వరి 30. ఎ .కె.ప్రభాకర్ 31. కొండేపూడి నిర్మల 32. తులసి చందు 33. ఎమ్ . విమల 34 శాంతిశ్రీ 35. కవిని 36.కన్నెగంటి అనసూయ 37. అల్లం రాజయ్య 38.. మాడభూషి సంపత్ కుమారాచార్య (చెన్నై) 39. శ్రీ రామోజు హరగోపాల్ 40. సూర్యకుమారి, జర్నలిస్ట్ 41 ఎస్.రమ,జర్నలిస్ట్ 42. కాత్యాయనీ విద్మహే 43. లోచన్ 44. అవునూరి సమ్మయ్య 45. నందిగం కృష్ణారావు 46. పెనుగొండ లక్ష్మీ నారాయణ, అరసం కార్యదర్శి 47. ఆర్ ఎం ఉమా మహేశ్వరరావు 48. ఇక్బాల్ చంద్ 49. సంగిశెట్టి రాజశేఖర్ 50. వైష్ణవ శ్రీ 51. నీలా దేవి 52. ఏ. ఎం. ఆర్. ఆనంద్ 53. కొండపల్లి పవన్ 54. కొత్తపల్లి రవిబాబు (ప్రజా సాహితి) 55. డా. బి. అరుణ (జన సాహితి) 56. జి.ఝాన్సీ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు 57. అన్వర్ (ఆర్టిస్ట్) 58.కొండవీటి సత్యవతి 59. వేమన వసంతలక్ష్మి 60. సి. మృణాళిని 61.ఎస్. కాత్యాయని 62. పి. శివలక్ష్మి 63. భూమన్ 64 . నవీన్ వాసిరెడ్డి 65 . బిబిజి తిలక్ (న్యూ ఢిల్లీ) 66. పద్మజా షా 67. దేశిరాజు 68. మధురాంతకం నరేంద్ర 69. అనంత్, జర్నలిస్ట్ 70.భరద్వాజ్ రంగావఝుల 71 . శిఖామణి 72. శ్రీనివాస్ గౌడ్ 73 .డాక్టర్ రవింగ్ 74 . రవూఫ్ 75 . బండ్ల మాధవరావు, 76. మూర్తి నండూరి 77. డాక్టర్ రఫీ 78. సాకం నాగరాజ 79. వి. ఆర్.రాసాని 80. చలపాక ప్రకాష్ 81. మందరపు హైమావతి 82. ముప్పాళ్ల భార్గవశ్రీ, 83. బి. తిరుపతి రావు 84. బా రహమతుల్లా 85. నామిని సుబ్రహ్మణ్యం నాయుడు 86. కోట పురుషోత్తం 87. కే. శ్రీనివాస్ 88. శ్రీరామ్ పుప్పాల 89. ప్రసేన్ 90. సుంకోజి దేవేంద్రాచారి 91. రాణి శివ శంకర శర్మ 92. రవి తేజ పదిరి (అడ్వకేట్) 93. జహాఉ ఆరా 94. గుర్రం సీతారాములు 95.మంజుల 96. తాయమ్మ కరుణ 97. శశికళ (అనంతపూర్) 98.డాక్టర్ బి. కార్తీక్ నవయాన్ (అడ్వకేట్) 99. చైతన్య చెక్కిళ్ళ,డాక్టం, ఎడిటర్, కొలిమి 100. శాంతి ప్రబోధ, 101. మెర్సీ మార్గరెట్ 102. ఎం. గంగాధర్, ఎడిటర్, అధ్యాపక జ్వాల 103. జింకా నాగరాజు (పోయెట్, జర్నలిస్ట్) 104. వెంకట కృష్ణ (కథారచయిత, కర్నూలు) 105. కే. ఉషారాణి (ప్రజాశక్తి బుక్ హౌస్) 106. ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) 107. కన్నెగంటి రవి, రైతు స్వరాజ్య వేదిక 108. వంగల పద్మ, వాయిస్ ఆఫ్ ది పీపుల్ 109. అమరజ్యోతి (అనకాపల్లి) 110. కట్టా కవిత 111. జంజర్ల రమేష్ బాబు 112. సుభాషిణి(మహబూబ్ నగర్) 113. ఎన్. వేణుగోపాల్ 114.నారాయణస్వామి వెంకటయోగి, కవి, ప్రిన్స్టన్, అమెరికా 115. డాక్టర్. కందాల శోభారాణి 116. కూర్మనాథ్ (రచయిత), 117. నల్లెల రాజయ్య, వరంగల్ రచయితల సంఘం 118. ప్రసాదమూర్తి 119.వైఎస్ కృష్ణేశ్వరరావు, సినీ రచయిత, నటుడు 120. రమా మేల్కోటే 121. జుగాష్ విలి 122. చుక్కా శ్రీనివాస్ (కాలిఫోర్నియా) 123. జి. లక్ష్మీ నరసయ్య 124. కొల్లాపురం విమల 125. పాపని నాగరాజు (సామాజిక తెలంగాణా మహా సభ రాష్ట్ర కార్యదర్శి, నిశ్శబ్దం, సంపాదకుడు) 126. గుండె బోయినశ్రీనివాస్ 127. దాసోజు లలిత 128. దాసోజు కృష్ణమాచారి, ఎరుక, సాహిత్య సామాజిక సాంస్కృతిక వేదిక 129. పి. విజయలక్ష్మి 130. యశోద వంగా. జర్నలిస్ట్ 131. డి. పద్మశ్రీ, జర్నలిస్ట్ 132. ముకుంద రామారావు 133. ఖాజా 134. రామశేషు (పోయెట్, జర్నలిస్ట్) 135. పల్నాటి శ్రీరాములు 136. సన్నపురెడ్డి వెంకట్రామ రెడ్డి 137. ఉషారాణి వంగూరు 138. సీతాలక్ష్మి 139. వి.సంధ్య, 140. ఖలీదాపర్వీన్, యాక్టీవిస్ట్ 141. భండారు విజయ 142. మెహక్ హైదరాబాదీ 143. వి.ప్రతిమ 144. బీరం రాములు 145. ఎ స్.కృష్ణవేణి 146. రాజేంద్ర బాబు అర్విణి 147. ఝాన్సీగెద్దం, దళిత స్త్రీ శక్తి 148. బత్తుల రమాసుందరి 149. ఎం. రాఘవాచారి పాలమూరు అధ్యయనవేదిక 150. రాజీవ్ వెలిచెట్టి 151. ప్రగతి (అనంతపురం) 152. రాఘవ శర్మ, జర్నలిస్ట్, తిరుపతి 153. ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం 154. మీరా సంఘమిత్ర (నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్ మెంట్స్) 155. జ్యోతి. బి 156. సూరేపల్లి సుజాత 157. పురుషోత్తం 158. ఆర్వీర్ 159. రూపా రుక్మిణి (కవి, ఖమ్మం) 160. లతీఫ్ (సివిల్ లిబర్టీ మోనిటరింగ్ కమిటీ) 161. పలమనేరు బాలాజీ 162. డాక్టర్ జి. వి. రత్నాకర్ 163. రాజేందర్ బల్లా (అడ్వకేట్) 164. పోపూరి రవి మారుతి 165. ముమ్వా శ్రీనివాస రావు 166. ప్రొఫెసర్ ఆమంచర్ల సుబ్రహ్మణ్యం 167. ఆకునూరి విద్యాదేవి168. కె. సుభాషిణి (కర్నూల్) 169. సీతారాం 170. వొర్రప్రసాద్ (ప్రజాశక్తి) 171. వకుళాభరణం రామకృష్ణ 172. తెలకపల్లి రవి 173. సింగరాజు రమాదేవి 174. శశిరేఖ 175. వెంకటాచారి 176. దేవి 177. బి. గిరిజ 178. వంగాల సంపత్ రెడ్డి 179. ప్రసాద్ ఇంద్రగంటి 180. కుమారస్వామి 181. శీలా సుభద్రాదేవి 182. శీలా వీర్రాజు 183. ఉదయమిత్ర 184. విష్ణుప్రియ (తిరుపతి), 185. వివి.జ్యోతి 186. డి.వి.ఎల్.సావిత్రి, జర్నలిస్ట్ 187. పర్స్పెక్టివ్స్ ఆర్కే 188 . ఉషారాణి వంగూరు 189. ఉషా సీతాలక్ష్మి 190. అరుణ క్వీన్ (ఫౌండర్ రమాబాయి అంబేద్కర్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ సెంటర్) 191. డాక్టర్ రజని 192. అరణ్యకృష్ణ 193. డా. వీరాచారి 194. డాక్టర్. కెబి. చంద్రభాను, కాకతీయ మెడికల్ కాలేజ్, వరంగల్ 195. రాజీవ 196. డాక్టర్ వలపదాసు రమ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ 197. దుప్పల రవి కుమార్ 198. వేణు ఉడుగుల 199. అనిల్ డ్యానీ 200. కిరణ్ చర్ల

201. అంకురం సుమిత్ర 202. వేంపల్లె షరీఫ్ 203. అనిల్ 204. అఫ్సర్ 205. చైతన్య పింగళి 206. కల్లూరి భాస్కరం 207. అపర్ణ తోట 208. బి. అనురాధ, రచయిత, యాక్టివిస్ట్ 209. మంచికంటి 210. మ. కామేశ్వరరావురాజు 211. ఉమానూతక్కి 212. ఎన్ .ఎస్.మూర్తి 213. వై.కరుణాకర్, 214. సి.హెచ్. వేణు 215. వృద్ధుల కల్యాణ రామారావు 216. భాస్కర్ కూరపాటి 217. బైరెడ్డి సతీష్ 218. సన్నశెట్టి రాజశేఖర్ (అధ్యక్షుడు, కళింగ సీమ సాహిత్య సంస్థ, ఎడిటర్, ఉత్తరాంధ్ర) 219. జి ఎస్ చలం , అరసం అధ్యక్షుడు, విజయనగరం జిల్లా శాఖ 220. దాట్ల దేవదానం రాజు, అధ్యక్షుడు, స్ఫూర్తి సాహితీ సమాఖ్య, యానాం 221. గాజోజు నాగభూషణం 222. యోహాన్ దాండే 223. ఇండస్ మార్టిన్ 224. సిద్దార్థ కట్టా 225. నరేష్కుమార్ సూఫీ 226. కృష్ణంరాజు (జోగి బ్రదర్స్) 227. సి.వనజ 228. ఏలూరు అజిత 229. ఎ. ఎం.ఖాన్ యజ్దాని 230. పి . సత్యవతి 231. కత్తి మహేష్ 232. చల్లపల్లి స్వరూపరాణి 233. నల్లిధర్మరావు (సీనియర్ జర్నలిస్ట్, కవి) 234. ఎస్.రాజేశ్వరి 235. దివికుమార్ (జనసాహితీ) 236. బాలసుధాకర మౌళి 237. వేనేపల్లి పాండురంగారావు, మట్టిమనిషి 238. గణేశ్వరరావు 239. మిరపా మాధవి. 240. గోపిరెడ్డి భాస్కర రెడ్డి, కన్వీనర్, రాయలసీమ విద్యావంతుల వేదిక 241. మనోజ నంబూరి 242. దువ్వరత్నాకర్ 243. విక్టర్ విజయకుమార్ 244. అనిశెట్టి రజిత 245. సుంకిరెడ్డి నారాయణరెడ్డి 246. లక్ష్మయ్య (ప్రజాశక్తి) 247. రజిత కొమ్ము 248. ఎస్. జీవన్ కుమార్ (మానవహక్కుల వేదిక) 249. భూపతి వెంకటేశ్వర్లు (మోదుగుపూలు, ఎడిటర్) 250. నలిమెల భాస్కర్ 251. అన్నవరం దేవేందర్ 252. జాషువా డానియల్ 253. రాంబాబు తోట 254. డి.వి.రామకృష్ణారావు 255. ప్రసాద్ చరసాల 256. పగిడిపల్లి వెంకటేశ్వర్లు 257. మా సత్యం 258. నల్లూరి రుక్మిణి 259. సి ఎస్ ఆర్.ప్రసాద్ 260. కోడూరి విజయకుమార్ 261. హేమా వెంకట్రావ్ 262. కుంబం అశోక్ 263. నెల్లుట్ల రమాదేవి 264. బి సుజాత (చైతన్య మహిళా సంఘం) 265. వీరబ్రహ్మాచారి 266. పి చంద్ 267. బిల్లా మహేందర్ 268.జి చంద్రకళ 269. సుధామాధురి 270.ఎం రవీందర్ 271. వి ఆర్ విద్యార్థి 272. బి. రమ 273. ఆరి సీతారామయ్య (అమెరికా) 274. లోచన్ 275. దెంచనాల శ్రీనివాస్ 276. రమేష్ కందుల రచయిత, జర్నలిస్ట్ 277. దుర్గం సుబ్బారావు, ఎడిటర్, బహుజన కెరటాలు 278. శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, సాహితీ మిత్రులు 279. యు సదయ్య 280. హరితాదేవి 281. భూసురపల్లి వెంకటేశ్వర్లు 282. డి మల్లయ్య 283. అమృతరాజ్ 284. కందుకూరి అంజయ్య 285 పద్మ కుమారి జి 286 తాయమ్మ కరుణ 287. ఎస్. జె కళ్యాణి బ్యాంకాక్ 288. నక్కా టార్జానీ 289. రామకృష్ణారావు డి.వి 290. రమణ మారం రాజు 291. అభినవ్ బూరం కెవెన్ పి ఎస్ 292. ఉపేంద్ర అట్లూరి 293. చంద్రశేఖర్ ఆర్తో చెన్నై 294. బల్ల రవీంద్ర హైదరాబాద్ ఆర్మాడ్ ఫోర్సెస్ పసిఫిక్ యు ఎస్ 295. రవిచందర్ 296. గున్నూరు రామ్మోహన్ 297. కన్నెగంటి రవి 298. షాజీ గోపాల్ డల్లాస్ 299. రమేష్ పోతుల 300 సాగర్ బి 301. శివ సుధ 302. రోషినేని శశికళ 303. పోతే దార్ వీర బ్రహ్మాచారి 304. కే బాబ్జి 305. మురళీధరన్ కె కొచ్చిన్ 306. ప్రశాంత్ సుబ్రహ్మణ్యన్ 307. శాంతోలాల్ లాల్ ఎర్నాకులం 308. మోహన్ పొడుపుగంటి 309. క్రాంతి కిరణ్ 310. అరవింద పొట్లూరు 311. ప్రశాంత్ ఏ బి కొచ్చి 312. సోమశేఖర శర్మ 313. విజయ్ కుమార్ కైలా 314. నిట్టూరు నాగేశ్వరరావు 315. సురేష్ బాబు 316. మారం శ్రీనివాస్ 317. గోలి షేక్ అబ్దుల్ పాషా 318. రిషి రాజ్ బరాల్, ఖాట్మండు 319. ప్రసాద్ బొలిమేరు 320. ఆజ్యాన్ కుమార్, కొచ్చిన్ 321. రాచమల్లు హరినాథ్ రెడ్డి 322. పులి సత్యనారాయణ 323. మేఘనాథ్ బిసాయి, కోల్కతా 324. అరవింద్ మాటూరి 325. రషీద్ మటన్చెరి , చేరయి 326. శేషు కొర్లపాటి 327. వెంకటేశ్వర్లు కోయ 328. శ్రీనివాసమూర్తి, పూణే 329. స్వప్నేష్ బాబు, కోజికోడ్ 330. రాక్టిం ఘోష్, కోల్కత్తా 331. ధరన్ ఆర్, బెంగుళూరు 332. రమేష్ బాబు దురుసొజు 333. శశి శేఖర్ పొన్నపల్లి 334. లక్ష్మీ నరసింహ రెడ్డి 335. అనిల్ కుమార్ 336. హుజూర్ యుక్సెల్ టర్కీ 337. ఎస్ హరగోపాల్ 338. కర్ణ టి 339. బాలసాని రాజయ్య 340. జనార్ధన్ 341. మల్లేశం గాండ్ల 342. కలీం కట్టెల లింగస్వామి 343. శ్రీనివాస్ పి 344. సేవ్ డెమోక్రసీ గ్రూప్, 345. టి ఇందిర 346. రంగన్న రాగం 347. రామాంజులు చిందులూరి 348. రెజాజ్ యం సైదిక్, కొచ్చిన్ 349. అంబన్న 350. పి స్వామి 351. జైసన్ సి కూపర్, కొచ్చి 352. లక్ష్మీనారాయణ కె 353. మంచాల అచ్యుత సత్యనారాయణరావు, బెంగళూరు 354. నార్ల రవి 355. రవి చావ 356. ప్రసాద్ బిశ్వాస్, కోల్కత్తా 357. కాసర్ల చంద్రమౌళి 358. మేడక యుగంధర్ రావు 359. నీలిమ బసు, కోల్కత్త 360. వైద్యుల రాజ రెడ్డి 361. దురుపాడి ఘోష్, కోల్కత్త 362. ఆంజనేయులు చకినాల 363. పి అభిలాష్, ఎర్నాకులం 364. ఈ వినోద్, చెన్నై 365. బోనీ హెూత్రి హజ్రా, కోల్కత్తా 366. ఎర్రాల సంపత్ రావు 367. పి కృష్ణా రావు 368. అలిగిరి సామి రెంగ రాజు, ట్రిచి 369. చందన శ్రీ రామ ప్రసాద్ 370. జి శ్రీనివాస్ 371. విక్టర్ విజయ్ కుమార్ 372. లోకేష్ కుమార్, చెన్నై 373. ప్రసాద్ పివిడి 374. ఎం వినోద్ కుమార్ 375. బి భార్గవ్, బెంగుళూరు 376. ఆల్ ఫోన్స్ కెన్నడీ, బెంగుళూరు 377. వివేక పోద్దర్, ముంబై 378. సంగీత గీత్ , ఢిల్లీ 379. శార్దూల్ పాటిల్, ముంబై 380. ఆర్నల్ సైకియా 381. క్రిష్ ప్రజాపతి, అహ్మదాబాద్ 382. టీ రాఘవేంద్ర, భ్యాహట్టి 383. నీరజ్ పాటిల్, దూలె 384. సోనమ్ కుమారి, ఢిల్లీ 385. భూపతి ఒత్తిసమి 386. అక్షత్ చిత్రన్ష్, రాంచీ 387. శంతను జాఖర్, పంచకుల 388. వైశాలి ఉపాధ్యాయ, న్యూఢిల్లీ 389. రమణ కందుకూరి 390. శివ రంజిత్, ఎర్నాకులం 391. తుషార్ కాంత్, భువనేశ్వర్ 392. వినీత్ విట్టల్ బాయ్ లింబచియ, పాలంపూర్ 393. పాలక్ వాఘసియ ఖిజయ్ వాఘసియ, అహ్మదాబాద్ 394. క్రుపాలి నర్కర్ ప్రియాంక భగత్ షా, కోల్కత్త 395. మహమ్మద్ షాదాబ్ 396. సామి చూటాని, ఢిల్లీ 397. సుస్మిత సుని 398. రాఖీ లుబనా, ఢిల్లీ 399. రామోలియా జీత్, సూరత్ 400. అర్నాబ్ పొద్దర్, కలకత్తా 401. ఓవి జె, బందుప్ 402. యశు క్మార్ దయానంద్, ముంబై 403. కుల్దీప్ గోహిల్, గాంధీధామ్ 404. ఆనస్ ఖాన్, న్యూఢిల్లీ 405. సుప్రతిక్ బోర, గువాహతి

406. తుషార్ కాంతి, నాగపూర్ 407. గరికపాటి శ్రీనివాసులు 408. ఇందర్ పాల్ సింగ్, ఢిల్లీ 409. సాహిల్ సింగ్, కళ్యాణ్ 410. అర్పన్ పద్వాల్, న్యూఢిల్లీ 411. రాజబాబు, దామరపూల 412. కార్తీక్ కార్తీక్ 413. ఆశిష్ కన్వర్, ముంబై 414. సుర్యాంష్ సింగ్ 415. సాంసన్ లైశ్రం, దిస్పూర్ 416. ప్రియాన్ష్ గుప్తా, హిసార్ 417. ధ్యేయ్ థక్కర్, రాజ్ కోట్ 418. ఆశిష్ కుమార్ మిశ్రా, లక్నో 419. యహియ యం, కోజికోడ్ 420. థామస్ జార్జ్, కోజికోడ్ 421. కె యస్ శ్రీజిత్ కుమార్, త్రివేంద్రం 422. సాక్షి గుప్తా, చండీఘర్ 423. తనుశ్రీ దాస్, కోల్ కతా 424. రేవంత్ గౌరిశెట్టి 425. నిశాంత్ ప్రేమ్ హర్, నాగర్కోయిల్ 426. యోగానంద చారి 427. మొహాక్ మొగ్రే, పూణే 428. మాటిన్ వోరా, ఉనా 429. జిత్ దాస్, కోల్ కతా 430. గౌరవ్ మద్దేష్యియ, బలు 4231. జాస్ లీన్ సవియా పింటో 432. గరిమా కుమారి, ఢిల్లీ 433. గౌరీ దాసన్ నాయర్, చెన్నై 434. శ్రేయన్ష్ కుమార్ శర్మ, పూణే 435. గురు ప్రసాథ్ 436. ఆకుల రవీందర్ 437. రజత్ భాటియా, జైపూర్ 438. బైరి మణిదీప్ 439. ప్రాన్జిత్ మండల్, గువహతి 440. సాకే కృష్ణ 441. శ్రీ సుధాకర్ 442. రెగ్గీ గోవేఅస్, గోవా 443. మరింగంటి రాఘవాచారి, చెన్నై 444. శాంతిశ్రే బెనర్జీ 445. నిర్భిందర్ సింగ్, సిర్సా 446. ఎన్ జయరాం, బెంగళూరు 447. మణిమారన్ మాతియాలన్ 448. సంతోష్ జార్జ్, తిరువల్ల 449. పోతు శంతన్ 450. సవ్యసాచి చటర్జీ, కోల్ కతా 451. విశాల కబీర్, న్యూ ఢిల్లీ 452. కన్వల్ జీత్ ఖన్నా ఖన్నా, జగ్రాన్ 453. ఎడంపాక విజయ్ ఖన్నా 454. అరుణ్ ద్రవడియన్, మలప్పురం 455. ఇప్ప రామ్ రెడ్డి 456. విక్ వర్మ, రోహతక్ 457. కుమార్ సమతల 458. సంచిత ముఖర్జీ, కోల్ కతా 459. శ్రీహరి కె వి, ఎర్నాకులం 460. షేక్ కరీముల్లా 461. వెంకటేష్ ఎస్ 462. సనూప్ మేలేప్పట్ట్, కోయంబత్తూరు 463. గుల్లెద్దుల నాగరాజు 464. అంబిక వెంకట సుబ్బు 465. శ్రీను ముళ్ళ 466. అర్పాన్ కుందు, చెన్నై 467. జి రామదేవుడు 468. రాజీవ్ బాలకృష్ణన్ 469. గళ్ళ నాయుడు 470. రూపం కర్మాకర్, చెన్నై 471. బిహాన్ష్ చటర్జీ, కోల్ కతా 472. జాబి జోసెఫ్ 473. ఎ ఎస్ వసంత కుమారి, ఢిల్లీ 474. మారం వెంకట గౌనా రెడ్డి 475. డా శ్రీను 476. భవాని ఎ బి ఎం ఎస్ 477. మెర్ ఎకేకో, శాంతినికేతన్ 478. నిశాంత్ ఆనంద్, లక్నో 479. అనుపమ్ కుమార్, లక్నో 480. విశ్వనాథ్ కుమార్, రాంచి 481. శశికాంత్ సింగ్, లక్నో 482. నికోలస్ హఫ్ ల్యాండ్, ఢిల్లీ 483. మధు గౌతమ 484. అభయ్ ఉపాధ్యాయ్, పాట్నా 485. సి హెచ్ భాస్కర్ రావు 486. జతిన్ కుమార్ సూర్యదేవర 487. అభిషేక్ కుమార్ నీరజ్, లక్నో 488. గోపాల సుందర రాజన్ 89. ఎ రామాంజనేయులు, బెంగళూరు 490. వెతియన్ వెతియన్, చెన్నై 491. రాజేష్ చిన్నారి 492. ఇప్పిత 493. రాజేష్ కుమార్,లక్నో 494. ఎ సురేష్, చెన్నై 495. విష్ణు పోలి, ఎర్నాకులం 496. ప్రిత్ పాల్ సింగ్, భటిండా 497. అనుపమ పొట్లూరి 498. అజయ్ హెూగాడే, బెంగళూరు 499. జితేంద్ర బహదూర్,లక్నో 500. బి హెచ్ పద్మ బి కె పి 501. దశరథ ఆరేళ్ళ 502. సోని ఆజాద్ లక్నో 503. దివ్యన్షు సింగ్, రాంచీ 504. రాహుల్ కె ఆర్, ఎర్నాకులం 505. జోతిస్ పుతాన్స్, త్రిస్సూర్ 506. లోకేష్ గౌతం, డెహ్రాడున్ 507. లింగం నాగేశ్వర రావు 508. రుబికా లాల్, కోల్ కతా 509. మహమ్మద్ నౌషద్, ఎర్నాకులం 510. శిహాస్ ఎడపాల్, ఎర్నాకులం 511. ఇంజమూరి రఘునందన్ 512. జావేద్ నక్వి, న్యూ ఢిల్లీ 513. రియ కుమారి, లక్నో 514. కళ్యాణ్ రే, కోల్ కతా 515. తాథా గత రాయ్ చౌదరి, కోల్ కతా 516. రామ్ చంద్రం ఆదెల్లి 517. బిజు కనవు, మలప్పురం 518. రాజ్దీప్ పంజా, కోల్ కతా 519. రవీందర్ రావు 520. జాయ్ పొవెల్ పొవెల్, కొచ్చిన్ 521. గుమ్మడి చంద్రశేఖర్ 522. నమ్రత బెనర్జీ, బరుఇపూర్ 523. రజని కుమారి 524. ఖుస్బు రహమాన్, డార్జిలింగ్ 525. అబ్దుల్ నాజర్, చెన్నై 526. సద్దాం హుస్సేన్, బెంగళూరు 527. అంకిత్ కుమార్ భాస్కర్, వారణాసి 528. అనిక్ బెనర్జీ, కోల్ కతా 529. మోతిలాల్ అట్లూరి 530. నాగేశ్వర్ అడపాల 531. పాలని ప్రబాగర్, చెన్నై 532. హర్మంజోట్ కౌర్, లుధియానా 533. సిరిగిరి లక్ష్మి నారాయణ 534. మహమ్మద్ అబ్దుర్ రెహమాన్ సి పి, ఎర్నాకులం 535. అనిశెట్టి శంకర్ 536. సాయన్ మజుందార్, కోల్ కతా 537. చందన్ కుమార్, లక్నో 538. పాండురంగ వరప్రసాద్ పరుచూరి 539. నవులూరి వెంకట రమణయ్య 540. పోతూరి విజయరామ రాజు 541. నరేష్ రాగుల 542. రమేష్ రామేమ్స్ 543. జితేందర్ కుమార్ పటేల్, వారణాసి 544. సాహితి వాసిరెడ్డి 545. అల్మాస్ వాజిద్, బెంగళూరు 546. అది నారాయణ్ రెడ్డి 547. శ్వేత సింగ్, లక్నో 548. సోనాలి బాస్కేయ్, ఖరగ్ పూర్ 549. ఆనంద్ చౌదరి, అహ్మదాబాద్ 550. దర్శన్ భూపతి, రాజ్ కోట్ 551. ఇర్ఫాన్ బేగ్, మైసూరు 552. మేహాక్ చోట్రని 553. రజని లోన్ గని, పూణే 554. బన్సాల్ వదేర్, అహ్మదాబాద్ 555. హరింద్రనాథ్, బెంగళూరు 556. శ్రియ కాటల 557. పురబి డోలీ 558. జయ్మిట్ కొకని, అహ్మదాబాద్ 559. సందీప్ సింగ్ రానా, న్యూ ఢిల్లీ 560. ప్రియాన్ష్ భరద్వాజ్, న్యూ ఢిల్లీ 561. జారాక్ శర్మీన్, న్యూ ఢిల్లీ 562. డ వందన వర్మ, లక్నో 563. అజింక్య బ్రాహ్మణే, ఖేర్ గాం 564. స్వాతి షాజిల్, కొల్లం 565. సుధన్ యం, చెన్నై 566. దేవేష్ చరణ్, జైపూర్ 567. రాజయ్య దామెర 568. నిశాంత్ లోహని, లక్నో 569. సంజన చావడ సంజన, అహ్మదాబాద్ 570. షెల్లీ బన్సాల్ 571. సనోబెర్ అన్సారి, ముంబాయి 572. రాకీ దుత్త, గువహతి 573. కుసుమ్ సింగ్, ఢిల్లీ 574. రాథోడ్ ప్రథం, అహ్మదాబాద్ 575. జునిల్ కుమార్, ఎర్నాకులం 576. ఎ. వెంకట్రామన్ 577. సీ ఓపీ 578. ఆర్ద్ర జి ప్రసాద్, పాలక్కాడ్ 579. గ్లాడ్విన్ ఎమ్మనుయెల్, చెన్నై 580. ఆహెూక్ కుమార్ ఎర్రగుంట 581. ప్రేమ్ వి 582. అనురాధ పొట్లూరి 583. సాయి గజ్జల 584. మమతారాణి ఎస్ 585. అమోఘ్ దివాకర్, బెంగళూరు 586. చౌదరి కెవిన్, అహ్మదాబాద్ 587. పరమార్ ప్రియదర్శినిబా, అహ్మదాబాద్ 588. అమిత్ కె ఆర్ దూబే, ఢిల్లీ 589. జస్విందర్ కౌర్, జలంధర్ 590. రాము బోయినపల్లి 591. శంకర్ లింగం, చెన్నై 592. ఆశిష్ గుప్తా 593. అనంత్ సింగ్ 594. శాంతి కుమార్ పాటిల్, బెంగళూరు 595. కటకం పవన్ కళ్యాణ్ 596.

సాయి సూర్య, కోయంబత్తూర్ 597. సంకల్ప్ దూబే, లక్నో 598. కిరణ్ పాట్కి, ముంబాయి 599. రాఘవ్ సింగ్లా, చండీఘర్ 600. అభిషేక్ రాథోర్ , ఢిల్లీ 601. ఆనంద్ పోలంపల్లి 602. చిన్మోయ్ దాస్ . గువహతి 603. ప్రతోష్ పి, బెంగళూరు 604. నిల్తు ఘోష్, కోల్ కతా 605. ఇందిరా బెనర్జీ, ఢిల్లీ 606. దర్శిత బాబారియ, అహ్మదాబాద్ 607. హసాన్ ఖరి, జమ్ము 608. స్ఫూర్తి స్ఫూర్తి ఎ ఎచ్, బెంగళూరు 609. చంపక్ కాకటి, గువహతి 610. రిశిల్ బక్షి 611. ముదుగు శామ్యూల్ శామ్యూల్, చెన్నై 612. రాజీవ్ సింగ్, లూధియానా 613. అంబిక తార, తిర్వనంతపురం 614. ఉత్సవ్ చౌహాన్, అహ్మదాబాద్ 615. జోసెఫ్ సింగ్సన్, ఇంఫాల్ 616. ఆల్మిన్ మోమిన్, ముంబాయి 617. సెంథిల్ కుమార్, చెన్నై 618. దీపక్ కరియప్ప,బెంగళూరు 619. కికి పాచుయు, ఇంఫాల్ 620. సిద్ధా ఎస్ సి చక్రా రావు 621. మన్మీత్ కౌర్, లుధియానా 622. ఇమ్మానుయెల్ లైరెమ్రుయుట, ఇంఫాల్ 623. పల్లవి శర్మ, ఢిల్లీ 624. సంజయ్ ఠాకోర్, పాలంపూర్ 625. ఎనగంటి కరుణ కుమార్ 626. షా జైనిష్, గోద్రా 627. లినిత్ అబ్రహం 628. అరుణ్ జి . యం అరుణ్, ఎర్నాకులం 629. బాబురాజ్ యం పి, బెంగళూరు 630. వెంకట రామప్ప, బెంగళూరు 631. శ్రేష్ట సరస్వతి 632. రణబీర్ పంజా 633. మిన్హజ్ మల్లిక్, కోల్ కతా 634. పెద్దిరెడ్డి చిన్నకోట్ల, బెంగళూరు 635. దాసరథి జి వి, బెంగళూరు 636. నిమిష లింగంనేని 637. షకిబ్ అలీ 638. రాహుల్ తివారి, పాట్నా 639. ప్రిన్సియా ప్రసన్న, బెంగళూరు 640. ఏనోన్ ముఖియా , కోల్ కతా 641. స్మితి యాదవ్, ఢిల్లీ 642. శివ కుమార్, పాట్నా 643. అమిత్ చటోపాధ్యాయ. కోల్ కతా 644. మహావీర్ కిలాక్, జైపూర్ 645. సామ్య బికాష్ పత్రాషి, కోల్ కతా 646. సంజయ్ కొక్లే,ముంబాయి 647. సోనియా డి సౌజా, పూణే 648. సిద్ధార్థ్ భండార్కర్, ముంబాయి 649. అనుజ్ శుక్లా, బెంగళూరు 650. సుదీర్ వర్మ, జమ్ము 651. ఎజ్హిలరాసన్ మణి, ట్రిచ్చి 652. సంఘ మిత్ర 653. అంకిత్ కుమార్, లక్నో 654. సుల్తాన్ అన్సారి, ముంబాయి 655. అనాస్ అలీ, బెంగళూరు 656. బ్యూటీ జాన్, శ్రీనగర్ 657. సినోజ్ థామస్, ఎర్నాకులం 658. రిచా మిశ్రా, ఢిల్లీ 659. ప్రదప్ వధర్, అహ్మదాబాద్ 660. హిబు బయి 661. యం డి ఇక్బాల్ హుస్సన్ 662. ఆహిశ్ నేగి 663. జైస్న సెలేస్టిన్, న్యూ ఢిల్లీ 664. హిస్సుం సి హెచ్ సి హెచ్, చెన్నై 665. మిలాన్ కుమార్ సాహూ, భువనేశ్వర్ 666. అలామీన్ మర్చంట్ 667. మన్దీప్ కుమార్ , మొహాలి 668. శ్రింజోయ్ భౌమిచక్, కోల్ కతా 669. సహిమా సుల్తానా, కోల్ కతా 670. మైథిలి రాజ్ 671. తులసి రామ్ కె 672. జాక్లెల్లు నౌడి, బెంగళూరు 673. జిత్ మొండల్, కోల్ కతా 674. సరిత ఆశిష్ కుమార్, లక్నో 675. అలోక్ సేమ్వాల్, న్యూ ఢిల్లీ 676. షబ్నం షేక్, ఢిల్లీ 677. వసీం షేక్, ముంబాయి 678. శ్రీ రాం 679. అబ్దుల్ రెహమాన్, ఢిల్లీ 680. మనోజ్ జగనియా, సోనిపట్ 681. అంజని దీక్షిత్, లక్నో 682. సన్ గుంజ్, పూణే 683. అయాన్ రాయ్, కోల్ కతా 684. ఉస్మాన్ షహీద్, ఢిల్లీ 685. రాజయూర్ రహమాన్, కోల్ కతా 686. స్వీటీ దూబే, పాట్నా 687. ఇఫ్తికర్ ఆలం, కోల్కతా 688. సిద్ధార్థ్ యాదవ్, ముంబాయి 689. రుబిన సుల్తానా, కోల్ కతా 690. అర్హామన్ మాజ్, జైపూర్ 691. ఆశిప్ మొల్లః, కోల్ కతా 692. మేహ్విష్ ఎస్ ఎచ్ కె , పూణే 693. మహేష్ శర్మ, జోధ్పూర్ 694. మహమ్మద్ యాసర్ సయ్యద్, ముంబాయి 695. ఫిరోజ్ అలీ, కోల్ కతా 696. యం డి మహాసిన్ ఖాన్ 697. యం డి కైఫ్, బెంగళూరు 698. నిరావ్ బక్రాని, సూరత్ 699. యం డి యౌనుస్ అహ్మద్ 700. అభిషేక్ చక్రవర్తి, కోల్ కతా 701. లాయిడ్ పిరిస్, బెంగళూరు 702. సుఖ్విందర్ సింగ్, లుధియానా 703. అల్యోన రాయ్, ఢిల్లీ 704. ఎర్లి లీన్, గువహతి 705. ఫతేమ తిన్వాల, గోద్రా 706. నవ్ప్రీత్ సింగ్ 707. జస్విందర్ కౌర్ 708. దివ్యజ్యోతి గోస్వామి 709. అభిషేక్ యాదవ్, ముంబాయి 710. నిఖిల్ శర్మ, ఢిల్లీ 711. శ్వేత గైక్వాడ్ 712. పల్లవి పైరసాని 713. అమిత్ జోషి, బెంగళూరు 714. మొహమ్మద్ పాలక్ర , ముంబాయి 715. శుభం త్రివేది, ఇండోర్ 716. సుభాదేవ్ డే, కోల్ కతా 717. గంగోత్రి బెనర్జీ, కోల్ కతా 718. బసుమత్రాయ్, గువహతి 719. ఐశ ఐష 720. షాబాజ్ షేక్, ముంబాయి 721. శిఖా వశిష్ట, న్యూ ఢిల్లీ 722. జై భూషణ్. కాన్పూర్ 723. అమ్మార్ ఫౌజాన్, భువనేశ్వర్ 724. జాకి చైన్, పూణే 725. యం డి నదీం, జంషెడ్ పూర్ 726. కృష్ణ రంగాని, ముంబాయి 727. అశ్వని కుమార్, అహ్మదాబాద్ 728. భువనేశ్వర్ బాల మురళి, చెన్నై 729. ఆర్ దాస్, కోల్ కతా 730. వృశాలి పాటిల్, ముంబాయి 731. పూర్ణ బ్రాత డే, ఐజ్వాల్ 732. జెన్నీ పఖుమతే, గువహతి 733. రైమ నస్కర్, కోల్ కతా 734. జస్పాల్ జస్పాల్, లుధియానా 735. జుహీ హసన్ 736. హనిఫ్ షేక్, ఇండోర్ 737. బితుపాన్ సైకియా, దిబ్రుగర్ 738. అంశు రావత్, ఢిల్లీ 739. మొహమ్మద్ షాదాబ్, చండీఘర్ 740. వసిం అక్రం, కోల్ కతా 741. అకంష ఖండరే, పూణే 742. అనుజ్ సంఘ్వాన్, ఢిల్లీ 743. బషీర్ అలం, న్యూ ఢిల్లీ 744. డేవిడ్ అలోషి, కొల్లాం 745. మీనా విపుల్ కాండే, ఇండోర్ 746. నున్హలయెన్ లేప్చ, కోల్ కతా 747. ధనిష్ సిధిక్ 748. మమత రాణి, చండీఘర్ 749. గాడ్ సన్ ఆంధ్రడే, ముంబాయి 750. సౌమిక్ ఘోష్, సైంతియా 751. సుదీర్ యాదవ్, జైపూర్ 752. హర్షిత తిలయచ, జైపూర్ 753. గుల్జార్ అహ్మద్, జమ్ము 754. రియాజ్ కషిఫ్ , ఢిల్లీ 755. నదీం చౌదరి, న్యూ ఢిల్లీ 756. దేబ్జిత్ బిస్వాస్, న్యూ ఢిల్లీ 757. మానవుయర్ హుస్సేన్ 758. దివ్యాన్ష రాణా 759. పూజ మజుందార్, కోల్ కతా 760. అల్బిన్ బినోయ్, కోజికోడ్ 761. సుర్జీత్ సింగ్, ఢిల్లీ 762. ఇషా ప్రధాన్, ఢిల్లీ 763. ఓవైస్ ఖాన్, ముంబాయి 764. రఘు మానికం, చెన్నై 765. వసిం అక్రం, ముంబాయి 766. సల్మాన్ ఖాన్ , డెహ్రాడున్ 767. హుస్సైన వాద్నగర్ వాలా, చెన్నై 768. శంకర్ ఆర్ముగం, చెన్నై 769. శుబం శర్మ , జటని 770. మనోజ్ కొకనే, ఎర్నాకులం 771. సుకాంత బార్, న్యూ ఢిల్లీ 772. అరుణ్ కుమార్, ఎర్నాకులం 773. శశి శాండిల్య 774. షాన్ షేక్, సూరత్ 775. సౌరీష్ హల్దర్ 776. సౌహర్ద్య భట్టాచార్జీ, కోల్ కతా 777. ఎస్ ఉదాస్, ఎర్నాకులం 778. సి శ్రీ రాం 779. అనంత్ కృష్ణన్ కుట్టి, ఆశ్ బర్న్స, వర్జీనియా 780 అఫ్జల్ ఖాద్రి, భువనేశ్వర్

(తెలుగు: మెట్టు రవీందర్)

లీగల్ నోటీసు

29.5.2021

టు

1) రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం (ప్రధాన కార్యదర్శి ద్వారా)

2) డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్,(డి.జి.పి), హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

అయ్యా,

విప్లవ రచయితల సంఘం- విరసం-(తెలుగు), రెవల్యూషనరీ రైటర్స్ అసోసియేషన్- ఆర్.డబ్ల్యూ.ఎ- (ఇంగ్లీష్) అధ్యక్షుడైన నా క్లయింట్ అరసవెల్లి కృష్ణ, వయసు 54 సంవత్సరాలు, విజయవాడ, కృష్ణా జిల్లా తరపున కింద పేర్కొనబడిన కొన్ని వాస్తవాలపై ఈ నోటీసును నేను మీకు పంపుతున్నాను.

1) ఏప్రిల్ 23, 2021న నా అర్జీదారుని (పిటిషనర్) సంస్థతో సహా 16 ప్రజా సంఘాలను నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి అనుబంధ సంఘాలని పేర్కొంటూ, వాటిని నిషేధించారని అన్ని వార్తా పత్రికలు, టీవీ ఛానెళ్ళ ద్వారా ఒక వార్తను ప్రచురించి, ప్రసారం చేశారు. చాలా ఆశ్చర్యకరంగా, దీనిని 30.3. 2021 నాడే సాధారణ పరిపాలనా (స్పెషల్-డి) శాఖ నుంచి ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 73 గా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గెజిట్ బుక్‌లో ప్రచురించి ప్రకటించినట్టుగా ఈ వార్తతోనే మాకు, ప్రజాసంఘాల వాళ్ళకూ తెలిసింది. తెలంగాణ ప్రజా భద్రతా చట్టం-1992 (తె.ప్ర.భ.చట్టం-1992) లోని సెక్షన్ 3 ద్వారా సంక్రమించిన అధికారాలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీనిని విడుదల చేశారు.

2) తెలంగాణ ప్రజా భద్రతా చట్టం-1992 నిబంధనలకు పరిమితమయ్యే నా క్లయింటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వపు పై చర్యను ప్రశ్నిస్తున్నాడు. ఏ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంఘాల పై నిషేధం విధించిందో, అదే చట్టంలోని ఇతర పలు నిబంధనలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, వాటికి వ్యతిరేకంగా ఈ ప్రభుత్వ నిషేధ చర్యలు ఉన్నాయనేది నా క్లయింట్ లేవనెత్తే ప్రాథమిక అభ్యంతరం.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మార్చి 30, 2021 నుండే 16 ప్రజా సంఘాలపై నిషేధం అమలవుతున్నదనే వాస్తవం గురించి తనకు గాని, లేదా సదరు ప్రజా సంఘాలకు చెందిన వ్యక్తులెవరికి గాని ఆ ప్రభుత్వ ఉత్తర్వులకు సంబంధించిన నోటీసు ఏమీ ఇవ్వకుండా, ఏప్రిల్ 23, 2021 నాటి మీడియాలో బహిరంగ వార్తా ప్రకటన ద్వారానే తెలిసిందని నా క్లయింట్ తెలియజేస్తున్నాడు. నా క్లయింట్ మరియు విరసం ఇతర ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యుల నివాస స్థలాలు మీకు తెలిసినప్పటికీ, ఈ రోజు వరకు కూడా మీ ప్రభుత్వ ఉత్తర్వులకు సంబంధించిన నోటీసులను వారికి ఇవ్వలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆ నోటీసు ఇవ్వలేదని అనిపిస్తుంది. ఎందుకంటే- ఆ మరుసటి రోజే, అంటే మార్చి 31, 2021 నాడే రెండు తెలుగు రాష్ట్రాలలో నిషేధిత ప్రజాసంఘాల బాధ్యుల, సభ్యుల ఇళ్ళపై పెద్ద ఎత్తున పోలీసులు, ఎన్ ఐ ఏ వాళ్ళు ఆకస్మిక దాడులు చేసి, సోదాలు, జప్తులు జరిపారు. దాడులు చేస్తున్న సందర్భంలోనైనా, ఆ తర్వాత అయినా ప్రభుత్వ ఉత్తర్వుల నోటీస్ విషయాన్ని తెలియజేయకుండా దాచిపెట్టారు.

3) తె.ప్ర.భ. చట్టంలోని 3 వ సెక్షన్ కింద దఖలు పడిన అధికారాలతో ప్రజా సంఘాలను నిషేధించడమైనదని చెబుతున్న మీరు అదే చట్టంలోని 4, 5, 6, 7 వ సెక్షన్లలోని చెక్స్, బ్యాలెన్స్‌ల లాంటి ఆదేశిక నిబంధనలను పాటించకుండా (మీకు మాత్రమే తెలిసిన కారణాల వల్ల) మీరు నిర్లక్ష్యం చేశారని నా క్లయింట్ అంటున్నాడు.

4) ఇదిలా ఉండగా, ప్రజాసంఘాల నిషేధం గురించి మీడియా ద్వారా తెలుసుకున్న తర్వాత ఒక వారం రోజులకే (తె.ప్ర.భ. చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం 15 రోజుల లోపల నోటీస్ గ్రహీతలు ప్రాతినిధ్యం చేయాలి) అనగా ఏప్రిల్ 30, 2021ననే ప్రెస్ మీట్ నిర్వహించి, పై విషయాలను వివరిస్తూ వెంటనే నిషేధాన్ని ఎత్తివేయాలని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అయిన మీకు (నెం.1 పైన ఉదహరించినది) ప్రజా సంఘాలపై నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని ఉమ్మడిగానూ, విడివిడిగానూ తమ సంస్థల ప్రాతినిధ్య పత్రాలను మీకు ఇచ్చారు. అంతేకాదు, ఇతర అనేక ప్రజాస్వామిక సంస్థలు, రాజకీయ పార్టీలు, మేధావులు దేశవ్యాప్తంగా నిషేధాన్ని ఖండించి, ఆ నిషేధాన్ని ఎత్తివేయాలని ప్రధాన స్రవంతి మీడియా, ఇతర సోషల్ మీడియాల ద్వారా అభ్యర్థించారు. వాటి విషయమై మీరు ఎలాంటి జవాబు గాని, స్పందన గాని తెలియజేయలేదు.

5) తె.ప్ర.భ. చట్టం లోని 5వ సెక్షన్ ప్రకారం, క్లయింట్ల ప్రాతినిధ్యాలను అందుకున్న తర్వాత, ప్రభుత్వ గెజిట్లో ప్రకటించిన 6 వారాలలో ప్రభుత్వం ఒక సలహా సంఘాన్ని నియమించాలి. ఒకవేళ ప్రభుత్వం మార్చి 30, 2021 ననే గెజిట్లో ప్రకటించి ఉంటే, మే 5, 2021కి ముందే పై చట్టం ప్రకారం ఒక సలహా సంఘాన్ని నియమించి, తనకు సంబంధించిన విషయాలను సలహా సంఘం ముందు తెలియజెప్పుకునే అవకాశం నా క్లయింట్‌కు ఇచ్చి, తన వాదనలను నిష్పక్షపాతంగా వినే బాధ్యత సలహా సంఘానికి ఉం(డిం)ది. (కాని అదేమీ జరగలేదు).

6) అయితే గతంలో 2005లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రతా చట్టం కింద దఖలు పడిన అధికారాలతో ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 373 ద్వారా తేది.17.8. 2005 నాడు అనేక ఆరోపణలతో విరసం సంస్థను చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించి, నిషేధించిన విషయాన్ని మీకు నా క్లయింట్ గుర్తుచేస్తున్నాడు. అప్పుడు కూడా, నా క్లయింట్ సంస్థ (విరసం) అప్పటి ఆం.ప్ర , ప్రధాన కార్యదర్శి మోహన్ కందా గారికి ఒక వివరణాత్మక ప్రాతినిధ్య లేఖను సకాలంలోనే సమర్పించింది. దానికి స్పందించి ఆనాటి అం.ప్ర ప్రభుత్వం జస్టిస్ టి ఎల్. ఎన్. రెడ్డి నాయకత్వాన ఒక సలహా సంఘాన్ని నియమించి, మూడు నెలల్లోనే విచారణ పూర్తి చేసింది. 2005వ సంవత్సరంలో సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో రెండుసార్లు క్లయింట్ తరపున, ప్రభుత్వం తరపున రెండువైపులా భిన్న వాదనలు విన్న మీదట, విరసంను చట్టవ్యతిరేక సంస్థగా ప్రభుత్వం ప్రకటించడానికి ఎటువంటి తగిన కారణం ఏదీ లేదని ఆ సలహా సంఘం అభిప్రాయపడింది. ఫలితంగా 11.11.2005 నాటి ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 503 ద్వారా ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విరసం పై నిషేధాన్ని ఎత్తివేసింది.

ఇప్పుడు మళ్లీ 15,16 సంవత్సరాల తర్వాత అదే రకమైన నిషేధాన్ని మరొక భిన్నమైన అనుభవంతో ఎదుర్కొంటున్నామని నా క్లయింట్ మీకు గుర్తు చేస్తున్నాడు. ఎందుకంటే- అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజా భద్రతా చట్టాన్ని తూచా తప్పకుండా పాటిస్తే, ఈనాటి మన తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పోరాడిన ప్రజా సంఘాలను నిషేధించడమే కాకుండా, తన ప్రజా భద్రతా చట్టాన్ని తానే ఉల్లంఘిస్తోంది. విచిత్రమైన విషయమేమిటంటే- ఒక వైపు తె.ప్ర.భ చట్టాన్ని పాటిస్తున్న సంస్థను (విరసంను) చట్టవ్యతిరేకమైన సంస్థగా నిందిస్తూ, మరో వైపు (మీ ద్వారా నడిచే) తెలంగాణ ప్రభుత్వం మాత్రం సదరు చట్టాన్ని పాటించడం లేదు.

7) కాబట్టి తె.ప్ర.భ చట్టం లోని 4, 5, 6, 7 వ సెక్షన్ లకు సంబంధించిన నిబంధనలేవీ పాటించనందున ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 73 ద్వారా మార్చి 30, 2021 న తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంఘాలపై విధించిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని, లేదా పైన పేర్కొన్న నిబంధనల ప్రకారం ఇప్పటికైనా ఒక సలహా సంఘాన్ని వెంటనే నియమించి ప్రజాసంఘాల తరపున తమ తమ వాదనలను వినిపించే అవకాశాన్ని కల్పించాలని ఈ నోటీసు ద్వారా నా క్లయింట్ కోరుచున్నాడు.

లేనిచో నా క్లయింట్ రాజ్యాంగ చట్టాల ప్రకారం తదితర సముచిత న్యాయ పరిష్కార మార్గాలను చేపట్టక తప్పని స్థితిలోకి నెట్టి వేయబడతాడని, అందుకు మీరే బాధ్యులవుతారని తెలియజేస్తున్నాను. కనుక ఈ నోటీసును స్వీకరించి తదనుగుణమైన న్యాయపర చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

- డి. సురేష్ కుమార్, అడ్వొకేట్

కరుణాంతరంగం

అన్నిటా తాను ప్రత్యేకమే
అనేక చెరగుల ఆలోచనా ప్రవాహమే



'నన్ను తీర్చిదిద్దిన కరుణన్న'

- శిరోమణి

సరిగ్గా ముప్పై ఏళ్ల క్రితం 1991లో కరుణన్నతో నాకు పరిచయం అయ్యింది. విప్లవోద్యమం వీరయ్యన్నను పరిచయం చేస్తే, వీరయ్యన్న ద్వారా కరుణన్నతో పరిచయం కలిగింది.

వీరయ్య అన్న కరుణన్నను తీసుకొని మా ఊరి ప్రక్కన అమ్మనబ్రోలుకు వచ్చారు. అక్కడ పసుమర్తి దానేలు మామ చెప్పులు కుడుతూవుండేవాడు.

కరుణన్న ఆయన దగ్గర తనకు అవసరమైన, బెల్ట్ బూటులు మోకాళ్ళ దగ్గరకు వచ్చేలాగ తయారు చేయించుకోవడానికి వచ్చాడు.

అప్పుడు కరుణన్న సంకలో కర్రల సాయంతో నుంచోవడం, కొద్ది దూరం నడవడం చేసేవాడు. వీరయ్యన్న పరిచయం చేస్తే చేతులు కలిపి పలకరించుకున్నాం. అలా మొదటి పరిచయం లోనే ఆసక్తిగా కనిపించాడు.

నేను ఇంటర్మీడియట్ చీరాల వి.ఆర్.యస్ - వై.ఆర్.యన్. కాలేజీలో చదువుతున్నానని, మా కాలేజీ సావనీర్‌కి ఆర్టికల్ రాయమన్నారని చెప్పాను. కచ్చితంగా రాయాలన్నాడు. ఏ అంశం మీద రాయాలని అడిగాను. స్టూడెంట్ లైఫ్ గురించే రాయమన్నాడు. అలా నా ఆసక్తిని గమనించి, అప్పటికప్పుడు చిన్న వ్యాసం రాసిచ్చాడు. అందులో కాలేజీ కుర్రోళ్ళు క్రికెట్టుకి, సినిమాలకు ఎంత బానిసలో చెబుతూ, "మా అమ్మాయిల శరీరాలు జీన్స్ ప్యాంటుల్లో, టీ షర్టుల్లో ఆధునికంలో విహరిస్తూ వుంటాయి. వాళ్ళ ఆలోచనలు మాత్రం అమ్మమ్మ, బామ్మలతో గుడుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఆదిమకాలంలో ఉంటాయి" అనే లైను నన్ను ఎంతో ఆకట్టుకుంది.

ఆయన రాసిన ఆ చిన్న వ్యాసాన్ని నేను కొంత జోడించి మా కాలేజీ తెలుగు లెక్చరర్ చిన తిరపతయ్యకు ఇస్తే చదివి చాలా మెచ్చుకున్నాడు.

పమిడిపాడులో వీరయ్యన్న, కరుణన్న, సీతమ్మ టీచర్లు కలిసి "బాలబడి" అనే చిన్న స్కూలు పెట్టారు. అది ప్రైమరీ స్కూలు. ఒక పూరింట్లో నడుపుతున్నారు.

ఆ పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి సంవత్సరం జరిపే వాళ్ళు, పాటలు, డ్యాన్సులు నేర్పించడానికి వీరయ్య మాష్టారు బాబు మామయ్యను పిలిపించుకునేవారు. అప్పుడప్పుడు చవటపాలెం నుండి కొంతమంది కుర్రోళ్ళం వెళ్ళేవాళ్ళం.

నేను కాస్త పాడగలగనని తెలుసుకున్న కరుణన్న మా పిల్లలకు పాటలు నేర్పించమని అడగడం, నేను బిడియంగానే ఆ పిల్లలకు పాటలు నేర్పించడం జరిగేది.

ఆ సందర్భంలోనే కరుణన్న నోటి నుండి నాకు తెలియని పాట 'జోలాలీ... పాడాలీ' అనే ఊసా గారి పాట నేర్చుకున్నాను.

'కొండలు పగలేసినం బండలనూ పిండినం..', 'అడవి తల్లికి దండాలో...' ఈ పాటలకు నృత్య రూపకాలు మామయ్య నేర్పిస్తే... 'ఆ చల్లని సముద్ర గర్భం ..' మరికొన్ని పాటలు నేను స్టేజి మీద పాడుతుంటే కోరస్ గా వీరయ్యన్న, కరుణన్న ఉండేవాళ్ళు.

ఆ రాత్రి కరుణన్న వాళ్ళింటికి భోజనానికి వెళ్ళాము. మేమంతా బిడియం బిడియంగా ఉన్నాము. మా కులం గురించి తెలుసో లేదో గాని, కరుణన్న అమ్మానాన్నలు చాలా ప్రేమగా పలకరిస్తూ భోజనాలు పెట్టారు. అప్పుడు పమిడిపాడు హైస్కూలు హెడ్మాస్టారుగా కరుణన్న వాళ్ళ నాన్న భాస్కరరావు మాస్టారు రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నాడు. కరుణన్న వాళ్ళ అమ్మ దగ్గరుండి అందరికీ వడ్డించింది. కరుణన్న అంటే ఆమెకు ప్రత్యేకమైన ఇష్టం. కరుణన్న ఇష్టాన్ని, ఆయన అభిమానించే మనుషుల్ని, కరుణన్నను ఎంత ప్రేమగా చూసుకొనేదో ఆ రోజు మమ్మల్నీ అలాగే చూసింది.

ఇలా పాఠశాల వార్షికోత్సవానికి ఏటా మమ్మల్ని ఆహ్వానించే వాళ్ళు.

* * *

1997 లో అనుకుంటా కరుణన్న కోసం వాళ్ళ నాన్నగారు మొత్తం తమ పెట్టుబడులతో బిల్డింగులు కట్టి పెద్ద హైస్కూలుగా మార్చారు. ఆ స్కూలుకు ఎప్పటిలాగే ఆ ముగ్గురు టీచర్లు నిత్యం శ్రమ చేసేవారు. వాళ్ళే వర్కర్లు, వాళ్ళే టీచర్లుగా, శాస్త్రీయ దృక్పథం తో, బెత్తం లేకుండా చదువు నేర్పాలనీ, అంకిత భావంతో పని చేయాలనీ, 'మార్క్సిస్టు భావాలు కలిగిన కరుణన్న వీరయ్యన్నతో పాటు సీతమ్మ టీచర్ కూడ పనిచేసేవాళ్లు. స్కూలుకు మంచి పేరు రావడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. చుట్టు ప్రక్కల ఊళ్లే కాదు, దూరప్రాంత విద్యార్థులు కూడ చేరారు. వాళ్ళకు వసతి స్కూల్లోనే ఏర్పాటు చేస్తే, ఆ విద్యార్థులకు వంట చేసే పని కరుణన్న వాళ్ళమ్మది. ఒక మనిషిని పెట్టుకొని తమ ఇంట్లోనే చేసి పెట్టేవాళ్ళు. తానే స్వయంగా వంటచేసి పెట్టడంలో ఆ అమ్మ తృప్తిపడేది.

నేను ఎప్పుడన్నా పమిడిపాడు పోయి స్కూలుకు వెళ్ళినప్పుడు కరుణన్నను కలవడం కాస్త ఆలస్యం అయ్యేది. ఎందుకంటే కరుణన్న స్కూలు కరస్పాండెంట్ హోదాలో బిజీగా ఉండేవాడు. ఎప్పుడన్నా మాట్లాడే అవకాశం వచ్చినా, ఇది వరకటిలా ఎక్కువ సమయం మాట్లాడుకునేవాళ్ళంకాదు.

పెట్టుబడి తెచ్చిన హోదాతో మార్క్సిస్టు అయిన కరుణన్న, స్కూలు యజమానిగా మారిపోయాడని, ఇక మనవంక చూడడేమోననీ అనుమానం కూడా కలిగింది నాకప్పట్లో. ఆ కాలంలోనే నేను ఆయన దగ్గర పుస్తకాలు చాలా తెచ్చుకొని చదివేవాడిని. అలిశెట్టి ప్రభాకర్ కవితలు అప్పుడే నాకు పరిచయం అయ్యాయి.

ఆ కవితలు నన్ను ఎంత ప్రభావితం చేశాయంటే, మా ఇంటి తలుపుల మీద, మంచి నీళ్ల బాయి కాడ, రోడ్లు ప్రక్క గోడల మీద అలిశెట్టి ప్రభాకర్ కవితలు బొగ్గుతో రాసేవాడిని. చాలామంది పరిచయస్తులకు ఆ కవితలు చదివి వినిపించేవాడిని.

అల్లం రాజయ్య గారి నవల (పులి ఆనంద మోహన్ పేరుతో రాసినది) "వసంతగీతం" ఆయన దగ్గర తెచ్చుకోని చదివా! ఇంకా ఇలాంటి ఎన్నో పుస్తకాలు కరుణన్న దగ్గర తెచ్చుకొని చదివేవాడిని.

* * *

1998లో కరుణన్న గవర్నమెంటు టీచర్ అయ్యాక మొట్టమొదటి సారి రాచపూడి అనే ఊళ్ళో ఎలిమెంటరీ స్కూల్లో చూశాను. ఆ వేళ చాలా సమయం ఆయనతో మాట్లాడే అవకాశం వచ్చింది.

కరుణన్న నాతో అనలేదు గానీ, ఎవరి ద్వారానో ఝాన్సీ అక్కతో కరుణన్న ప్రేమ గురించి తెలిసింది. ఆమె 'బాలబడి' స్కూల్లో టీచర్ గా చేస్తుందని తెలిసింది. స్కూలుకి సెలవు దొరికినప్పుడల్లా కరుణన్న ఒంగోలు కాంతి – మూర్తి ఇంటికి వచ్చేవాడు. ఆ ఇంట్లో సాహిత్య వాతావరణం పుష్కలంగా ఉండేది. విప్లవాన్ని కాంక్షించే మిత్రులకు అక్కడ చోటుండేది. కరుణన్న – ఝాన్సక్కల ప్రేమ, పెళ్ళి రూపం దాల్చింది అక్కడే.

ఒకరోజు నేను, కరుణన్న కాంతి అక్క వాళ్ళింట్లో ఉన్నాము. మేదరమెట్ల దగ్గర చలివేంద్రం నుండి ఝాన్సక్క వచ్చింది. వాళ్ళిద్దరూ చాలా సేపు మాట్లాడుకున్నాక ఝాన్సక్కను పిలిచి కాంతక్క ప్రత్యేకంగా మాట్లాడింది. "బాగా ఆలోచించుకో ఝాన్సీ! కరుణ మీద ప్రేమతో నువ్వు మిగిలిన విషయాల గురించి ఆలోచించడంలేదు. కరుణ కనీసం తన పనులు తాను చేసుకోలేడు, పసి పిల్లవాడితో సమానం. కరుణ మీద ఇప్పుడున్న ఆకర్షణ, ప్రేమ భవిష్యత్ లో ఉండకపోవచ్చు. అప్పుడు నీకు చాలా కష్టం అనిపించవచ్చు. తర్వాత బాధపడి లాభంలేదు, అందుకే కొంత కాలం ఆలోచించుకోని నిర్ణయం తీసుకో ...తొందరేమిలేదు" అని నచ్చచెప్పింది. ఝాన్సక్క మౌనంగా దిగులు ముఖం పెట్టింది.

పెళ్ళికి తమ తమ ఇళ్ళలో ఝాన్సీ అక్కకు లభించిన అంగీకారం కరుణన్నకి దొరకలేదు. కరుణన్నను అంత ప్రేమగా చూసుకునే తల్లిదండ్రులు ఈ ప్రేమను తిరస్కరించడం ఆశ్చర్యం కలిగించింది.

ఆ సాయంత్రం 'నేను మేదరమెట్ల పోను కరుణా!...' అంటూ ఝాన్సక్క దిగులు ముఖం పెట్టుకుంది. మరెట్లా!...అన్నట్టు కరుణన్న దిగులుగా చూశాడు. "శిరోమణితో వాళ్ళ ఊరువెళతాను, పొద్దున్నే ఇక్కడకు వస్తాను!". కరుణన్న మౌనం అయిపోయాడు.

నేను ఉలిక్కిపడ్డాను. "వద్దక్కా...వద్దు నువు మా ఇంటికి రావద్దు. ఎందుకంటే మా ఇంటిలో ఫ్యాను లేదు, కనీసం బాత్ రూమ్ కూడ లేదు" అన్నాన్నేను. "అదేంటి శిరోమణి! మీ అమ్మా, చెల్లెలు ఎలా ఉంటారో! అలాగే నేనూ వుంటా!"అంది.

ఆ రాత్రికి మా ఊరికొచ్చి, పొద్దున్నే మళ్ళీ ఒంగోలు కరుణన్న దగ్గరకు రావాలనే ఆమె కోరికను ఆనాడు నేను నెరవేర్చలేకపోయాను. పాపం దిగులుగానే మేదరమెట్ల ప్రయాణమయ్యింది.

3 మే 1999 న కరుణన్న ఝాన్సక్కల పెళ్ళి అనుకున్నాము. బాబు మామయ్య మరో మిత్రుడుతో కలసి, పెళ్ళికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. పెళ్ళి వేదుక ఒంగోలు బి.యస్.యన్.యల్ ఆఫీసు ఎదురుగా ఎ.పి.సి.యల్.సి. నాయకులు, లాయర్ కనకయ్య గారి ఆఫీసు.

ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు మొత్తం ఇరవై, ముప్పై మంది పాల్గొన్న పెళ్ళి సభ అది. మేదరమెట్ల నుండి ఝాన్సక్క వాళ్ళక్క రజనీతో వచ్చింది. అక్కడ చేరినవారిలో కరుణన్న తర్వాత నేనే వాళ్ళకి కాస్త పరిచయస్తుడిని. బిడియంగా, భయంగా ఉన్నారు. కరుణన్న కూడ భావోద్వేగంగా ఉన్నాడు.

రజనీ అక్క అప్పటికప్పుడు ట్రంకురోడ్డుకెళ్ళి కొని తెచ్చిన ఎర్రటి పంజాబీ డ్రస్‌లో ఝాన్సక్క పెళ్ళికూతురుగా తయారైంది.

కరుణన్న, ఝాన్సక్కలు చెరొక కుర్చీలో, మరో మూడు కుర్చీలలో పెళ్ళి పెద్దలు కళ్యాణరావు, గాండ్ల వెంకట్రావు, కనకయ్య,

మేమందరం చాపలేసుకుని క్రింద కూర్చున్నాం.

ప్రసంగాలు అయ్యాయి, పత్రాలు చదివారు. కరుణన్న, ఝాన్సక్కలు పూలదండలు మార్చుకున్నారు. పెళ్ళి తంతు జరిగిపోయింది. పెళ్ళి అయ్యాక కొత్త దంపతులు కరుణ – ఝాన్సీ లు ఎక్కడ నివాసం ఉండాలని ముందుగా అనుకోలేదు.

ఆరోజు కాంతి అక్క వాళ్ళు ఒంగోలులో లేరు. అప్పటికప్పుడు కె.యన్.పి.యస్. నాయకులు దుడ్డు ప్రభాకరన్న చొరవతో చీమకుర్తిలో రిటైర్డ్ టీచర్ సంగీతరావు మాష్టారు గారింట్లో ఉంచాలని తీర్మానించారు.

నేను అప్పటికే పది రోజుల ముందు చీమకుర్తి క్వారీలో కార్మికుడిగా చేరడం జరిగింది. రోజూ ఒంగోలు నుండి చీమకుర్తి వెళుతూ ఉండేవాడిని.

ఒంగోలు నుండి గాకుండా నన్ను చీమకుర్తిలోనే కరుణన్న – ఝాన్సక్కలకు తోడుగా వాళ్ళతోనే ఉండమని ఎవరు ప్రతిపాదించారో తెలియదు గానీ వెంట వెంటనే నిర్ణయాలు జరిగిపోయాయి. ఒక వెహికిల్లో కరుణ–ఝాన్సీలు, రజనక్క నేను ప్రభాకరన్న వాళ్ళతో సహా ఆ రాత్రి చీమకుర్తి బయలుదేరిపోయాము.

చీమకుర్తిలో నేనెప్పుడూ చూడని కొత్త ప్రాంతంలోకి వెళ్ళి ఆగింది జీపు. అది ఎం.ఆర్.ఓ ఆఫీసు ప్రక్కన సంగీతరావు మాష్టారు ఇల్లు అది. ప్రభాకరన్న అండదండలను నమ్ముకున్న కరుణన్న కాస్త ధైర్యంగా ఉన్నాడు.

మమ్మల్ని చూసి ఆ ఇంట్లో వాళ్ళు ప్రేమతో పలకరించి ఆహ్వానించారు. అది రెండు పోర్షన్ల పెద్ద పెంకుటిల్లు, ముందుగా చెప్పారేమో! ఒక పోర్షన్ మొత్తం ఖాళీచేసి వుంచారు. చాలా ప్రశాంతంగా ఉంటుంది ఆ ఇల్లు.

మరుసటి రోజు ప్రభాకరన్న నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. కరుణన్న పెళ్ళి చేసుకున్నాడన్న సంగతి తెలిసి, పెళ్ళికి హాజరు కానివారందరూ రోజుకు కొంతమంది వచ్చిపోతుండేవారు. ఒక రోజు కాంతి-మూర్తి, వాళ్ళ ఇంటి దగ్గరతను వస్తున్నారని తెలిసి, మటన్ తీసుకొని వచ్చాం. రజనక్క సాయంతో మేమే వంటచేశాం. మధ్యాహ్నం అందరం ఒకే సారి కలసి తిన్నాం.

చీమకుర్తిలో ఉన్నప్పుడు మద్దూరి నగేష్ బాబు రాసిన "మీరేవుట్లు?" అనే సంకలనం కొన్నాడు కరుణన్న. అందులో కవితలు ఎంజాయ్‌మెంట్‌గా పెద్దగా చదివేవాడు. అందులోని వ్యంగ్యానికి నేను, ఝాన్సక్క నవ్వలేక చచ్చేవాళ్ళం. అప్పటి నుండే నేను మద్దూరు ప్రేమలో పడిపోయా! అంత గొప్పగా పరిచయం చేశాడు కరుణన్న.

చీమకుర్తిలో దాదాపు నలభై మూడు రోజులు ఉన్నాము. ఆ రోజు ఆ ఇల్లు ఖాళీ చేసి వెళ్ళుతున్నప్పుడు ఝాన్సక్క కన్నీళ్ళు పెట్టుకుంది.

ఒంగోలులో కొత్త కాపురానికి అవసరమైన మంచాలు, కంచాలు కొని, మినీ లారీలో వేసుకొని రాచపూడిలో గొర్ల కొష్టంలాంటి ఇంట్లో వాళ్ళను దింపేసి నేను చీమకుర్తికి బయలు దేరాను. కాలం అలా గడిచిపోతుంది. రాచపూడిలో ఉన్నప్పుడు కరుణన్న వాళ్ళింటికి మూడుసార్లు వెళ్ళినట్టు గుర్తు. చిన్నారి అక్కడే పుట్టాడు. తర్వాత ప్రక్కనే మాలంపాటివారిపాలెం ట్రాన్సుఫర్. రాచపూడి నుండి మూడు కి.మీ. నడుచుకుంటూ వెళ్ళేవాడిని.

మాలంపాటివారిపాలెంలో ఉన్నప్పుడే కరుణన్నకు నన్నపనేని రవి ద్వారా రాఘవ సార్ పరిచయం అయ్యాడనుకుంట.

ఒక రోజు సడెన్ గా కరుణన్న ఫోన్ చేశాడు. రేపు ఆదివారం మాలంపాటివారిపాలెం రమ్మన్నారు. 'అన్నా నాకు హెల్త్ బాగోలేదు. జ్వరం తగ్గింది గానీ, పెదాలు పొక్కిపోయాయి, ఇప్పుడు రాలేనన్నా' అన్నాను. 'నీ గ్లామరు కోసం కాదయ్యా! నువు అర్జెంటుగా రేపు వచ్చెయ్యి' అన్నారు. నేను కాదనలేకపోయాను. 'వస్తూ.వస్తూ కొత్తగా రాసిన కథ ఉంటే పట్టుకొనిరా!' అన్నారు.

చిత్తూరు నుండి పలమనేరు బాలాజీ, సుంకోజి దేవేంద్రాచారి వచ్చారు. దుద్దుకూరు శ్రీను, నన్నపనేని రవి, రాఘవ, మాధవి, శ్రీదేవి కరుణన్న, ఝాన్సక్క మూడేళ్ల చిన్నారి వాళ్ళందరి ముందు భోజనాలు అయ్యాక బిడియంగా కూర్చున్నాను.

ఒక్కొక్కరు కథలు చదవడం మొదలు పెట్టారు. ముందుగా కొత్త కథకులుగా దుద్దుకూరు శ్రీను గారు కథ చదివారు. కథ మీద అక్కడ అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. తర్వాత నేను కథ చదివాను. కథ చదువుతున్నప్పుడే పలమనేరు బాలాజీ గారు నోట్సు రాసుకుంటున్నాడు. చదవడం అయ్యాక 'నీ ఒక్క కథలో ఎనిమిది కథలున్నాయబ్బా! ఒక కథా వస్తువు తీసుకున్నప్పుడు దాని పరిధిలోనే కథ నడవాలి. అలాగాక అనేక అంశాలు జోడిస్తే అది నవల అవుతుందని బాలాజీ గారు చెప్పారు.

ఆ తర్వాత కరుణన్న చేసిన విశ్లేషణే ముందు ముందు నేను కథలు రాయడానికి ప్రేరణయ్యింది. 2001లో ఒకసారి కరుణన్నకు హార్ట్ స్ట్రోక్ లా వస్తే ఒంగోలు కార్తికేయ హాస్పిటల్లో రెండు, మూడు రోజులు ఉన్నాడు. సంవత్సరం పిల్లోడు చిన్నారిని అమ్మ వాళ్ళ దగ్గర వదిలేసి, కరుణన్నని కనిపెట్టుకోని వుంది ఝాన్సక్క.

ఆ సాయంత్రం హాస్పిటల్ కు వెళ్లాను. నన్ను చూసి కన్నీళ్ళు పెట్టుకుంది ఝాన్సక్క 'అన్నకు ఏం కాదులే అక్కా. ధైర్యంగా వుండు' అని ఓదార్చి వచ్చాను. తర్వాత సమస్యేమీ లేదని తెలిసింది. ఆ తర్వాత నాకు తెలిసి అనారోగ్యంతో కరుణన్న హాస్పిటల్ గడప తొక్కింది ఎప్పుడూ లేదు.

కరుణన్న-ఝాన్సక్కలు నా పెళ్ళికి జీపులో కేశవరప్పాడు వచ్చారు. మాకు జరిగిన దండల పెళ్ళిలో కరుణన్న మాట్లాడితే చాలా మంది ఆసక్తిగా విన్నారు. అలా మా బంధువులకు పరిచయం అయ్యాడు. ఎప్పుడన్నా మా ఊరికిపోతే 'నీ పెళ్ళిలో మాట్లాడిన ఆయన బాగున్నాడా' అని అడుగుతుంటారు. బాబు మామయ్య పెళ్ళి సందర్భంగా చవటపాలెం కూడ వచ్చారు.

* * *

కరుణన్నతో నాకున్న సాన్నిహిత్యం నా మానసిక ఎదుగుదలకు ఉపయోగపడింది. సాహిత్యంలో గానీ, నా వ్యక్తిగత జీవితంలో వచ్చే ఎన్నో ఒడుదుడుకులకు అన్న మాట సాయం నాకెంతో ఉపయోగపడేవి. దైవాలరావూరులో ఉన్నప్పుడు రెండు సార్లు కరుణన్న దగ్గర వెళ్ళాను.

మొదటి సారి స్కూల్లో పిల్లలతో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు చూడడానికి వీరయ్యన్న, బాబు మామయ్య, నేను కలసివెళ్ళాము. అది జనవరి నెల కావడంతో మంచులో ఒణుకుతూ కూర్చుని పిల్లల నృత్యాలు, నాటికలు చూశాము.

ఆ రాత్రికే మామయ్య, వీరయ్యన్న పమిడిపాడు వెళ్ళారు. కరుణన్న నన్ను ఉండమన్నారు. ఆ తెల్లారి పొద్దున్నే కోటేశ్వరరావు హెడ్మాస్టారు, సి.ఎ ప్రసాద్ గారు, రాఘవ గారు వస్తే చాలా సేపు నా చేత పాటలు పాడించాడు కరుణన్న. కారంచేడు ఒగ్గు కథలోని కొన్ని పాటలు పాడితే, కోటేశ్వరరావు మాష్టారు, రాఘవ సార్ మురిసి తబ్బిబ్బయ్యారు.

ముఖ్యంగా "కొసితో కదలండిరో...కత్తులు బట్టండిరో మీసమున్న రోషమున్న కమ్మ రైతు బిడ్డలారా" అనే పాటను ఎమోషనల్ గా నేను పాడుతుంటే వింటున్న వాళ్ళు కూడ ఎమోషనల్గా ఫీలయ్యారు. అంత బాగా పాడినందుకు కరుణన్న చాలా సంతోషపడ్డాడు.

2016 లో నేను పనిచేస్తున్న క్వారీలో మానివేసి, మూడు నెలలు ఇంటి దగ్గరే ఉండాల్సివచ్చింది. నాకు ఉపాధి కల్పించడానికి కరుణన్న చేసిన ప్రయత్నం నేనెప్పటికీ మరువలేను. ఆ సందర్భంగా రెండవ సారి దైవాలరావూరు వెళ్ళాను.

ఎం.ఎల్. ఏ గొట్టిపాటి రవికుమార్ క్వారీలో చేర్పించాలని చాలా ప్రయత్నం చేశాడు. మద్దిపాడు గ్రోత్ సెంటర్, చివరకు కరీంనగర్ కూడ పంపించాడు. తనకు పరిచయం లేని రంగమైనా తెలిసిన మిత్రుల ద్వారా తీవ్రమైన కృషి చేశాడు.

నన్ను ఎప్పుడూ ఇంట్లో మనిషిలాగానే చూసేవారు. కలిసి భోజనాలు చేసేవాళ్ళం. నేను వేరుగా బయట గదిలో పడుకుంటానంటే, వద్దు! ఇక్కడే పడుకోమనేవారు. కరుణన్న బెడ్ మీద నేను పడుకుంటే, ప్రక్కన మరో మంచం మీద ఝాన్సక్క పడుకొనేది.

ఇక సాహిత్య గురువుగా నేను ఏది రాసినా మొదట అన్నకు పంపేవాడిని. ఆయన సమీక్ష చాలా అర్థవంతంగా ఉంటుంది. అలా నా

రచనను మెరుగులు దిద్దుకొనేవాడిని. ఎక్కువ సార్లు నా రచనకు వస్తువు కరుణన్నే ఇచ్చేవాడు.

నేను కథలు రాయడానికి అన్న ఇచ్చిన ప్రోత్సాహం అంతా ఇంతా కాదు. 'నీకు తెలిసిన జీవితమే రాయి శిరోమణి, తెలియని దానిలో ఏలు పెట్టకు. నీ పల్లె జీవితం మీద, నీ క్వారీ జీవితం మీద బోలెడు కథలు రాయవచ్చు' అని ప్రోత్సహించి, అలా క్వారీ కథలు రాయడానికి ప్రేరణ అయ్యాడు.

"బాబూ... మీ జేబులు ఒక సారి వెతుక్కోండి/నీవు కత్తిరించి దాచుకున్న పేపరు వెనుక/ఏ పోలీసు ప్రకటనో ఉండొచ్చు/ కాదని ధిక్కరించావంటే/పోలీసు కేసు కావచ్చు/మొండికేసి కూర్చున్నావంటే/కవి రివేరా నే కాదు/నువ్వయినా, నేనయినా, "పోటా" పోటుకు గురి కావచ్చు!" అంటూ 2003 లో అరెస్ట్ అయిన మిత్రుడు రివేరా కి సంఘీభావంగా కవిత రాయడానికి ప్రేరణ కరుణన్నే. ఆయన ఇచ్చిన మొదటి లైనుకు నేను ఆ కవిత ను రాయగలిగాను. నా రాతను ఆయన 'ఒకే' అన్నాడంటే నేను హిట్టయిపోయినట్టే అలా సంబరపడిపోయేవాడ్ని.

మంగమూరుకు ట్రాన్ఫర్ అయ్యాక ఝాన్సక్క స్కూటీ మీద ఇంటికి వెళ్ళాను. ఒంగోలులో అక్క పనిచేసే స్కూలు నుండి వెళ్లాలి."అబ్బాయ్... స్కూటీ తోలుతావా!" అంది. "అబ్బే! నాకు అంత అలవాటూ లేదక్కా" అన్నాను. సరే వెనుక కూర్చోమంది. 'లేదు నేను ఆటోలో వస్తాలే' అన్నా! 'ఆటోలు ఎప్పటికో వస్తాయి. వచ్చి కూర్చోవయ్యా!'. నేను చాలా సిగ్గు పడిపోయాను. ఇంత కాలం బండి ఎందుకు నేర్చుకోలేదా! అని. మధ్యలో బండాపి చెరుకు రసం తాగాము.

ఇంటికి వెళ్ళాక సిగ్గుతోవున్న నా ముఖం చూసి కరుణన్న"ఏం శిరోమణి... వెనుక కూర్చున్నందుకు ఫీలయ్యావా?"అన్నాడు. నేను ఒక నవ్వు విసిరాను. 'నీలో పితృస్వామ్య భావాజాలం పోలేదయ్యా!' అని ఆట పట్టించాడు. "నిన్నే కాదు స్వామీ! మొన్న కోటేశ్వరరావు హెడ్మాస్టారు గారిని కూడ వెనుక కూర్చోబెట్టుకొని ఇంటికి వచ్చింది. ఆయన కూడ ఏం ఫీలు కాలా" అన్నాడు.

* * *

ఇక ఫేస్ బుక్ లో నేను రాసే రాతలను చూచి కరుణన్న మెచ్చుకొనే కంటే హెచ్చరించిన సందర్భాలే ఎక్కువ.

నువ్వెందుకు ఇలా సూటిగా ప్రశ్నిస్తావు? కామెంట్స్ పెట్టి ఇతరులతో గొడవలు పడతావు? కాస్త జాగ్రత్తగా ఉండు నాయనా.

రోజులు బాగోలేవు. నువు పోస్టులు పెట్టకపోయినా పర్వాలేదు. ఇబ్బందులు తెచ్చుకోమాకు. నీవు కావాలంటే కథో, కవితో రాసుకో.... అది ఏ పత్రికలకో పంపు అంతేగానీ ఎఫ్.బి.లో మాత్రం పోస్టు చేయకు. నీకు తొందర ఎక్కువ" అని హెచ్చరించేవాడు.

నాకు వ్యక్తిగతంగా, సాహిత్య పరంగా, రాజకీయంగా ఏ కష్టం వచ్చినా, సందేహం వచ్చినా కరుణన్నతో మాట్లాడితే పరిష్కారం అయ్యేది. నేను ఉపాధి కోసం తమిళనాడు, కేరళ వెళ్ళుతున్నప్పుడు కలత చెందేవాడు, జాగ్రత్తలు చెప్పేవాడు. ఇలా కాకుండా నీవు స్థిరంగా ఉండాలంటే నేను ఏ రకంగా ఉపయోగపడగలను అని అడిగేవాడు.

2018 లో నేను మైనింగ్ లో ఫోర్ మన్‌గా పాస్ కావడానికి సహాయ సహకారాలు అందించాడు. నేను నా వృత్తిలో బిజీగా వున్నా, నైట్ డ్యూటీలు చేస్తున్నానంటే, ఫోన్ చేసి ఆరోగ్యం జాగ్రత్త అని హెచ్చరించేవాడు. 'నీకు ఆరోగ్య సమస్యలు ఏమైనా వస్తే, గమ్మునుండకు. నీకు ఆర్థిక సహాయం చేయడానికి నేను ఎప్పుడూ సిద్ధమే' అని ఒకసారి హామీ ఇచ్చాడు.

గత ఏడాది వలస కార్మికులు నడిచిపోతుంటే వాళ్ళను ఆదుకునేందుకు ఎంత తపన పడ్డాడో! ఎంతమందికి ఫోనులు చేసి వాళ్ళ సహాయ సహకారాలు అందివ్వడానికి కారణం అయ్యాడో! వలస కార్మికుల మీద నా చేత మంచి వ్యాసం కూడ రాయించాడు.

"పిల్లలను మంగమూరు గవర్నమెంటు స్కూలులో చేర్చి, మా ఇంటి దగ్గర ఇల్లు తీసుకుని ఉండు శిరోమణి... పిల్లలకు స్టడీస్ మేము చూసుకుంటాం" అంటే.... ఆ ఒక్కటి మాత్రం నేను చేయలేకపోయాను.

ప్రతి సంవత్సరం మొదట్లో అడిగేవారు ఎందుకు పిల్లలకు ఫీజులు వేలు, వేలు పోయడం అనేవారు. ఝాన్సక్క అయితే మరీ.

మా వాడిని పదవ తరగతి తర్వాత ఒకేషనల్ కోర్సుల్లో ఫిషరీస్ గానీ, వెటర్నరీ గానీ చేయిద్దామనుకుంటున్నాను అని చెప్పగానే, అన్న చాలా సంతోషించాడు. మంచి నిర్ణయం అని ప్రోత్సహించారు.

'అడ్మిషన్, సీటు సంగతి నేను చూసుకుంటాను నాకు వదిలేయి' అన్నాడు. మా అమ్మాయికి ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో సీటు రావడానికి అన్న సలహాలు ఇచ్చాడు.

* * *

నేను పది రోజుల క్రితం ఝాన్సక్క కు ఫోన్ చేశాను. అక్క లిఫ్ట్ చేసి ముక్కుతో మాట్లాడినట్లుంది. తర్వాత కరుణన్న తీశాడు. 'అక్క ఏంటి అలా వుంది. జలుబు చేసిందా' అన్నాను. అవును, ఈ రోజు నుండి స్టార్ట్ అయ్యింది అన్నాడు. మూడు తర్వాత ఫోన్ చేస్తే ఝాన్సక్క మాట్లాడింది. 'అబ్బాయ్... నాకు పాజిటివ్ వచ్చింది' అని మెల్లగా చెప్పింది. నేను కంగారు పడిపోయి, ధైర్యంగా ఉండండి అని చెప్పాను.

16.7.21 మధ్యాహ్నం కరుణన్న కి ఫోన్ చేశాను. 'అన్నా అమ్మాయికి సెకండ్ టరం ఫీజు ఆన్లైన్ ద్వారా కట్టాలి. వాళ్ళు లింకు పంపారు. అది నావల్ల కాలేదు చూడన్నా!' అని అడిగాను. అయ్యో! మరి నాకు చెప్పొద్దా? అని లింకు తీసుకుని పది నిమిషాల్లో ఫీజు కట్టినట్టు రసీదు వాట్సాప్‌లో పంపాడు.

17.7.21 న మెసేజ్ చేసినా, ఫోన్ చేసినా కరుణన్న నుండి రిప్లయ్ రాలేదు. 18.7.21 పొద్దున్నే సుమారు 5.30 కు కరుణన్న ఆరోగ్యం బాగాలేదని హాస్పటల్ కి వచ్చాడని మిత్రుడు రాఘవ ఫోన్ చేస్తే వెంటనే వెళ్ళాను. ఒంగోలు వెంకట రమణ హాస్పిటల్లోకి పరిగెత్తుకు పోతే, అక్కడ చిన్నారి, ఝాన్సక్కలు నన్ను చూసి ఒక్కసారి బోరుమని ఏడ్చారు.

నాకు కాళ్ళు, చేతులు ఆడలేదు. కారులో కరుణన్న ఝాన్సక్క ఒడిలో శాశ్వతంగా నిద్రపోతున్నాడు. ఝాన్సక్క అల్లాడిపోతుంది.

అయ్యో... నా మిత్రుడు, అన్నయ్య, నా గైడు, నా రాజకీయ గురువు, నా శ్రేయోభిలాషి కరుణన్నను ఇలా నిర్జీవంగా చూడాల్సివచ్చినందుకు కుమిలిపోయాను.

హాస్పిటల్ కి వచ్చేముందే కరుణన్నను ఈ మధ్య కాలంలో విపరీతంగా అభిమానించే రమాసుందరి మేడంకు సమాచారం ఇచ్చాను.

కరుణన్న నిర్జీవ దేహంతో ఝాన్సక్కను తీసుకుని చిన్నారి పమిడిపాడు బయలుదేరాడు.

కరుణశీల రాజకీయ హృదయం

పాణి

మరణాల మధ్య, విషాదాల మధ్య, దుఃఖాల మధ్య తిరుగాడుతున్న కాలమిది.

మరణం నుంచే ఉత్తేజం పొందవలసిన కాలమని అనుకోడానికి మనసు ఒప్పడం లేదు. కుంగదీసే మరణమే అపారమైన ఆశతో లేపి నిలబెడుతుందనే వైచిత్రిని అంగీకరించ బుద్ధి కావడం లేదు.

కొన్ని రోజుల నుంచి మరణాలు.. మరణాలు..

అసహజ మరణాలు, అకాల మరణాలు, వ్యవస్థీకృత మరణాలు....

ఫాదర్ స్టాన్‌స్వామి అలా మరణిస్తాడని అనుకున్నామా? పండు వృద్ధాప్యంలో జైలులో, కరకు న్యాయ వ్యవస్థ సంకెళ్లలోంచి వెళ్లిపోయాడు.

హరిభూషణ్ అలా మరణిస్తాడని అనుకున్నామా? వేల యుద్ధాలకు గుండెను ఒడ్డిన సాహసి. ఆయన అనేక సార్లు మరణించాడనే వార్తలు విన్నాం. సాహిత్యంలో కనిపించే వాస్తవ, కాల్పనిక పాత్రధారి ఆయన. కడకు కరోనాతో వెళ్లిపోయాడట. ఆయన మరణవార్తను ప్రకటించాలనే ఆనందం ఆయన విరోధులకు దక్కలేదు.

ఇంకోపక్క నుంచి కామ్రేడ్ కరుణాకర్ మరణం.

అద్భుతమైన మనిషి. ఆయన మరణవార్త విన్నాక ఆయనతో స్నేహం ఎంత సుదీర్ఘమైనదో గుర్తుకు రాలేదు. ఆయన రూపొందిన తీరు ఏమిటా? అనే అంతర్మథనమే మొదలైంది.

కొందరు కాలానికి కూడా పవిత్రతను ఆపాదిస్తుంటారు. ఆ కాలంలో కాబట్టి అలాంటి మనుషులు తయారయ్యారని, ఇప్పుడు అలాంటివారు ఎక్కడ అని అంటుంటారు. కరుణాకర్ అచ్చం మన కాలం ఒడిలో నిర్మాణమైన మనిషి. ఇది ఎంత ఆటుపోట్ల కాలం. ఎన్ని సందిగ్ధతల కాలం. అసలు సందిగ్ధతలు ఉండటమే మేధో చిహ్నమనే దబాయింపు రాజ్యమేలుతున్న కాలం. కానీ దృఢమైన అవగాహనలతో దేన్నయినా ఎలా అన్వేషించవచ్చో, దేన్నయినా శాస్త్రీయంగా ఎలా చేరుకోవచ్చో తన ఆలోచనలతో ఈ కాలంలో కరుణాకర్ నిరూపించాడు.

'కదలిక' కష్టమైన మనిషి కదా, కానీ అపార చలనశీలిగా జీవించాడు. చాలా మామూలు మనిషిగా అనేక మంది దగ్గరికి వెళ్లాడు. అంతకంటే ఎక్కువ మందిని తన దగ్గరికి తీసుకున్నాడు. తన రాజకీయ తాత్విక విశ్వాసాల జెండాలను రెపరెపలాడిస్తూనే అందరికీ చేరువయ్యాడు. అందరూ తనకే కరుణాకర్ సన్నిహితమనుకొనే మానవ సంబంధాల జీవధార అతను. ఇప్పుడు ఆయన మరణానంతరం మిత్రుల తలపోత వెనుక ఉన్న రహస్యం అదే.

ఆయన గొప్ప ఉపాధ్యాయుడు కావచ్చు. అద్భుతమైన చిత్రకారుడు కూడా కావచ్చు. అనువాదకుడు కావచ్చు. వెరసి మంచి మనిషి కావచ్చు. కానీ ఇన్ని చెరగుల, ఇన్ని తీరుల విస్తరించింది ఆయన రాజకీయ హృదయమే. మార్క్సిస్టుగా, విప్లవాభిమానిగా,



వర్గపోరాటవాదిగా ఆయన నిర్మాణమైన తీరులోనే ఆయన సకల ప్రత్యేకతలు ఉన్నాయి.

ఇప్పుడనిపిస్తున్నది.. బహుశా ఆయన స్కూల్లో పిల్లలను దగ్గరికి తీసుకున్నట్లే తన చుట్టూ ఉండే అనేక మంది సృజనకారులను దగ్గరికి తీసుకున్నారు. ఆయన భౌతికంగా పరిగెత్తి పోలేని తావులన్నిటికీ తన ఆలోచనా ప్రపంచాన్ని విస్తరింపజేసుకున్నాడు. ఇతరులు ఏది ఎట్లా ఆలోచిస్తే మంచిదో గుర్తించి దానికి తన ఆలోచనలను జోడించినవాడు. వాళ్లతో కలిసి ఆలోచనలను అన్వేషించినవాడు. చాలా మందికి సహాన్వేషకుడు కావడమే కరుణాకర్ ప్రత్యేకత. దేన్నయినా ఆయనతో కలిసి ఆలోచించవచ్చనే నమ్మకం ఇవ్వడం అంత సామాన్యం కాదు. అది కేవలం ఆయన వ్యవహార శైలి మాత్రమే కాదు. ఆలోచనారీతికి సంబంధించింది కూడా. బడిలో పిల్లల దగ్గరి నుంచి అనేక మంది రచయితలతో, కార్యకర్తలతో, ఆలోచాపరులతో కరుణాకర్ అలాంటి సంబంధాలను కొనసాగించాడు.

బడిలో పిల్లలకు చెప్పినట్లే ఎవరికి ఏది ఎట్లా అర్థం అవుతుందో అట్లా చెప్పడం, తానే చేయగల పనులన్నీ వెతికి అందుకోవడం ఆయన విశిష్టత.

వీటన్నిటినీ తరచి చూస్తే ఒకటి అర్థం అవుతుంది. ఈ కాలంలో ఏది అవసరమో, ఎందుకు అవసరమో గుర్తించడం. అట్లా ఆయన చేసిన పనులన్నిటి సారం మార్క్సిస్టు చైతన్యం తప్ప మరేమీ కాదు.

విప్లవోద్యమ ప్రభావాల్లోంచి కరుణాకర్ ఆలోచనాపరుడిగా ఎదిగాడు. పాతికేళ్లుగా విప్లవోద్యమ సంచలనాలను దగ్గరిగా చూశాడు. అర్థం చేసుకున్నాడు. అనేక వాదవివాదాల అర్థాలు పసిగట్టి తనదైన వైఖరి తీసుకున్నాడు. ఆయన మరణానంతరం స్థానిక మిత్రులు.. ఆరోజుల్లో పౌరహక్కుల ఉద్యమంలో బాలగోపాల్ వాదనల గురించి కరుణాకర్ అవగాహనను పంచుకున్నారు. అప్పుడు ఆయన పౌరహక్కుల సంఘంలో ఉండేవాడు. సహజంగానే ఆ వాదనలకు సన్నిహితంగా మసలి ఉంటాడు. వాటి మీద మార్క్సిస్టు వైఖరిని కరుణాకర్ చాలా లోతుగా వివరించాడని చెబుతున్నారు.

అట్లా చివరి దాకా కరుణాకర్ ఎడతెగని సంభాషణలో ఉన్నాడు. ఆయన చాలా ప్రేమాస్పదుడని, సున్నితంగా ఉంటాడని అంటున్న మిత్రులే వైఖరుల దగ్గరికి వస్తే చాలా కచ్చితంగా ఉంటాడని గుర్తు చేసుకుంటున్నారు. నిజానికి అక్కడ కరుణాకర్ కఠినంగా కూడా ఉంటాడు. మొహమాటానికి, గౌరవ భావాలకు లోనుకాడు. ఈ మాట చెప్పడానికి ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు.

ఏ చిన్న విషయంలోనైనా ప్రగతిశీల ఉద్యమ అవసరాలకు తగిన వైఖరులు తీసుకుంటాడు. మానవులు తమ ఆలోచనలతో, హేతుబద్ధతతో, తార్కికమైన ఆచరణతో ప్రగతిదాయక పరివర్తనలో భాగమవుతారని, ప్రగతిని సాధిస్తారనే అవగాహనను గీటురాయి చేసుకున్నాడు. అందువల్లనే చాలా సున్నితమైన సమస్యల్లో కరుణాకర్ సంభాషణ అనేక మందిని ఆకట్టుకొనేది. తన చుట్టూ ఉన్న వాస్తవ పరిస్థితుల సంక్లిష్టతను పొరలు పొరలుగా విప్పి చూడగల ఆయన సునిశితత్వమే ఆయన స్నేహ ప్రపంచాన్ని సువిశాలం చేసింది. శారీరకంగా తనకున్న ప్రత్యేకతల వల్ల ఆలోచనలను నిత్యం చలనశీలంగా తీర్చిదిద్దుకున్నాడు.

తెలుగు-ఆంగ్ల మాధ్యమాలు, అస్తిత్వ ఆకాంక్షలు-వర్గపోరాటాలు, మార్క్సిస్టు సిద్ధాంతం-భిన్న ప్రగతిశీల సిద్ధాంతాలు, సాహిత్య కళారంగాల్లో సృజనాత్మక ప్రయోగాలు-ప్రజానుకూల లక్ష్యం.. ఇలా ఎన్నిటిలోనో కరుణాకర్ ఆసక్తికరమైన వైఖరులు తీసుకొనేవాడు. సున్నితమైన భాషతో సునిశిత విశ్లేషణలు చేసేవాడు.

పాతికేళ్లకుపైగా కరుణాకర్ విరసంతో, విప్లవ సాహిత్యోద్యమంతో సన్నిహితంగా ఉన్నాడు. ఎంతగానంటే ఆయన విరసం సభ్యుడు కాదని ఎవ్వరికీ అనిపించేది కాదు. తాను అనుకొనేవాడు కాదు. ప్రత్యేకించి ఏ పనీ లేకపోయినా విప్లవ సాహిత్యోద్యమం ఆలోచించాల్సిన ఏదో ఒక విషయం గురించి వివరంగా చర్చించేవాడు. తనంత తానుగా అరుణతారలోని కథలకు బొమ్మలు వేస్తానని ముందుకు వచ్చాడు. పత్రికలో వస్తున్న కథలపట్ల ఆయన ఆసక్తి అలా ఉండేది. అరుణతార అచ్చుకు వెళుతుండగా కథలు పంపించినా రాత్రిళ్లు మేలుకొని బొమ్మలు వేసి ఇచ్చేవాడు. ఈ క్రమంలో ఆ కథల గుణదోష చర్చ చేసేవాడు. ఎంతగానంటే ఒక కథలో ఉన్న అంతరార్థాలకు తగినట్లు తాను బొమ్మ వేయలేకపోయానని ఒకసారి, ఫలానా కథలో ఈ చిన్న సమస్య ఉన్నది.. దాన్ని ఇట్లా సవరించవచ్చేమో చూడండి అని మరోసారి అనేవాడు. పైకి బాగానే ఉన్నా అంతిమంగా కథ లోపభూయిష్టంగా ఉందని, అచ్చువేయకపోతేనే మంచిదనీ సలహా ఇచ్చేవాడు. ముఖ్యంగా దండకారణ్య కథలు కరుణాకర్‌కు ఒక ప్రత్యేక ఆకర్షణ. ప్రతి కథ మీదా చర్చించేవాడు. ఒక్కోసారి ఆ కథలకు తను వేసిన బొమ్మ తనకే సంతృప్తి ఇవ్వక చివరాఖరిలో మరొటి వేసి పంపించేవాడు.

ప్రొ. సాయిబాబా జైలు జీవితంతో కరుణాకర్ చాలా సున్నితంగా కనెక్ట్ అయ్యాడనిపిస్తుంది. తన గురించి ఒక అద్భుతమైన వీడియో తయారు చేశాడు. సాయి కవిత్వ సంపుటి తెలుగులో వస్తోందని తెలిసి అనువాదం చేస్తానని ముందుకు వచ్చాడు. కొన్ని కవితలకు చిత్రాలు గీచాడు. అట్లా అరుణతారలో అచ్చయిన సాయి కవిత్వానికి కూడా అద్భుతమైన బొమ్మలు వేశాడు. విరసం.ఆర్గ్ అంతర్జాల పత్రికకు అవసరమైన అనువాదాలు గంటల వ్యవధిలో పంపించేవాడు.

వసంతమేఘం అంతర్జాల పత్రికకు ఒ వైకల్య రాజకీయాల మీద రాస్తానని అన్నాడు. దాని కోసం చాలా ఏండ్లుగా తనకున్న ఆలోచనలను మరోసారి చెక్ చేసుకున్నాడు. కొత్తగా చదివాడు. స్పష్టత కోసం ఎంతో సుదీర్ఘ సంభాషణ కొనసాగించాడు. వైకల్యం కేవలం శారీరకమే కాదని, అదొక అస్తిత్వమని, సాంఘిక సాంస్కృతిక కోణాలు దానికి ఎన్నో ఉన్నాయనే నిర్ధారణకు వచ్చాడు. వైకల్యమనే అస్తిత్వాన్ని మార్క్సిస్టు పద్ధతిలో విశ్లేషించాలని అనుకున్నాడు. వసంతమేఘానికి తొలి రచన పంపించిన మరునాడే అమరుడయ్యాడు. ఆయన అద్భుత, సునిశిత ఆలోచనాధార ఆగిపోయింది. అది మార్క్సిస్టు సిద్ధాంత రంగానికి తీరని లోటు.

ఇలాంటి పనులు ఆయన విరసానికే చేయలేదు. ప్రగతిశీల సంస్థలన్నిటికీ చేసి పెట్టాడు. మాతృక పత్రిక కళా, రాజకీయ ప్రమాణాల వెనుక కూడా కరుణాకర్ ఉన్నాడు. తన సంబంధాల్లో వ్యక్తుల అధ్యయనం, రచన, అవగాహన పెరగడానికి దోహదపడ్డట్లే సంస్థల, ఉద్యమాల ప్రభావం పెరగడానికి తాను చేయగల పనులన్నీ స్వయంగా ఇలాంటి పనులు ఎన్నుకొని చేశాడు.

ఆయన రాసింది చాలా తక్కువ. తన చుట్టూ ఉన్న వాళ్లు రాయడానికి తోడ్పడింది ఎక్కువ. ఇప్పుడు ఆయన గురించి మిత్రులు ఆర్ద్రంగా తలపోసుకుంటున్నది అదే. ఆ రకంగా ఆయన చాలా విభిన్న పాత్ర పోషించారు. ఇలాంటి వాళ్ల కృషిని గుర్తించడానికి, అర్థం చేసుకోడానికి, అంచనా వేయడానికి మనం ఇంకా చాలా సృజనాత్మక పరికరాలు సమకూర్చుకోవాలేమో. ఇప్పటికి మన దగ్గర ఉన్న ప్రమాణాల దగ్గరి నుంచే అలాంటి వాటిని ఆవిష్కరించుకోలి.

కరుణాకర్ తొలి రోజుల్లో పౌరహక్కుల సంఘంలో ఉండేవాడుగాని ఆ తర్వాత నిర్మాణాల్లో లేకపోయినప్పటికీ ఉద్యమాలనిటితో తాను ఉన్న చోటి నుంచే కలిసి నడిచాడు. ఒక మనిషి ఎన్ని పనులు చేయగలడో ఉదాహరణగా నిలిచిన వాళ్లు ఎందరో ఉన్నారు. మన కాలంలో మన కళ్లెదుట అలా నిలిచిన మనిషి కరుణాకర్. ఆ పనులను, వాటి వెనుక ఉన్న ఆలోచనలనూ ముందుకు తీసికెళ్లడంలోనే కరుణాకర్‌ను పదిలంగా నిలుపుకోగలం. అంతకంటే ఆయనకు ఇవ్వగల నివాళి ఏముంటుంది?



(2021ఏప్రిల్ 11న విజయవాడలో జరిగిన విరసం సాహిత్య పాఠశాల ప్రారంభోపన్యాసం ఇది. కొవిడ్ తీవ్రత వల్ల కామ్రేడ్ మురళీధరన్ కేరళ నుంచి రాలేకపోయారు. తన ప్రసంగపాఠాన్ని రాసి పంపించారు. అరుణతార మే సంచికలో సంక్షిప్తంగా ఇది అచ్చయింది. ఇది పూర్తి వ్యాసం. గమనించగలరు- వర్కింగ్ ఎడిటర్)

మన సంస్కృతులను బ్రాహ్మణీయ భావజాలం నుండి విముక్తి చేద్దాం

కామ్రేడ్స్,

భారతదేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ విప్లవోద్యమంలో అమరులైన వీరులందరికీ ఎర్రెర్ర దండాలు! మీ అందరికీ ఎర్రెర్ర దండాలు!

విప్లవ సాంస్కృతిక పతాకను అవిచ్ఛిన్నంగా గత యాభై సంవత్సరాలుగా ఎత్తిపట్టిన విప్లవ రచయితల సంఘం మన దేశంలోని సాంస్కృతిక సంఘాలలో విలక్షణమైనది. తీవ్రమైన అణచివేతను ఎదుర్కొంటూ కూడా విరసం ఈ బాధ్యతను నిర్వర్తించింది, నిర్వర్తిస్తుంది. గత యాభై యేళ్ళ కాలంలో విరసం నిషేధానికి గురైంది, నాయకులు జైళ్ళపాలయ్యారు. విరసం ప్రచురణలను నిషేధించారు. అభివృద్ధి నిరోధక రాజ్యం విరసం నాయకులను, కార్యకర్తలను హత్యలు కూడా చేసింది. అయినా శ్రామికవర్గ భావజాలమైన మార్క్సిజం, లెనినిజం-మావోయిజానికి కట్టుబడి వున్నానని విరసం ఎలాంటి తడబాటు లేకుండా ప్రకటిస్తూనే వున్నది. ప్రజా ప్రయోజనాల కోసం ధైర్యంగా కట్టుబడి వుంది. భారతదేశంలో మావోయిస్టు ఉద్యమానికి పునాదులు వేసిన నక్సల్బరీ సాయుధ రైతాంగ ఉద్యమం నుండి అది పొందిన ఉత్తేజాన్ని కొనసాగిస్తూనే వున్నది.

ఇలాంటి అద్భుతమైన విప్లవాత్మకమైన సంస్థ జరుపుతున్న సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడడానికి ఆహ్వానాన్ని పొందడం నిజంగా గొప్ప గౌరవం. ఇలాంటి అవకాశాన్ని ఇచ్చినందుకు విరసం నాయకత్వానికి నా ధన్యవాదాలు. నా వ్యాస సంకలనం "క్రిటికింగ్ బ్రాహ్మినిజం" అనే పుస్తకాన్ని తెలుగులోకి అనువాదం చేసినందుకు వారికి నా కృతజ్ఞతలు.

ఈ సమావేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం గురించి ప్రసంగించమని నిర్వాహకులు నన్ను కోరారు. సైద్ధాంతికమైన విమర్శకంటే, బ్రాహ్మణవాదాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన ఆచరణాత్మక కర్తవ్యాలమీద నేను దృష్టి కేంద్రీకరించాలని వాళ్ళ అభిప్రాయం. సంఘపరివార్ ఫాసిస్టు మూకలు ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట అమానవీయమైన నేరాలకు పాల్పడడాన్ని, ప్రజాస్వామిక హక్కులను అణచివేయడాన్ని మనం చూస్తూనే వున్నాం. వర్తమానంలో మనం జీవిస్తున్న ఇలాంటి ప్రమాదకరమైన సందర్భంలో ఆచరణాత్మక కర్తవ్యాలమీద దృష్టి కేంద్రీకరించడం చాలా అవసరం. అయినా ఆ కర్తవ్యాలకు అవసరమైన నేపథ్యాన్ని, భూమికను తెలియజేయడం కోసం నేను కొంతమేరకు సైద్ధాంతికమైన అంశాలను కూడా ప్రస్తావిస్తాను.

కామ్రేడ్ పాణి గత సంవత్సరం చేసిన ఒక ప్రసంగంలో తన పరిశీలనను ఇలా వెల్లడించాడు, "అంధ విశ్వాసాన్ని విమర్శించడం, ఆర్‌యస్‌యస్ అనుసరిస్తున్న ఎత్తుగడలను, ఆడుతున్న నాటకాలను

విమర్శించడం చాలదు. జీవితానికి సంబంధించి సడలింపులులేని సాంప్రదాయక దృష్టి మన సమాజంలో ఆధిపత్యస్థానంలో వుంది. బూర్జువా సెక్షన్ల ప్రయోజనాలను కాపాడడం కోసం సంఘ్‌పరివార్ ఈ దృష్టిని ఎత్తిపడుతుంది."

విషయానికి సంబంధించిన కీలకాంశాన్ని ఈ వ్యాఖ్య పట్టుకున్నది. ఇది ఆర్‌యస్‌యస్ ఆడుతున్న నాటకాన్ని బహిర్గతం చేస్తుంది. అదే సందర్భంలో దాన్ని ఎదుర్కొనే క్రమంలో మనం చేపట్టవలసిన కర్తవ్యాల సంక్లిష్టతను కూడా ఈ వ్యాఖ్య సూచిస్తుంది.

సాధారణంగా చెప్పుకుంటే, ఇక్కడ ప్రస్తావించిన సాంప్రదాయిక దృష్టి జీవితానికి, సమాజానికి సంబంధించిన "సాధారణ జ్ఞాన" దృష్టికోణం మాత్రమే. దీన్నే గ్రాంసీ విమర్శించాడు. ఈ భావన పాలకవర్గాల ఆధిపత్యపు అంతర్లీన అంశంగా ఎలా వుంటుందో గ్రాంసీ వివరించాడు. పాలకవర్గం తనకు అవసరమైన నమూనాని రూపొందించిన "ఆధిపత్య ఏకాభిప్రాయ భావన"ను సృష్టించడంలో, నిలబెట్టుకోవడంలో, ఈ "సాధారణ జ్ఞానం" ఎలాంటి పాత్రను కలిగివుందో ఆయన వివరించారు. ప్రజల్ని నిర్వీర్యం చేసి వాళ్ళు "చట్టవిధేయులైన పౌరులుగా" కొనసాగేటట్లు చేయడానికి దీన్ని ఉపయోగించుకున్నారు. ఈ "ఆధిపత్య ఏకాభిప్రాయ భావన" ఒక భావజాల పరమైన, రాజకీయమైన, సామాజిక-సాంస్కృతిక, మనస్తత్వ నిర్మాణం. ఇవి దాని ప్రధాన వ్యక్తీకరణ సాధనాలు. అయితే, రాజ్యానికున్న పాశవిక శక్తి దీని హద్దులను నిర్ణయిస్తుంది, అమలుపరుస్తుంది. బూర్జువా ప్రజాస్వామ్యం సాధారణ పనితీరులో, ఈ హింస ముసుగులోవుండి మనకు కనపడదు. చట్టబద్ధ పాలన తలకిందులయ్యే అరుదైన సందర్భాలలో ఒక అరుదైన చర్యగా ఈ హింస గురించి మాట్లాడతారు. ఇది బూర్జువా ప్రజాస్వామ్యపు విలువ. ఫాసిజం ఈ విలువకు కూడా తూట్లుపొడుస్తుంది. అరుదైన స్థితి అనబడేది ఫాసిజంలో సాధారణ అంశంగా మారుతోంది. అన్నిరకాల అబద్ధపు ప్రచారాలను ఉపయోగించుకుని, ఫాసిజం మన సమాజం 'ఇతరుల' కారణంగా ప్రమాదంలో పడిందనే అభిప్రాయాన్ని కలిగిస్తోంది. ఆ 'ఇతరులు' ఆంతరంగిక, బాహ్యశత్రువులు. కొన్ని సంఘటనలను– టెర్రరిస్టు సంఘటనలతో సహా– సృష్టించడం ద్వారా ఈ ప్రమాదం వాస్తవంగా ఉందేమో అనిపించేటట్లు అది చేస్తుంది. రాజ్యహింసను, ప్రజాస్వామిక హక్కుల అణచివేతను నిరంతరం బహిరంగంగా కొనసాగించడాన్ని సమర్థించుకోవడానికి దీన్ని వాడుకుంటోంది. కేవలం రాజ్యహింస మాత్రమే కాదు, 'ఇతరుల'కు వ్యతిరేకంగా ఫాసిస్టుమూకలు అనుసరిస్తున్న హింసను కూడా ఇది న్యాయబద్ధం చేస్తుంది. ఇది సాధారణమైన సాంఘిక స్థితి అనే అభిప్రాయాన్ని కలిగిస్తుంది. జీవితంపట్ల సడలింపులు లేని దృక్పథం, సామాజికప్రవర్తనకు, రాజకీయ జీవితానికి సంబంధించిన ఖచ్చితమైన విలువగా బహిర్గతమవుతోంది. వైవిధ్యాలన్నింటిని, తమ ఊహలో వున్న 'జాతి ఆదర్శాన్ని' భంగపరిచేవిగా చిత్రీకరిస్తారు.

అణచివేతకు గురవుతున్న దేశాల ఆధునిక పాలకవర్గాలన్నీ ఒక బూర్జువా పాలనారూపంగా ఫాసిస్టు భావజాలానికి సంబంధించిన అంశాలను తరచుగా నంలీనం చేనుకుంటాయి. గతంలో ప్రపంచవ్యాప్తంగా భూస్వామ్య ప్రభుత్వాలలో మనం చూసినట్టుగా నిరంకుశ ఆజ్ఞలద్వారా పరిపాలించే వ్యవస్థలను ఇవి ఫాసిస్టు భావజాలంలో కలిపివేసుకుంటాయి. హిట్లరు, ముస్సోలినీల వంటి ఫాసిస్టు ప్రభుత్వాల కింద సామ్రాజ్యవాద దేశాలు కూడా భూస్వామ్య రాజ్య వ్యవస్థ లక్షణమైన ఆజ్ఞల ద్వారా పాలించే పద్ధతిని కలిగివుండేది. దీన్ని బూర్జువా ప్రజాస్వామ్యంలో చట్టబద్ధపాలన, సమానత్వం అనే విలువలు ప్రతిక్షేపించాయి. అయితే ఈ రెండింటి మధ్య ప్రామాణికమైన వ్యత్యాసం వుంది. మూడో ప్రపంచదేశాలలో కొనసాగుతున్న అర్ధవలస, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సంబంధాల నుండి ఇవి రూపొందుతున్నాయి. దీని ఫలితంగా పార్లమెంటరీ వ్యవస్థలాంటి బూర్జువా పాలనారూపాలు అమలులో వున్నప్పటికీ, అవి స్వభావ రీత్యానే లోపభూయిష్టంగానే వుంటాయి. ఇలాంటి దేశాలలో ఆధునిక బూర్జువా పాలనారూపాలను తొలగించి భూస్వామ్య నియంతృత్వ రూపాలు ఉనికిలోకి రావడం సాధారణంగా జరుగుతుంది. ఇది ఒక శాశ్వతమైన లక్షణం. అయితే దాని వ్యక్తీకరణ భిన్నంగా వుంటుంది. నగరాలలో, ముఖ్యంగా మధ్యతరగతి, ఉన్నతి తరగతి వర్గాలలో చట్టబద్ధపాలన ప్రధానంగా ఒక విలువ. అయితే గ్రామీణప్రాంతాలలోనూ ముఖ్యంగా సమాజంలో అట్టడుగుస్థాయిలో నివసిస్తున్న ప్రజలలోనూ చట్టం అంటే స్థానిక పీడకుల మాటే. వీళ్లకు చట్టబద్ధ ప్రభుత్వానికి సంబంధించిన ఆధునిక పరికరాలైన పోలీసులు, పంచాయితీల వంటి స్థానిక సంస్థలు సమర్థవంతంగా ఉపయోగపడతాయి. తరచుగా వాళ్లు అమలుపరిచే హింస క్రూరమైనదిగానూ అమానవీయమైనదిగానూ ఉంటుంది. అది సాధారణంగా నిర్ణయాత్మక అంశంగా మారుతుంది.

రాజ్యాంగబద్ధమైన హక్కులను కలిగివున్న పార్లమెంటరీ వ్యవస్థ నుండి, ప్రజాస్వామిక హక్కులను బహిరంగంగా అణచివేసే స్థితికి మార్పు చెందడం ఖచ్చితంగా ఒక విలక్షణమైన సంఘటన. ప్రస్తుత కాలంలో దీనికి వ్యతిరేకంగా విశాల ప్రజా ప్రతిఘటన తప్పనిసరిగా రూపొందుతుంది. ప్రజాబాహుళ్యంలో పెరుగుతున్న ప్రజాస్వామిక చైతన్యానికి ప్రతిఫలనం అది. ప్రజలు స్వయంగా చేసిన పోరాటాల ఫలితమది. ప్రపంచ వ్యాప్తంగా సమాచారం వ్యాప్తి చెందడం ద్వారా ప్రజలు తమ ఎరుకను అభివృద్ధి చేసుకుంటున్నారు. ఇదంతా పాలకవర్గాల స్పృహలో వున్న విషయమే. ఆ కారణంగానే వాళ్ళు ఫాసిజాన్ని స్థాపించడానికి అవసరమైన రాజకీయ, సాంస్కృతిక పునాదిని ఏర్పరుచుకోవడానికి చైతన్యయుతంగా సిద్ధమవుతున్నారు. ఫాసిస్టు పాలనను న్యాయబద్ధమైన, రాజ్యాంగ ఆమోదం గల పాలనా రూపంగా ప్రజలచేత గుర్తింప చేయడానికి వాళ్ళు ప్రయత్నిస్తున్నారు. అన్ని ప్రజాస్వామిక హక్కులను, కార్మికుల, పాలకవర్గాలలోని తమ వ్యతిరేకుల హక్కులను అణచివేయడం ఇందులో భాగం. మోడీ పాలనద్వారా ఆర్‌యస్‌యస్ మనదేశాన్ని ఆ వైపుగా నెడుతోంది. అయితే ఆ స్థితి ఇంకా పూర్తిగా రాలేదు. మనం ఒక ధోరణిని, ఉద్యమం నుండి తప్పనిసరిగా వేరుచేసి చూడాలి. ఫాసిస్టు పాలనకు సంబంధించిన బలమైన లక్షణాలు వర్తమానంలో పెరుగుతున్నాయి. అయినా ఇప్పటికీ పరిస్థితి 1975 నాటి అత్యవసర పరిస్థితిలాగా లేదు.

మన దేశానికి సంబంధించి మరొక ప్రత్యేకమైన అంశం వున్నది. ప్రస్తుతం ఫాసిజంవైపుగా జరుగుతున్న ప్రయాణం భారత పాలకవర్గాల "ఆధిపత్య ఏకాభిప్రాయ భావన"ను పునర్నిర్మాణం చేసే ప్రయత్నంలో చాలా దగ్గరగా మెలిపడివుంది. కొన్ని దశాబ్దాలుగా పాలకవర్గాలు న్యాయబద్ధత అనే సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. దాన్ని

పరిష్కరించుకోవడానికి అవి అనుసరిస్తున్న పథకంలో ఒక అడుగు ముందుకు వెళ్లడానికి ఇది ఉపయోగపడుతుంది. సంఘ్‌పరివార్ అధ్యర్యంలో అది ఒక విలక్షణమైన గందరగోళాన్ని, రెట్టింపైన విషతుల్యమైన సారాన్ని సంపాదించుకున్నది. అందుకే దీన్ని బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం అని పిలవడం సరైంది. అయితే బ్రాహ్మణిజం కేవలం సంఘ్‌పరివార్‌కు మాత్రమే పరిమితమైంది కాదు. ఈ ఫాసిజానికి సంబంధించిన ఖచ్చితమైన విశ్లేషణ చేయాలంటే దాన్ని విస్తృత నేపథ్యంలో చూడాలి.

ఆర్‌యస్‌యస్, ఇతర హిందూత్వశక్తులు అనుసరిస్తున్న దుందుడుకు బ్రాహ్మణీయవైఖరి మన సమాజంలో ప్రారంభం నుంచే గాంధీ-నెహ్రూ భావజాలంతో సమాంతరంగా ఉనికిలో వుంది. అది ఎన్నడూ పాలకవర్గాలలో పట్టు పొందలేకపోయింది. అయినప్పటికీ అది పూర్తిగా వాళ్లనుంచి దూరంగానూ లేదు. దుందుడుకుతనంతో కూడిన బ్రాహ్మణీయవైఖరి అంచుల నుండి బయటకి వచ్చి, ముందుకు సాగుతుంది. ఇప్పుడది పాలకవర్గాల "ఆధిపత్య ఏకాభిప్రాయ భావన"లో ఆధిపత్యస్థానాన్ని అనుభవిస్తోంది. గత కొన్ని దశాబ్దాలలో భారత రాజకీయ వ్యవస్థలో జరిగిన మార్పులలో ఈ చలనం అత్యంత ప్రధానమైనది. భారతదేశంలో రాజ్యం ఎదుర్కొంటున్న న్యాయబద్ధ సంక్షోభపు వెలుగులో చూసినప్పుడు మాత్రమే దాన్ని సక్రమంగా అవగాహన చేసుకోగలం. పాలకవర్గాల "ఆధిపత్య ఏకాభిప్రాయ భావన" తీసుకున్న డైరెక్షన్‌లోనే దాన్ని మనం పరిశీలించాలి. లేనిపక్షంలో పార్లమెంటరీ రాజకీయాల పైపై మెరుగులలో మనం చిక్కుకుపోతాం.

భారత పాలకవర్గాల- భూస్వామ్యవర్గమైనా, దళారీ బ్యూరోక్రాటిక్ బూర్జువావర్గమైనా- భావజాలానికి బ్రాహ్మణవాదం నిత్యం కేంద్రకంగా వుంటూ వచ్చింది. బ్రిటీష్ పాలనాకాలంలో ఈ వర్గాల మధ్య మిత్రత్వం రూపొందడంలోనూ, అభివృద్ధి చెందడంలోనూ ఇది ప్రధాన అంశంగా వుండింది. అయితే ఈ బ్రాహ్మణవాదం మధ్య యుగాలనాటి సాంప్రదాయక కుల ఆధారిత భూస్వామ్యం కాదు. వలసవాద ఆధునికత వత్తిళ్ళ కారణంగానూ, ప్రభావాల కారణంగానూ దీని నమూనా మారి కొత్త రూపాన్ని ధరించింది. కింది నుంచి వస్తున్న డిమాండ్లకు, వత్తిళ్ళకు అనుగుణంగా దీని వ్యక్తీకరణ, దృక్పథం కూడా మారుతూ వచ్చాయి. గాంధీ రాకతో, 'ఇతరుల'ను తనలో ఇముడ్చుకుంటూ సంలీనం చేసుకుంటూ తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడం, విస్తృతం చేసుకోవడంపై బ్రాహ్మణవాదం శక్తి, దృష్టి కేంద్రీకరించాల్సి వచ్చింది. ఈ సమయంలో వాళ్లకు అనుకూలించిన బ్రాహ్మణవాదం గూఢమైనది. అది సంయమనంతో కూడినది. ఆధునికతకు సంబంధించిన రాజకీయ చిహ్నాలు అందులో ప్రధానపాత్ర వహించాయి.

1960ల నాటి నుండి "ఆధిపత్య ఏకాభిప్రాయ భావన" తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. సామ్రాజ్యవాదం మీద ఆధారపడడం అనే వాస్తవం, పాలకులు ప్రవచిస్తున్న 'సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక' భావనల డొల్లతనం ఎప్పటికప్పుడు మరింతగా బహిర్గతమయ్యాయి. జాతి ఉద్యమాలు, వివిధ సెక్షన్ల ప్రజా ఉద్యమాలు రాజ్య న్యాయబద్ధతను సవాల్ చేయడం విస్తృతమైంది. నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు దేశాన్నంతటినీ కుదిపివేసింది. ఇందిరాగాంధీ పాలనలో ప్రజాకర్షక విధానాలతో కూడిన ఫాసిస్టు పాలన ద్వారా ఆధిపత్యాన్ని పునరుద్ధరించడానికి ఒక ప్రయత్నం జరిగింది. అది కూడా విఫలం కావడంతో కుల ఆధారిత రిజర్వేషన్లు, లౌకికవాదం వంటి అంశాలకు సంబంధించిన భావజాలాన్ని కొత్త నమూనాలో రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. రాజ్య అజమాయిషీలోని పబ్లిక్ సెక్టార్ ఆర్థిక నమూనా క్రమక్రమంగా కుప్పకూలి పోయింది. నామ మాత్రంగా వున్న స్వీయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ స్థానంలో బహుళజాతి కంపెనీలు లోతుగా చొచ్చుకుపోయాయి. సోవియట్ యూనియన్ కుప్పకూలటం, 1990లలో ప్రపంచీకరణ ఎజెండాను పెద్ద ఎత్తున ప్రోత్సహించడంతో ఆర్థికవ్యవస్థ ఒక గొప్ప మార్పుకు గురైంది.

సవర్ణ హిందూకులాలను దేశవ్యాప్తంగా రాజ్యానికి కీలకమైన సాంఘిక పునాదిగా కలిపివుంచడానికి ఒక చైతన్యయుతమైన ప్రయత్నం, "ఆధిపత్య ఏకాభిప్రాయ భావన"ను మారిన పరిస్థితులకు అనుగుణంగా రూపొందించే క్రమంలో జరిగింది. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ కొత్తగా రూపొందించబడుతున్న "ఆధిపత్య ఏకాభిప్రాయ భావన" మరింత నగ్నంగా బ్రాహ్మణవాదరూపాన్ని సంతరించుకుని, శక్తివంతమైన హిందూత్వగా రూపొందింది. మితవాదులనుండి వామపక్షవాదులవరకు, అన్ని సెక్షన్ల పాలకవర్గాలు, వాటి రాజకీయప్రతినిధులు దీన్ని అంగీకరించి ప్రచారం చేశారు. వాళ్లమధ్యవున్న వివాదమంతా, దాన్ని ఎంత దుందుడుకుగా ముందుకు తీసుకువెళ్లాలనేదానికి, వ్యక్తీకరణ రూపాలకు సంబంధించిన వివాదం మాత్రమే.

పాలకవర్గాలు సాధారణంగా ఆమోదముద్ర వేసిన బ్రాహ్మణవాదంలో స్పష్టమైన తీవ్రవాద వైఖరి సంఘ్‌పరివార్‌ది. అయితే కాంగ్రెస్‌లాంటి ఇతర పార్టీలు అనుకూలించే 'కలుపుకుపోయే' ధోరణికి భిన్నంగా దీనిని 'వెలుపల'వుంచే భావనగా గుర్తించడం తప్పు. 'ఇతరుల'ను స్థాయిలవారీగా తమలో సంలీనం చేసుకోవడంలోనే బ్రాహ్మణవాదం వర్ధిల్లుతున్నది. ఇలా స్థాయిలవారీగా తమలో చోటు ఇస్తూనే, అది 'ఇతరుల'కు తనతో సమాన హోదా ఇవ్వకుండా బయటవుంచుతుంది. 'వెలుపలవుంచుతూ, కలుపుకుపోయే' తత్వం దానిది. అలా అది ప్రత్యేక సౌకర్యాలను పొందుతుంది. ఫాసిస్టుమూకలు ముస్లింలను, దళితులను ఊచకోత కోస్తుంటే, ఆర్‌యస్‌యస్ నాయకులు 'కలుపుకుపోవడం' గురించి సూక్తులు వల్లించడం కొత్తా కాదు, అసాధారణమూ కాదు.

దళితులను, నడిమి కులాలను, ఆదివాసీలను తమ శ్రేణులలో భాగంగా చేసుకోవడానికి ఆర్‌యస్‌యస్ శక్తివంతంగా పనిచేస్తోంది. అణచివేతకు గురవుతున్న కులాల నుండే ఒక శిష్ట వర్గం తలెత్తింది. వాళ్ళ దోపిడీ ప్రయోజనాలు పెరుగుతున్న కొద్దీ దానితో సమానంగా వాళ్ళు బ్రాహ్మణీకరణ చెందుతున్నారు. తమ సాంఘిక హోదాను పెంచుకోవడానికి, తమ ప్రస్తుత ప్రయోజనాలకు అనుగుణంగా వుండేటట్లు వాళ్ళంతట వాళ్ళే గతంలోని తమ పోరాటాలను 'శుద్ధి' చేసుకొంటున్నారు. వాళ్ళను తమలో సంలీనం చేసుకోవాలనే ఆర్‌యస్‌యస్ వ్యూహం, ఈ శిష్టుల ఆలోచనలు పరస్పర ఆధారాలు. అందుచేతనే కేవలం కుల ఆధారిత ఐక్య సంఘటనల ద్వారా ఆర్‌యస్‌యస్ ఎత్తుగడలను ప్రతిఘటించడానికి చేసే ప్రయత్నాలకు ఖచ్చితంగా అవరోధాలు ఎదురవుతాయి.

తమ ఆధిపత్యానికి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టటానికి పాలకవర్గాలు చేస్తున్న ప్రయత్నాలను బహిరంగంగా

మిలిటెంట్‌గా ఎదుర్కోవడం మన కర్తవ్యం. ఆ ఉద్యమానికి బ్రాహ్మణవాద విమర్శను మనం కేంద్రంగా చేసుకోవాలి. గాంధీ- నెహ్రూ తరహా సాధుపూర్వకమైన బ్రాహ్మణవాదం ద్వారా ఈ కర్తవ్యం పూర్తికాదు. వాళ్ళు ప్రదర్శించిన ఉదారవాదం, ప్రజాస్వామ్యం వంటివన్నీ పైపై మెరుగులు మాత్రమే. వాళ్ళు మన సమాజ నేపథ్యంలో ప్రజాస్వామికీకరణకు చెందిన మౌలికమైన సమస్యలను పట్టించుకోలేదు. ఆర్‌యస్‌యస్, దాని అనుచరవర్గం అమలు పరుస్తున్న బ్రాహ్మణీయ ఫాసిస్టు ఎజెండాకు వ్యతిరేకంగా అర్థవంతమైన పోరాటాన్ని గతంలోని బ్రాహ్మణీయ వ్యతిరేక భక్తి ఉద్యమాలలోకి వేళ్ళూనిన ప్రజా ఉద్యమాలు మాత్రమే చేయగలవు. అయితే ఆ వుద్యమాలను ప్రతిపాదించిన విలువలను, బోధనలను వల్లెవేసుకుంటే చాలదు.

ఈ ఉద్యమాలన్నీ ఆనాడున్న పరిస్థుతులకు ప్రతిస్పందనగా ఆవిర్భవించాయి. వాటిని నేటి మన పరిస్థితులకు తగినట్లుగా సాగదీయలేం. బ్రాహ్మణీయ హిందూఫాసిజం అభివృద్ధి చెందడానికి ఉపకరించిన భౌతిక పరిస్థితులు సంక్లిష్టమైనవి. కేవలం పాలకవర్గాల ప్రయోజనాలేకాక సమకాలీన సామ్రాజ్యవాద ప్రయోజనాలుకూడా దానిలో ఇమిడివున్నాయి. పైగా సవర్ణులలో కూడా వర్గ విభజన ఏర్పడి అది పెరుగుతోంది. బ్రాహ్మణ వ్యతిరేక పోరాటాలలో ప్రజా సంప్రదాయాలను నిర్ణయించేటప్పుడు సవర్ణులతో సహా అన్ని అణచివేతకు గురవుతున్న సెక్షన్ల ఆందోళనలను దృష్టిలో వుంచుకోవాలి. కుల, మత సంబంధమైన మిత్రకూటములైన అవి ఎంత ప్రాతినిధ్య ప్రజాస్వామిక స్వభావం కలిగినప్పటికి వాటిద్వారా ఈ కర్తవ్యం సాధ్యంకాదు. ఇది పార్లమెంటరీ వ్యవస్థ ద్వారాకూడా సాధ్యంకాదు. కావల్సింది కిందిస్థాయి నుండి ప్రారంభమైన ఉద్యమాలు. వర్గం, కులం, లైంగికత, జాతి, మతమైనారిటీ, జాతీయత, ప్రాంతీయత, పర్యావరణ అంశాలకు సంబంధించిన ఉద్యమాలన్నింటినీ ప్రోత్సహించాలి. ఈ ఉద్యమాల ద్వారా విశాలమైన రాడికల్ ప్రజాస్వామిక వేదికను నిర్మాణం చేయాలి. దాని ద్వారా ఏకాభిప్రాయంగల ప్రతిఘటనను రూపొందించాలి. పాలకవర్గాలను, ఆర్‌యస్‌యస్ దాని ఫాసిస్టు మూకలను ఎదుర్కోవడం కోసం శక్తివంతమైన నిరంతరాయంగా పనిచేసే ఉద్యమాన్ని నిర్మాణం చేయాలంటే ఇది తప్పనిసరి.

ఈ విశాలమైన చట్రంలోనే సాంస్కృతిక రంగంలో మన కర్తవ్యాలను నిర్దేశించుకోవాలి. ఇది రెండు బాధ్యతలను మన ముందుంచుతున్నది. అవి పరస్పర సంబంధితాలే అయినప్పటికీ దేనికదే ప్రత్యేకమైనవి. ఒకటి, సాధ్యమైనంత సమగ్రంగా పాలకవర్గాల ఆధిపత్య ఏకాభిప్రాయ సాధన కుట్రను బహిర్గతం చేసి సవాల్ చేయడం. రెండవది, ఆధిపత్య ప్రతిఘటనా ఏకాభిప్రాయాన్ని వ్యక్తీకరించడం, ప్రచారం చేయడం. దాని మూలాలు మన ప్రజల ప్రజాస్వామిక సాంప్రదాయాలలో వేళ్ళూనుకుని వుండాలి. ఈ రెండింటిలోనూ ఖచ్చితంగా రెండవ కర్తవ్యమే నిర్ణయాత్మకమైనది. పాలకవర్గాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పటిష్టవంతమైన సవాలును అవి చైతన్యయుతంగా స్వీకరించాలి. అయితే, 'ప్రజాస్వామిక సంప్రదాయాలు' అంటే ఏమిటి? అలా అన్నప్పుడు మనం ఎవరి సంప్రదాయాలను, ఏ సాంప్రదాయాలను ప్రస్తావిస్తున్నట్లు?

ప్రజాస్వామ్యం, ఆధునికార్థంలో మనదేశంలోకి వలసవాద ఆధునికత ద్వారా ప్రవేశించింది. ఆ కారణంగా అది దాని అనువంశికతను ఎప్పుడూ కోల్పోలేదు. అందుచేత మనం ఈ ఆధునికతను విమర్శనాత్మక దృష్టితో చూడాలి. ఇది, పెట్టుబడిదారీ వ్యవస్థలోకి పరిణామం చెందడం ద్వారా పశ్చిమ ఐరోపా దేశాలలో ఆవిర్భవించిన ఆధునికతలాంటిది కాదు. ఇంతవరకు సాధారణంగా అందరూ అంగీకరిస్తున్నారు. ఇప్పుడు కొంతమంది దీనిని 'భారతీయ ఆధునికత' అని పిలుస్తున్నారు. అలా అనడం ద్వారా ఈ దేశంలో నిరంతరం కొనసాగుతూన్న హేయమైన కుల-భూస్వామ్య విలువల నుండి సంబంధాల నుండి ఆధునికతను తప్పించడానికి అవకాశం వుంటుందని వాళ్ళు ఆశిస్తున్నారు. అయితే, నిజానికి అది ఏ సమస్యనూ పరిష్కరించలేదు. 'భారతీయత' అనేది ఆధునికపూర్వ లక్షణాలన్నింటినీ ఆధునికతలో కలుపుకుపోయే పదంగా వుండాలని వాళ్లవాదన. ఈ ఆధునికత ఆధునికపూర్వ అంశాలతో చాలా తేలికగా సహజీవనం చేయగలుగుతోందని మనం అనవచ్చు. అయితే 'వలసవాద' ఆధునికతా సూత్రానికి అది కీలకం. దీన్ని 'భారతీయత' అనే మారుపేరుతో పిలవడం సమస్యను గందరగోళపరచడమే. వలసవాద ఆధునికతను మరింత లోతుగా పరిశీలించడం నేటి అవసరం. ఇది కేవలం అసంపూర్ణంగా మిగిలిపోయిన ఆధునికత మాత్రమేనా? ఇది వలసవాద పరిస్థితుల్లో సంభవించిన ఆధునికత కాబట్టి, ఈ ఆధునికతా క్రమం పెట్టుబడిదారీ వ్యవస్థలోకి పరిణామం చెందలేకపోయిందా? కాదు. ఇది అసంపూర్ణమైన వ్యవహారం కాదు. నిజానికి అసంపూర్ణత దాని సహజ లక్షణం. ఈ ఆధునికత నుండి అసంపూర్ణతను విడదీసి చూడలేం. అణచివేతకు గురిఅవుతున్న దేశాలలో సామ్రాజ్యవాదం పెంచిపోషిస్తున్న విలక్షణమైన పెట్టుబడిదారీ వ్యవస్థలో అంటే బ్యూరోక్రాట్ క్యాపటలిజం నిర్దిష్ట లక్షణాలలో దీని మూలాలున్నాయి.

సామ్రాజ్యవాదం నిజానికి కుల-భూస్వామ్యాన్ని పరిణామానికి గురిచేసింది. అయితే దాన్ని నాశనం చేయడంలో దానికి ఆసక్తిలేదు. బ్యూరోక్రాటిక్ క్యాపిటలిజం అనే ఒక నిర్దిష్టతరహా పెట్టుబడిదారీ విధానానికి ఇది కారణభూతమైంది. దానికి కుల భూస్వామ్యంతో విడదీయరాని సంబంధం వున్నది. సామ్రాజ్యవాదంతో, భూస్వామ్యంతో జమిలిగా వున్న బ్యూరోక్రాటిక్ క్యాపిటలిజం ఆ రెండింటికేకాక సాంప్రదాయకమైన ధనిక రైతాంగానికి కూడా సేవచేస్తుంది. మరో మాటలో చెప్పాలంటే వలసవాద ఆధునికత ఒక ద్వంద్వ, వైరుధ్యభరితమైన పాత్రను పోషిస్తుంది. బ్యూరోక్రాటిక్ పెట్టుబడి కుల భూసామ్యంలోని చాలా లక్షణాలను నిరంతరం మారుస్తూ ఒక నూతన స్థితికి తీసుకువచ్చింది. అయినా అదే సమయంలో అది పాత వ్యవస్థలోని ప్రధానాంశాలను పునరుజ్జీవింప చేసింది. బ్యూరోక్రాటిక్ పెట్టుబడి ద్వారా పరిణామం ఎప్పటికీ పూర్తికాదు. అది తన దళారీ ప్రయోజనాలను సంఘటితపరుచుకోవడం కోసమే పరిణామక్రమంలో భాగస్వామి అవుతుంది. అందుచేత ఈ క్రమాలన్నీ అసంబద్ధ లక్షణాలను కలిగివుంటాయి. ఇది వలసవాద ఆధునికత ప్రధాన లక్షణం. దేశం సామ్రాజ్యవాద పీడనకింద కొనసాగుతున్నంతకాలం, బ్యూరోక్రాటిక్ పెట్టుబడి ఆచరణాత్మకంగా వున్నంతకాలం ఈ పరిణామ క్రమం, పునరుద్ధరణ కొనసాగుతూనే వుంటాయి. అందుచేతనే నయావలసవాదంలో కూడా దీనిని మనం చూడగలం.

వలసవాద ఆధునికత కాలంలో ఆవిర్భవించిన పాత సాంఘిక ఉద్యమాలన్నీ ఈ ద్వంద్వంచేత ప్రభావితమైనవే. వలసవాద ఆధునికత

ఇచ్చిన అవకాశాల్ని అందిపుచ్చుకోవడానికి అవి ప్రయత్నించాయి. అయితే అదే సమయంలో ఆ సాంఘిక ప్రక్రియ విధించిన పరిమితులను కూడా అవి తమలో అంతర్లీనం చేసుకున్నాయి. ఇందులో భాగంగానే రెండు ప్రధాన స్రవంతుల మధ్య వున్న తేడాలను మనం గమనించాలి. అవి సవర్ణ స్రవంతి, అవర్ణ స్రవంతి. వర్ణ వ్యవస్థలో అంతర్భాగంగా పరిగణించబడిన బ్రాహ్మణులు, నయ్యర్, రెడ్డి, పటేల్, మరాఠ వంటి శూద్ర కులాలన్నీ కలిసి సవర్ణ స్రవంతి. వర్ణ వ్యవస్థకు బయటవున్నదంతా అవర్ణ స్రవంతి. ఇప్పటి మాటల్లో చెప్పుకోవాలంటే వెనుకబడిన కులాలు, దళిత కులాలు అవర్ణం. ఇక్కడ ఒక విషయం స్పష్టంచేయాలి. ఈ స్రవంతులను సూచించడానికి వాడిన సవర్ణ, అవర్ణ అనే పదాలు వాటి సారాంశానికి సంబంధించినవేగాని, వాటి సమర్థకుల పుట్టుకను సూచించేవి కావు.

సవర్ణ స్రవంతి కూడా ప్రజాస్వామికీకరణకు దోహదపడింది. అయితే సవర్ణులకు వుండే అణచివేత హోదా కారణంగా, వాళ్లు వలసవాద పరిణామం అందచేసిన నూతన అవకాశాలను ఉపయోగించుకోవడంలో, సాంప్రదాయిక, ధనిక, ఆవిర్భవిస్తున్న మధ్యతరగతి వర్గాలకు అడ్డుగా నిలబడిన క్రతువులు, సంబంధాలు, కుటుంబంతోసహా వ్యవస్థలలో సంస్కరణలను మించి ఏమీ కోరుకోలేదు. అంతకుమించి వాళ్లకు కులం ఒక బరువు కాదు. అది వాళ్ల పురోగమనానికి ఉపయోగపడే ఒక సాంఘిక సంబంధం. ఇందుకు భిన్నంగా, కుల వ్యవస్థనే సవాల్ చేయడం అవర్ణ స్రవంతికి తప్పని సరైంది. ఇలా చేయడం ద్వారా మాత్రమే వర్గ హోదాలో వాళ్లు సాధించుకున్నది ఏదైనా సాంఘిక విలువను సంతరించుకోదు. కేరళకు సంబంధించిన ఒక ఉదాహరణ ద్వారా దీన్ని మీకు వివరించడానికి ప్రయత్నిస్తాను. గతంలో కేరళలో ఒక అవర్ణ కులానికి చెందిన అలుముత్తిల్ చెన్నార్ స్థానిక తిరువితంపూర్ సంస్థానంలో అందరికంటే ఎక్కువ పన్ను చెల్లించేవాడు. అతడు ఒక కారు కొనుక్కోగలిగాడు. సవర్ణ కులమైన నయ్యర్ కులానికి చెందిన ఒక వ్యక్తిని డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. అయినా, ఆయన కారు ఏదైనా దేవాలయం ముందుగా వెళ్లాల్సి వస్తే దానికి మైల తగలకుండా ఈయన కారు దిగి చుట్టుతిరిగి నడుచుకుంటూ వెళ్లేవాడు. సవర్ణుడైన ఆ డ్రైవర్ మాత్రం దీనితో సంబంధంలేకుండా దేవాలయం ముందు నుంచే కారు నడుపుకుంటూ వెళ్లి తన యజమానికోసం ఎదురు చూస్తూండేవాడు.

ప్రజాస్వామికీకరణను సవర్ణ స్రవంతి పరిమిత దృక్పథంతో చూసిందనడాన్ని మళయాళ సాహిత్యం నుంచి మనం సోదాహరణగా వివరించవచ్చును. ఓ.చందుమీనన్ రాసిన ప్రఖ్యాతిచెందిన నవల 'ఇందులేఖ'ను క్లాసికల్ నవలగా గుర్తిస్తారు. అంతేగాక, మళయాళీ పునరుజ్జీవనాన్ని ఉద్దీపింపచేసిన కొద్ది నవలల్లో అదికూడా ఒకటిగా గుర్తించబడింది. కథాంశం ఇది. నయ్యర్ కులానికి చెందిన ఒక యువకుడు, యువతి ప్రేమించుకుంటారు. నంబూద్రి (బ్రాహ్మణ) కులానికి చెందిన ఒక వ్యక్తి ఆ యువతిని తన ఉంపుడుగత్తెగా చేసుకోవడానికి తన కుల హోదాను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తాడు. అంతిమంగా ప్రేమ విజయాన్ని సాధించింది. ఉనికిలో వున్న కులవ్యవస్థకు, దాని సాంఘిక విలువలకు ఈ నవల ఖచ్చితంగా ఒక సవాల్ వంటిదే. ఒక వ్యక్తి, అతడు లేక ఆమెకుండే, జంటను ఎంచుకునే హక్కు కుల హోదాను వ్యతిరేకించింది. అయినా ఈ ప్రజాస్వామిక వైఖరికూడా ఉనికిలో వున్న కుల కట్టుబాట్లకు, బ్రాహ్మణీయ కట్టుబాట్లకు చెందిన పరిమితులలోనే ఉండిపోయింది. ఆ యువతీ యువకుల వివాహం కూడా నయ్యర్ సంప్రదాయాలలోనే జరిగింది. అంటే ఒక పక్క కుల కట్టుబాట్లను బద్దలుకొట్టటం, మరోపక్క కుల విలువలను గట్టిగా అమలువరచడం కూడా జరిగింది. ఇక్కడ మనం గమనించాల్సింది ఏమిటంటే సాంప్రదాయకంగా ఒక శూద్రకులానికి చెందిన నయ్యర్ల వైపు నుంచే తమ హక్కును కాపాడుకునే ప్రయత్నం జరిగింది. వలస పూర్వకాలంలో ప్రారంభమై వలసవాద పరిస్థితుల్లో మరింత అభివృద్ధిచెందిన, ఈ కులాల ఊర్ధ్వ చలనం ఈ నవలలో ప్రతిబింబించింది.

ఈ ఉదాహరణలో మనం చూసిన కుల ఆధారిత స్పందనల వెనుకవున్న లోతైన భావనలని మనం గమనించాలి. సవర్ణ స్రవంతి తన సంస్కరణలను కులానికి సంబంధించిన అంశంగాకాక, వ్యక్తిగత, వర్గపరమైన డిమాండ్లుగా ముందుకు తెస్తుంది. అయితే ఇలాంటి తన అవసరాలనే సంతృప్తి పరుచుకోవడానికి అవర్ణ స్రవంతి కుల ఆధారిత డిమాండ్లను లేవనెత్తక తప్పదు. తమ కులాల్ని 'వెలుపల వుంచడం' అనే సమస్యను అది ముందుగా పరిష్కరించుకోవాలి. ఇక్కడ 'సమాన అవకాశం' అనే పదానికి వేరే అర్థం వుంది. అవకాశాల్ని ఒక కులంగా పొందాలి, వాటికి న్యాయబద్ధత వుండాలి. అందుచేత తమ డిమాండ్లను చారిత్రకంగా కాలంచెల్లిన కుల కేటగిరి ద్వారా మాత్రమే అవర్ణ స్రవంతి తన డిమాండ్లను వ్యక్తీకరించక తప్పలేదు. అవి గతం తాలుకు బురదలో కూరుకుపోయినట్లు కన్పిస్తుంది. అయితే నిజానికి ప్రస్తుత మన సందర్భంలో అదే అసలైన ప్రజాస్వామికీకరణ కర్తవ్యాన్ని చేపట్టింది. దీనికి భిన్నంగా, సవర్ణ స్రవంతి సాంప్రదాయక కుల చట్రంలోనే సంస్కరణలకు పరిమితమైంది. అది చేపట్టిన ప్రజాస్వామికీకరణ పైపై మెరుగు మాత్రమే. అయినా అది తన అవసరాలను ఆధునిక పరిభాషలో వ్యక్తం చేయగలిగింది. చాదస్తపు సాంప్రదాయాల అవరోధాలను తొలగించుకునే విషయంలో తప్ప, బ్రాహ్మణీయ క్రతువుల విషయంలోగాని, కుల ఆచారాల విషయంలోగాని దానికి తగాదా ఏమీలేదు. ఒకసారి దీన్ని సాధించుకోగలిగితే సవర్ణుల సాంఘిక వ్యక్తిగత జీవితాలలో కొనసాగుతున్న కుల విలువలు, ఆచరణలు 'అదృశ్యం' కావచ్చు. తమనితాము కులానికి పైన లేదా కులానికి ఆవల వున్న వాళ్లుగా చిత్రీకరించుకొని సవర్ణులు అదనపు సౌకర్యాలను అనుభవించగలరు. ఒకవైపు అది సంస్కరించబడిన బ్రాహ్మణవాదాన్ని పెంచిపోషిస్తూనే మరోవైపు ఈ సవర్ణ స్రవంతి ఆధునికతా పతాకను చేపట్టినట్లు కనపడగలదు.

నేను కేరళకు సంబంధించిన ఉదాహరణలిచ్చాను. కాని కుల భూస్వామ్యం ఉనికిలో వున్న అన్ని జాతులలోనూ, సంస్కృతులలోనూ ఇలాంటి దృష్టాంతాలు మీకు తప్పనిసరిగా కనపడతాయి. 'సతి' దురాచారాన్ని రూపుమాపడాన్ని 'భారతీయ పునరుజ్జీవన' క్రమంలో ఒక అద్భుతమైన సంఘటనగా గొప్పలు చెప్పుకునే ఉదాహరణే తీసుకుందాం. కేవలం అగ్రకులాల మహిళలుగా చెప్పుకోబడే ఒక చిన్న సెక్షన్‌కు, అదికూడా కేవలం ఉత్తరభారతదేశంలో ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన ఒక దురాచారాన్ని నిర్మూలించడాన్ని మొత్తం ఉపఖండంలో మహిళలందరూ అనుభవిస్తున్న దురాచారాల నిర్మూలనగా ఎలా భావించగలం? పైగా, 'సతి'రద్దు అయిన తరవాతకూడా ఆధునిక

సాహిత్య లేఖ

ఇది దళిత కథా?

- మొలకలపల్లి కోటేశ్వరరావు

(గత రెండు సంచికలు రాకపోవడంతో ఈ లేఖ ఇప్పుడు ప్రచురిస్తున్నాం)

కొలకలూరి ఇనాక్ రాసిన కథ వృద్ధి. ఇది వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ ప్రతి ఏటా తెచ్చే కథల సంకలనం కథ -2019 లో వచ్చింది. అతి నిరుపేదలైన మాదిగ మహిళలని దారుణంగా అవమానిస్తూ, అవహేళన చేస్తూ కించపరుస్తూ రాసిన కథ ఇది. ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని బ్రహ్మాండంగా ప్రశంసిస్తూ ఆ పథకాల వలన దళిత కులాల పేదలు, శ్రామికులు సోమరులుగా, తిరుగుబోతులుగా అవుతున్నారని రచయిత, సంపాదకులు నొక్కి వక్కాణిస్తూ ప్రచురించిన కథ. పదహైదేళ్ళ చిన్న పిల్లను పాత్రగా తీసుకుని క్రూరమైన, అసహ్యకరమైన వర్ణనలు చేసిన కథ. దీనికి ఉదాహరణగా ఈ వాక్యాలు చూడండి. "విధవరాండ్రకి ఇచ్చే పెన్షన్ తల్లికి, కూతురికి వస్తూ ఉంది. వెయ్యి రెండువేలు అయ్యే సరికి లింగి కూరగాయలు అమ్మే గంప మూలన పారేసింది. నెలకు నాలుగు వేలు ఏ పని చేయకుండా వస్తుంటే ఇద్దరికీ ఆనందమే! కేజీ రెండు రూపాయల బియ్యం పదికేజీలు వస్తే వాళ్లకు నెలకు సరిపడా బియ్యం గింజలు ఇంటిలో ఉంటున్నాయి. చెక్కెర, కందిపప్పు, చింతపండు, సరుకులన్నీ చవకధరకు లభిస్తుంటే నెలకు ఒక్క వెయ్యి రూపాయలతో కాలం గడుస్తూ ఉంది." దీని వల్ల వాళ్ళు సోమరులుగా తయారయ్యారని కథ చెప్పదలుచుకున్నది. కథలోనే కాదు ఇదే మాట రచయిత, సంకలనం సంపాదకులు వాళ్ళు రాసిన ముందుమాటలో చాల స్పష్టంగా చెప్పారు. "సంక్షేమ పథకాలు, పెన్షన్లతో లబ్ధిపొందుతూ రైతు కూలి స్త్రీలు పొలం పనులు మాని, వృత్తి వ్యాపారాలు వదిలి శ్రమకు, కృషికి, సంసారానికి, నైతికతకు దూరం కావడం, విలువలు దెబ్బతినడం బాధ కలిగించింది రచయతకు" ఇది కథను పరిచయం చేస్తూ రాసిన ముందుమాట. టూకీగా కథ చెప్పదలుచుకున్న వృద్ధి ఇది. పేదలను అవమానించడంలో వృద్ధి. మాదిగ మహిళలను అవమానించడంలో వృద్ధి. ఇంత గొప్ప వృద్ధిని చూసి ఈ కథల పుస్తకం సంపాదకులు ముచ్చట పడిపోయారు. "పల్లెల జీవన శైలిలో వచ్చిన మార్పులని నిస్సంకోచంగా బయటపెట్టిన రచయితను అభినందించాల్సిందే" అని రాసుకున్నారు. 'పదిహేడు ఉత్తమ కథల సంకలనం అని పుస్తకం మొదటిలో పెద్ద పెద్ద అక్షరాలతో రాసుకున్నారు. ఈ కథలో అణువంత ఒక్క వాక్యంలో అయినా ఉత్తమం ఉందా? కొన్ని మంచి కథలు, విప్లవాత్మక కథలు ప్రగతిశీల కథలతో పాటు చాలా చౌకబారు కథలు కూడా ఈ సంకలనాలలో ఉన్నాయి. అలాంటి కథలలో ఏదో మార్మికత ఉందని, గొప్ప అర్థం దాగి ఉందని భ్రమ పడాల్సిన అవసరం లేదు. దానికి ఉదాహరణ కొలకలూరి ఇనాక్ రాసిన వృద్ధి కథ. దళిత స్త్రీలను అవమానపరుస్తూ రాసిన కథ ఎట్లా ఉత్తమ కథ అవుతుంది? అలాంటి కథను మళ్ళీ అచ్చువేసిన ఈ పుస్తకం ఉత్తమ కథా సంకలనం ఎలా అవుతుంది. ☆

సవర్ణ మహిళల నడవడికకు సంబంధించి నూతన విలువలు పుట్టుకొచ్చాయి. వీటిని 'భారతీయ స్త్రీ పాటించవలసిన' నమూనాగా సాధారణీకరించారు. ఈ క్రమంలోనే సవర్ణులతో పోలిస్తే కొంతమేరకు ఉదారవాద నైతిక విలువలను అనుభవిస్తున్న అవర్ణులు, శూద్ర స్త్రీలు కూడా వీటికి లోబడాల్సి వచ్చింది. అలాంటప్పుడు దీన్ని పునరుజ్జీవనం ఎలా అనగలం?

ఇక్కడ మనం చూస్తున్నది తలకిందుల వ్యవహారం. వలసవాదం తీసుకువచ్చిన ఆధునికీకరణ, ఉనికిలోవున్న సాంఘిక సంబంధాల మధ్య జరిగిన పరస్పర చర్యా ప్రతిచర్యల నుండి ఇది ఉత్పన్నమైంది. దీని ఫలితంగా, సంస్కరణల కారణంగా సాంప్రదాయక విలువలు కూడా ఆధునిక విలువలుగా కనపడుతున్నాయి. అవర్ణుల వ్యక్తీకరణ విషయానికివస్తే- అది కుల ఆధారంగా వ్యక్తీకరించబడక తప్పని స్థితిలో - అభివృద్ధికరమైనది కూడా కాలం చెల్లినదానిలాగా కనపడుతోంది. వలసవాదం కింద పదునెక్కిన సాంఘిక సంబంధాల వాస్తవ స్వభావం రహస్యంగా వుండిపోయింది. అన్ని సామాజిక పార్శ్వాలలోనూ, నిర్దిష్టంగా భావజాలరంగంలో ఈ తప్పుడు చైతన్యం తీవ్రమైన ప్రభావాన్ని కలిగించింది. అది ఇప్పటికీ వాస్తవమే.

మన విమర్శ మౌలికమైనదిగా వుండాలంటే దీన్ని తప్పనిసరిగా ప్రశ్నించి రద్దుచేయాలి. ఈ విషయంలో, అవర్ణ, సవర్ణ ప్రజాస్వామికీకరణ స్రవంతుల మధ్య వున్న భిన్నత్వం చాలా ప్రాధాన్యత కలది. సామాజిక అధ్యయనాలలోగాని సాంస్కృతిక విమర్శలోగాని మన విశ్లేషణలో దీనిని ప్రధానభాగం చేయాలి. కీలకమైన ఈ భిన్నత్వాన్ని అవగాహన చేసుకోవడంలో విఫలం కావడమే ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ లేదా ప్రస్తుత సి.పి.ఐ., సి.పి.యం.లకు చెందిన రివిజనిస్టు సిద్ధాంతవేత్తలు చేసిన అత్యంత ప్రధానమైన పొరపాట్లలో ఒకటి. బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలను సమర్థిస్తూ, అస్పృశ్యతను తుదముట్టించడం గురించి, కార్మికుల గురించి అనుకూలంగా రచనలు చేసినందుకుగాను వల్లతోల్ (సవర్ణ నయ్యర్ కులానికి చెందినవాడు)ను ఒక జాతీయ కవిగా ఇ.యం.యస్ నంబూద్రిపాద్ శ్లాఘించడంలో ఇది మనకు అర్థమౌతోంది. నిజానికి వల్లతోల్ అస్పృశ్యత గురించి రాసే సమయానికే నారాయణగురు, అయ్యంకళి, పొఖ్యాల్ యోహన్నన్ వంటి గొప్ప వ్యక్తులు ఆ సమాజంలో కులనిర్మూలనను ఒక ఆచరణాత్మక కర్తవ్యంగా రూపొందించి వున్నారు. సహోదరన్ అయ్యప్పన్ అప్పటికే అక్టోబర్ విప్లవాన్ని పొగుడుతూ కవిత్వం రాసివున్నాడు. కాని ఇ.యం.యస్ దృష్టిలో కులంకన్నా, వర్గంకన్నా 'జాతీయ' భావనే నిర్ణయాత్మకమైనది. ఆయన దృష్టిలో అవర్ణ స్రవంతి వ్యక్తీకరించిన బ్రాహ్మణవాద వ్యతిరేక ప్రజాస్వామీకరణ- నిజమైన ఏ జాతీయోద్యమానికైనా ఇది తప్పనిసరి- ద్వితీయ ప్రాధాన్యత పొందింది.

మన ప్రజాస్వామికీకరణ క్రమంలో సవర్ణ స్రవంతి పాత్రను నేను నిరాకరించడం లేదు. అదికూడా సైద్ధాంతిక, సాంఘిక సంస్కరణ, రాజకీయ సమీకరణ, సంఘటనస్థాయిలలో ఈ క్రమానికి దోహదపడింది. దీన్ని మనం అంగీకరించాలి. వ్యక్తిగత ప్రేమను సమర్థించడం, బాల్యవివాహాలను వ్యతిరేకించడం వంటి అంశాలలో కూడా ఆధునికత ఉన్నది. అయితే మనం ప్రశ్నించాల్సిందల్లా అదిమాత్రమే ఆధునికత అనే భావనను. కుల చట్రానికి అతీతంగా వున్నానన్న దాని నటనను మనం బహిరంగం చేయాలి. మనం తీవ్రంగానూ నిరంతరంగానూ విమర్శించాల్సింది 'జాతీయత' రూపంలో ఆకర్షణీయంగా తయారైన ఈ బ్రాహ్మణవాదాన్ని.

(మిగతా వచ్చే సంచికలో...)

☆

నివాళి

రాయలసీమలో సాహసిక మూర్తిమత్వం



ప్రగతిశీల జీవన రంగాలకు పూడ్చలేని ఖాళీని వదిలి జయశ్రీ వెళ్లిపోయారు. పౌర ప్రజాస్వామిక హక్కుల ఉద్యమంలో మూడు దశాబ్దాల క్రియాశీల ఆచరణ అర్ధాంతరంగా ఆగిపోయింది. మానవ హక్కుల వేదిక నాయకురాలిగా రాయలసీమలో, ముఖ్యంగా కడప జిల్లాలో ఆమె వేసిన ముద్ర అసాధారణమైనది. హక్కులు, వ్యక్తి స్వేచ్ఛ, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్యమనే భావనలు ఇప్పటికీ నెలకొనని రాయలసీమ వంటి నేలలో ఆమెది ఒక సాహసిక యాత్ర. అట్టడుగు ప్రజలపట్ల అపారమైన ప్రేమను వ్యక్తం చేసే జయశ్రీ రాయలసీమలోని సకల ఆధిక్యాల మీద తన సహజ శైలిలో వ్యంగ్యాన్ని, సునిశిత విమర్శను ప్రకటించేది. 'ప్రజాస్వామ్యమంటే మా వాళ్లకు ఏం తెలుస్తుంది?' అని అక్కడి నాయకుల గురించి, సామాజిక ఆధిపత్యశక్తుల గురించి వెటకారాన్ని ప్రదర్శించేవారు.

అలాంటి చోట ఆమె జీవితమంతా ప్రజాస్వామ్య విలువల కోసం ఆరాటపడ్డారు. పుట్టుకతోనే వచ్చిన గుండె జబ్బును లెక్క చేయకుండా జీవితాంతం అవిశ్రాంత పోరాటాన్ని సలిపారు. ఆరంభంలో విప్లవోద్యమ చైతన్యంతో జయశ్రీ ప్రజాస్వామిక హక్కుల ఉద్యమంలోకి వచ్చారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో, ఆ తర్వాత మానవ హక్కుల వేదికలో ఆమె ఎంచుకొని పని చేసిన సమస్యలను గుర్తు చేసుకుంటే ప్రజాస్వామ్యాన్ని ఆమె ఎంత విశాలమైన అర్థంలో స్వీకరించిందీ తెలుస్తుంది. కడప జిల్లాలో ఏ మారుమూల ఎక్కడ హక్కుల ఉల్లంఘన జరిగితే అక్కడ ఆమె ఉండేవారు. తన వంటి వాళ్లందరినీ కదిలించి నిజనిర్ధారణలకు వెళ్లేవారు. పోలీసులతో, అధికారులతో తలపడేవారు. గ్రామాల్లోని అగ్రకుల ఆధిపత్య శక్తులతో వాదనకు దిగేవారు. మాటలకు, చర్చలకు తావులేని చోట, బెదిరింపులు, లొంగదీసుకోడాలు, కుట్రలు మాత్రమే ఉన్నచోట ఆమె చట్టాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను పరిచయం చేశారు. చర్చనీయాంశం చేశారు. విజ్ఞాపన పత్రాలు, పత్రికా సమావేశాలు, ధర్నాలు, పలు నిరసన రూపాల్లో తన ఉనికిని నిలబెట్టుకున్నారు. రాయలసీమ సాంస్కృతిక జీవనంలో పెద్దగా లేని వ్యంగ్య సంభాషణా శైలిని ఆమె ఎక్కడ ఎలా అందుకున్నారోగాని సభల్లో, పత్రికా సమావేశాల్లో ఆమె సునిశితమైన రాజకీయ వ్యాఖ్యలు చేసేవారు.

ఫ్యాక్షన్ దారుణాలు, దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, పాలకుల అభివృద్ధిలోని విధ్వంస రూపాలు, నిరుపేదల జీవన్మరణ సమస్యలు .. ఒకటేమిటి పత్రికల్లో ఒక వార్త వచ్చినా చాలు, ఒక ఫోన్ కాల్ అందుకున్నా చాలు జయశ్రీ బయల్దేరి వెళ్లేవారు. ఆమె అవగాహనకు, కార్యాచరణకు కడప జిల్లాలోని యురేనియం ప్లాంట్ వ్యతిరేక పోరాటం అత్యుత్తమ ఉదాహరణ. కొన్నేళ్లుగా ఆమె అందులో తలమునలకలుగా ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నో సవాళ్లు, నిస్సహాయతలు, కుట్రలు.. అయినా ఆమె వెనక్కి తగ్గలేదు. కడప యురేనియం సమస్య బైటి ప్రపంచానికి తెలిసేలా కృషి చేశారు.

కడప జిల్లా పేరును వైఎస్ఆర్ కడపగా మార్చినప్పుడు దాన్ని అడ్డుకోడానికి ఆమె చాలా సాహసిక ప్రయత్నాలు చేశారు. ప్రశ్నించడానికి వీల్లేని పవిత్ర భావనగా అప్పుడది మారిపోయింది. కానీ అనేకమంది ప్రజాస్వామికవాదుల ఆధ్వర్యంలో ఆమె తీవ్ర నిరసనను తెలిపారు. రాయలసీమ సాంస్కృతిక కేంద్రమైన కడప అస్తిత్వాన్ని రద్దు చేయడంగా ఆమె దాన్ని భావించారు. కడప పాలెగాళ్ల సాంస్కృతిక ఆధిపత్యాన్ని ఎదుర్కొనే పోరాటంలో భాగంగా స్వీకరించారు.

న్యాయవాదిగా కూడా ఆమె ప్రజల తరపున పిటీషన్లు పెడుతూ నిరంతరం జిల్లాలో ఒక చర్చా వాతావరణాన్ని నిలబెట్టేవారు. తొలి రోజుల నుండి చివరి దాకా కార్మిక ఉద్యమాలకు అండదండగా, భాగస్వామిగా ఉన్నారు. గత ముప్పై ఏళ్ల కడప, రాయలసీమ ప్రజాస్వామిక పోరాటాల చైతన్య వికాస చరిత్రలో జయశ్రీ చెరగని ముద్ర వేశారు. కడప సమాజం తనలోకి తాను తొంగి చేసుకొనే ప్రేరణాశక్తిగా జీవించారు. మనుషులపట్ల తిరుగులేని ప్రేమగల పౌర సమాజపు బాధ్యతాయుత కంఠస్వరం మూగబోయింది. రాయలసీమ కరకు ఫ్యాక్షన్ నేలలో ఎంత నైతికశక్తి సంతరించుకుంటే ఆమెకు ఈ సాహసం అలవడి ఉంటుందో తలచుకుంటే ఆశ్చర్యమనిపిస్తుంది. అలాంటి చోట కూడా ప్రజాస్వామ్యం కోసం, విలువల కోసం జరిగిన మహత్తర ప్రయత్నానికి ఒక తరం ప్రతినిధి ఆమె. ఇప్పుడు ఆమె లేరు. ఆ పనులన్నీ అలాగే ఉన్నాయి. వాటి అవసరం మరింత పెరిగింది. వాటిని మనం అందుకోగలమనే భరోసా ప్రజలకు ఇవ్వాలి. ఆదే జయశ్రీకి నివాళి.

- విరసం, ఆగస్టు 2, 2021

పెద్ద కథ

బాలి

- నిత్య

ప్రకృతి కాంత వన్నెలు విరుచుకునే హేమంతంలో ఎముకలు గడ్డ కట్టించే చలి.

ఇంటి ముందటి వసారాలో నెగడు.

ఇంటి వెనుక పెరట్లో మామిడిచెట్టుకు తాళ్లతో కట్టిపడి ఉన్న ఓ ఆడపిల్ల, ఆ పిల్ల బాలి.

శరీరం చల్లగా మంచు ముక్కలా...వంటి మీద టెరికాట్ పంజాబీ డ్రెస్సు చలికి మరింత చల్లగా..

రెండు చేతులూ వెనక్కి విరిచి తాడుతో ముంజేతులకు మెలికతిప్పి బిగించి మరీ చెట్టుకు కట్టేసి ఉన్నాయి.

తండ్రి ప్రతిసారి లోటాడు నీళ్లు తెచ్చి తాడును తడుపుతున్నాడు. అయన శరీరం కోపంతో బుసలు కొడుతోంది.

"నేను దీన్ని కనిపెంచిన. బుద్ధులు నేర్పిన. చదువుకుంటదని స్కూలుకు పంపితే నా మీదకి తిరగబడుతాది. చదువు నేర్పిన కావరం వదలాలి. దేన్ని చూసుకుని దీనికింత పొగరు. దీనికి ఎవదు అడ్డం వస్తడో చూస్త" పళ్లు కొరుకుతున్నాడు రాంజీ.

రెండు చేతులూ చచ్చుబడిపోయాయి. ఒళ్లంతా పచ్చిపుండులా ఉన్నది. శరీరానికంటే మనసుకు తగిలిన గాయాలు బాలిని ఎక్కువ బాధిస్తున్నాయి. ఆమె కళ్లల్లో నీళ్లు ఇంకిపోయాయి. ఇంతకీ అతను తనను కన్న తండ్రేనా...బాలిని పదే పదే వేధిస్తున్న ప్రశ్న ఒక్కటే.

కట్టె విరిగేదాకా.. గొడ్డును బాదినట్లు... ఎందుకు అంత కసి.. తను పరాయిది కాదుగా.. ఆయన కడుపున పుట్టిన బిడ్డేగా...

తండ్రి బుసలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

రక్తం గడ్డలు కట్టుకుపోయి తెల్లటి శరీరం నల్లగా కమిలిపోయింది. గాయాల మంట కంటే మనసుకు తగిలిన గాయం ఎక్కువ సలుపుతున్నది.

తనను అసలు స్కూలుకు ఎందుకు పంపించాడు.

తను మాంసపు ముద్ద కాదు, మెదడున్న మనిషి. తనకు నచ్చని చోటుకు పోవటానికి ఇష్టం లేని గొడ్డు తనను కొన్న యజమాని దగ్గరకుపోకుండా పారిపోయి తను పుట్టి పెరిగిన ఇంటికే వస్తది. తన బతుకు గొడ్డు కన్నా హీనమా? తను ఆడపిల్ల అయి పుట్టడమే తను చేసిన నేరమా? ఎందుకు తనకు ఈ శిక్ష తను ఎందుకు భరించాలి?

అమె ఆత్మ తిరగబడుతోంది.

చచ్చినా సరే తను మాత్రం ఒప్పుకోదు. ఇంతకన్నా ఏం చేస్తారు. ఇప్పటికి చేసిన అవమానం చాలు.

తన తలకట్టు చూసి తన స్నేహితురాళ్లంతా ఎంత ముచ్చటపడే వాళ్లు. సిల్కులా జారిపోయే జుట్టంటే తనకు ఎంత ఇష్టం. అంత అందమైన వెంట్రుకలను అంత నిర్దాక్షిణ్యంగా...బొరికెలు పెట్టిన తలతో తన ముఖం చూసి తన స్నేహితురాళ్లు నవ్వరూ., అతనికి చేతులెలా వచ్చాయో...

ఖాళీ కడుపు... రెండు రోజుల నుండి తిండి లేదు. పొద్దున్న ఎప్పుడో ఎవరూ చూడకుండా నానమ్మ ఇంత వేడి టీ తాగించి పోయింది.

తండ్రి చూస్తే లేనిపోని రాద్ధాంతం చేస్తాడని భయం భయంగానే వచ్చింది. తన కడుపున పుట్టిన కొడుకే... తను వేలు పట్టి తప్పటడుగులు వేయించిన కొడుకే.. అయినా వాడు కొడుకు. వాడి నీడనే తన జీవితం గడవాలి. అందుకే ఆ తల్లికి కూడా వాడంటే భయం.

అఖరుకు ఉండబట్టలేక పోయింది. తన మనవరాలి కోసం తెగించింది. రాత్రయింది. అందరూ నిద్ర పోయారు. నెమ్మదిగా లేచి వచ్చి బాలి కట్లు విప్పింది. పొదివిపట్టుకుని గదిలోకి తీసుకెళ్లి పక్కపై పడుకోబెట్టి బొంత కప్పింది.

కలత నిద్దురలో బాలి.

* * *

మాడియా సంప్రదాయాలు బలంగా వేళ్లూనుకున్న గ్రామం టేకలా. ఆ గ్రామపు పంచాయతీ రాజ్ అధికారం తెల్ల టోపీల చేతిలో తెగ అధికారం నల్లటోపీల చేతిలో ఉన్నది. అహిరి రాజకుటుంబం రెండుగా చీలిపోయి ఒకటి కాంగ్రెసుగా, మరొకటి నాగ విదర్భ సమితిగా పార్లమెంటరీ వ్యవస్థలో సంలీలనమై పోయాయి. కాంగ్రెసు అనుయాయులు తెల్లటోపీలు, నాగ విదర్భ సమితి అనుయాయులు నల్లటోపీలుగా గ్రామాలలో దర్శనమిస్తారు. ఆ గ్రామంలో ముందు నుండీ విప్లవ ప్రజా సంఘాల నిర్మాణం బలహీనంగానే ఉంది. విప్లవ ప్రజా ప్రభుత్వాల నిర్మాణం పరస్పెక్టివ్ దశలోనే ఉన్నది.

అ గ్రామంలో పూసిన అందమైన పువ్వు బాలి. పచ్చబొట్ల సంప్రదాయం నుండి విముక్తి అయిన తరం. ఆదివాసీ సమాజంలో పెళ్లీడు వచ్చేవరకూ ఆడపిల్లలు స్వేచ్ఛగానే పెరుగుతారు. భూస్వామ్య సమాజంలో

లాగా కట్టు-బొట్టు, మాట-తీరు, నడవడి, మంచి మర్యాద అంటూ అడుగడుగునా అంక్షలు ఉండవు. తల్లిదండ్రులతో స్నేహితుల్లా మాట్లాడుకుంటారు. యువతీ యువకులు కలుపుగోలుగా ఎలాంటి అరమరికలు లేకుండా భుజాల మీద చేతులు వేసి అట పాటలలో పాల్గొంటారు.

బాలి ఇలాంటి స్వేచ్ఛా వాతావరణంలోనే పెరిగింది.

చిన్నప్పుడే తమ గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో బాబా ఆమ్టే స్థాపించిన లోక్‌బిరాదరీ స్కూలులో చేర్పించాడు తండ్రి.

బాలి చదువులో చురుకైన పిల్ల. బుద్ధిమంతురాలు. క్రమశిక్షణగా ఉండేది. టీచర్లు ఇష్టపడే వాళ్లు. టీచర్లు ఇచ్చిన హెూంవర్క్ ఖచ్చితంగా

పూర్తిచేసుకునేది. అలా టీచర్ల చేతిలో ఒక దెబ్బ గానీ, ఒక మాట గానీ పడే అవకాశం రాలేదు.

బాబా ఆమ్టే 1975లో ఎమిలికస్స దగ్గర లోక్‌బిరాదరీ సంస్థను ప్రారంభించాడు. అదివాసీ ప్రజలకు వైద్య సేవలు అందించటం అ సంస్థ ప్రధాన లక్ష్యం. స్కూలును కూడా నడుపుతారు. ఆయన కొడుకు ప్రకాశ్ ఆమ్టేను భామ్రాగడ్ తాలూకాలో ప్రజలు దేవుడితో సమానంగా భావిస్తారు. వారి జీవిత శైలిలో ఉండే సాదాతనం బాలిని ప్రభావితం చేసింది. ఊహ తెలిసినప్పటి నుండీ అలాంటి స్కూలు వాతావరణంలో పెరిగిన బాలి వ్యక్తిత్వం వికసించింది.

జీవితంలో అన్నీ ఉండి కూడా వేషభాషల్లో సాదాగా ఉండటం బాలిని ప్రభావితం చేసింది. మిగతా ఆడపిల్లల్లా లిప్‌స్టిక్‌లు, వాస్‌మాల్‌లు, రంగు రంగుల గాజులు పూసలు, అలంకరణ వస్తువులపై అమెకు మోజు లేదు. తల దువ్వి ఒకసారి జడ అల్లితే మరుసటి రోజే తల దువ్వేది. మిగతా అడపిల్లల్లా రోజుకు పదిసార్లు అద్దం చూసుకుంటూ సింగారించుకోవటం తనకు ఇష్టం ఉండేది కాదు.

ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదువుకునేది. సావిత్రిబాయి పూలే, జ్యోతిబా పూలేల గురించి చదివింది. సనాతన అచారాల్ని ఎదిరించి తమ లాంటి ఆడపిల్లలకు చదువుకోవటానికి దారులు వేసిన అ దంపతులంటే అమెకెంతో అభిమానం. మరికొందరు సంఘసంస్కర్తల గురించి చదివింది. సమాజసేవలో లీనమై ఉన్న ప్రకాశ్ ఆమ్టే, బాబా ఆమ్టేలను రోజూ చూస్తున్నది.

బాలి ఒక వ్యక్తిత్వం కలిగిన యువతిగా పరిణతి చెందింది.

* * *

స్కూలుకి వేసవి సెలవులిచ్చారు. ఏటపల్లిలో చదువుకునే మేనమామ బిడ్డ సుమన్ కూడా సెలవులు కావటంతో ఇంటికి వచ్చింది.

వాళ్లిద్దరూ ఒకే ఈడు పిల్లలు కావటంతో ఎక్కువ స్నేహంగా ఉంటారు. అ రోజు అదివారం, బాలి మేనమామ ఇంట్లో టివి చూడటానికి వెళ్లింది. బాలికి సినిమాల పిచ్చి లేదు. వేరే సినిమా అయితే చూసేది కాదు. అ రోజు 'చెక్ దే ఇండియా" వస్తున్నది. ఒక మహిళా హాకీ టీం విజేతగా నిలబడిన తీరు చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇంచుమించు అందరూ సినిమాలో లీనమై పోయారు.

పక్కింటి వెనక పెరట్లో దేన్నో గానీ కట్టెతో దబ దబ బాదిన చప్పుడు వస్తున్నది. ఏదైనా విషపురుగు కావచ్చుననుకున్నారు.

"నా ఇంట్లో ఉండకు... పో.. ఇది నా ఇల్లు... నా ఇష్టం.." హుంకరిస్తున్నది పురుష కంఠం.

"ఇది నా ఇల్లు. మట్టి మోసినా, అడుసు తొక్కినా. ఇటుకలు మోసినా. ఇల్లు కట్టినా... నాగలి పట్టిన. పొలం దున్నిన. పంట కోసిన. కళ్లం నుండి ఇంటికి గంపలల్లో నెత్తికెత్తుకుని మోసిన... ఈ ఇంటిని చక్కబెట్టటందుకు నువ్వెంత కష్టం చేసినవో నేను కూడా అంతే కష్టం చేసిన..."

అడ మనిషి గొంతు వినిపిస్తున్నది. ఆమె కూడా గట్టిగానే మాట్లాడుతున్నది.

ముసలాయన కల్లు మైకం దిగలేదు. కట్టెపట్టుకుని ఊగుతూనే నిలబడ్డాడు.

"పెద్దయ్యా! అవ్వ నెందుకు కొడుతున్నావే!"

చీకట్లో నుండి ఎవరో అంటున్నారు నెమ్మదిగా...

"నా భార్య... నా ఇష్టం..." ఖరాఖండిగా తేగేసి చెప్పాడు.

సన్నివేశం బాలిని కదిలించింది.

టివి కట్టేసి నిద్రకుపక్రమించారు. పక్క మీద వాలిందే కాని బాలికి నిద్ర రావటం లేదు.

ఆలోచనలు అమెను ముసురుకున్నాయి.

తాతమ్మలు, అమ్మలందరి పరిస్థితి ఇదేనా! మహిళకు పైసా మందం విలువ లేదు. ఎంత చాకిరి చేసినా చేసినా ఈకతో సమానం. నిజంగా ఆయన ఇంట్లోంచి వెళ్లగొడితే అ అవ్వ ఎక్కడికి పోయి బతకాలి. ఆరుగాలం అ ఇంటిని నిలబెట్టడానికి తన రక్తమాంసాలన్నీ ధారపోసింది. చివరికి అమెకు మిగిలేది ఏంటి. భర్తకి కోపం వచ్చినా, తనకి కోపం వచ్చినా అ ఇంటిని వదిలి పోవలసింది ఆడ మనిషేనా!

నా భార్య.నా ఇష్టం...ఎంత అధికారం... ఎక్కడి నుండి వచ్చింది అంత అధికారం. ఎవరిచ్చారు ఆయనకు అ అధికారం...

కల్లు తాగింది ఆయన... తాగిన మైకంలో ఊగిపోతున్నాడు... కట్టెతో గొడ్డును బాదినట్లు బాదింది ఆయన... పైపెచ్చు అవ్వనే ఇంట్లోనుండి పొమ్మంటున్నాడు.

అక్కడ జమ అయిన వాళ్లు కూడా చోద్యం చూస్తున్నారు. అది తప్పని ఎవరూ ఎందుకు అనటం లేదు. మాట్లాడరెందుకు!

సవాలక్ష సందేహాలు మనస్సును వేధిస్తుండగా గట్టిగా కళ్లమూసుకుని నిద్రకుపక్రమించింది బాలి. .

* * *

తనను దళం వాళ్లు రమ్మన్నారని తన చిన్న చెల్లి చెప్పింది.

వెన్నులోంచి ఏదో వణుకు లాంటిది బాలి వళ్లంతా పాకింది. తనను ఎందుకు పిలిచి ఉంటారు? తను పుట్టక ముందు నుండే తమ ఊరికి దళం రాకపోకలు చేస్తుంది. చిన్నప్పటి నుండే స్కూలుకు పోవటంతో తను సెలవులకు వచ్చిన టైంలో దళం రాకపోవటమో, దళం వచ్చిన సమయానికి తను వేరే పని మీద పోవటమో జరిగేది. దళం గురించి పరోక్షంగా విన్నదే ఎక్కువ కావడంతో సందేహాలు ఎక్కువ.

తను చిన్నగా ఉన్నప్పుడు ఒక్కసారి దళాన్ని చూసింది. తమ దగ్గరి చుట్టం జోగా గావడేను దళంలో లాల్సు అని పిలుస్తారు. తనను దగ్గరికి తీసుకున్నాడు. వాళ్ల దళం వాళ్లు పాటలు పాడారు. మహిళలు ప్రాకు లాంటి కుచ్చు లంగాలు వేసుకుని ఓణి వేసుకున్నారు. తలకు, నడుముకు ఎర్రపట్టీలు కట్టుకున్నారు. చేతిలో ఎర్ర రుమాలు పట్టుకున్నారు. జెండాపై ఏదో గుర్తు తెల్ల తెల్లగా కనిపించింది కానీ చీకట్లో బాలికి అర్థం కాలేదు. అకుపచ్చ, ఎరుపురంగుల కలయిక చూడముచ్చటగా ఉన్నది.

లయబద్ధంగా నాట్యం, మనుషులను రారండని పిలిచే పాట, మనసులను ఉరకలెత్తించే రాగం, డప్పుల నాదం విని నిద్రలో ఉన్న వాళ్లు

కూడా లేచి లేచి వస్తున్నారు. పిల్లాజెల్లా, ముసలీ ముతకా, యువతీ యువతులు మహిళలతో సందడిగా ఉన్నది. నడిరాత్రి దాటేవరకూ ప్రోగ్రాంలు నడిచాయి. 'ముగించుదాం" అంటూ కమాండరు ప్రకటించాడు. 'ఒక్క పాట పాడు శంకరన్నా!' గుంపులోంచి కేకలు. ఒకటీ ఒకటీ కలిపి రాత్రి పన్నెండు దాటిపోయింది.

మీటింగు ముగిసింది.

యువతీ యువకులు ఎవరికి ఇష్టం అయిన రాగాన్ని వాళ్ళు గునగునాయించుకుంటూ ఇళ్లముఖం పట్టారు. చిన్నారి బాలికి మాత్రం,

"లేత లేంజు లెయ్యాలయ్యార్, లడాయి పాట డోలు డాక వరటీరో లెయ్యా లెయ్యార్

నెత్తురు నెత్తురు పొడుదు అలె బర బర పేసమంత వరటీరో లడాయి కీయల

నెత్తురు నెత్తురు అకి జెండా అలె లాలు జెండా ఊంగ మంత వరటీరో లెయ్యా లెయ్యార్'

"పాలుపోసుకునే యౌవ్వనంలో ఉన్న యువతీ యువకులారా పోరుపాట, దప్పు నాట్యం నాట్యం చేద్దాం రండి. ఎర్రని సూర్యుడు పొడుస్తున్నాడు, అడవంతా ఎరుపుమయం. అ అడవిలో ఎగురుతోంది ఎర్ర జెండా పోదాం పదండి పోరులోకి' అనే పాట ఏదో తెలియని ఉద్వేగాన్ని నింపింది..

అపరేషన్ గ్రీన్ హంట్ మొదలయినప్పటినుండి దళం ఊర్లోకి వచ్చి మీటింగులు పెట్టడం తగ్గిపోయింది. దళం ఊరికి వచ్చేది పోయేది ఊరందరికీ తెలియనిచ్చేవాళ్లు కాదు.

నక్సలైట్ల మూలంగా గడ్చిరోలి జిల్లాలో అభివృద్ధి పనులు జరగటం లేదనీ, దాని మూలంగా ఆదివాసులు వెనకబడిపోయారనీ, తాము చెప్పిన మాట వినకుండా ప్రజా ప్రభుత్వాలను ఎన్నుకోవటానికి ఓటు వేస్తే వేలి మీద గుర్తు చూసి వేళ్ళు నరికారనే వార్తలను పేపర్లలో చదివింది. ప్రభుత్వం నుండి దొరికే పథకాలను తీసుకోనివ్వరని ఊర్లో పెద్దవాళ్లు చర్చించుకుంటుండగా విన్నది. పిల్లలు చదువు నేర్చుకునే స్కూళ్లను కూలగొడతారట? ఈ సంవత్సరం తమ స్కూలుకు వస్తున్న కంప్యూటర్లను కాల్చివేశారని ఆఫీసులో వాళ్లు మాట్లాడుకుంటుండగా విన్నది. కంప్యూటర్లు వాళ్లకు శత్రువులా? వాళ్లు నిజంగానే చదువులకు వ్యతిరేకులా?వాళ్లు ప్రజల కోసమే పని చేస్తే ప్రజలకు ఉపయోగపడే పనులను ఎందుకు అడ్డుకుంటున్నట్లు? వాళ్లనే అడిగితే... కోపానికి వస్తరేమో...వాళ్లు కబురు చేశారంటే పోవాలా వద్దా అని మనసులో తర్కించుకున్నది. ఏం చెపుతారో పోయి చూస్తా అని దళం వద్దకు బయలుదేరింది.

తమ స్కూల్లో ఎవరో వచ్చి ఓ పుస్తకం పంచిపోయారు. అ పుస్తకం మరాఠీలో ఉన్నది. 'మలా సరెండర్ వ్హయ్చా..నేను సరెండరు అవుతాను"

అది ఇలా ఉన్నది. 'ఒక దళం ఉంటుంది. దానికి ఒక పురుషుడు కమాండరుగా ఉంటాడు. ఊర్లో మీటింగు చేసి యువతీ యువకులు దళంలోకి భర్తీ కావాలని హుకుం జారీ చేస్తాడు. కొద్ది మంది యువతీ యువకులు దళంలోకి చేరతారు. కొద్ది రోజులకు దళంపై ఫైరింగు జరుగుతుంది.

ఒక మహిళ గాయపడుతుంది. ఆమెను ఎలాగో తమతో తీసుకుపోతారు. అమె బాధను భరించలేక ఏడుస్తుంటుంది. ఏడిస్తే ఆ శబ్దాలు విని పోలీసులు వస్తారని కమాండరు కసురుకుంటాడు. అయినా నొప్పి భరించలేక మూలుగుతుంది. సహనం కోల్పోయిన కమాండరు తూటా కాల్చాలని సభ్యునికి ఆదేశం ఇస్తాడు. సభ్యుడు వెనకాముందాడుతుంటే తనే ఒక తూటాను కాల్చుతాడు. శవాన్ని పూడ్చిపెట్టడానికి గుంత తవ్వుతారు. కానీ ఆ గొయ్యి సరిపోలేదు. శవాన్ని నాలుగుముక్కలుగా నరికి పూడ్చిపెట్టి వెళ్లిపోతారు. ఈ ఘటనతో చలించిపోయిన సభ్యుడు తను ఇంటికి పోయి పోలీసుల ముందు లొంగిపోవాలని నిర్ణయించుకుంటాడు.'

ఈ కథ గురించి తమ స్కూల్లోనూ, హాస్టల్‌లోనూ వేడి వేడి చర్చలు జరిగాయి. అదే సమయంలో తమ క్లాస్‌మేట్ ప్రియాంక హఠాత్తుగా మాయం అయింది. అమె దళంలోకి పోయిందనీ, ఫైరింగులో గాయపడితే తమతోటి వాళ్లే చంపి పూడ్చిపెట్టారనీ వార్త వేసవిలో అడవిని అంటుకున్న నిప్పులా గప్పుమన్నది.

అ తర్వాత ఏమయిందీ తనకు తెలియదు. బాలి మనసును పీడిస్తున్న సందేహాలలో అది కూడా ఒకటి. నిజంగా దళంలో తమ తోటి సహచరులను అలా కాల్చిచంపుతారా? అలా చేసే వాళ్లు నిజంగా మనుషులేనా? అటువంటి హృదయం లేని మనుషులు, కారిన్యులు సమాజసేవ ఎలా చేస్తారు?

ఇవన్నీ గుర్తుచేసుకుంటూ చాలా రాత్రి వరకూ బాలికి కంటిమీద కునుకు రాలేదు.

* * *

మెలకువ వచ్చేసరికి ఆరయిపోయింది. ఏడింటికే తమ వద్దకు రావాలని కబురు చేశారు. ఆలశ్యం చేస్తే కోప్పడతారేమో? హడావిడిగానే లేచి కాలకృత్యాలు తీసుకుని స్నానం చేసి తయారయింది.

ముందే తయారయిన బాలి చెల్లెలు చాయ్ వేడి చేసి ఇచ్చింది.

దళం దగ్గరికి వచ్చేసరికి నవ్వుతూ స్వాగతం చెపుతున్నారు. అందరూ వరుసగా నిలబడి మాకు కరచాలనం చేశారు.

మహిళలనూ, పురుషులనూ వెంటనే పోల్చుకోలేకపోయింది.

రా కూర్చో... అంటూ తన జిల్లీని చూపిస్తున్న వ్యక్తి మహిళనా.. పురుషుడా... క్రాపు చేయించుకుని టోపీ పెట్టుకుని ఉన్నారు. మాట చూస్తే అడగొంతులా ఉన్నది. ఎర్రగా, బొద్దుగా, సుకుమారంగా కనిపించింది. ప్రభుత్వం ప్రచారం చేసే టెర్రరిస్టు ఈమేనా? బుద్ధి తెలిసినంక చూడలేదు. ఏదో చిన్న బెరుకు వెంటాడుతూనే ఉంది.

సంశయిస్తూనే పోయి బిడియంగా ముడుచుకుని ఒక మూలకి ఒదిగి కూర్చుంది.

పక్క గ్రామాల నుండి వచ్చిన విద్యార్థులలో కొందరికి ముందే పరిచయం ఉన్నట్లున్నది. బాగున్నావా అక్కా అంటూ వచ్చి జిల్లీలో చుట్టుముట్టారు. వారి పిలుపులో ఎంతో అప్యాయత తొణికిసలాడుతున్నది.

అందరూ విద్యార్థినులే ఉన్నారు. పిచ్చాపాటీ కొద్దిసేపు మాట్లాడుకున్నాక కమాండరు నెమ్మదిగా ఆచితూచి మాట్లాడటం మొదలుపెట్టింది.

విద్యా విధానంపై చర్చ మొదలయింది. రాజుల కాలం నుండీ ఆదివాసులు ఎలా వివక్షతకు గురవుతున్నారో వివరించింది. ఏకలవ్యుడి కథ విన్న తర్వాత గురుభక్తి పేరు వెనుక ఇంత కుట్రనా అని బాలి అశ్చర్యపోయింది. తమ్మ మీద ఎంత ప్రేమ ఒలకపోస్తారు.. తమకు ఏకలవ్యుడిని ఆదర్శంగా చూపిస్తారు కదా.. ఆ ఆదర్శం వెనుక ఇంత దుర్మార్గమైన కుట్ర దాగిఉన్నదా? మబ్బుపొరలు విచ్చుకుంటున్నట్లయింది.

"మనం ఈ రోజు పోరాడుతున్నది కూడు-నీడ-గుడ్డ అందరికీ

సమానంగా దొరకాలని. పేదలూ–గొప్పవాళ్ల అంతరం సమసిపోవాలని పోరాడుతున్నాం. స్త్రీ-పురుషుల నడుమ సమానత్వం కావాలని పోరాడుతున్నాం.

మన అదివాసీ స్త్రీలూ–పురుషులూ వివక్షకు గురవుతున్నారు. ఈ అడవిలో పుట్టి పెరిగిన వాళ్లను అడవి నుండి పరాయివాళ్లను చేయటానికి అనేక చట్టాలు రూపొందించారు. వీటిని ఉపయోగించుకుని మనల్ని పరాయివాళ్లను చేయటం, అడవిలోని సంపదలను కారుచౌకగా కొల్లగొట్టుకు పోవడం వారి లక్ష్యం. ఈ కొల్లగొట్టుడును మనకు అర్థం కానీయకుండా చేయటానికి ఆదివాసుల అభివృద్ధి అనే ముసుగు వేస్తున్నారు.

మన నేలపై దాగి ఉన్న ఖనిజ సంపదలను తరలించటానికి వారికి రోడ్లు కావాలి. రైళ్లు కావాలి. కరెంటు కావాలి. నీటి వసతి కోసం డ్యాంలు కట్టాలి. రేపు గనుల తవ్వకం మొదలయితే మన భూములు, ఇళ్లు, అడవి అన్నీ కోల్పోయి బికారులం కావలసిందే. దీన్నే మన పార్టీ వద్దంటున్నది. అందుకే మన పార్టీ అంటే వారికి కంటిలో నలుసు. అందుకే మన పార్టీ మీద కక్ష కట్టారు. మనపై దుష్ప్రచారం చేశారు....”

శ్రద్ధగా వింటున్నది బాలి. ఎంతో కొంత నిజం ఉన్నట్లు అనిపించింది. ఆలోచనలో మునిగిపోయింది.

* * *

స్కూల్లో దీపావళి సందర్భంగా టోర్నమెంట్స్ నడుస్తున్నాయి. చదువులోనే కాక ఆటల్లో కూడా బాలి చురుగ్గా పాల్గొనేది. వాలీబాల్ ఆటలో పట్టు సంపాదించి జిల్లా టీంకు ఎన్నికయింది. రాష్ట్రస్థాయి క్రీడలకు కూడా వీళ్ల టీం సెలెక్టయింది.

టోర్నమెంట్స్ కోసం నాగపూర్‌కి ప్రయాణమయ్యారు. బస్సులో ప్రయాణం. భామ్రాగడ్ నుండి నాగపూర్‌కు పోయే బస్సు ఉదయం ఏడుగంటలకు బయలుదేరుతుంది. బస్సు ప్రయాణం ఎప్పుడూ అలవాటులేదేమో జోలపాడినట్లయి నిద్రముంచుకొచ్చింది. నిద్రలో ఉండగానే బాలి ప్రయాణిస్తున్న బస్సు గడ్‌చిరోలి పొలిమేరలను దాటింది. బస్సు కుదుపుతో ఎత్తి కుదేసినట్లయింది. బాలి నుదురు ముందు సీటు కడ్డీలకు గుద్దుకుని తల దిమ్ముపట్టింది. నక్సలైట్ల మీద బాలికి పట్టరానంత కోపం వచ్చింది.

నక్సలైట్లు రోడ్లు పొయ్యనియ్యరని, తారురోడ్లపై గుంతలు తవ్వుతారనీ విన్నది. రోడ్లతో వీళ్లకేం పని. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే వాళ్లకేం ఒరుగుతుందట. ఈసారి కలిస్తే మాట్లాడాలి అనుకుంటూ కిటికీలోంచి బయట పరిసరాలను పరిశీలిస్తూ “అరె, గడ్‌చిరోలి దాటిపోయింది.

ఇది నక్సలైట్ల ఏరియా కాదుగా!” అకారణంగా నక్సలైట్ల మీద కోపానికొచ్చినందుకు బాలి మనసులోనే నవ్వుకున్నది.

ఒక స్కూలులో వీరికి బస ఏర్పాట్లు చేశారు. హాస్టల్ వెనుకవైపు అంతా స్లమ్ ఏరియా... ఒక పక్కన ఆకాశాన్ని అంటే భవంతులు... మరో దిక్కు మురికివాడలు. ఒక దిక్కు ఆగర్భ శ్రీమంతం... మరోవైపు ఆకలి చావుల కటిక దారిద్ర్యం. రోడ్లు, వంతెనలు, కరెంటు అన్ని సౌకర్యాలు ఉన్నాయిగా... మరి ఇక్కడి ప్రజలు ఇంత దీనంగా ఎందుకున్నారు. తమ ప్రాంతాలలోనైతే నక్సలైట్ల మూలంగానే పేద వాళ్లకు ప్రభుత్వం నుండి దొరికే వసతులు అందకుండా పోతున్నాయనే ప్రచారాన్ని విన్నది.

చిక్కువీడని ఎన్నో సందేహాలు మనసును వేధిస్తుండగా రాత్రి అన్నం తిని పడుకున్నది. ప్రయాణపు బడలికేమో అదమరిచి నిద్రపోయింది.

అర్ధరాత్రి ప్రహరీకి అవతలి పూరి గుడిసెల్లో పెద్దగా కేకలు వినిపిస్తున్నాయి. కరెంటు స్థంభాల వెలుతురులో ఖాకీ డ్రస్సులు వేసుకున్న మనుషులు లాఠీలతో ఎవరినో గొడ్డును బాదినట్లుగా బాదటం కనిపించింది.

“రంకు ముండ.. నీకు... లో పెట్రోల్ పోసి తగలబెడతనే.”

అది వ్యభిచారుల వాడ అనీ, వాళ్లు రోజూ పోలీసులకు మామూళ్లు చెల్లించుకోవాలనీ, అవి చెల్లించుకోలేని నాడు ఈ దాష్టీకం అనీ తర్వాత తెలిసింది.

అబ్బ... అడోళ్లకి ఎక్కడకు పోయినా తిప్పలు తప్పవా... తమ సమాజంలోనే కాబోలు మహిళలపై హింస అనుకున్నది. ఇక్కడ అంతకంటే ఘోరంగా ఉన్నది కదా!

ఆడజన్మ పాపపు జన్మనా... వాళ్లు వీటన్నిటినీ భరించవలసిందేనా... వేదన సుడులు తిరిగింది. బాలికి కంటిమీద కునుకు రాలేదు. తెల్లారే వరకూ భయం భయంగానే గడిపింది.

టోర్నమెంట్స్‌లో కూడా గడ్‌చిరోలి టీం గెలిచింది. బాలి స్టేట్ ప్లేయర్‌గా మెడల్ అందుకుని తిరిగి వచ్చింది. పరీక్షలు అయిపోయాయి.

9వ తరగతి కాబట్టి అంత పట్టింపు ఉండదు, అయినా బాలి ఫస్టు రాంకు కోసం కష్టపడి చదివి పరీక్షలు రాసింది.

* * *

సెలవులు అయిపోయాయి. ఈ సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం రాత్రీ పగలూ కష్టపడి చదువుతున్నది. ఇందులో మంచి మార్కులు సంపాదిస్తేనే తర్వాత సైన్సులో సీటు దొరుకుతుంది. రాంకు లక్ష్యంగా బాలి పుస్తకాలలో మునిగిపోయింది.

టీచర్ల పర్మిషన్ తీసుకుని బాలిని ఇంటికి తీసుకుపోవటానికి వచ్చాడు తండ్రి. అమ్మకు వంట్లో బాగాలేదని, సీరియస్‌గా ఉందని చెప్పి పర్మిషన్ తీసుకున్నాడు. స్కూలుకు ఒక రోజు శెలవు పెట్టి తండ్రితో బయలుదేరింది బాలి.

ఇంటికొచ్చేసరికి ఛత్తీస్‌గడ్‌లో ఉండే దూరపు బంధువులెవరో ఇంటి ముందు మంచాల మీద కూర్చుని చాయ్ తాగుతున్నారు. పెరట్లోకి పోయి కాళ్లూ చేతులూ కడుక్కుంది.

తండ్రి దగ్గర కూర్చోబెట్టుకుని వాళ్లు వచ్చిన పని గురించి చెప్పాడు.

“చూడు బాలీ, నాకా కొడుకులు లేరు. కూతుళ్లయినా కొడుకులయినా మీరే. ఇంటికి పెద్దబిడ్డవు. బరువు బాధ్యతలు తెలిసినదానివి. మాకు కూడా వెనకా ముందూ ఎవరూ లేరు. చెల్లెళ్లు చిన్నాళ్లు. నీ కోసం ఇల్లరికం తెచ్చుకుందామని వెతగ్గా ఈ కుర్రాడు దొరికాడు. పిల్లాడు బుద్ధిమంతుడు. మామాటను కాదనవని అమ్మా, నేనూ వాళ్లకు మాటిచ్చాం. ఈ రోజు కల్లు తెచ్చారు. నువ్వు నీ చేతులతో వాళ్లకు కల్లు చిప్పలు అందిస్తే మన ఆచారం ప్రకారం ఒప్పందాలు కుదురుతాయి.”

“పెళ్లికి ఏం తొందరలేదంటున్నారు. పిల్ల చదువు కానిమ్మంటున్నారు.”

బాలికి కుడికన్ను అదురుతున్నది. మనసు ఏదో కీడును శంకిస్తున్నది. తన చుట్టూ ఏదో వల బిగుసుకుంటున్న భావన బాలిని చుట్టివేసింది.

“నీకు ఇష్టమే కదా.. ఎంత చదువుకున్నా ఒకింటికి పోవలసినదానివే. నువ్వు ఉద్యోగాలు చేస్తే గాని పొట్టగడవని పరిస్థితి లేదు.”

“నేను ఇప్పుడే పెళ్లి చేసుకోను, నేను చదువుకుంటాను. పెళ్లి చేసుకున్నా ఇతన్ని చేసుకోను. నాకు అతనంటే ఇష్టం లేదు.” ఖరాఖండిగా తెగేసి చెప్పింది బాలి.

“నిన్ను ఇవాళే పెళ్లి చేసి పంపుతామని ఎవరన్నారు. ఇంటికొచ్చిన

చుట్టాలకు ఇంత ఇప్పు సారా ఇవ్వటం మన మర్యాద. చిప్పలో పోసి అత్త మామలకు ఇవ్వు."

మొండికేసింది బాలి.

తండ్రి కూడా బలవంతం చేయలేదు.

మరుసటి రోజు స్కూలుకు తెచ్చి దిగబెట్టి వెళ్లిపోయాడు. తండ్రి గంభీరంగానే ఉన్నాడు.

తను గెలిచానని సంతోషపడింది బాలి.

పదవ తరగతి పరీక్షలు రాసింది.

స్కూలుకి సెలవులు ఇచ్చారు. బాలి ఇంటికి వచ్చింది. ఇంటికి రాంగనే బాలిపై పెళ్లి కోసం వత్తిడి మొదలయింది. ముందు తాము మెచ్చిన లామదేను బాలి కూడా మెచ్చాలి.

"నేను పెళ్లి చేసుకోను. నాకు ఇప్పుడే పెళ్లి చేసుకోవాలని లేదు."

తన అభిప్రాయాన్ని స్పష్టంగానే చెప్పింది.

అయినా ఆడపిల్ల అభిప్రాయాన్ని గౌరవించే సమాజం కాదుగా... ఆడపిల్ల చచ్చినట్లు ఒప్పుకుని తీరాల్సిందే.

తను లొంగిపోదలచుకోలేదు. తనకు ఎటునుండీ మద్దతు దొరికేటట్లు కనిపించటం లేదు. తనను ఆదుకునే ఆపద్బాంధవులు ఎవరైనా ఉన్నారా? అన్వేషించింది బాలి మనసు.

తన ప్రాణసఖి మిన్‌కొ గుర్తుకొచ్చింది. తన సలహా, సహాయం కావాలి.

'స్నేహితురాలింటికి పోయివస్తానని చెప్పి వెళ్లింది.

దళం వాళ్లను కలిస్తే ఏదైనా మార్గం దొరుకుతుందని సలహా ఇచ్చింది.

తమ ఊరికి దళం రాక చాలా రోజులయింది. సరితక్క ఒక్కతే చీరకట్టుకుని వచ్చి గ్రామంలో మహిళలతో మాట్లాడి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఎవరూ అటు రాలేదు.

వాకబు చేయగా పక్కూరికి దళం వచ్చినట్లుగా తెలిసి తన స్నేహితురాలితో కలిసి వెళ్లింది. కొద్దిగా ముందు మీటింగు చేసి డేరా ఖాళీ చేసి వెళ్లిపోయింది.

* * *

గడ్‌చిరోలి జిల్లా విప్లవోద్యమం ఆటుపోట్లను తట్టుకుంటూ విస్తరించింది. ఎంతో మంది ప్రజలు, విప్లవకారులు తమ నులివెచ్చని నెత్తుర్లను ధారపోసి పోరుమొలకలను నాటారు.

కూలీ రేట్ల పెంపుదల కోసం పోరాట కమిటీలలో సంఘటితం అయిన ప్రజలు, 'సంఘాలకే సర్వాధికారాలు". 'అడవిపై ఆదివాసులకే హక్కు' అని నినదించారు. అలా నినదించిన మహిళలూ, పురుషులూ దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్‌లోనూ, క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘంలోనూ సంఘటితం అయ్యారు.

దశలు దశలుగా నిర్బంధాలను అధిగమిస్తూ ఉద్యమంలో పురోగమిస్తూనే ఉన్నారు. దేశ ఆంతరంగిక భద్రతకు పెద్ద ముప్పంటూ ప్రకటించిన మన్మోహన్ సింగ్ యుపిఎ-2 ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్ హంట్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభమనే ఊబినుండి బయటపడటానికి మూడవ ప్రపంచదేశాల ముడిసరుకులపై అమెరికా డేగకన్ను వేసింది. ఆ ముడిసరుకులకు కేంద్రాలు ఆదివాసులు నివసించే ప్రాంతాలు కావటం, అక్కడ ఆ ప్రజలకు అండగా మావోయిస్టు పార్టీ నిలబడటాన్ని సహించలేని దోపిడి పాలక వర్గాలు "ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో ఆదివాసీ ప్రజలపై యుద్ధాన్ని ప్రకటించాయి.

హరిత వేట పేరుతో ఆదివాసులను వేట చేసి ఆ జాతిని హతమార్చి ఆ స్మశాన వాటికలపై మిత్తల్, జిందల్, ఎస్సార్, నికో, లయడ్స్, వేదాంతలకు హంసతూలికలు పరచటం దాని లక్ష్యం.

ప్రజలపైకి సి-60 పేరుతో ప్రత్యేక కమాండో బలగాలను ఉసిగొల్పుతున్నది. వారికి అండగా సిఆర్‌పిఎఫ్ బెటాలియన్లను మోహరించింది.

ప్రజలపై తలపెట్టిన ఒక బహుముఖ దాడి ఇది. నాలుగు రథచక్రాలపై ఈ బహుముఖ దాడిలో మానసిక యుద్ధం ఒకటి. దీని ప్రభావంతో ప్రజలలో భయాందోళనలు చోటుచేసుకున్నాయి.

అందుకే బాలికి దళం వచ్చిన కబురు తెలియటం లేదు. ఆ రోజు ఇంటింటికీ అన్నం జమ చేయటం చూసిన బాలి, తన స్నేహితురాలు పుంగాటి బేబితో కలిసి చీకటి మాటున అన్నం-నీళ్ల తీసుకుపోయేవాళ్ల వెనకెనుక పోయింది.

పొలం పాకలో నుండి మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. సన్నగా వర్షం తుంపర్లు పడుతున్నాయి. ఇద్దరూ తడిసిపోతున్నారు. అయినా మెదలకుండా కూర్చుని ఊరి వాళ్లు పోయేవరకూ వేచిచూస్తున్నారు. ఊరి వాళ్లు లేని సమయంలో తన గోడును దళంకు చెప్పుకుంటే ఏదైనా పరిష్కారం దొరుకుతుందేమోనన్న ఆశ మినుకు మినుకు మంటున్నది.

అన్నం తెచ్చిన గిన్నెలు, ఖాళీ నీళ్లబిందెలు తీసుకుని గ్రామస్థులు బయలుదేరారు. అంతా చిమ్మచీకటి. మనుషులు లేచినట్లు అర్థం అయింది. తీరా దగ్గరికి పోయి చూసేసరికి ఎవరూ లేరు. ఎటుపోయి ఉంటారని అడుగుజాడల కోసం వెతికారు. గడ్డిపోచలు నలిగిన దిశగా కొద్దిదూరం పోగలిగారు. తర్వాత దారి తప్పిపోయారు.

అయినా ఆశ చావలేదు. రాత్రి రెండయ్యేదాకా వెతికారు. ఫలితం దక్కలేదు. చుట్టూ కన్నుపొడుచుకున్నా కానరాని చిమ్మ చీకటి. వెతికి వెతికి అలసిపోయారు. ఆకలి వేసింది. తడిసిన బట్టల మూలంగా వెన్నులోంచి వణుకు మొదలయింది. అంతలో ఆకాశం మెరిసింది. ఆ వెలుగులో దూరంగా ఒక పాక కనిపించింది.

ప్రియసఖిలిద్దరూ పాకలోకి చేరారు. పగలు రాజేసిన నిప్పు చల్లారలేదు. నిప్పు రాజేశారు. తినటానికేమైనా దొరుకుతుందేమో అని చుట్టూచూశారు. ఇల్లు అయితే కదా దొరకటానికి. పాకచుట్టూ అల్లుకున్న బెబ్బర తీగలకు కాయలు కనిపించాయి. వాటిని తెంపుకుని నిప్పుమీద కాల్చుకుని తిన్నారు. నిప్పు పక్కనే చినిగి పోయిన గోనెసంచె పరుచుకుని ఇద్దరూ పడుకున్నారు. తెల్లారక ముందే లేచి మళ్లీ ఊరు ముఖం పట్టారు. ఉసూరోమన్నది బాలి ప్రాణం.

బాలి ఇంటికి పోకుండా తమ నానమ్మ దగ్గరకు పోయింది. పగలంతా అక్కడే కాలక్షేపం చేసింది. రాత్రి అన్నం తిని నిప్పు దగ్గర నానమ్మ పక్కలో పడుకున్నది.

ఈ విషయం ఇంటి వాళ్లకు తెలిసింది.

తండ్రి కారాలు మిరియాలు నూరాడు. కల్లు తాగాడు. టార్చి వేసుకుంటూ బాలి వాళ్లు పడుకున్న దగ్గరకు వచ్చాడు. టార్చితోనే ఎడాపెడా బాదడం మొదలెట్టాడు

"ఎక్కడికి పోయినవే.. ఎవడే నీకు అడ్డుపడేది. ఇంకోసారి అట్ల పోయినవంటే మక్కెలిరగ్గొడతా.. ఏమనుకుంటున్నవో.." ఆవేశంతో ఊగిపోతున్నాడు. తప్పతాగి ఉన్నాడేమో టార్చి చేతిలోంచి జారిపోయి దూరంగా పడ్డది. నిప్పు కట్టె తీసుకుని మీదకు వచ్చాడు.

"చంపుకు తింటావురా పండంటి బిడ్డని. దానికి ఇష్టం లేదంటే ఎందుకురా దాన్ని గోసబుచ్చుకుంటావు!"

వెనక్కి తగ్గాడు తండ్రి. తన చిన్నమ్మ వచ్చి బాలిని లేపి అవతలికి తీసుకుపోయి తమ గదిలో పడుకోబెట్టుకుంది. తెల్లారింది బాలికి అన్నం తినబుద్ధి కావటం లేదు. జీవితం మీద విరక్తి వచ్చింది. పగలంతా పడుకునే ఉన్నది. చిన్నమ్మ ఎంత బతిమాలినా పచ్చి ఎంగిలి కూడా ముట్టలేదు. చీకటిపడే వేళ ఊరి అంచున గుట్టబోరు మీదికెక్కింది. అక్కడో ఇప్పచెట్టు కింద కూర్చున్నది. ఎటు పోదామన్నా దారులు మూసుకుపోయినట్లయినాయి. బతికి ఏం లాభం, చావే మేలు అనే నిర్ణయానికొచ్చింది.

తన ఓణీని ఇప్పచెట్టు కొమ్మకు ఉరిగా వేసింది. ఉరిని మెడలో వేసుకుంటుండగా మళ్లీ పార్టీ గుర్తుకొచ్చింది. 'ఛీ! పిరికిదానిలా చావకూడదు. దళం వాళ్లు కలిస్తే వాళ్లతో పోయి పనిచేస్తా. ప్రజల కోసం ప్రాణం ఇవ్వటం ఎంత గొప్ప. పుట్టినంక చావు ఎటూ తప్పదు. మంచి పని కోసం ప్రాణాలిస్తే కలకాలం పేరుంటుంది."

ఈ ఆలోచన రాంగనే చచ్చిపోయిన ఆశకు ప్రాణం పోసినట్లయింది. తను పార్టీని ఎట్లయినా కలవాలి. అక్కడే తనకు దారి దొరుకుతుంది. తనకు విముక్తి లభిస్తుంది.

క్లాసులు వింటానికి పోయినప్పుడు జైనక్క తను అనుభవించిన కష్టాల గురించి చెప్పింది. ఇప్పుడు పార్టీలోకి వచ్చినంక తనెంత స్వేచ్ఛగా ఉంటున్నదీ చెప్పింది. పార్టీలో కూడా పెళ్లిళ్ల గురించి ఎవరూ బలవంత పెట్టడం గానీ, ఒప్పించటం కానీ ఉండదు. పెళ్లి చేసుకోవటం, చేసుకోకపోవటం వాళ్ల వ్యక్తిగత అభిరుచి మీదనే ఆధారపడి ఉంటుంది.

"కాదు, తను చావకూడదు. తను ఒక్కతీ చనిపోయినంత మాత్రాన తమ సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచారం మారదు కదా! ఎల్లాగైనా దళాన్ని కలవాలి."

"పోనీ తను కలవలేకున్నా ఉత్తరం రాస్తేనో... తనలో తనే తర్కించుకుంది. అ ఉత్తరం తప్పిపోయి తండ్రి చేతిలో పడితే అదో పెద్ద నరకం. ఉత్తరం రాయకూడదని నిర్ణయించుకుంది."

పొద్దుపోయినంక ఇంటికి వచ్చింది. అందరూ అన్నాలు తిని నిద్ర పోయారు. చీకటి గదిలో ఓ మూలకు జరిగి కానరాని గమ్యం గురించి ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకుంది.

ఎవరో జుట్టుపట్టి బరబర ఈడ్చుకుపోతున్నారు. మెలకువ వచ్చిన బాలికి ఎవరో కాదు తన తండ్రేనని అర్థం అయింది. ఈడ్చుకుపోయి గదిలో పడేశాడు. గదికి బయటినుండి గొళ్లెం పెట్టారు.

తమ అల్లునికి తలకెక్కేదాకా గోర్ల కల్లు తాగించారు. 'ఇదిగో నీ సొమ్ము... నీ ఇష్టం.. అల్లునికి పూర్తి అధికారాలు కట్టబెట్టారు.

మేనరికపు అడపదుచులపై, పెద్దల ఇష్టాలతో నిశ్చయమయిన పెళ్లిని వ్యతిరేకించిన ఆడపిల్లలను వివాహానికి ముందే గదులలో బంధించి బలవంతంగానైనా స్వంతం చేసుకునే అధికారం ఆదివాసం సమాజం పురుషునికి ఇచ్చింది. ఆ పిల్ల ఇంకా మొరాయిస్తే పిల్లగానికి అన్నదమ్ముల వరుసైన వాళ్లు కూడా అమెను అనుభవించే అధికారం ఇచ్చింది. నయానా భయానా అ పిల్లను పెళ్లికి ఒప్పించటానికి ఇలాంటి హింస ఒక హక్కుగానే అధికారికంగా అమలవుతోంది. గడ్చిరోలిలో విప్లవ పార్టీ నాయకత్వంలో సంఘాలు బలపడిన క్రమంలో ఈ హక్కులు రద్దయినాయి.

ఆ వ్యవస్థ తాలూకు కూకటివేళ్లు మిగిలే ఉన్నాయి.' ఆపరేషన్ గ్రీన్‌హంట్ వాటికి నీళ్లు పోసింది.

గదిలో తనకిష్టం లేని వ్యక్తితో బాలి. గది చుట్టూ బడితెలు పట్టుకుని పహరా కాస్తున్నారు.

"కాబోయే పెళ్లి కొడుకు వచ్చి బాలి భుజం మీద చెయ్యి వేశాడో లేదో... శక్తినంతా కూడదీసుకుని విసిరి కొట్టింది. ఊహించని ఈ ప్రతిఘటనకు తూలిపడ్డాడు.

చీకట్లోనే తడుములాడగా గోడమూలకు పెట్టిన గడ్డపార చేతికి దొరికింది. 'నా వంటి మీద చేయి వేసినవంటే చూడు బెదిరించింది."

ఊహించని ప్రతిఘటనకు బిత్తరపోయాడు. ఏమనుకున్నాడో గానీ పెళ్లికొడుకు అడుగు ముందుకెయ్యలేదు. ఇదే అదననుకుని వెనక దర్వాజ తీసుకుని బయటకు అడుగుపెట్టిన బాలిని ఇంటి చుట్టూ కావలి కాసిన చిన్నాయనలు, పెదనాయనలు అందరూ ఒక్కసారిగా చుట్టుముట్టారు. వంగదీసి పిడిగుద్దులు గుద్దుతున్నాడు తండ్రి."

చీకటి ఆసరాతో పెరడి దడి దూకి మొక్కజొన్న పెరట్లో దాక్కున్నది. తెల్లారి మసక మసక వెలుతురులో బాపమ్మ దగ్గరకు పోయింది.

బాలి తలమీద చెయ్యివేసి బాపమ్మ హితబోధ చేసింది. 'నాయనా చెప్పిన మాట విను బిడ్డా! సుఖంగా బతకవచ్చు. లేని కష్టాలు కొనితెచ్చుకుంటున్నవే. బిడ్డగా ఉన్నప్పుడు తండ్రి సాటున పెరిగినవ్, వయసొచ్చింది భర్త నీడ గావాలె బిడ్డా! నువ్వు పెళ్లి కాదన్నా నిన్ను ఊరికే ఉండనియ్యరే... వదిలిపెట్టరే...అంటూ మౌనంగా ఉండి పోయింది బాపమ్మ."

బాపమ్మకు తన యౌవ్వనంలో తనమనసైన వాడిని మనువాడలేక తను పడిన తపన సుడులు తిరిగింది."

నీడలు లేకుండా అడబతుకు లేదా! కాళ్లూ చేతులూ అమెకూ ఉన్నాయిగా. మగవాళ్లతో సమానంగా అమె కూడా పనిచేస్తుంది కదా! అమెకు శక్తి లేదా! ఆమె ఆదిమాత, శక్తి స్వరూపిణి అని స్కూలు పుస్తకాల్లో చదివింది ఉత్తిదేనా? లేదు తనకు నీడ అవసరం లేదు. తన కాళ్ల మీద తనే నిలబడాలి. బాలి ఆలోచిస్తూ చాలా సేపు అలాగే కూర్చునిపోయింది.

బాపమ్మ సలహాతో ఏటపల్లిలో ఉన్న పెదనాయన దగ్గరకు పోయింది. తన గోడంతా పెదనాయనకు చెప్పుకుంది.

"మీ నాయన మూర్ఖుడే బాలీ! కడుపున పుట్టిన బిడ్డను గొడ్డును బాదినట్టు బాదుతడా " అనునయంగా అన్నాడు పెదనాయన.

ఊపిరి పీల్చుకుంది బాలి. వారం రోజులున్నది. పెద్దమ్మకు చేదోడు వాదోడుగా ఇంటి పనులన్నీ చేసింది. బాలి పనితనం చూసి 'తీరున్న పిల్ల" అని పెద్దవ్వ ముచ్చటపడింది.

'పెదనాయన మాటల్లోని మర్మమూ, తెరవెనుక మంతనాలనూ అర్థం చేసుకునే జీవితానుభవం బాలికి లేదు.

ఇట్లా బలవంతపు పెళ్లిళ్లను వ్యతిరేకించే యువతులను 'మైకం చేసే" (హిప్నటైజ్ చేయటం) మహిళలు ఉంటారు. అలాంటి మహిళలను మూసే ఆసు అంటారు. బాలిని నెమ్మదిగా ఆమె దగ్గర దిగబెట్టారు. ఆమె ఆడపిల్లలను మాటలతో ట్రాన్స్‌లోకి తీసుకెళ్లి పెళ్లికి ఒప్పుకునేట్లు చేస్తుందని నమ్ముతారు...

బాలి గోడు విన్న పక్కింటి అడవాళ్లు, "చూడు బాలీ! అన్నం తినేటప్పుడు మంచిగా చూసి తినాలి. చాయ్‌లో కూడా మందు పెడతది."

హెచ్చరికగా చెప్పారు సానుభూతితో...

బాలి మీద మూసే ప్రయోగం కూడా విఫలం అయింది.

* * *

ఒక రోజు పొద్దున్నే ఊరి గోటుల్ దగ్గర అందరూ జమ కావాలని కొత్వాల్ చాటింపు వేశాడు. డోలు కూడా కొట్టారు.

బాలి వాళ్ల పెదనాయన ఇంటి ముందే గోటుల్ ఉన్నది. ఒకరోజు పొద్దున్నే జమ కావాలని డోలు కొట్టారు. ఊరందరూ జమ అయినారు.

గోటుల్ సమావేశాలకు మహిళలు పోరు.

గోటుల్‌లో ఒక మహిళ తల వంచుకుని కూర్చున్నది. ఆమె చుట్టుపక్కల ఎవరూ లేరు. ఆమెపై ఓడె(మంత్రగత్తె) ఆరోపణ వచ్చింది. వాళ్ల పక్కింట్లో నైతాం కుటుంబం ఉంటుంది, వాళ్లింట్లో ఇటీవలి కాలంలో జబ్బులతో ఇద్దరు పిల్లలు చనిపోయారు. పాము కరిచి గొడ్డు చనిపోయింది. వేడి నీళ్ల తొలికి పిల్లకి కాలు కాలింది. ఇవన్నీ అపశకునాలే..

నైతం అములు అంటున్నాడు, "ఖచ్చితంగా ఇది చేతబడే. ఎవరో కాదు, నా బిడ్డలను మింగింది ఇదే.. ఓడె కాకుంటే మాకు ఇన్ని కష్టాలు ఎందుకొస్తయి. పక్కూరు పూజారి దీని పేరే చూపెట్టాడు. నా కుటుంబాన్ని పొట్టన బెట్టుకున్నది. నేను దీన్ని వదలను. చంపుతాను."

ఆవేశంతో ఊగిపోతున్నాడు.

చుట్టూ నిశ్శబ్దం అలుముకుంది. ఓడె అంటేనే ఆదివాసీ సమాజంలో ఒక టెర్రర్. దాన్ని కాదని ఖండించే ధైర్యం ఎవరికీ ఉండదు. అందరి మనసుల్లోనూ ఏదో మూల నిజం కావచ్చుననే శంక పీడిస్తూనే ఉంటుంది. ఇటువంటి పంచాయతులకు తిరుగులేని జనామోదం ఉంటుంది.

ఎవరూ మాట్లాడకపోవటం చూసి అములుకు ధైర్యం వచ్చింది.

ఉన్నపళంగా లేచి తన కాలు చెప్పు తీసి ఆ మహిళను ఎడా పెడా బాదుతున్నాడు. జుట్టుపట్టుకుని ఈడుస్తూ కాళ్లతో తన్నుతున్నాడు.

"చెప్పవే చెప్పు... చెప్పకుంటే నిన్ను ఇక్కడే చంపి పాతిపెడతాను."

ఆమె భర్త కొడుకులు ఓ మూలకు నిస్సహాయంగా తలలు వంచుకుని కూర్చున్నారు. ఈ ఆరోపణ వచ్చిన కుటుంబాన్ని గ్రామంలో వెలివేసినట్లు చూస్తారు.

ఎదుటివారికి వచ్చినప్పుడు ఈ బాధ లోతు అర్థం కాదు. తమ వరకూ వచ్చినంక గానీ ఆ గాయం సలుపు అర్థం కాదు. ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు తమ సహచరులను వదులుకోలేని భర్తలు ఊరు వదిలిపోయిన సందర్భాలున్నాయి. ఊరికి దూరంగా పొలంలో అంటరానివాళ్లుగా బతికిన కుటుంబాలున్నాయి. భర్తల సహకారం ఉంటేనే ఇది సాధ్యపడుతుంది.

గోటుల్ వద్ద ఇతర మహిళలు ఎవరూ లేరు. సాధారణంగా ఓడె ఆరోపణ వచ్చినప్పుడే మహిళలను గోటుల్ వద్దకు పిలుస్తారు. ఆదివాసీ సమాజంలో చెప్పుదెబ్బను చాలా అవమానంగా పరిగణిస్తారు. గోటుల్ చెప్పుదెబ్బ తిన్న మహిళలు పిట్టమందును ఆశ్రయించిన సందర్భాలు ఎన్నో.

"నువ్వు ఎట్లయినా దాన్ని రుజువు చెయ్యాలె. లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి." హెచ్చరికతో గోటుల్ సమావేశం ముగిసింది.

మరుసటి రోజు ఉదయాన్నే బాలి నిద్రలేచి బ్రష్ చేసుకుంటూ వాకిట్లోకి వచ్చింది. బజార్లో గుంపులు గుంపులుగా జమ అయి మాట్లాడుకుంటున్నారు.

"తప్పు చేసింది కాబట్టే తన ప్రాణానికి తెగించింది. తనకేమీ తెలియకుంటే ఎందుకు చచ్చిపోతుంది. తను నిరూపించుకోవచ్చుగా.."

"ఏమయింది అత్తా.. ఊర్లో ఎవరయినా చనిపోయినారా?"

"నిన్న గోటుల్‌లో పంచాయితీ చేసినారు కదా? ఆమెనే పిట్టమందు తిన్నదట."

బాలికి కళ్ల ముందు చీకటి అలుముకున్నట్లయింది. కడుపులో తెమిలింది. అది బాధో... ఆవేదనో... కానీ ఆ రోజు బాలికి అన్నం సయించలేదు. ఆడవాళ్ల బతుకులింతేనా... ఆమెకు నిజంగా మంత్రాలు వస్తాయా... తనకు స్కూల్లో మంత్రాలు లేవనీ అదొక మూఢ నమ్మకమనీ చెప్పగా విన్నది. తన సమాజంలో గట్టి నమ్మకం ఉన్నది. ఈ మూఢ నమ్మకం ఎంతమంది మహిళల నిండు ప్రాణాలను బలితీసుకుంటుందో..

భయంతో... అభద్రతతో బాలి ఒళ్లు జలదరించింది.

ఆ రోజంతా బాలి కాలుగాలిన పిల్లిలా దేని మీదా మనసు పట్టకుండా తిరుగాడింది.

* * *

బాలి గురించిన సమాచారం తండ్రికి ఎప్పటికప్పుడు అందుతూనే ఉన్నది.

బాలి తండ్రి పెళ్లి పత్రికలు అచ్చు వేయించాడు. చుట్టపక్కాలందరికీ పత్రికలు వెళ్లిపోయినయి. 'బాలీ నీ పెళ్లటనే!? వదినె చెప్పితేగాని బాలికి తెలియదు.

ఊళ్లో పెళ్లి సన్నాహాలన్నీ జరిగిపోతున్నాయి. కట్నాలు తేవటానికి ఊరందరికీ అన్నం పెట్టారు. ఇలా అన్నం పెట్టడాన్ని 'ఆరో తెమాతొని అంటారు.

బాలిని తీసుకపోవటానికి మోటారుసైకిలు తీసుకుని వచ్చాడు చిన్నాయన. రానని మొండికేసింది.

'పెళ్లని ఊరూ వాడా ప్రచారం అయింది. ఇప్పుడు నువ్వు రానంటే ఎవరికే ఇజ్జతు... రాకుంటే బండికి కట్టి ఈడ్చుకుపోతాం' బెదిరించారు.

తలొంచింది బాలి. మౌనంగా మోటారు సైకిలు ఎక్కింది. అక్కడ కూడా వెనుక ఒకరు కూర్చున్నారు. నడుమ బాలి తప్పించుకునే వీలు లేకుండా...

అమ్మలక్కలు తన వంటికి పసుపు పెట్టారు. స్నానం చేయించారు. తలవంచింది బాలి. కానీ ఓటమిని ఆమోదించలేదు. పెళ్లి తంతు ముగిసింది.

ఇంట్లో పన్లన్నీ చక్కబెట్టుకుంటుంది. అందిరితోనూ కలిసి మెలిసి ఉంటుంది. స్నేహితురాళ్లతో కలిసిమెలిసి ఉంటుంది. కానీ మంగురును మాత్రం కన్నెత్తిచూడబుద్ధికాదు. అతన్నో మనిషిగా, తన జీవిత సహచరునిగా ఆమె మనసు ఆమోదించటం లేదు.

పోనీ వేరే ఎవరినైనా ప్రేమించిందా అంటే అదీ లేదు. పెళ్లి అనే ఆలోచనే లేని సమయంలో ఈ చేదు అనుభవం దాన్ని వెగటుగా మార్చింది. చదువుకున్నాగాని బాలి కాయకష్టానికి దూరం కాలేదు. పొలం పనులను నామోషీగా భావించలేదు. నాగలి పట్టి దున్నుతుంది. కొడవలి పట్టి కోస్తుంది. పార పట్టి గట్లు పోస్తుంది. మగ పిల్లాడితో సమానంగా పనిచేస్తుంది.

విత్తనాలు చల్లిన తర్వాత వరి ఈనె సమయంలో రైతులు తమ పొలాలలో వేసుకున్న పాకల దగ్గరే ఉంటారు. రాత్రి పూట ముసలివాళ్లు పొలానికి కావలి ఉంటారు. పగలంతా ఇంటిల్లిపాదీ పొలంలో ఏదో ఒక పని చేసుకుంటూ అక్కడే గడిపి సాయంత్రం వేళకు ఊర్లోకి వస్తారు.

వరికోతలు అయిపోయి పంట నూర్పిళ్లవరకూ అక్కడే ఉంటారు.

ఒకరోజు బాలి, తన చెల్లెలితో కలిసి పొలంలో వేసిన పాక దగ్గర పడుకున్నది. అప్పటికి రెండురోజులయింది ఇంటికి పోలేదు.

తండ్రి కల్లుతాగి వచ్చాడు నడిరాత్రి. అక్కచెల్లెళ్లిద్దరూ పగలంతా పొలం పనిచేసి ఆదమరచి నిద్ర పోతున్నారు.

'బాలీ... బాలీ! గాండ్రించాడు తండ్రి.

లేపి కూర్చోబెట్టాడు. పిట్టమందు బాలి ముందు పెట్టాడు. ఇది తిని చావనైనా చావు. లేదంటే మొగనితో కాపురమన్నా చేయి. రెంటిండిలో ఏదో తేల్చుకో.

చచ్చిపోయేంత పిరికితనం బాలికి లేదు కాబట్టే ఈ పోరాటం. బాలి మౌనంగా తలవంచుకు కూర్చుంది.

కోపంతో ఊగిపోతున్నాడు. లేచి చేతికందిన కట్టెతో విరగబాదుతున్నాడు. కట్టెలు విరుగుతున్నాయ్. దెబ్బలు విన్న పొరుగు పొలాల వాళ్ళు ఉరికివచ్చారు. బాలి తండ్రి వాళ్ల తల్లిని కొడుతున్నాడనుకుని ఆ దెబ్బలకి చచ్చిపోతదని ఉరికొచ్చారు.

తీరా వచ్చి చూస్తే కన్నబిడ్డనే గొడ్డులా బాదుతున్నాడు.

"ఎంతయినా కన్నబిడ్డ కాదా, ఎందుకయ్యా దాన్నట్ల కొడతవు. తీరైన పిల్ల, ఎంత బుద్ధిమంతురాలు. నీకు చేతులెట్లొచ్చినయయ్యా."

"నా బిడ్డ నా ఇష్టం. దీన్ని కన్నది నేను, పెంచింది నేను. ఇది నా మాట ఇనకుండా నా ఇజ్జత్ తీస్తాంది. దీన్ని చంపినా పాపం తీరదు."

ఎగపోస్తున్నాడు.

తెల్లని సల్వార్ సూట్ అంతా రక్తం మరకలతో ఎర్రగా మారింది.

చావుకే తెగించింది బాలి. తన ఒంటిలో ఊపిరి ఉండగా రాజీ పడననుకుంది.

* * *

తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తూనే ఉన్నది.

తన క్లాస్‌మేట్స్ అహిరి, అలపల్లిలలో చదువుకుంటున్నారు. వాళ్ల దగ్గరికి పోతే ఏదైనా సాయం దొరుకుతుందేమో అని ఆలోచించింది.

అహిరికి ప్రయాణమయింది. తన స్నేహితురాళ్ల హాస్టల్‌కు పోయింది. వాళ్లతో తన గోడు వెళ్లబోసుకుంది.

వాళ్ల సాయంతో బిల్డింగు పనుల కూలీకి పోయింది. తమ పొరుగు గ్రామం బెజ్జూరుకు చెందిన యువతులు కూడా అక్కడ కూలి పనులకు రావటంతో వారం రోజులు చింతలేకుండా గడిచిపోయింది. పేమెంట్లు అయిపోయినంక ఆ యువతులు తమ తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

బాలి కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి.

"మా హెడ్‌మాస్టరమ్మ చాలా మంచామెనే... మేం చెప్తుతం. నువ్వు టీసి తెచ్చుకుని మళ్లీ జాయిన్ అయితే మాలాగా చదువుకోవచ్చు."

సలహా ఇచ్చారు.

టీసి అంటే మళ్లీ ఎమెల్‌కస్సకు పోవాలి. అక్కడికి పోతే తమ ఊరి వాళ్లు ఎవరో ఒకరు చూస్తారు. తన తండ్రికి చెప్తుతారు. మళ్లీ ఆ నరక కూపంలోకే పోవాల్సివస్తది. బాలి మనసు నిరాకరించింది.

హాస్టల్‌లో కూడా ఎక్కువ రోజులు ఉండటానికి కుదరదు. గమ్యం లేకుండానే హాస్టల్‌నుండి బయటికి అడుగుపెట్టింది. అహిరి నుండి అలపల్లికి వచ్చింది. బస్టాండులో కూర్చుని ఒక్కత్తే చాలాసేపు ఆలోచించింది.

వటపల్లిలో ఉన్న స్నేహితురాలు బేబి నరోటి గుర్తుకొచ్చింది. తనేమైనా సహాయం చేస్తుండవచ్చని ఏటపల్లికి పోయే బస్సు ఎక్కింది.

ఎప్పుడో ఒకే ఒక్కసారి చూసిందేమో వెతికి వెతికి అలసిపోయి చివరికి ప్రాణం నిస్త్రాణమైపోయిన సమయంలో ఎట్లనో దొరికింది.

"బేబి ఉందా అంటీ? మేమిద్దరం స్నేహితులం. తనను చూడటానికి వచ్చాను."

"బేబి లేదమ్మా పనిమీద వెళ్లింది. వారం రోజులకు గానీ తిరిగిరానని చెప్పి వెళ్లింది."

బాలి గుండె గతుక్కుమన్నది. అయినా ధైర్యం కోల్పోదలుచుకోలేదు. ఆ పూటకు అన్నాలు తిన్న తర్వాత బేబి వాళ్లమ్మ నెమ్మదిగా కదిలించింది బాలిని.

తన కథనంతా ఏకరువు పెట్టింది బాలి.

"అయితే మా ఇంట్లో ఉండువులేమ్మా..' సాంత్వన పలికింది బేబి తల్లి. అలా మరో వారం గడిచిపోయింది.

ఒకరోజు మధ్యాహ్నం తలస్నానం చేసి జుట్టు అరబెట్టుకుంటున్నది బాలి.

బేబి వాళ్లమ్మ నెమ్మదిగా మొదలుపెట్టింది, "అతనంటే ఇష్టం లేదంటున్నావు. మా అబ్బాయి రాకేష్ ఉన్నాడు. నీకు ఇష్టమైతే మంచి ఈడూజోడూ. మీ వాళ్లకు కబురు పంపుతాం."

ఏం చెప్పాలో, ఎటు పోవాలో తోచని బాలి అయోమయంగా గుడ్లెళ్లబెట్టి చూస్తుండిపోయింది. ఆమె మౌనం అర్థాంగీకారమయింది.

టేకలా దుర్వా పిల్ల తమ కొడుక్కు ఇల్లుచొచ్చిందని ఊరి పెద్దలకు కబురిచ్చారు. ఊరంతా కూర్చున్నారు. ఇలా కూర్చుండే ఆచారాన్ని "కుముట్ ఉదనా" అంటారు.

బాలి తండ్రికి కబురుపోయింది. ఈ విషయం బాలికి తెలియదు.

ఇంటి ముందు టాటా సుమో ఆగింది.

తన చిన్నాయనలు, పెదనాయనలు వచ్చి బాలి రెక్కపట్టుకుని గుంజుకుంటూ పోయి కారులో కుదేశారు. ఇంటికి తీసుకువచ్చినంక ఊరంతా సమావేశమయ్యారు. స్త్రీలు, పురుషులు అందరూ ఉన్నారు.

బాలి తండ్రి ఆమె రెండు చేతులనూ వెనక్కి విరిచి కట్టాడు. ఇంట్లోకి పోయి కత్తెర పట్టుకొచ్చాడు. తలంతా బొరికెలు బొరికెలుగా కత్తిరించాడు. అటు క్రాపు కాదు. ఇటు గుండు కాదు. వికారమైన తలకట్టు.

తను కర్దె కాబోతున్నదన్నమాట. బాలి ఒళ్లు గగుర్పొడిచింది.

తన అమ్మమ్మ చెప్పగా విన్నది. కెర్దాల అగచాట్లు.

ఆ అవమానాన్ని భరించలేక ఎండ్రిన్‌ను ఆశ్రయించిన యువతుల విషాద గాథలు గుర్తుకొచ్చాయి.

బాలి కథను మరో కెర్దె విషాద గాథ కానియ్యననుకున్నది.

* * *

తను ఏటపల్లికి పారిపోయినప్పుడు 'మా బిడ్డ తప్పిపోయిందని' భామ్రాగడ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు రాయించాడు బాలి తండ్రి.

అందుకోసం ఇప్పుడు బాలిని తీసుకుపోయి థానేదార్ ముందు హాజరుపరచవలసి ఉంటుంది. ముందుగానే బాలికి హెచ్చరికలు జారీ అయినాయి.

"మతి స్థిమితం తప్పి ఎటో వెళ్లిపోయాననీ, కొంచెం తెలివిపడగానే ఇంటికి తిరిగి వచ్చాననీ, తననెవరూ ఏమీ అనలేదనీ" బాలి వాంగ్మూలం తీసుకుని ఇంటికి తీసుకుపొమ్మని పంపివేశాడు.

అక్కడి నుండి తిన్నగా ఇంద్రావతి నది దాటించి కర్మవాడలో పిల్లగాని ఇంటివద్ద దిగబెట్టి వచ్చారు. '"మీ కోడలు, మీరే చూసుకోండి' తమ బరువు దులుపుకుని బయటపడ్డారు పెద్దలు.

రెండు నెలలు రెండు యుగాలుగా గడిపింది. ఏదో ఒక వంక పెట్టి బాలి అతన్ని తప్పించుకుని తిరుగుతున్నది. మనసులేని వానితో వైవాహిక జీవితం పంచుకోవటానికి బాలి వ్యక్తిత్వం రాజీపడనంటున్నది. ఇద్దరి మధ్యా ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తున్నది. ప్రతిరోజూ రాత్రి వేళకు ఏదో ఒక వంక పెట్టి గదిలోకి పోకుండా తప్పించుకుంటున్నది.

ఆమె ఎదురు చూస్తున్నది. తన బంధనాలను తెంచుకునే మార్గం కోసం. అమె అన్వేషిస్తున్నది స్వేచ్ఛ కోసం. తన వ్యక్తిత్వాన్ని గౌరవించే మనుషుల కోసం..

ఒక రోజు ఇంటి పెరట్లో ఎంగిలిపళ్లాలు కడుగుతున్నది. అదే సమయంలో ఊరిలోకి వచ్చారు ఇద్దరక్కలు. వాళ్లల్లో ఒకామె పేరు మంగి.

అమే అ దళానికి కమాండరని తర్వాత తెలిసింది. వాళ్లను చూడగానే బాలికి ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఉరికిపోయి చేయి కలిపింది.

ఒళ్లంతా అప్యాయత నింపుకుని పలకరించింది. ఒక్కోరోజు ఒక్కో యుగంలా కాలం వెళ్లమారుస్తున్న బాలికి అందలం దొరికినట్లయింది.

తన అత్త మామలు ఏమనుకుంటారో, వదినెలు, అడపడచులు ఏమనుకుంటారోననే బెరుకుపోయింది.

""అక్కా నీతో కొంచెం మాట్లాడాలి. వింటావా?"

"ఏంటి చెప్పమ్మా?" అంది మంగి ఇంటి అరుగు మీద కూర్చుంటూ... ఇద్దరూ కూర్చున్నారు.

"రెండు గంటలు కన్నార్చకుండా బాలి వ్యథను విన్నది మంగి.

కాసేపు ఆలోచించిన మంగి స్థానిక క్రాంతికారీ జనతన సర్కార్ అధ్యక్షున్ని సంప్రదించింది.

పంచాయతీ క్రాంతికారీ జనతన సర్కార్ గ్రామ సభ సమావేశం కావాలని కబుర్లుపోయాయి. మహిళా సంఘం వాళ్లకు కూడా ప్రత్యేకంగా కబురు ఇచ్చారు.

మరుసటి రోజు మధ్యాహ్నానికి అందరూ సమావేశమయ్యారు. క్రాంతికారీ జనతన సర్కార్ అధ్యక్షుడు చిన్న ఉపోద్ఘాతంతో సమావేశాన్ని ప్రారంభించాడు.

"మనం ఇవాళ ఒక భీకరమైన నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మన ఆదివాసులకు వ్యతిరేకంగా అన్యాయమైన అప్రకటిత యుద్ధాన్ని ప్రకటించాయి. వారితో మనం రాజీలేని పోరాటం చేస్తూ ఆదివాసుల ఉనికినీ, అస్మితను కాపాడుకోవాలి. మనలో మనకు ఎన్ని గొడవలున్నా మనందరం సమైక్యంగా నిలబడాలి. ఇది పాలక వర్గాలకూ పీడితులైన పాలితులకూ నడుమ వైరుధ్యం. ఇది భీకరమైన వర్గపోరు ద్వారానే పరిష్కారమవుతుంది. దీనితో మనందరికీ ఏకాభిప్రాయమే. మన అదివాసీ సమాజంలో మన వర్గపోరు క్రమంలో గ్రామాల్లో పాత అధికారానికీ కొత్త ఆలోచనలకూ నడుమ వైరుధ్యం ఉన్నది. అది సియాన్‌లకూ సంఘం వాళ్లకూ నడుమ వైరుధ్యంగా మనకు కనిపిస్తున్నది. నిజానికి అది కొత్తకూ పాతకూ నడుమ ఘర్షణ.. ఈ ఘర్షణే లేకుంటే సమాజం ముందుకు పోదు."

"మన సమాజం మహిళలపై కొన్ని నిషేధాలను విధించింది. "విత్తనాలు చల్లకూడదు", "ఆడపిల్ల ధాన్యం గదిలోకి పోకూడదు", నెలసరి అయిన మహిళలు 'కుర్మలోను'లోనే ఉండాలి, పూజారులకు వడ్డెలకు, గునియాలకు కనిపించకూడదు", 'మేనరికం పెళ్లిని కాదనకూడదు",

'తనకిష్టంలేదనే పేరుతో పెద్దలకు అమోదమైన పెళ్లిని వ్యతిరేకించకూడదు, అలా వ్యతిరేకించిన మహిళలను కర్రెలు చేయటం", 'మంత్రగత్తెల పేరు మీద వెలి, మరణశిక్ష 'మనసులేని వాన్ని ఇల్లరికం పెట్టడం" ఈ ఆచారాలన్నీ మహిళలను హింసిస్తున్నాయి. పార్టీ రాకముందు నాతో సహా మనందరం ఈ ఆచారాలనూ, కట్టడులనూ అమలుపరిచాం. ఎంతో మంది మన అక్కచెల్లెళ్లనూ, అమ్మలనూ కోల్పోయాం. వాళ్లకు దిక్కుతోచక, చేయి అందించేవాళ్లు లేక పిట్టమందును ఆశ్రయించారు."

""బాలి సమస్యనే చూడండి. ఆమె తండ్రికి ముగ్గురాడపిల్లలు. తమకు కొడుకులు లేరు కాబట్టి బిడ్డకు లామ(ఇల్లటం) పెట్టుకుంటే ముసలితనంలో తమను సాదుకుంటారని ఆశించడం తప్పుకాదు. అయితే బిడ్డ ఇష్టాన్ని కూడా చూడాలి. నేను పట్టిందే పట్టు అని తన కన్నబిడ్డను ఎంతగా హింసించాడు. ఆమె సమస్యను మన ముందుకుతెచ్చింది. తనకు ససేమిరా ఇష్టం లేదంటున్నది."

బాలికి మాట్లాడడానికి అవకాశం ఇచ్చింది న్యాయ కమిటీ.

బాలి తన వ్యథను సభ ముందు పరిచింది. సభ వాతావరణం బరువెక్కింది.

మహిళా సంఘం అధ్యక్షురాలు ముందుకు వచ్చి బాలికి అండగా నిలబడతామని హామీ ఇచ్చింది. తన భర్త నుండి విడాకులు తీసుకోవాలని కోరుకుంటున్నది. దానికి మా సంఘం ఆమోదం తెలుపుతున్నది.

"బాలి తనకిష్టం లేని కాపురం చేయవలసిన అవసరం లేదనీ, తనకిష్టం ఉన్న యువకున్ని పెళ్లిచేసుకోవచ్చనీ, ఈ ఇంటి నుండి వెళ్లిపోవచ్చనీ, ఇష్టం లేని పెళ్లిళ్లు చేయవద్దనీ" పంచ్ తీర్పునిచ్చింది.

బాలి బంధనాలు తెగిపోయినాయి. మైమరిచి నాట్యం చేయాలని ఉంది. తన కట్టుబట్టలు చేతి సంచిలో సర్దుకున్నది. ఇంట్లోంచి బైటికి అడుగుబెట్టబోతుండగా...

"బాలీ బాలీ బేకె దాంతిన్" (ఎటు పోతున్నావ్ బాలీ!)

వెనుతిరిగి చూసింది బాలి. పంజరంలో రామచిలుక మౌనంగా చూస్తున్నది. బాలి దాన్ని ముద్దుగా మిట్టూ అని పిలుచుకుంటుంది.

మిట్టూను తనచేతుల్లో పొదుపుకుని గుండెలకు హత్తుకున్నది.

"నేను పోతున్నా మిట్టూ... మన పంజరాలను పగులగొట్టడానికి మిట్టూ.. అకాశంలో ఎగిరే స్వేచ్ఛ కోసం మిట్టూ..."

ఇప్పుడు అమె అకాశంలో విహంగం.

తన అందాలతో ప్రకృతిని కవ్వించే బుల్లి పిట్ట.

అందరికీ లాల్ సలాం చెప్పి గ్రామస్థుల నుండి వీడ్కోలు తీసుకుని దళం కదిలింది మరో గమ్యానికి...

అక్కా! నేనూ మీతోనే..అశ్చర్యంగా చూస్తున్న మంగితో అన్నది బాలి.

ఆమె జీవితం చిగురించింది కొత్త పూరేకులతో.

సాహిత్య విమర్శ

సాహిత్య చరిత్రలో ఇరవై ఏళ్ల 'నల్లపొద్దు'



- నాగేశ్వరాచారి

"చరిత్రకారుడు పరిశీలించేది నిర్జీవమైన గతాన్ని కాదు. సమకాలంలో ఏదో విధంగా సజీవ సంబంధమున్న గతాన్ని. గత కాలపు సంఘటనల వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోలేకపోతే ఆ సంఘటనలు చరిత్రకారునికి మృతప్రాయమే. కాబట్టి భావాల చరిత్రే చరిత్ర" అని కొలింగ్ ఉడ్ అన్నారని ఇ.హెచ్.కార్ అంటారు.

గోగు శ్యామల సంకలనం చేసిన 'నల్లపొద్దు' దళిత స్త్రీల సాహిత్యం (1921-2002) అనే పుస్తకం కాలింగ్‌వుడ్ చరిత్ర గురించి చెప్పిన అభిప్రాయాలకు దగ్గరగా ఉంది. ఇప్పుడు ఆ పుస్తకానికి దగ్గర దగ్గర ఇరవై ఏళ్లు. మన కళ్ల ముందే ఈ ఇరవై ఏళ్ల తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణమైంది. ఈ పుస్తకంలో తొంభై ఏళ్ల దళిత మహిళల సాహిత్యం ఉన్నది. సరిగ్గా ఇప్పటికి నూరేళ్లు. ఆ రకంగా ఇప్పుడు ఈ పుస్తకాన్ని మరోసారి పరిగణనలోకి తీసుకోవాలి. దేనికంటే ఈ పుస్తకం ఈ ఇరవై ఏళ్లుగా తెలుగు సాహిత్య చరిత్ర గురించిన అంచనాలను ప్రభావితం చేస్తునే ఉన్నది. ఆలాంటి ప్రభావంలోనే ఈ పదేళ్లలో కూడా దళిత మహిళల అద్భుత సాహిత్యం వెలువడింది. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణ క్రమాన్ని పరిశీలించేందుకు అవసరమైన ఒక ముఖ్యమైన చూపును ఈ పందేళ్ల దళిత మహిళల సాహిత్యం అందిస్తుంది.

ఈ పుస్తకంలో గోగు శ్యామల అన్నట్లుగా 'చరిత్రలో, సమాజంలో అధికార సాహిత్యం ఒక ప్రవాహంగా కొనసాగితే దాన్ని ధిక్కరించే సాహిత్యం మరో ప్రవాహంగా కొనసాగుతూ వచ్చింది'ని అన్నారు. దళిత స్త్రీల సాహిత్యానికి ఉన్న చరిత్రను అర్థం చేసుకొనే క్రమంలో ఆమె ఈ మాట అన్నారు. చరిత్ర, అందులోనూ భావాలు కేంద్రంగా ఉండే సాహిత్య చరిత్రను అంత సరళంగా చూడటం కష్టమే. అయినా ఆమె పరిశీలన గమనించదగింది.

గతంలో జరిగిన సంఘటనల పర్యవసానమే నేటి చరిత్ర అని ఆమె చెప్పదలచుకున్నారు. తెలుగు సాహిత్య చరిత్రలో 'హిందూ బ్రాహ్మణీయ దోపిడీ సాహిత్యకారుల ఆధిపత్యమే' ఉందని ఆమె సాహిత్య చరిత్రలో దళిత స్త్రీలకు జరిగిన అన్యాయాన్ని గుర్తించారు. భారత చరిత్రంతా వర్ణ, వర్గ, ఆర్య, హిందూ కులాధిపత్యాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల చరిత్రని గుర్తించారు.

ఈ పుస్తకంలో మొత్తం యాభై నాలుగు మంది దళిత రచయిత్రుల జీవితాల్ని పరిచయం చేస్తూ వారి రచనల్ని కూడా పాఠకులకందించారు. ఈ పద్ధతి వల్ల ఆ రచయిత్రులను అంచనా వేసుకోవడానికి ఒక అవకాశం కల్పించారు. ఆ రకంగా విస్మరణకు గురైన దళిత స్త్రీల సాహిత్య చరిత్రను అర్థం చేసుకోడానికి ఒక పునాది వేశారు.

ఒకసారి జి. కల్యాణరావుగారు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని తెలుగు అధ్యయన శాఖలో విద్యార్థులతో ముచ్చటిస్తూ ఒక శాస్త్రీయ చర్చను భాషా వికాసానికి సంబంధించినది ప్రారంభించారు. అక్షరం ముందు పుట్టిందా? భాష ముందు పుట్టిందా అని ప్రశ్నించి, ఆయనే భాషే ముందు పుట్టిందని వివరించారు. అక్షరం పుట్టి స్థిరపడే క్రమంలోనే దాన్ని పరాన్న జీవులు కైవసం చేసుకుని "అంధ్రభువుని కావ్యంబు గ్రామ్యంబుగాదు" అన్న వరకు చరిత్ర నడిచిందని ఆయన వివరించారు.

మన దేశంలో దళితుల, అందునా దళిత స్త్రీల చరిత్రను, వాళ్ల సాహిత్యానికి ఉండే చరిత్రను పరిశీలించడానికి ఈ సూత్రీకరణ బాగా ఉపయోగపడుతుంది. సాహిత్య చరిత్రలో కులం పాత్ర వల్ల, పితృస్వామ్యం వల్ల ఆ రోజుల్లో దళిత రచనల్ని, స్త్రీల రచనల్ని గుర్తించలేదు. ఇక దళిత స్త్రీ రచనల్ని గుర్తించడం జరగదు. ఒక వేళ స్త్రీల రచనల్ని గుర్తించినా ఆనాటి పాలక వర్గ భావజాలాన్ని అక్షరాలా ప్రతిపాదించి బలపరిచిన రచనల్నే విమర్శకులు, సమాజం గుర్తించింది. ఎందుకంటే పాలకవర్గ భావజాలమే ఆనాటి ప్రజల భావజాలంగా కొనసాగి తీరుతుంది కాబట్టి. అదే స్త్రీల భావజాలంగా ఉండాలని ఆధిపత్య వ్యవస్థలు కోరుకుంటాయి. స్త్రీలు ఆ భావజాలంలో ఉండటమే వాళ్లకు కావాలి.

అయితే దళిత స్త్రీలు సాహిత్య రచనలోకి రావడమంటేనే అగ్రకుల, పితృస్వామ్య వ్యవస్థల ఆధిపత్యానికి వ్యతిరేకించడం. ఆ కాలం వల్ల, ఆ రచయిత్రుల వ్యక్తిగత నేపథ్యం వల్ల వాళ్లు ఏమైనా రాసి ఉండవచ్చు. కానీ రచనలోకి రావడమే ఒక భావజాల సంఘర్షణ. అది తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ముఖ్యమైన పాయ.

గోగు శ్యామల ఈ పుస్తకం ద్వారా దళిత స్త్రీల చరిత్ర రచనకు పూనుకుంటూ దీని వెనుక ఉన్న కుల, పితృస్వామ్య ఆధిపత్యాన్ని, విభజనను గుర్తించారు. మన కాలంలో కళ్లముందున్న సంక్షోభానికి కారణాలు గతంలోంచి వెదుకుతూ వచ్చారు. అందువల్ల గతంలో విస్మరణకు గురైన దళిత స్త్రీల సాహిత్యం ఒక చారిత్రకావసరమని గుర్తించారు. ఇది కేవలం గతాన్ని నిర్మించడానికే కాదు. ఆధిపత్య శక్తులు గతంలో చేసిన దుర్మార్గాన్ని బహిరంగపరిచి భవిష్యత్తుకు పునాదులేశారు. ఆ రకంగా చరిత్ర చోదకులైన

దళిత మహిళలకు గత వర్తమానాల మీది నుంచి భవిష్యత్తులో కూడా గౌరవం గుర్తింపును, గౌరవాన్ని అందించారు. అది వాళ్లు పొందవలసిన స్థానం. దాన్ని ఈ పుస్తకం ద్వారా శ్యామల పాఠకుల దృష్టికి తీసుకొచ్చారు.

తెలుగు సాహిత్య చరిత్రను కందుకూరి వీరేశలింగం పంతులు, కురుగంటి సీతారామయ్య, దివాకర్ల వేంకటావధాని, ఆరుద్ర, జి. నాగయ్య, ద్వానాశాస్త్రి వరకు ఎందరో రచించారు. ఇందులో దళిత స్త్రీ రచయితల్ని ఎవ్వరూ గుర్తించలేదు. వారి చారిత్రక దృష్టి ఇప్పుడు మనకున్న దృష్టి కాదు. ఆరుద్ర చరిత్రను నేపథ్యంగా ఉంచుకుని సాహిత్య చరిత్ర రాశాడంటారు. కానీ అందులో చారిత్రక దృష్టి లేదు. సామాజిక దృష్టి కూడా లేదు. 1965లో తెలుగు సాహిత్య అకాడమీ వారు 'అఖిల భారత కవయిత్రులు' అన్న పుస్తకం ప్రచురించారు. ఈ పుస్తక సంకలన కర్త ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ (ఇటువంటి ప్రయోగాలు ఈ పుస్తకంలో చాలా ఉన్నాయి). పదహారు భారతీయ భాషల నుంచి నాలుగు వందల ముప్పైఐదు మంది రచయిత్రుల్ని పరిచయం చేశారు. వేదకాలం నుంచి పందొమ్మిదో శతాబ్దం వరకున్న స్త్రీలను పరిచయం చేస్తూ రచనల్ని రేఖామాత్రంగా వివరించారు. వారి జీవిత నేపథ్యం కానీ, రచనల స్వభావాన్ని కానీ వివరించలేదు. ఆనాటి సాహిత్య చరిత్రకారుల దృష్టి వాస్తవిక చారిత్రిక దృష్టి కాదని చెప్పడానికే ఇలాంటివి ఉదాహరణ.

గోగు శ్యామల దళిత స్త్రీ రచయితల చరిత్ర రాసే నాటికి సమాజం ముందు అనేక ప్రశ్నలుదయించాయి. ముఖ్యంగా జెండర్, కులవివక్ష రైతాంగ పోరాటాలు ఉధృతంగా సాగుతున్న కాలమది. రిజర్వేషన్ పోరాటాలు సుడిగాలిలా ప్రారంభమై సామాజిక మూలాల్ని కదిపింది. చుండూరు, కారంచేడు దమనకాండ రాజ్య స్వభావాన్ని బట్టబయలు చేసింది. పత్రికల పుణ్యమాని వరకట్నపు చావులు, స్త్రీలపై అత్యాచారాలు వెలుగు చూశాయి. ఇలా అన్ని రకాల అణచివేతలకు దన్నుగా ఉన్న రాజ్య స్వభావాన్ని, మూలాల్ని ప్రశ్నించే పోరాటాలు శక్తివంతం అయ్యాయి. వాటిలో గతంలో కంటే పెద్ద ఎత్తున క్రియాశీలంగా పాల్గొనడం మొదలు పెట్టారు. కుల, తెగ, పితృస్వామ్య పీడనలకు, దోపిడీకి వ్యతిరేకంగా స్త్రీల పోరాటం వల్ల ఒక భావజాల, సాంస్కృతిక వాతావరణం ఏర్పడింది. గత నలభై యాభై ఏళ్లుగా సాగిన ఈ క్రమం సమాజం ముందు అనేక రాడికల్ ఆలోచనలను పెట్టింది. ముఖ్యంగా గతాన్ని సునిశితంగా చూసే పద్ధతిని అందించింది. ఈ మొత్తం వాతావరణంలో 'నల్లపొద్దు' పొడిచింది. పీడితుల్లోకెల్లా పీడితులైన దళిత మహిళల సృజనాత్మక వ్యక్తీకరణే నల్లపొద్దు.

ఇందులోని తొలి తరం రచయిత్రులు క్రైస్తవ సమాజాలు అందించిన స్నేహ హస్తంతో పైకొచ్చినవారే. సమాజం వారిని దూరంపెట్టినా దగ్గరకు చేర్చుకుని క్రైస్తవ సమాజం వారికి విద్య నేర్పింది. మత సంస్థ అయినా సమాజంలో ఆ వర్గానికి చేయూతనిచ్చి ముందుకు నడిపింది. ఆ రోజుల్లో అలాంటి సంస్థలే దళిత స్త్రీలకు ఒక ప్రపంచాన్ని పరిచయం చేశాయి. కొందరు రచయిత్రులు క్రైస్తవ గీతాలకు కర్ణాటక సంగీత శాస్త్రీయ బాణీలో రాగాలు కూర్చారు. మరికొందరు పద్య కవిత్వం రాశారు. ఎవరికైనా ఆనాటికి సిద్ధంగా ఉన్న భావజాలాన్నే ముందు అనుసరించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇది ఎవరికైనా వర్తించేదే. దళిత బాలికలు, మహిళలు క్రైస్తవ పాఠశాలలు అందించిన సహకారంతో విద్యావంతులై ప్రభుత్వోద్యోగులై సామాజిక గౌరవం సంపాదించుకున్నారు. ఈ విద్యా, ఆర్థిక పరిణామాల వల్ల తెలుగు లిఖిత సాహిత్య చరిత్రలోకి దళిత మహిళలు వచ్చారు. అయితే భావజాల పరంగా అప్పటికి సిద్ధంగా ఉన్నదానికి కొందరు మాత్రమే భిన్నంగా ఆలోచించగలిగారు. దేనికంటే జీవిత విధానంలో రూపం మారిందే గాని అప్పటికి సారంలో మార్పు రాలేదు. స్వాతంత్ర్యోద్యమ ప్రభావం వీరిపై అధికంగా ఉన్నట్లు లేదు. చదువులోకి వచ్చినప్పటికీ సామాజిక, రాజకీయ ప్రభావాలు పడనంత దూరంగా దళిత స్త్రీలు ఉన్నారని, సమాజం ఉంచిందని గుర్తించాలి. ఇలాంటి విషయాల్లో దళిత పురుషులకే కులం వల్ల చాలా ఆంక్షలు ఉండేవి. ఇక స్త్రీలకు ఎలా ఉంటాయో ఊహించవచ్చు. 1950ల తరువాత కొంత స్వాతంత్ర్యోద్యమ ప్రభావం, కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం వల్ల కొందరు సామాజిక జీవితంలోకి వచ్చారు. రచయితలైనారు.

ఈ విధంగా రచయిత్రులైన వారి కుటుంబాలు చాలా వరకు విద్యావంతులై ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారే. అతి తక్కువ మంది రచయిత్రులు శ్రామిక కుటుంబాల నుంచి వచ్చిన వారున్నారు. ఇలాంటి వారు రచయిత్రులు కావడాని ప్రేరణ ఉద్యమాలే. పేరున్న రచయితలే. 1970ల తరువాత వచ్చిన రచయిత్రులు దాదాపుగా ఉద్యమాల నేపథ్యం నుంచి వచ్చిన వారే కనిపిస్తారు. తాము ఈ సమాజంలో కోల్పోయిందేమో తెలుసుకున్న తరువాత విద్యావంతులైన స్త్రీలు రచనారంగంలో తమను వెదుక్కుంటూ కనిపిస్తారు. రచనల ద్వారా తమ వారిని మేల్కొల్పుతూ తమకు జరిగిన అన్యాయాన్ని సమాజం ముందు న్యాయబద్ధమైన చర్చకు పెట్టారు. ఈ చర్చలో ముఖ్యమైంది కుల వివక్ష రెండవది స్త్రీలపై అత్యాచారాలు. వీరి న్యాయబద్ధమైన పోరాటం ప్రభుత్వాల్ని కదిపింది. స్త్రీల రక్షణకై అనేక చట్టాల్ని ప్రభుత్వం చేస్తూనే ఉంది. వాటిని అమలు చేయవలసినపుడు ఆధిపత్యా భావజాలమే పని చేస్తూ ఉండడం వల్ల నేరస్తులు సులభంగా బయట పడుతున్నారు. దీనికి కారణం అసలు దోషి వ్యవస్థను కాపాడే చట్ట సభలే. వ్యవస్థ ఎదుర్కోవడంలో కూడా దళిత పోరాటంలో ఒడిదొడుకులున్నాయి. సమాజంలో అణచివేతకు గురి అవుతున్న కులాల మధ్య ఐక్యతను కుల వ్యవస్థ లేకుండా చేసింది. శ్రమ విభజన, శ్రామికుల విభజన దీనికి కారణం. కుల వ్యవస్థకు పునాది భూస్వామ్య విధానాలతో కూడిన బ్రాహ్మణిజం. ఈ రెండింటి సంబంధాలను బట్టబయలు చేస్తూ అణచివేయబడ్డ శక్తులు పునరేకీకరణ కావాల్సి ఉంది.

ఈ సందర్భంలో దళిత స్త్రీ రచయితలు ఇద్దరు శత్రువులనెదుర్కోవాలి. ఒకటి కులం, మరొకటి జెండర్. ఈ రెండింటి సమ్మేళనమే హిందూ బ్రాహ్మణీయ సాహిత్యం. దీన్ని విమర్శించిన దళిత స్త్రీల సాహిత్యం ఉన్నది. స్థూలంగా ఇదే మార్గంలో రాసిన దళిత స్త్రీల సాహిత్యం ఉన్నది. 1970కి పూర్వం దళిత రచయిత్రులకు ఈనాడు మనకున్న దృక్పథం లేదు. ఆనాటి పండిత వాతావరణంలోనే వాళ్లూ ఉన్నారు. కొందరు తొలి రోజుల్లో క్రైస్తవ భావజాలంతో రాశారు. అలాగే బ్రహ్మ సమాజం, స్వాతంత్ర్య పోరాట ప్రభావాలున్నాయి. ఇటీవలి కాలంలోని కె. దుర్గాదేవి వంటి వారు హిందూ బ్రాహ్మణీయ గ్రంథాలపై విమర్శనాత్మక విశ్లేషణ చేశారు. "అన్ని వేదాల్లో ఉన్నాయష.... స్త్రీ పతనం కూడా అన్న వ్యాసం ఉదయం వార్తా పత్రికలో 1995లో అచ్చయింది. ఈ వ్యాసాన్ని చదువుకున్న వాళ్లు "పొగరుబోతు" అన్న వాళ్ళు ఉన్నారట. క్రైస్తవ ముస్లిం స్త్రీలు రాసి ఉంటే వారిని బతకనిస్తారా? అన్నవాళ్లు కూడా ఉన్నారట. ఈ ధిక్కారానికి కొనసాగింపుగా బోయి విజయ భారతి ఇటీవల "నరమేధాలు - నియోగాలు" అన్న గ్రంథంల్లో పురాణాల డొల్లతనాన్ని విశ్లేషించారు.

'నల్లపొద్దు'లో బి.జె. స్వరూపరాణి వంటి వారు స్త్రీ వాద దళిత వాదాలకు దూరంగా ఉంటూ రచనలు చేశారని గుర్తించారు. అలా ఎందుకు జరిగిందో దళిత స్త్రీల సాహిత్య చరిత్ర నిర్మాణ క్రమంలో భాగంగా పరిశీలించాలి. ఆ రోజుల్లో దళిత స్త్రీల విషయంలో పెద్దగా భావజాల చర్చ చేయలేం. వాళ్లు రచనా రంగంలోకి రావడమే అపురూపం. కానీ వర్తమాన కాలంలో ఏ వాదాలకు, రాజకీయాలకు అతీతంగా రాయడం సాహిత్య చరిత్రలో పట్టించుకోవాల్సిన విషయం. జెల్ది సీతమ్మలాంటి వారు జాతీయ స్థాయిలో...

మిగతాది 50 వ పేజీలో...

ఎక్సోడస్

- మహమూద్

జన్మస్థలం ఇపుడో నెత్తుటి జ్ఞాపకం

వెతుకులాటలో
జీవనం పొందే
బరువును మోస్తూ
కలల ఎక్సోడస్

కళ్ళకూ చూపుకూ మధ్య
అంతర్యుద్ధం మొదలై
రెటినా కి
చిక్కేదంతా చిక్కటి
రుధిరం స్రవిస్తున్న
ఆఫ్ఘనిస్తాన్

డాలర్ రాజకీయాల అపసవ్యతకి
గుర్తుగా
రెండుగా విడిపోయిన దేశదేహం
ఏం చేస్తుంది?
తనతో తానే ఎడతెగని యుద్ధం చేస్తుంది
అంతే కదా?

ప్రజాస్వామ్యం కీలుబొమ్మని ఆడించే మర్మం
యుద్ధరంగంలో తప్పిపోయి
వాడు వెన్నుచూపితే
మత చాదస్తపు
తాలిబనిజం అంగలార్చుతోంది
అధికారం కోసం

సమరం ఒక్కటే పరమసత్యంగా మిగిలిన చోట
శిధిలాల శైధిల్యం తప్ప ఏం మిగులుతుంది?

దిక్కులు ముక్కలైన దృశ్యాన్ని
కనులెదుట ఉంచుతుంది కాందహార్
చరిత్ర పొడుగుతా సూఫీతత్వం బోధించిన
వెన్నెముక విరిగిపడిన కాబూల్

ఏం చూసుకొని జీవించాలి ఇక్కడ?
ఏం దొరుకుతుందని నిలబడాలిక్కడ?

స్వదేశం వదిలి
తెలియని ప్రదేశంలో
బతుకుని వెదకటమంటే
ప్రాణం ఉండి మరణం పొందడం కదా

వలపోత వదనమంత వెతగా మారడం
ఎవరు కోరుకుంటారు?
ఊరూవాడనీ, అస్థిత్వ చిరునామానీ
ఒదులుకోవడం ఎవరికి అవసరం?

మట్టిస్పర్శని గుప్పిట్లో పట్టుకొని
పొలోమంటూ పరుగుదీస్తున్న వారి
గుండె కవాటాల అదురు బెదురు
వింటే
వరుస భూకంపాల మీద కాలు పెట్టినట్టు ఉంటుంది

ప్రాణాన్ని బలవంతంగా
దేహం నుంచి వేరుపరచుకున్నంత

కర్కశంగా ఉంటుంది

భాషకు లొంగని
భావధార కన్నీరుగా
మారినట్టుగా ఉంటుంది

మట్టి మీద వెగటుపుట్టి కాదు
శిథిలాల్ని తప్ప
ఇంకో ఫలితం ఇవ్వని
మీ యుద్ధం అంటే అసహ్యమేసి

ప్రమాదం లేని స్థలం కోసం
పాదాలకి మనిషి నెత్తురంటని జాడ కోసం
స్పర్శకి మృత శరీరం దొరకని ప్రదేశం కోసం
వెదుకులాటని గమ్యం తెలియని
దారుల పాలు చేసి

బయలుదేరారు

లోగిళ్ళు సమాధులుగా మిగలని
చోటు దొరకకపోదా అనే
అనే ఆశని పొదుముకొన్నవాడికి
ప్రాణాన్ని నిలుపుకోవడం ప్రాణప్రదమౌతుంది

అవును
యుద్ధం నివారించే శక్తి లేని సామాన్యులకు
ప్రాణం కాపాడుకోవడం
ఒక ఉద్యమం

కుటుంబాన్ని రక్షించుకోవడం
అక్కరలేని యుద్ధంలో ప్రాణం విడవడం కంటే
గొప్ప త్యాగం

నరనరంలో రుధిరంలా ఉరికే దేశం
దేహం లోపలైనా సరే ఊపిరితో ఉంచడం
గొప్ప సందేశం..

వెళ్ళనీ వాళ్ళనీ

పదమూడు శతాబ్దాలుగా సూఫీ పరిమళం
చిగురించిన నేలపై తిరిగి
సనాయ్ గజ్నవీ సత్యపు పూలతోట
మళ్ళీ కవితా వసంతాన్ని తొడుగుకునేదాకా

రూహానీ రూహ్ తిరిగి సూఫీ గీతాలాపన చేసేదాకా

లిలిలినాటో సైనిక పటాలం వెళ్ళిపోయాక అంతర్యుద్ధం
నుంచి
తప్పించుకోడానికి వలసబాట పట్టిన ఆఫ్ఘన్ లకు

సనాయ్ గజ్నవీ...ప్రాచీన ఆఫ్ఘన్ కవి
రూహానీ ....గొప్ప సూఫీ గురువు
రూహ్..ఆత్మ... ■

ఆమె

- విజయ

తెల్లవారక ముందే చేతిలోకి రోకలి తీసుకుంటుంది
బిందె మీద బిందె పెట్టుకుని నీళ్లు తెస్తుంది
వండుతుంది, ఉతుకుతుంది, కడుగుతుంది
వేళ్లనే సాధనాలుగా చేసుకుని కలుపు తీస్తుంది
కొడవలి చేతబట్టి పంట కోస్తుంది
చంకలో బుట్ట పెట్టుకుని విప్ప'పూవు ఏరుతుంది
తరాలుగా ఆమె అంటే అంతే
ఇంత చేసిన ఆమె ఇప్పుడు ఎంతో చేస్తున్నది
చంకన బుట్ట పెట్టుకుని విప్ప పూవు ఏరుతూ రెక్కీ చేస్తుంది
పంట కోసే కొడవలినే ఆయుధంగా చేసుకుంది
వేళ్లతో పోలీసుల కళ్లు పీకాలని చూస్తున్నది
వండుతూ, ఉతుకుతూ, కడుగుతూ రాజకీయాల గురించి
ఆలోచిస్తుంది
యుద్ధం కోసం మందుగుండు తల మీద మోస్తుంది
తుపాకీ పట్టుకుని యుద్ధం చేస్తుంది
గాయపడ్డ ప్రజా యోధులను భుజానికి ఎత్తుకుంటుంది
చీకటిలో ఉన్న తన జీవితానికి తానే వెలుగుతారై నిలిచింది
ప్రజా యుద్ధంలో మునుముందుకే సాగుతున్నది ■

పత్రికా ప్రకటన

ఇంత దుఃఖం ఉంటుందా?

ఫాదర్.. మిమ్మల్ని వాళ్లు హత్య చేశారని బిగ్గరగా అరవండి!

అతను వెళ్లి పోయాడు. మనందరిని వదిలి సాగిపోయాడు. అతను భూగోళం ఖాళీ చేసాక దుఃఖ పడటం మన వంతయింది. అతను గౌరవ వీడ్కోలు తీసుకోలేదు. శిలువతో సెలవంటూ వెళ్లి పోయాడు. మానవ జీవితంలో ఇంతటి విషాదం వుంటుందా. మనుషులను ప్రేమించే వాళ్ళు తాము నివసించే సమాజాన్ని, కాలాన్ని సౌందర్యమయం చేసే వాళ్లు భౌతికంగా వెళ్లి పోయినప్పటి దుఃఖం ఇది. మనిషిగా అతనిని మనం ఎన్నడూ కలవక పోవొచ్చు. ఒక ఆత్మీయ సంభాషణ అయినా లేకపోవొచ్చు. అతనిని చూసి చిరునవ్వు అయినా జత కలపకపోవొచ్చు. అతను మన మనిషి. మహా మనిషి. ఈ దేశపు సంపద. ఆతనే ఫాదర్ స్టాన్ స్వామి.

శరీరం సహకరించని స్థితిలో ఎనభై మూడేళ్ళ వయస్సులో 8-10- 2020న మోది, షా నేతృత్వంలో నడుస్తున్న ఎన్ ఐ ఎ బృందం ఆయనను అరెస్ట్ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీపై హత్యా ప్రయత్నం చేశాడన్న ఆరోపణపై 'ఉపా' కింద అరెస్ట్ చేయబడిన వారిలో 16వ ముద్దాయి. స్టాన్ స్వామి తమిళనాడులో పుట్టి కర్ణాటకలో పెరిగి విదేశాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని బెంగుళూరులో సోషల్ సైన్సస్ రీసెర్స్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ గా చేస్తూ అన్నీ వదులుకొని జార్ఖండ్ ఆదివాసుల మధ్య జీవిస్తున్నాడు. భారత దేశంలో లభ్యమౌతున్న ఖనిజ సంపద నలభై శాతం జార్ఖండ్ రాష్ట్రంలో వుంది. ఇక్కడ మైనింగ్ చేయడం వలన రాష్ట్ర జనాభాలో నాలుగో వంతు నిరాశ్రయులవుతున్నారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుళజాతి సంస్థలతో చేసుకున్న ఒప్పందాల వలన ఆదివాసుల అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారిన వేళ వారికోసం స్టాన్ స్వామి నిలబడ్డాడు.

ఫాదర్ హృదయంలో అణగారిన వారి పట్ల మమకారం. వారి పట్ల అంతులేని ప్రేమ. మనిషిగా వారిపట్ల బాధ్యత. వారి విముక్తి కోసం ఆరాటం. అందుకే సహజంగా స్టాన్ స్వామి మావోయిస్టు అయినాడు. ఈ దేశ సంపద ఈ దేశ ప్రజలదే అన్నందుకు, ఆదివాసులుకు హక్కులు ఉంటాయన్నందుకు, అక్రమ కేసుల్లో వేలాది మంది ఆదివాసులు దీర్ఘ కాలం జైళ్లలో వుంటున్నారని అన్నందుకు, వారిని విడుదల చేయాలని జార్ఖండ్ ప్రభుత్వం పై పోరాటం చేసినందుకు, ఖనిజ సంపదను దోచుకునే కార్పొరేట్లకు అడ్డు నిలిచినందుకు కేంద్ర ప్రభుత్వం భీమా కోరేగాం కుట్ర కేసు బనాయించింది.

వృద్ధాప్యం, అనారోగ్యాలతో తన పనులు తాను చేసుకోలేని, తన కనీస అవసరాలు తాను తీర్చుకోలేని స్టాన్ స్వామిపై భారత ప్రజాస్వామ్యం ప్రతీకారం తీర్చుకుంది. ఆయన దాదాపు తొమ్మిది నెలలుగా జైల్లో వున్నారు. అనేక దఫాలు బెయిల్ రిజెక్ట్ అయింది. అంతిమంగా రాజ్యం చేతిలో హత్యకు గురయ్యాడు. తనకంటూ ఏమీ లేని ఫాదర్ బహుశా తన జీవితకాలంలో ఎన్నడూ ఒంటరిగా గడిపి ఉండడు. ఆదివాసుల మధ్యనే జీవితమంతా కొనసాగించి ఉంటాడు. అణగారిన సమూహాల కోసం కాలాన్నంతా వెచ్చించి ఉంటాడు. ఇప్పుడాయన ఈ కాలగమనంతో తెగతెంపులు చేసుకొని, ఒంటరిగా వెళ్లిపోయాడు.

ఆయన ప్రజల కనీస అవసరాల కోసం గళం విప్పితే మత మార్పిడులు చేస్తున్నాడని సంఘ్ పరివార్ ఆరోపించింది. ఇంకా ఎన్నో ఆరోపణలు చేసింది. కానీ ఆయనేం చేశారు? అత్యంత 'వెనుకబడిన' అనేక సహజ సంపదల సంపన్న జార్ఖండ్ ప్రాంతంలో ఆయన ప్రజలను చైతన్యవంతం చేయడంలో నాలుగు దశాబ్దాలుగా కృషి చేశారు. ఆ చైతన్యాన్ని రాజ్యం భరించలేకపోయింది. ఆయన చేసిన కృషిని పూర్వపక్షం చేయాలనుకున్నది. ఆయన మీద హింసారోపణలు చేసింది. దేశ ద్రోహి ముద్ర వేసింది. అక్రమ ఆరోపణలతో ఖైదు చేసింది. చివరకు కరోన కాలంలో మానసికంగా, శారీరకంగా వేధించి ఆసుపత్రి గదిలో రాజ్యం హంతక పాత్ర పోషించింది. ఆయనను ఈ రాజ్యం హత్య చేసింది.

ఆయన తను నమ్మిన విలువల కోసం అమరత్వం చెందాడు. జననం నుండి మరణం వరకు నమ్మిన విశ్వాసాల పునాది పై పని చేసాడు. ఆయనకు ఈ దేశమంతా ఇవాళ కన్నీటితో నివాళి ప్రకటిస్తున్నది. ఈ హత్యతో భారత రాజ్య యంత్రం తన జీవిత చరమాంకంలోకి చేరుకున్నది. దేశ ప్రజల కోసం కలలు గన్న అన్వేషకుని ఊపిరి తీసింది. రాజ్యం చివరి ఊపిరి తీసుకుంటున్నది. భారతదేశంలో రాజకీయ అసమ్మతికి కాలం తీరిందని, పీడిత అస్తిత్వ వ్యక్తీకరణలకు, ఆకాంక్షలకు కాలం లేదని, ఏ మాత్రం భిన్నాభిప్రాయాలకు భారత ప్రజాస్వామ్యంలో చోటు లేదని ఈ హత్యతో సంఘ పరివార్ బరితెగించి ప్రకటిస్తున్నది.

మనుషులపట్ల ప్రేమ తప్ప మరేమీ తెలియని ఫాదర్ స్టాన్‌స్వామిని భీమా కోరేగావ్ అక్రమ కేసులో నిందితుడ్ని చేయడంలోనే కుట్ర దాగి ఉన్నది. ఈ కుట్ర కేసులో మూడేళ్ళుగా మహారాష్ట్ర జైలులో నిర్బంధంలో ఉన్న వారు చాలా వరకు తీవ్ర అనారోగ్య సమస్యలతో కాలాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రొఫెసర్ సాయిబాబా పరిస్థితి దయనీయంగా ఉంది. ఇంకా సీఏఏ వ్యతిరేక ఆందోళనల కాలంలో అక్రమ కేసుల్లో అరెస్టయిన వాళ్లు ఎందరో జైల్లో ఉన్నారు. అయినా వారెవరికీ బెయిల్ ఇవ్వడానికి సంఘ్ పరివార్ కనుసన్నలలో నడుస్తున్న న్యాయస్థానాలు సిద్ధంగా లేవు.

స్టాన్ స్వామి మరణం ఇవాల్టి దేశ వ్యాప్తంగా అమలవుతున్న అణిచివేత కోణానికి ఉదాహరణ. ఈ దేశంలో ఫాసిజం రాజ్యమేలుతున్నదనడానికి ఇంతకంటే ఇంకేం కావాలి. ఈ పాలక చర్యలను ముక్తకంఠంతో ధిక్కరించవలసిన సమయం ఇది. ఈ వేదనా భరిత కాలంలోనే ఫాదర్ స్టాన్ స్వామి జైలు సహచరులందరి విడుదల కోసం మనం కృషి చేయాల్సి ఉన్నది. రాజకీయ దురుద్దేశాలతో దేశవ్యాప్తంగా నమోదైన అక్రమ కేసులన్నీ ఎత్తేయాలని కోరాలి. అత్యంత అమానుష, రాజ్యాంగ వ్యతిరేక, మానవ వ్యతిరేక ఉపా చట్టాన్ని రద్దు చేయాలని నినదిద్దాం. ఉపా వ్యతిరేకంగా పోరాడి అదే ఉపాకు బలైపోయిన ఫాదర్‌కు నివాళి ప్రకటించడమంటే ఉపా రద్దు కోసం పోరాడటమే. ఈ దేశపు లౌకిక, ప్రజాస్వామిక, విప్లవకర జీవధార ఫాదర్ స్టాన్‌స్వామి. అలాంటి వైవిధ్యభరితమైన మేధావి, ప్రజా ప్రేమికుడు జీవించి కాలం ఇది. ఆయన ఆచరణతో, ఆలోచనలతో ఈ పోరాట కాలమంతా తేజోవంతమైంది. ఆయన మరణంతో ఈ దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం తన ఫాసిస్టు స్వభావాన్ని చాటుకున్నది. ఆ రకంగా ఆయన మరణించీ మన ముందు ఒక సత్య ప్రకటన చేసి వెళ్లిపోయాడు. ఆయన అమరత్వానికి విప్లవ రచయితల సంఘం జోహార్లు ప్రకటిస్తున్నది.

- అరసవిల్లి కృష్ణ

జూలై 6, 2021

విరసం అధ్యక్షుడు

వ్యాసం

కులం - కుటుంబం - తెగ

- రమేష్ పట్నాయక్

రెండో భాగం

(విరసంపై నిషేధం వల్ల పత్రిక ఆగిపోవడంతో మే సంచిక తర్వాత మిగతాది ఇప్పుడు అందిస్తున్నాం... వర్కింగ్ ఎడిటర్)

పట్టణ మధ్యతరగతిలో భార్య భర్తలు ఇద్దరూ బయట పనిచేస్తున్న సందర్భాన్ని తీసుకుందాం. వారు ఉత్పత్తి, సేవా, పాలనా రంగాలలో కార్మికులుగా లేదా ఉద్యోగులుగా పనిచేస్తూన్నా వారి ఆదాయాలు మెరుగ్గా ఉంటే, అంటే ఇంటిలో పనిమనిషిని పెట్టుకునే స్థోమత ఉంటే వారిని కుటుంబ సంబంధాల అధ్యయనం కొరకు మధ్యతరగతి కుటుంబం అనవచ్చు. ఈ కుటుంబం ఒక సామాజిక యూనిట్, ఒక ఆర్థిక యూనిట్ మరియు వీరికి స్వంత ఇల్లు ఇతర ఆస్తులు ఉండవచ్చు కావున ఒక ఆస్తిపర యూనిట్. కాని ఈ కుటంబం ఒక ఉత్పత్తి యూనిట్ కాదు. ఈ కుటుంబంలో స్త్రీ తనకు స్వంత సంపాదన ఉండడం వలన కొంత స్వాతంత్ర్యాన్ని సాధించుకోగలుగుతుంది. అయితే ఈ కుటుంబాల విషయంలో సామాజిక కట్టుబాట్లు ఎక్కువగా ఉంటాయి. ఉన్నత కులాలు అని చెప్పబడే వాటినుంచి రావడం లేదా వారిని అనుకరించడానికి ప్రయత్నించడం వలన కట్లుబాట్లు ఎక్కువగా ఉండి స్త్రీ సమానత్వానికి ఆటంకంగా ఉంటాయి. ఈ కుటుంబాలలో పిల్లలపై ఆధిపత్యం, వారి చదువుల విషయంలో, పెళ్ళిళ్ళ విషయంలో ఎక్కువగానే ఉంటుంది. తమ పిల్లలు ఆర్థికంగా తమ స్థాయిలో లేదా ఇంకా పైస్థాయిలో ఉండాలనే కాంక్ష వారిపై ఆధిపత్యానికి దారి తీస్తుంది. అయితే వారు ఒక్కసారి మేజర్లు అయిన తరువాత పరిస్థితిలో మార్పు వస్తుంది. ఏది ఏమైనా గ్రామంలో మధ్య తరగతి రైతు కుటుంబం మరియు పట్టణంలో అసంఘటిత రంగ కార్మిక కుటుంబాల మధ్య పోలికలు తేడాలు మన అధ్యయనానికి బాగా పనికి వస్తాయి. అవి రెండూ, రెండు చివరల ఉండే ఉదాహరణలు. మిగిలిన కుటుంబాలు వాటి మధ్య వివిధ స్థాయిలలో ఉంటాయి. సమాజం యొక్క పురోగామి భవిష్యత్‌లో కుటుంబం అన్ని బంధనాల నుండి విముక్తి చెంది సామాజిక బంధంగా నిలవగలదు.

మరల మనం గ్రామాలవైపు తిరిగి చూస్తే, గ్రామాలలో ధనిక, మధ్యతరగతి, పేద రైతులు ఉంటారు. భూమిలేని వ్యవసాయ కూలీలు ఉంటారు. ఇందులో దళితులు ఎక్కువగా ఉంటారు. అయితే దివాళా తీసిన వెనుక ఉంచబడిన కులాల వారు, కొన్ని సందర్భాలలో అగ్రకులాలు అని చెప్పబడేవారు కూడా వ్యవసాయ కూలీలుగా ఉంటారు. ఇక కమ్మరి, కుమ్మరి, కంసాలి, సాలి వంటి వస్తూత్పత్తి చేసే వృత్తుల వారు, బట్టలు ఉతకడం, క్షవరం చేయడం వంటి వృత్తులు చేసేవారు ఉంటారు. అయితే గ్రామంలో కట్టు బాట్లకు ప్రధాన ఆధారం భూమిపై యాజమాన్యం ఉన్న రైతాంగమే. సహజంగానే పేద రైతులు కంటే మధ్య తరగతి మరియు ధనిక రైతులు గ్రామ కుల ఇతర అభివృద్ధి నిరోధక కట్టుబాట్ల విషయంలో ప్రాధాన్యత వహిస్తారు. ఆర్థిక స్థోమత వలన ధనిక రైతులు ప్రాధాన్యత పొందితే, జరుగుబాటుకు లోటులేని సొంత ఉత్పత్తి సాధానాలు కలిగిన మధ్య తరగతి రైతులు తమ సంఖ్యా బలం వలన విస్తృత సామాజిక సంబంధాల వలన గ్రామీణ సమాజంలో ప్రాధాన్యత వహిస్తారు. అన్ని కుటుంబాలు సామాజిక మరియు ఆర్థిక యూనిట్‌లే, అయితే, వాటిలో మధ్య, ధనిక రైతు కుటుంబాలు ఉత్పత్తి సాధనం అయిన భూమి సొంత ఆస్తిగా ఉన్న కుటుంబాలు. అందులో ఇంకా మధ్య తరగతి రైతు కుటుంబాలు ఒక ఉత్పత్తి యూనిట్‌గా కూడా ఉండే కుటుంబాలు కావడం గమనించదగ్గ విషయం.

గ్రామంలో పెట్టుబడి - శ్రమ అనే పెట్టుబడిదారీ దోపిడీ సంబంధాలు ప్రధానంగా ఉన్నాయి. (గ్రామాలలో ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలు లేవని ఈ రచయిత ఒక విశ్లేషణాత్మక వ్యాసం ప్రచురించి ఉన్నాడు.) అయితే, గ్రామ సమాజంలో మధ్యతరగతి రైతు కుటుంబం, అది ఒక ఉత్పత్తి యూనిట్ కూడా అయినందున, ఇంతకుముందు వివరించినట్లు, అంతరంగికంగా ఆధిపత్య సంబంధాలలో ఉంటుంది. చారిత్రకంగా కులం కుటుంబాన్ని అంటి పెట్టుకుని ఉన్నందున ఈ మధ్యతరగతి రైతు కుటుంబాలు కులానికి బలమైన ఆధారాలుగా ఉన్నాయి. అంతరంగికంగా ఆధిపత్య సంబంధాలలో ఉన్న మధ్యతరగతి రైతు కుటుంబం తన బయట ఇతర కుటుంబాలతో సంప్రదాయంలో ఉన్న కులాధిపత్య సంబంధాలను నెరుపుతుంది. తన కుల అస్థిత్వాన్ని, ఆ విధంగా కుల వ్యవస్థను బలపరుస్తుంది. మరొక రకంగా చెప్పాలంటే, వ్యవసాయంలో కూడా పెట్టుబడి ఉత్పత్తి సంబంధాలు పాదుకున్న తరువాత గ్రామంలో ఏదో ఒక స్థాయిలో ఉన్న ఆర్థికేతర ఆధిపత్య సంబంధాలకు - కుల మరియు పితృస్వామిక ఆధిపత్య సంబంధాలకు - అనేక వామపక్ష పార్టీలు భావిస్తున్నట్లు కుటుంబం బయట ఉన్న ఉత్పత్తి సంబంధాల కంటే మధ్యతరగతి రైతు కుటుంబంలో ఉన్న ఆధిపత్య సంబంధాలు అధికంగా ఆధారంగా ఉన్నాయని ఇక్కడ మనం ప్రతిపాదిస్తున్నాం. కులాల నిచ్చెనకు వ్యవసాయ కులం గరిభినాభి స్థానం అయితే వ్యవసాయ కులానికి మధ్యతరగతి రైతే గరిభినాభి స్థానం. గామంలో బ్రాహ్మణీయ కుటుంబాలు ఉంటే వారు కుల మరియు పితృస్వామిక వ్యవస్థలకు కావలసిన సిద్ధాంతాన్ని, నైతిక శక్తిని అందిస్తారని వేరుగా చెప్పనవసరం లేదు. ఇక ధనిక రైతులు తమ ప్రయోజనాల కొరకు మధ్యతరగతి రైతులను రెచ్చగొడతాడు. మధ్యతరగతి రైతుకు కొంతలో కొంత స్థోమత ఉండడం, తమ కులంలో అన్నివర్గాల వారితో సంబంధం ఉండడం వలన కుల సమీకరణ చేయగలుగుతున్నాడు. మధ్యతరగతి రైతు వర్గం ధనిక రైతులతో కలసి గ్రామంలో కుల సంబంధాలకు, పితృస్వామిక సంబంధాలకు ఆధారంగా ఉంటుంది. అభివృద్ధి నిరోధక పాత్ర పోషిస్తున్నది. కుల సంబంధాలను నిలబెట్టడంలో ధనిక రైతు వీరికి నాయకత్వ స్థానంలో నిలబడతాడు. వీరికి అన్నివైపులా ఉంటాడు. ఏది అవసరం అయితే అది చేస్తాడు. అసలు విలన్ ధనిక రైతే అయినా మధ్యతరగతి రైతులే ప్రధాన పనిముట్టుగా ఉంటున్నారు. కుటుంబంలో ఉన్న ఆధిపత్య సంబంధాలే మధ్యతరగతి రైతుకు నైతిక బలంగా పనిచేస్తున్నాయి. తన మాట జవదాటని (దాటలేని) భార్య బిడ్డలు ఉండడం ఒక గొప్ప ఫ్యూడల్ నైతిక శక్తి కదా?

గ్రామంలో సన్నకారు మరియు పేద రైతులు కొంత సొంత వ్యవసాయంపైనా కొంత కూలీ పైన జీవిస్తారు కావున అంటే కొంత ఇంటియజమాని క్రింద శ్రమించడం ద్వారా కొంత బయట శ్రమించడం ద్వారా జీవనాధారాలు సంపాదిస్తారు కావున వారి కుటుంబాలు అంత ఫ్యూడల్‌గా ఉండవు. వ్యవసాయ కూలీల కుటుంబాల ఆంతరంగిక సంబంధాలలో ఫ్యూడల్ లక్షణాలు తక్కువగా ఉంటాయి. వ్యవసాయేతర వృత్తుల కుటుంబాలలో కూడా, ప్రధానంగా ఎక్కడైతే కుటుంబ యాజమాన్యంలో ఉత్పత్తి సాధనాలు ఉంటాయో, ఉదాహరణకు బట్టల నేత కుటుంబాలలో, ఫ్యూడల్ సాంస్కృతిక సంబంధాలు బలంగా ఉంటాయి. ధనిక రైతుల కుటుంబాలలో ఫ్యూడల్ సాంస్కృతిక సంబంధాలు రెండవ తరం వారు వ్యవసాయంలో స్థిరపడ్డారా లేక పట్టణ వ్యాపారాలలో ఉద్యోగాలలలో స్థిరపడ్డారా అనే దానిపై ఆధారపడి ఉంటుంది. మధ్యతరగతి రైతులకు కూడా ఇది వర్తిస్తుంది కాని వారి సంతతికి ఇతర అవకాశాలు తక్కువ. మధ్యతరగతి రైతుల విషయంలో అధిక సంఖ్యాకులు రెండవ తరంలో కూడా వ్యవసాయాన్ని చేయవలసిన పరిస్థితి కావున రెండవ తరం వారు మొదటి తరంపై ప్రధానంగా తండ్రిపై ఆధారపడి ఉంటారు. ఇదే ఆధిపత్య సంబంధాలకు దారితీస్తుంది. ఒక గ్రామంలో ఇతర వృత్తులు క్షీణించినా ఇతర గ్రామాలలో, దగ్గర పట్టణాలలో ఉన్న కులవ్యవస్థ ఆధారంగా రైతు కుటుంబాలు కుల వ్యవస్థను కొనసాగిస్తాయి.

ధనిక రైతులు అధికాధికంగా పట్టణాలకు తరలిపోతున్న జిల్లాలను, ప్రాంతాలను ప్రక్కన పెడితే గ్రామంలో ఆర్థికేతర ఆధిపత్యాన్ని కొనసాగించడం ధనిక రైతుల అందులోనూ ప్రధానంగా ల్యాండు సీలింగు కంటే అధికంగా భూములు ఉన్నవారి, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారి, వడ్డీ వ్యాపారం చేసేవారి, వ్యవసాయ ఉత్పత్తులలో వ్యాపారం చేసేవారి అవసరం. అయితే దీనికి మధ్యవర్తిత్వం వహించగలిగేది కుటుంబం ఉత్పత్తి యూనిట్‌గా ఉన్న మధ్యతరగతి రైతు మాత్రమే. ధనిక రైతుకు లేని నైతిక శక్తి, విస్తృత ఆత్మిక సంబంధాలు మధ్యతరగతి రైతుకు ఉంటాయి. కాబట్టి మధ్య తరగతి రైతు గ్రామాన్ని కులం వంటి భావజాల విషయాలలో ప్రభావితం చేయగలుగుతున్నాడు. మధ్యతరగతి రైతు సహాయంతో తన కులానికి చెందిన పేద రైతులను, వ్యవసాయ కూలీలను కూడా ధనిక రైతు తనవైపు ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. కుల వ్యవస్థ కొనసాగడంలో ధనిక రైతుకు ఏంతో ప్రయోజనం ఉంటుంది. గ్రామంలో శ్రమ జీవుల ఐక్యతను కులం ద్వారా విచ్ఛిన్నం చేయవచ్చు. అయితే, మధ్యతరగతి రైతుకు కుల వ్యవస్థ వలన వస్తుగత ప్రయోజనం ఏమీ ఉండదు. పైగా తాను తన ప్రయోజనాల కొరకు ఇతర శ్రమ జీవులతో కలవడానికి కులం అడ్డువస్తుంది. కాని సంప్రదాయ కారణాల వలన మధ్యతరగతి రైతు కులానికి కేంద్ర బిందువుగా ఉంటాడు. అయితే విప్లవోద్యమ వాతావరణం ఏర్పడితే కులంలో వస్తుగత ప్రయోజనం ఏమీలేని మధ్య తరగతి రైతు కుల ప్రభావం నుండి బయటపడి పోరాట శక్తులతో కలిసి వస్తాడు. విప్లవానంతరం మధ్యతరగతి రైతు ఆర్థిక స్థోమత ఒకవైపు పెంచుతూ రెండవ వైపు ఆ కుటుంబాన్ని ఆంతరంగిక ఉత్పత్తి సంబంధాల నుండి విముక్తి చేసి (ఉత్పత్తిపర కుటుంబం) గ్రామీణ సమాజ ప్రగతికి మార్గం వేయవలసి ఉంటుంది. *వ్యవసాయ రంగంలో కుటుంబం అనేది ఆస్తిపర యూనిట్‌గా ఇంకా ఉత్పత్తి యూనిట్‌గా ఉన్నందున కులానికి అది ఆధారంగా పనిచేస్తుందన్నదని ఇక్కడ ప్రధానమైన ప్రతిపాదన.*

గ్రామంలో కులం ఉన్నప్పుడు పట్టణంలో కూడా దాని కొనసాగింపు ఉంటుంది. పట్టణంలో, చివరికి విశ్వవిద్యాలయాలలో అసహ్యమైన రూపాలలో, ఇంకా ప్రాణాంతకమైన రూపాలలో కుల విభేదాలు, అణచివేతలు వ్యక్తం అవుతున్నా వాటి మూలాలు మాత్రం గ్రామంలోనే ఉన్నాయి. కులాంతర వివాహాల వలన ఇది పరిష్కారం అవుతుందని చాలా మంది అపోహ పడతారు. నిజమే కులాంతర వివాహాల రూపంలోనే కులానికి అంతం ఉంది. అయితే కులాంతర వివాహాలు జరగడానికి అవసరమైన భౌతిక ప్రాతిపదికలు ఏమిటి. గ్రామాల కంటే పట్టణాలలో కులాంతర వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. ఎందుకు? పట్టణాలలో ఇటు అసంఘటిత కార్మిక కుటుంబాలు గాని లేదా మెరుగైన వేతనాలు పొందుతున్న ఉద్యోగ వర్గాలలో కాని కుటుంబం ఒక ఉత్పత్తి యూనిట్ కాదు. రెండవ తరం వారి ఉపాధి అవకాశాలు వారి విద్య, నైపుణ్యాలపై మాత్రమే ఆధారపడుతుంది కాని మొదటి తరం వారు చేస్తున్న వృత్తిపై ఆధారపడవు. రెండవ తరం వారు తమ బ్రతుకు తెరువు తాము వెదుక్కోవలసిందే. ఈ కారణాన పట్టణాలలో ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం లేని కుటుంబాల రెండవ తరం వారు ఎంత నిరాధారులుగా ఉంటారో అంత స్వేచ్ఛగా కూడా ఉంటారు. కుటుంబానికి ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం లేనప్పుడు, లాభాలు వచ్చే వ్యాపారం లేనప్పుడు, కుటుంబం ప్రధానంగా జీతనాతాలపై ఆధారపడిన సందర్భంలో తండ్రి తన మేజర్ కొడుకును నియంత్రించే అవకాశం తక్కువగా ఉంటుంది. గ్రామంలోనికి మనం వెళ్ళే సరికి పరిస్థితి మారిపోతుంది. అక్కడ, ప్రధానంగా భూమి జీవనాధారంగా ఉన్న అలాగే నేత పనివంటి ఉత్పత్తి సాధానాల ప్రాధాన్యత ఉన్న వృత్తులు చేస్తున్న కుటుంబాలలో రెండవ తరం వారు మొదటి తరం వారిపై ఉత్పత్తి సాధనాల కొరకు ఆధారపడతారు. అందుకే రెండవ తరం వారికి స్వేచ్ఛ తక్కువగా ఉంటుంది. అంతేగాక చిన్నవయసు నుంచి కుటుంబం ఒక ఉత్పత్తి యూనిట్‌గా తండ్రి అదుపాజ్ఞలలో పనిచేయడం అలవాటు వలన కూడా ఆ కుటుంబాల యువకులు స్వంత్రించి ఏ ఆలోచన చేయలేరు. కులాంతర వివాహాలు జరగాలంటే ముందుగా రెండవ తరం వారికి సాపేక్షమైన స్వేచ్ఛ అవసరం అని, అలా ఉన్నప్పుడే కులాంతర వివాహాలు విరివిగా జరగగలుగుతాయని ఇక్కడ ప్రతిపాదిస్తున్నాం. కుటుంబం సొంత ఆస్తిపై నిర్మితం కావడం, ఇంకా ఉత్పత్తి యూనిట్లుగా ఉండడం, ప్రధానంగా వ్యవసాయంలో కుటుంబం ఉత్పత్తి యూనిట్‌గా ఉండడం వలన రెండవ తరం వారికి సాపేక్షమైన స్వేచ్ఛకూడా అందడం లేదు. ఆ కారణంగానే పట్టణాలలో జరిగినట్లు గ్రామాలలో కులాంతర వివాహాలు జరగడం లేదు.

గ్రామాలలో కులానికి ప్రధానమైన కోటలు వ్యవసాయ కుటుంబాలలో ఉన్నాయన్నది సారాంశం. ఆ కుటుంబాలలో కూడా ధనిక రైతులు కులాన్ని కొనసాగించడానికి ప్రత్యేకమైన శ్రద్ధ కలిగి ఉన్నారని మనం చెప్పుకున్నాం. ఇక కులం కొనసాగింపులో మధ్యతరగతి రైతు కుటుంబం యొక్క ఆంతరంగిక ఆస్తి, ఉత్పత్తి సంబంధాలకు ఉన్న ప్రాధాన్యతకు, కుల విశ్లేషణ సాహిత్యంలో ఇంతవరకు సరియైన గుర్తింపు లేకపోవడం కారణంగా ప్రత్యేకంగా ఎత్తి రాయడం జరిగింది. అంతేగాని కులం విషయంలో ధనిక రైతు యొక్క విలన్ పాత్రను, బ్రాహ్మణీయ కుటుంబాల కుటిల పాత్రను ఎంతమాత్రం తగ్గించడానికిగాని లేదా మధ్యతరగతి రైతును ప్రధాన విలన్‌గా చూపించడానికిగాని కాదని పాఠకుడు గ్రహించాలి.

కుల నిర్మూలన:

ఇప్పుడు మనం కుల నిర్మూలన గురించి చర్చిద్దాం. ఈ సందర్భంలో ముందుగా మనం 'కుల నిర్మూలన' అనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచనను పరిశీలించాలి. కులం పోవాలంటే కులాంతర వివాహాలు జరగాలని అంబేద్కర్ ఇందులో చెప్పారు. అవును కులాంతర వివాహాలే కులం రద్దుకు పరిష్కారం. ఇందులో రెండవ అభిప్రాయం సుమారు ఎవరికీ లేదు. అయితే కులాంతర వివాహాలు జరగడానికి ఏమిటి అడ్డంకి అని పరిశీలిస్తూ అంబేద్కర్ ఎటువంటి వస్తుగతమైన కారణాలను ముందు పెట్టలేదు. 'ఉత్పత్తి శక్తుల – ఉత్పత్తి సంబంధాల' సిద్ధాంతాన్ని అంబేద్కర్ అంగీకరించరు. ఉత్పత్తి సంబంధాలలో కులానికి ఆధారం చూడకపోయినా ఆస్తిపైన, ఉత్పత్తి సాధనాలపైన అగ్రకులాలకు ఆధిపత్యం ఉంది కావున వ్యవసాయ భూములపై, మొత్తం సమాజంపై తమ ఆర్థిక, రాజకీయ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలను విభజించడానికి, ఒకరిపై ఒకరిని కాపలా ఉంచడానికి వారు కులవ్యవస్థను కోరుకుంటున్నారని, కొనసాగిస్తున్నారని కూడా ఈ రచనలో వ్రాయలేదు. అంబేద్కర్: "హిందువులు కులాన్ని పాటించడానికి వారు అమానుషమైన లేదా దుర్మార్గమైన వారు కావడం కారణం కాదు, వారు మత భావాలను లోతుగా నమ్ముతారు కావున కులాన్ని పాటిస్తారు... కాబట్టి మనం ఎదుర్కొనవలసింది కులాన్ని పాటిస్తున్నవారిని కాదు వారికి కులపరమైన మతాన్ని బోధిస్తున్న శాస్త్రాలను... కుల నిర్మూలనకు శాస్త్రాలలో ఆపాదించబడ్డ పవిత్రతను ధ్వంసం చేయడమే నిజమైన పరిష్కారం ... ప్రతి పురుషునికి, స్త్రీకి శాస్త్రాల దాస్యం నుంచి స్వేచ్ఛను కలిగించండి, శాస్త్రాల పునాదిగా వారిలో కలిగిన హానికరమైన ఆలోచనలను వారి హృదయం నుండి తొలగించండి, అప్పుడు వారు మీరు చెప్పకుండానే సహపంక్తి భోజనాలు చేస్తారు, కులాంతర వివాహాలు చేసుకుంటారు... (పేజి 41, కుల నిర్మూలన, క్రిటికల్ క్వెస్ట్ ప్రచురణ)" అని వివరించాడు. శాస్త్రాలకు ఆపాదించబడ్డ పవిత్రత అనేది హిందువులను కాలం చెల్లిన విలువలకు కట్టిపెడుతున్న మాట వాస్తవమే కాని, కులం కట్టుబాట్లు కొనసాగడానికి కావలసిన వస్తుగత పరిస్థితులు కూడా ఉన్నాయన్న గ్రహింపు అంబేద్కర్ యొక్క ఈ రచనలో కనిపించదు. ఇక, 1916 లో కొలంబియా విశ్వవిద్యాలయంలో ఒక సెమినార్‌లో ప్రవేశపెట్టిన 'భారతదేశంలో కులాలు' అన్న తన అధ్యయన పత్రంలో కాని, 1936లో ప్రసంగ పాఠంగా ప్రచురించిన 'కుల నిర్మూలన' రచనలోగాని కుల నిర్మూలనకు ఎటువంటి ఆస్తిపర లేక ఉత్పత్తి సంబంధాలపర సంస్కరణలు అంబేద్కర్ సూచించలేదు. ఇక 1947లో రాజ్యాంగ పరిషత్‌కు అఖిల భారత షెడ్యూలు కులాల సమాఖ్య తరపున తాను సమర్పించిన వినతి పత్రం 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' (ఆర్టికల్ 2, సెక్షన్ 2, క్లాజ్ 4)లో వ్యవసాయం రాజ్యం యొక్క పరిశ్రమగా ఉండాలని అలాగే సమిష్టి పద్ధతిలో సాగుచేయబడాలని వ్రాసిన విషయం తెలిసిందే. వ్యవసాయం రాజ్య పరిశ్రమగా ఉండాలని, సమిష్టిగా సాగుచేయబడాలని రాసినా ఆ చర్యలు కులాన్ని రద్దుచేయడానికి ఉపయోగపడతాయని వ్రాయలేదు. అయితే ఎత్తి రాయనంత మాత్రాన వ్యవసాయం రాజ్య పరిశ్రమగా ఉండడం మరియు సమిష్టి పద్ధతిలో సాగుచేయబడడం అనే చర్యలు, ఏవైతే గ్రామాలలో ఆర్థిక సమానత్వాన్ని సాధిస్తాయో ఆ చర్యలు, కుల నిర్మూలనకు ఉన్న వస్తుగత ఆటంకాలను తొలగించగలుగుతాయని అంబేద్కర్ భావించలేదని చెప్పలేం.

అంబేద్కర్ తన 'కుల నిర్మూలన' రచనలో సంస్కరణోద్యమం గురించి చేసిన మరొక ప్రకటనను పరిశీలిద్దాం. "సామాజిక సంస్కరణను హిందూ కుటుంబాన్ని సంస్కరించడం అనే అర్థంలో, ఇంకా హిందూ సమాజాన్ని పునర్నిర్వహించడం, పునర్మించడం అనే అర్థంలో, రెండింటి మధ్య ఉన్న ప్రత్యేకతలలో చూడాలి. విధవా వివాహం, బాల్య వివాహం మొదలగునవి మొదటిదానితో సంబంధం కలిగినవి కాగా రెండవది కుల సమాజాన్ని రద్దుచేయడంతో సంబంధం కలిగి ఉంటుంది... (పేజి 8, కుల నిర్మూలన, క్రిటికల్ క్వెస్ట్ ప్రచురణ)" ఇక్కడ అంబేద్కర్ సామాజిక సంస్కరణలను రెండు పార్శ్వాలుగా చూపిస్తున్నాడు. ఒకటి హిందూ కుటుంబాన్ని సంస్కరించడం కాగా రెండవది హిందూ సమాజాన్ని సంస్కరించడం. నిజానికి కాంగ్రెస్ వారి సంస్కరణోద్యమం, (అది ఎంతమేరకు అయితే కార్యాచరణగా మారిందో అంతమేరకు కూడా) మొదటిదానిపై దృష్టిపెట్టిందిగాని రెండవ దానిపై దృష్టిపెట్టలేదని కూడా అంబేద్కర్ అభిప్రాయం, సామాజిక సంస్కరణలో ఉన్న రెండు ప్రధానమైన పార్శ్వాలను ఈ విధంగా చూపించడం ఎంతైనా ప్రయోజనకరమైన విషయం. అయితే ఈ రెండు పార్శ్వాలు పరస్పరం సంబంధం లేనివి మాత్రం కావు. కుల అణచివేత కుటుంబంలోపల అణచివేత రెండూ పరస్పర పూరకాలుగా కొనసాగుతున్నాయి. అవి పరస్పరం పెద్ద ఎత్తున ప్రభావితం చేసుకుంటాయి. కులం పోతే కుటుంబం ప్రజాస్వామికం అవుతుంది, రెండవ వైపు నుంచి కుటుంబం ప్రజాస్వామికం అయితే కులం పోతుంది. ఇందులో ఏది జరగాలన్నా అంబేద్కర్ చెప్పినట్లు భావనాత్మక రంగాలలో మార్పు అవసరమే అయితే అందుకు ఆర్థిక రంగంలో కొన్ని మార్పులు తప్పనిసరి. కులం పుట్టుకలో ఆర్థిక కారణాలు ఉన్నాయి. కుల నిర్మూలన జరగాలంటే ఆ ఆర్థిక కారణాలు రద్దుకావాలి. ఆర్థిక రంగంలో విస్తృతమైన పారిశ్రామికీకరణ జరగకుండా కులం రద్దుకాని, కుటుంబ ప్రజాస్వామికీకరణ కాని జరగవు. నిజానికి గత ఏడు దశాబ్దాల కాలంలో కులం ఎంతమేరకు అయితే బలహీనపడిందో, కుటుంబం ఎంతమేరకు అయితే ప్రజాస్వామికీకరించబడిందో, ఆ ఫలితాల వెనక కూడా నెమ్మదిగానైనా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ పాత్ర ఉందని గుర్తించాలి. కులం అనేది కుటుంబ వృత్తిలో ఉంటే ఆ కుటుంబం ఆంతరంగికంగా ఒకరకమైన ఆధిపత్య ఉత్పత్తి సంబంధాలలో ఉందని ముందు పేరాలలో పరిశీలించాం.

భారతదేశంలో కులం గురించి మార్క్స్ ఏంగెల్స్ తమ రచన 'జర్మన్ భావజాలం'లో ఏమన్నారో ఒక్కసారి గమనిద్దాం. "భారతీయులలోనూ, ఈజిప్ట్ వారిలోనూ కనిపించిన శ్రమ విభజన యొక్క మొరటు రూపం రాజ్యంలోనూ మరియు మతంలోనూ కుల వ్యవస్థను ముందుకు తీసుకువస్తే ఆ విషయాలన్ని గమనించకుండారి కుల వ్యవస్థయే ఈ మొరటు రూపాన్ని సృష్టించిన శక్తి అని చరిత్రకారులు నమ్ముతారు.(పుట 45, వాల్యూం 1/3, మార్క్స్ ఏంగెల్స్ సంకలిత రచనలు, ఇంగ్లీషు, ప్రోగ్రెస్ పబ్లిషర్స్)" ఈ ఉటంకింపును శ్రద్ధగా పరిశీలిస్తే మార్క్స్, ఏంగెల్స్‌లు కులాన్ని స్పష్టంగా ఒక ఉత్పత్తి సంబంధాల విషయంగా చూసారని గ్రహిస్తాం. వారి ప్రధాన వ్యాసం ఐరోపాను దృష్టిలో పెట్టుకుని శ్రమ విభజన ఏలా విస్తరించిందో దాని పర్యవసానాలు ఏమిటో అన్న విషయం అయినప్పటికీ భారత్ మరియు ఈజిప్ట్‌లపై ఒక పాసింగ్ కామెంట్ చేసారు. అంబేద్కర్ జర్మన్ భావజాలం చదివాడని చెప్పలేం. అంబేద్కర్ స్వతంత్రంగానే భారత దేశంలో శ్రమ విభజన స్థానంలో, శ్రామికుల విభజన జరిగిందని విశ్లేషించి చూపాడు. మార్క్స్ ఏంగెల్స్ భారత్ మరియు ఈజిప్ట్‌లలో ఒక మొరటు రూపంలో శ్రమ విభజన జరిగింది అని చెపితే అంబేద్కర్ ఆ మొరటు రూపాన్ని వివరించినట్లు కనిపిస్తుంది. శ్రమ విభజన, శ్రామికుల విభజన రెండూ ఉత్పత్తి సంబంధాలకు చెందిన విషయాలే. అంటే భారత దేశంలో కులం ఒక ఉత్పత్తి సంబంధాలకు సంబంధించిన విషయమనే సూచన అంబేద్కర్‌లో బలంగానే కనిపిస్తుంది.

కాని ఎందుకో అంబేద్కర్ ఈ ఆలోచనారీతిని కొనసాగించలేదు. కులానికి పరిష్కారం 'ఉత్పత్తి సంబంధాల' మార్పులో కాక భావజాల సంస్కరణలో చూసాడు. అయితే అంబేద్కర్ రచనాకాలం నాటికి కులతత్వాన్ని, పితృస్వామ్యాన్ని బలపరిచే భావజాలం, మత సాహిత్య ప్రభావం చాలా ఎక్కువగా ఉండింది. ప్రజలు మత నిబంధనలను ఉల్లంఘించాలంటే, సంస్కరణలను ఆమోదించాలంటే భయపడేవారు. ఆనాడు సంఘ సంస్కర్తలందరికీ మత సాహిత్య ప్రభావమే ప్రధాన సమస్యగా కనిపించింది. వాటి పునాదులలో ఉన్న ఆర్థిక కారణాలను గమనించడం అంత సులభంగా లేకుండింది. ఇక ఆర్థిక కారణాలను పరిశీలించిన వారు కూడా వర్గ దోపిడీని గమనించారు కాని కుటుంబంలో లోపల ఉత్పత్తి సంబంధాలను గమనించలేదు. కుటుంబం లోపల ఆధిపత్యానికి, కులాధిపత్యానికి మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని చూడలేదు.

భూమి పంచితే కులం పోతుందని ఎవరైనా చెపితే వారు విషయాన్ని పూర్తిగా చెప్పలేదని అనుకోవాలి. బెంగాల్‌లో భూమి పంపకం బాగానే జరిగింది. కాని కులం పోలేదు. భూపంపకం పూర్తి అయినా కులం పోదు. భూమి పంపకం దానికదే కులాన్ని రద్దుచేయజాలదని, కుటుంబం ఒక ఉత్పత్తి యూనిట్‌గా రద్దయితేనే కులం పోవడానికి వస్తుగత పరిస్థితులు సమకూరుతాయని ఇక్కడ ప్రతిపాదిస్తున్నాము. వ్యవసాయేతర కులాలు రద్దు విషయం ముందుగా పరిశీలిద్దాం. పారిశ్రామికీకరణ వలన ఈ కులాలు చాలా వరకు రద్దు అవుతున్నాయి. ఐరోపాలో, అమెరికాలలో జరిగినట్లు భారత దేశంలో పెట్టుబడి కార్యాచరణ ద్వారా పూర్తిస్థాయి పారిశ్రామికీకరణ సాధ్యమా అనేది ఒక ప్రశ్న ఉంది. ఆ విషయాన్ని ఈ వ్యాసంలో చర్చించలేం. అర్ధ పారిశ్రామిక దేశాలలో కూడా కార్మిక వర్గ విప్లవం సాధ్యమని ఇప్పటికే చరిత్ర ఋజువు చేసింది కావున కార్మిక వర్గ విప్లవ పరిష్కారాన్ని ముందుగా పరిశీలిద్దాం. విప్లవానంతరం కార్మిక వర్గ నాయకత్వాన గల రాజ్యం తీసుకునే విస్తృత చర్యల ద్వారా ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయి. పారిశ్రామికీకరణ విస్తరిస్తుంది. ఉద్యోగావకాశాలు పెరగడంతో ఇంత వరకు చావు బ్రతుకుల మధ్య మట్టి, రాయి, కలప, ఇనుము, పత్తి, తోలు, నార, కొమ్ము వంటి వాటిపై ఆధారపడి వస్తూత్పత్తి వృత్తులు చేస్తున్నవారు వృత్తులు మానివేసి ఆధునిక ఉద్యోగావకాశాలకు తరలిపోతారు. పశువుల పెంపకం, చేపల పెంపకం పూర్తిగా పరిశ్రమలుగా మారిపోతాయి. బట్టలుతకడం, క్షవరం చేయడం, రోడ్లు ఊడ్చడం వంటి పనులు చేసేవారు కూడా ఇతర ఉద్యోగాలకు వెళ్ళిపోవడంతో అవి చేసేవారు తక్కువ అవుతారు. ఆ వృత్తులకు గిరాకీ పెరుగుతుంది. ఆ వృత్తులకు ఆదాయాలు పెరుగుతాయి, అవి కూడా వీలయినంత వరకు యాంత్రికీకరణ జరుగుతాయి. సాంస్కృతిక విప్లవం ద్వారా సామాజికంగా అవసరమైన అన్ని శ్రమలకు గౌరవం పెరుగుతుంది. కులాలకు అతీతంగా ఈ వృత్తులలోనికి ఇతరులు కూడా వస్తారు. కాలువలు, రోడ్లు ఊడ్చడం వంటి పనులు, అవి ఎంతమేరకు అయితే ఇంకా యాంత్రికీకరించబడలేదో అంత మేరకు, వారాలు వారిగా ప్రతి ఒక్కరు చేయాలనే విధానం కూడా రావచ్చు. ఈ విధంగా వస్తూత్పత్తి మరియు సేవక కులాలు రద్దు అవుతాయి. వృత్తులు రద్దయిన తరువాత ఆయా వృత్తులపై ఆధారపడే కులాలు ఎన్నాళ్ళుండగలుగుతాయి? కాని విప్లవం వ్యవసాయ వృత్తిని రద్దుచేయబోవడం లేదు. విప్లవం భూమిని పంచడం ద్వారా వ్యవసాయ వృత్తిని మరింత స్థిరపరుస్తుంది. మరి వ్యవసాయం చేసే కులాలు ఏ విధంగా రద్దవుతాయన్నది మన ప్రధాన ప్రశ్న.

ఈ ప్రశ్నకు మనమేమీ క్రొత్త సమాధానం వెదకబోవడం లేదు. చరిత్ర ఇప్పటికే స్థాపించిన సమాధానం సహకార మరియు సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు. విప్లవం భూమిని పంచుతుంది. అనంతరం రైతులను సహకార వ్యవసాయానికి, వివిధ రూపాల సమిష్టి వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటుకు కార్మిక రాజ్యం ప్రోత్సహిస్తుంది. ఎప్పుడైతే సహకార, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు ఏర్పడతాయో అప్పుడు వ్యవసాయ కుటుంబం ఒక ఉత్పత్తి యూనిట్‌గా రద్దు అవుతుంది. వ్యవసాయ కుటుంబాలలో రెండవ తరం వారు వ్యవసాయంలో కొనసాగడం క్రమంగా తగ్గిపోతుంది. వారికి ఇతర ఉపాధి అవకాశాలు కూడా లభ్యమవుతాయి. రెండవ తరం వ్యవసాయంలో కొనసాగినా వారు తన తండ్రి అదుపు ఆజ్ఞలలో పనిచేయాల్సిన పరిస్థితి రద్దుచేయబడింది. సహకార మరియు ఇతర సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో పనిచేసే కుటుంబాల సభ్యులు సమిష్టి క్షేత్రాల నాయకత్వ మార్గదర్శకత్వంలో పనిచేస్తారు. వ్యవసాయ కుటుంబం కూడా అంతరంగిక ఆధిపత్యాల నుండి విముక్తి పొంది ఒక ఆర్థిక మరియు సామాజిక యూనిట్‌గా ఒక ప్రజాస్వామిక సంస్థగా అభివృద్ధి చెందగలుగుతుంది. విద్యా, వైద్యం మాత్రమే కాక గృహ వసతి, నీరు, విద్యుత్, గ్యాస్, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ వస్తువులు, సమాచార, రవాణా సౌకర్యాలు, డేటా వంటివి కూడా రాజ్యం ఉచితంగా ఇవ్వనారంభించిన తరువాత కుటుంబం ఒక ఆర్థిక యూనిట్‌గా ఉండే అంశం కూడా క్రమంగా ప్రాధాన్యతను కోల్పోతుంది. ఇక కుటుంబం ఒక సామాజిక యూనిట్ మాత్రమే, అప్పుడు మాత్రమే కుటుంబం ఒక స్వీట్ హోమ్‌గా అభివృద్ధిచెందగలదు. కుటుంబం సమాజ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించగలదు. పట్టణాలలో కులం గ్రామాలలో ఉన్న కులంపై ఆధారపడి ఉంది. గ్రామాలలో కులం వృత్తులపై ఆధారపడి ఉంది. గ్రామాలలో వ్యవసాయ కులాలే కులానికి గట్టి పట్టుకొమ్మలు. వ్యవసాయ కుటుంబాలు సామాజిక, ఆర్థిక యూనిట్లుగా మాత్రమే కాక ఆస్తిపర, ఉత్పత్తిపర యూనిట్లుగా కూడా ఉండడం వలననే అవి అంతరంగికంగా ఆధిపత్య సంబంధాలను కలిగి ఉన్నాయి. ఈ వ్యవసాయ కుటుంబాలు సమిష్టి వ్యవసాయం ద్వారా ఆస్తిపర, ఉత్పత్తిపర యూనిట్లుగా రద్దయితే తరువాత కులానికి పాదార్థిక ఆధారాలు పోతాయి. సాంస్కృతిక పోరాటాల ద్వారా కుల భావనలను తొలగించడం, కులాంతర వివాహాలు జరగడం అప్పుడు పెద్ద ఎత్తున సాధ్యమవుతుంది. కులం నిర్మూలించబడుతుంది.

అయితే విప్లవానికి బదులు పెట్టుబడిదారీ కార్పోరేటీకరణ జరిగితే వ్యవసాయ కుటుంబాలు భూమిని కోల్పోతాయి. అయినా కులం పోదు, అందుకు విరుద్ధంగా ఉపాధిలేమి విశ్వ రూపం దాలుస్తుంది. పేదరికం, అనేకమైన అసమానతలు, అభద్రత పెరుగుతాయి. పాలక వర్గాల రాజకీయ అవసరాల వలన గ్రామీణ సమాజం మరింత మూఢ నమ్మకాలకు, మరింత ఛాందస సాంప్రదాయాలకు నిలయం అవుతుంది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ నిరంతర సంక్షోభంలో ఉన్న నేటి పరిస్థితులలో, ఉద్యోగావకాశాలులేని అభివృద్ధిగా (జాబ్‌లెస్ గ్రోత్) గా సాగుతున్న పెట్టుబడిదారీ కార్పోరేటీకరణ ప్రత్యామ్నాయ ఉపాధిని చూపించజాలదు. కాబట్టి అత్యధిక జనాభా ఎటువంటి ఉపాధి కూడా లేక నిరాధారులవుతారు. ఆదాయంలో పైన ఉన్న ఇరవై శాతానికి అసాంఘికమైన శరీర సంబంధమైన వ్యక్తిగత సేవలు (వ్యభిచారం, కిడ్నీలమ్మకం నుంచి గర్భాన్ని మోయడం వరకు) చేసి బతకవలసిన పరిస్థితికి ప్రజలు నెట్టివేయబడతారు. భయంకరమైన పేదరికం, మరణం, విధ్వంసం జరుగుతాయి. మూడు వ్యవసాయ చట్టాలు అమలు జరిగితే రాబోయే 5 సంవత్సరాల కాలంలో 5 ఎకరాలు లోపున భూకమతాలు కలిగివున్న 12.5 కోట్ల మంది రైతులు దివాళా తీస్తారు. ప్రత్యామ్నాయ ఉపాధి కూడా

లేక ఆకలి చావులు ఒక అంటువ్యాధిగా వ్యాపిస్తాయి. పనిలేక వ్యవసాయ కూలీలు, ధరల పెరుగుదల వలన గ్రామీణ పట్టణ కూలీలు కూడా ఆకలి సమస్యను ఎదుర్కొంటారు. మధ్యతరగతి తన అభివృద్ధి ఆశలను వదులుకోవలసి వస్తుంది. ప్రజల జీవనాధారాలు ఛిద్రం అవుతాయి. మానవేతిహాసంలో ఎప్పుడూ జరగనంత ఉపద్రవం జరగవచ్చు. ఆ సంక్షోభం ఒక విప్లవంగా మారుతుందా అంటే మారుతుంది. కాని వామపక్ష శక్తులు అందుకు సైద్ధాంతికంగా మరియు నిర్మాణపరంగా సిద్ధం కావలసి ఉంటుంది, వారు మొదటిగా బ్యాలెట్ బుల్లెట్ సిండ్రోమ్ నుంచి బయట పడాలి. ప్రజా ఉద్యమ నిర్మాణం, ప్రజా ఉద్యమ రాజకీయీకరణ అనే ప్రక్రియను ప్రధాన విధానంగా స్వీకరించాలి. ఈ విషయంపై వివరణాత్మక చర్చకు ఇక్కడ అవకాశం లేదు.

ఇక, ఏ మధ్య తరగతి రైతు అయితే, ఇంతకు ముందు మనం పరిశీలించినట్లు, అభివృద్ధి నిరోధకత్వానికి ముడిసరుకుగా ఉన్నాడో ఆ మధ్యతరగతి రైతు విప్లవానికి ఒక గొప్ప వనరుగా ఉండగలడు. మధ్య తరగతి రైతును కమ్యూనిస్టులు గెలుచుకోకపోతే వారు ఫాసిజం వైపు మొగ్గుతారు. వామపక్షాలు గ్రామాలను నిర్లక్ష్యం చేస్తున్నాయి లేదా పంచాయితీలు చేస్తూ ఓటుబ్యాంకులుగా నిర్వహిస్తున్నాయి. ఇక భూమి పెట్టుబడిగా మారిన నేటి పరిస్థితులలో భూమి పంపకం పోరాటాలు నామమాత్రం అయినాయనీ, గిట్టుబాటు ధరల సమస్య ప్రధాన సమస్యగా ముందుకు వచ్చిందనీ గుర్తించాలి. వ్యవసాయ చట్టాల సందర్భంలో కార్పోరేటు శక్తులకు రైతుకు మధ్య తలెత్తిన వైరుధ్యాన్ని ముందుకు తీసుకువెళ్ళాలి. గ్రామంలో భూకబ్జాదారులను, వ్యాపారుల ఏజంటులను బట్టబయలు చేయాలి. ఇతర ధనిక రైతులను కలుపుకుపోవాలి. గ్రామాలలో అత్యధిక ధనిక రైతుల ఆదాయం ప్రభుత్వ నాల్గవ స్థాయి ఉద్యోగికంటే తక్కువే అని గమనించాలి. వ్యవసాయ రంగంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, విద్యుత్ వంటి వాటిని కూడా కార్పోరేటు కబంధ హస్తాలనుంచి విముక్తి చేయడానికై పోరాడాలి, మూడు వ్యవసాయ చట్టాలకు, విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా, అలాగే గిట్టుబాటు ధరల కొరకు జరిగే ఉద్యమాలను ఆనుకొని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల వంటి వ్యవసాయ మదుపుల రంగంలో కార్పోరేటు వ్యతిరేక పోరాటాలను విస్తరించాలి. స్వంత వినియోగం కొరకు పంటలు పండించే పేద మరియు మధ్యతరగతి రైతులకు ఎరువులు పురుగుమందులు విత్తనాలపై డిమాండ్లు ప్రధానమైనవన్న విషయం తెలిసిందే. ఉద్యమంలో డిమాండ్లను విస్తరించకపోతే మరిన్ని ప్రజారాసులు ఉద్యమంలోనికి దిగవు. సరియైన సమయంలో డిమాండ్లను తగిన స్థాయిలో విస్తరించడమే ఉద్యమ రాజకీయీకరణ. కార్పోరేటు వ్యతిరేక పోరాటంలోనే బూర్జువా పార్టీలు, బూర్జువా ప్రభుత్వాలు, చివరికి బూర్జువా రాజ్య వ్యవస్థ ప్రజల ముందు బట్టబయలు అవుతాయి. కార్మిక రాజ్యమే పరిష్కారంగా జనసామాన్యానికి కనిపించినప్పుడే విప్లవానికి సమయం అవుతుంది. మనం మొదటి విషయానికి వెళితే, విప్లవం సహకార, సమిష్టి వ్యవసాయ విధానాల ద్వారా కులం రద్దుకు ప్రాతిపదికలు కల్పించగలదు.

వ్యాసాన్ని ముగించేముందు మనం ఒకసారి పునశ్చరణ చేసుకుంటే, ఎ) వృత్తుల సంఖ్య కంటే కులాల సంఖ్య ఎక్కువ. ఒకనాడు అసంఖ్యాకంగా ఉండిన గణాలు, తెగలు కులాలుగా పరివర్తన చెందించబడడంతో అలా జరిగింది, బి) ఒకే వృత్తిని ఒకటి కంటే ఎక్కువ కులాలు చేస్తున్నాయి. వ్యవసాయాన్ని రెడ్లు, కమ్మలు, కాపులు, వెలమలు, కాళింగులు, బలిజలు, తెలగలు ఇలా అనేక కులాలు చేస్తాయి. ప్రతి వృత్తినీ ఒకే ఒక కులం చేయడం లేదు కాని ప్రతి కులం ఒకే ఒక వృత్తిని కలిగి ఉంది, సి) సంప్రదాయమైన వృత్తి చేసే కుటుంబాలు అనేక సందర్భాలలో సామాజిక, ఆర్థిక యూనిట్లుగా మాత్రమే కాక ఆస్తిపర, ఉత్పత్తిపర యూనిట్లుగా కూడా ఉంటాయి. ఆ కుటుంబాలలో తండ్రి కుటుంబానికి సామాజిక అర్థంలో యజమాని మాత్రమే కాక ఆ కుటుంబం పనిచేసే ఉత్పత్తి యూనిట్‌కు కూడా యజమానే. ఈ కుటుంబాలలో కుటుంబ యజమాని కుటుంబ సభ్యుల శ్రమను నిర్దేశిస్తాడు. ఈ కుటుంబం అంతరంగికంగా, ఆధిపత్య ఉత్పత్తి సంబంధాలలో ఉండే సంస్థ. మొదటి తరంపై రెండవ తరం తన ఉపాధి కొరకు ఆధారపడి ఉంటుంది. అంతరంగికంగా ఫ్యూడల్ సాంస్కృతిక సంబంధాలలో ఉండే ఈ కుటుంబం తన బయట ఇతర కుటుంబాలతోగల కుల సంబంధాలను, ఫ్యూడల్ సంబంధాలను బలపరుస్తున్నది. డి) కులం ప్రధానంగా వ్యవసాయ కుటుంబాలు ఉత్పత్తి యూనిట్లుగా ఉండడం వలన కొనసాగగలుగుతున్నది. ఇ) భూమిని పంచినా వ్యవసాయ కుటుంబం ఉత్పత్తి యూనిట్‌గానే కొనసాగుతుంది కావున అది అంతరంగికంగా ఫ్యూడల్ సంబంధాలలోనే ఉంటుంది. యఫ్) విప్లవానంతరం సహకార లేదా ఇతర సమిష్టి వ్యవసాయ విధానాల ద్వారా మాత్రమే కుటుంబం ఒక ఉత్పత్తి యూనిట్‌గా రద్దుచేయబడి కుల నిర్మూలనకు పూర్తి ప్రాతిపదికలు ఏర్పడగలవు. అయితే అంతకు ముందు కులాంతర వివాహాలకు, కులనిర్మూలన పోరాటాలకు ప్రాధాన్యత లేదని ఎంతమాత్రమూ కాదు. ☆

సాహిత్య చరిత్రలో....41 తర్వాత...

క్రీడాకారిణిగా రాణిస్తూనే సంగీత సాహిత్యాల్లో కూడా స్థానం సంపాదించుకున్నారు. ప్రాచీన దృక్పథాన్ని విడవకుండా తెలుగు వ్యాకరణాల్ని ఛందోబద్ధంగా ఎండ్లూరి విజయకుమారి రాశారు. ఇలా దళిత స్త్రీల సాహిత్యం అంతా ఒకటి కాదు. అనేక రకాలుగా కుల, పితృస్వామ్య, దోపిడీ పీడనలకు, వివక్షలకు, వెలివేతలకు గురైన దళిత స్త్రీలు కావడమే సాధారణాంశం. వాళ్లందరూ వేర్వేరు రకాలుగా సాహిత్యంలోకి వచ్చారు. సాహిత్యంలో వ్యక్తమయ్యారు. ఇంత వైవిధ్యం సామాజిక చరిత్రలోనే ఉంటుంది. అంత కంటే సంక్లిష్టమైన భావాల చరిత్ర అయిన సాహిత్య చరిత్రలో కూడా ఉంటుంది. చరిత్రలో భాగమైన, చరిత్రకు భాగం కాలేక వివక్షకు గురైన దేన్నయినా ఈ సంక్లిష్ట సామాజిక, భావజాల క్రమంలోనే చూడాలి.

చివరగా ఉపోద్ఘాతంలో 'దళిత సాహిత్య చరిత్ర నేపథ్యం'లో సాహిత్యాల వివిధ దశల్ని వివరించుకోవాల్సిన అవసరం ఉంది. 'భావాల చరిత్రను దృష్టిలో ఉంచుకోకపోతే సాహిత్య చరిత్ర గమన సూత్రాల్ని ఆవిష్కరించలేం... తెలుగు సాహిత్య చరిత్ర రాసేటప్పుడు భావనల చరిత్రనీ వాట నిర్దిష్ట గమన సూత్రాల్ని నిరంతరం దృష్టిలో ఉంచుకోవాలి (టిఎంఎస్ సాహిత్య సర్వస్వం - 2, పేజి 47) అన్నారు. సాహిత్య చరిత్రను భావాల చరిత్రగా చూడాలి.

అయితే నల్లపొద్దు పుస్తకం దళిత మహిళల సాహిత్య సంకలనం. ఈ రూపంలో ఈ పుస్తకం దళిత సాహిత్య చరిత్రకు పునాది వేస్తుంది. ఇదొక ప్రత్యేకత. ఆ రకంగా ఇది తొలిపొద్దు. దీనికి ఇరవై ఏళ్ల వయసు వస్తోంది. ఈ ఇరవై ఏళ్లలో గతానికి కొనసాగింపుగా దళిత స్త్రీల సాహిత్య చరిత్ర ఎలా కొనసాగుతున్నది? ఆధునిక, ప్రగతిశీల, విముక్తి ప్రమాణాలతో ఎలా ఉన్నది? అనేది కూడా ఇప్పుడు పరిశీలించవచ్చు. అది నల్లపొద్దుకు మంచి కొనసాగింపు అవుతుంది. అలాంటి పనికి నల్లపొద్దు తప్పక ఇప్పటికీ ప్రేరేపిస్తూనే ఉంటుంది. తద్వారా దళిత మహిళా సాహిత్య చరిత్రలో, మొత్తంగా తెలుగు సాహిత్య చరిత్రలో వర్తమాన, భవిష్యత్తుల నిర్మాణానికి ఇప్పటికీ ఈ పుస్తకాన్ని ఆధారం చేసుకోవచ్చు. ☆

విరసం సహా 16 ప్రజాసంఘాలపై నిషేధానికి వ్యతిరేకంగా పోరాడుదాం
ఈ నిషేధాలు - నిర్బంధాలు
రాజ్యాంగ వ్యతిరేకం
08 మే 2021 శనివారం
సా. 7-00 గంటలకు
నిరసన సభ
అధ్యక్షత: అరసవెల్లి క్రిష్ణ వక్తలు: కొత్తపల్లి రవిబాబు, పెనుగొండ లక్ష్మీనారాయణ, సత్యరంజన్, కాత్యాయని విద్మహే, ఖాదర్ మొహియుద్దీన్, యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, సి.ఎస్.ఆర్. ప్రసాద్.
facebook facebook.com/virasam.org
LIVE Streaming
విప్లవ రచయితల సంఘం


వారం వారం-1 (సీరీస్ -2)
కారా స్మరణ
జూన్ 20, ఆదివారం
రాత్రి 7 గంటలకు
మాష్టారి కథలు
అధ్యక్షత: అరసవెల్లి కృష్ణ
వక్తలు:
గంటేడ గౌరునాయుడు, కెక్యూబ్ వర్మ, ఉదయమిత్ర
facebook facebook.com / virasam.org
LIVE Streaming
విప్లవ రచయితల సంఘం


వారం వారం - 2 (సీరీస్-2)
27-06-202
ఆదివారం
సా. 7-00 గం.లకు
టిప్పు సుల్తాన్-
సంఘ్ పరివార్
విద్వేష రాజకీయాలు
వక్త: సతీష్ బైరెడ్డి
విప్లవ రచయితల సంఘం
LIVE virasam.org page


జులై 4
విరసం ఆవిర్భావ దినం సందర్భంగా సభ
జులై 4 ఆదివారం
ఉదయం 10 గంటలకు
అధ్యక్షత: అరసవెల్లి కృష్ణ
అంశం: సృజనాత్మకతను నిషేధించగలరా ?
అంశం: సామాజిక మాధ్యమాలపై ఆంక్షలు - కార్పొరేట్ల ప్రయోజనాలు
సాయంత్రం: 7 గంటలకు
అధ్యక్షత: రివేరా
అంశం: రాజద్రోహ నేరం - చారిత్రక, న్యాయ పరిశీలన
అంశం: దేశీ సంస్కృతి - విప్లవ ప్రజాస్వామ్యం
LIVE STREAMING facebook.com / virasam.org


వారం వారం - 3 (సీరీస్-2)
బ్రాహ్మణవాదం
బ్రాహ్మణవాదం
పుస్తకంపై విశ్లేషణ
వక్త: మెట్టు రవీందర్
19-07-2021 సోమవారం సాయంత్రం 7 గంటలకు
LIVE STREAMING facebook.com / virasam.org


కా॥ చలసాని ప్రసాద్ & కా॥ ఆలూరి భుజంగరావు
వర్ధంతి సభ
25-07-2015
30-06-2013
25
అధ్యక్షత: అరసవెల్లి క్రిష్ణ
అంశం: భాష, సంస్కృతి, మతతత్వం
వక్త: రమేష్‌పట్నాయక్
అంశం:
ఫాదర్ స్టాన్‌స్వామి హత్య- భారత ప్రజాస్వామ్యం
వక్త: రివేరా
విప్లవ రచయితల సంఘం
LIVE STREAMING facebook.com / virasam.org

కరుణాకర్ గురించి
మాట్లాడుకుందాం
31
జులై 2021
శనివారం
రాత్రి 7 గంటలకు
అధ్యక్షత: వరలక్ష్మి
వక్తలు:
రాఘవరెడ్డి,
నూకతోటి రవికుమార్, మంచికంటి,
శ్రీనివాస్ గౌడ్, వెంకటకృష్ణ
విప్లవ రచయితల సంఘం
LIVE STREAMING facebook.com / virasam.org

KLVA101M196

TARA A Literary and Cultural Telugu Monthly Journal RNI Regn. No. 21152/72
August, 2021, Vol. : 49, Issue : 5, Vijayawada

అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి
శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విప్లవ రచయితల సంఘం అధికార పత్రిక అరుణతార 1977 నవంబర్ నుంచి మాస పత్రికగా వస్తోంది. సాహిత్య సాంస్కృతిక సంస్థగా విరసం విప్లవ, విప్లవ సాహితోద్యమాల్లో నిర్వచించుకున్న తన రాజకీయ, సాహిత్య, మేధో పాత్రకు వాహికగా తెలుగు సమాజంపై ప్రభావం వేస్తున్నది. గత మూడు తరాలుగా ఎందరో రచయితల, బుద్ధిజీవుల ఆలోచనా వికాసానికి వేదికగా ఉన్నది. సాహిత్య పత్రిక అయినప్పటికీ సామాజిక, రాజకీయార్థిక, సిద్ధాంత విశ్లేషణలకు, చర్చలకు, అన్వేషణకు సృజనశీలమైన మాధ్యమంగా కొనసాగుతున్నది. నక్సల్బరీ శిశువుగా విరసం తాను ఎంచుకున్న విప్లవోద్యమ ప్రచార కర్తవ్యంలో అరుణతార పాత్ర గణనీయం. 1970లలో ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణ దశ నుంచి ఇవాళ దేశవ్యాప్తంగా సాగుతున్న విప్లవ, ప్రజా పోరాట సంచనాలను అరుణతార తన శక్తినంతా వెచ్చించి అక్షరబద్ధం చేస్తున్నది. మరీ ముఖ్యంగా చత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం దుర్మార్గాలు మొదలైనప్పటి నుంచి ఇవ్వాల్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశ, సాల్వాజుడుం రెండో దశ దాకా దండకారణ్య ప్రజా యుద్ధాన్ని, ప్రజారాజ్యాధికారాన్ని, ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్నీ, అక్కడ సాహిత్య, సాంస్కృతిక వికాసాన్నీ తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నది, విశ్లేషిస్తున్నది. దండకారణ్య విప్లవోద్యమానికి సంఘీభావ హస్తాన్ని అందిస్తున్నది. ఈ పనిలో ఇతర ప్రజాస్వామిక పత్రికల పాత్ర కూడా ఉన్నప్పటికీ అరుణతార దాన్నే ఒక ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది. ఇటీవల పెరిగిపోయిన హిందూ ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక కంఠస్వరాన్ని బలంగా వినిపిస్తున్నది. వేర్వేరు సామాజిక ఉద్యమాల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వాటి న్యాయబద్ధతను విశ్లేషిస్తున్నది.

ప్రజాఉద్యమాల్లోని కార్యకర్తల సృజనాత్మక వ్యక్తీకరణలకు అరుణతార అవకాశం ఇవ్వడం వల్ల వాళ్లలోంచి ఎందరో ప్రతిభావంతులైన ఆలోచనాపరులు, రచయితలు తయారువుతున్నారు. అరుణతార ఈ పని ఆది నుంచి చేస్తున్నది. అందువల్ల ఒక పక్క లబ్ధప్రతిష్టుల రచనలతోపాటు ఎప్పటికప్పుడు కొత్త గొంతులు అరుణతారలో వినిపిస్తుంటాయి.

అయితే మొదటి నుంచీ అరుణతార అనేక ఆర్థిక, నిర్వహణ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఒక్కోసారి ఈ ఇబ్బందులు కాస్త తక్కువగా ఉన్నా, ఇటీవల తీవ్రమైన సంక్షోభాల మధ్య ఎప్పటికప్పుడు అభిమానుల, మిత్రుల అండదండలతో నడుస్తున్నది. గతంలో ఒకసారి అరుణతారకు విరాళాలు వద్దు.. చందాలు కట్టండనే ఆదర్శాన్ని కూడా అమలు చేసింది. అయితే నానాటికి పెరుగుతున్న ప్రెస్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు మోయలేని భారమయ్యాయి. దీంతో రెండు నెల్లకో సంచిక వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పేజీలు పెంచి పాఠకులకు మరిన్ని రచనలు అందిస్తూ వచ్చాం.

ఈ అన్ని అనుభవాల దృష్ట్యా అరుణతారకు శాశ్వత నిధి తయారు చేయకుండా ఇక పత్రికను నాలుగు కాలాల పాటు నడపడం అయ్యేపని కాదని తేలింది. ఇంత కాలం అభిమానుల సహకారంతోనే నడుస్తూ వచ్చిన అరుణతార ఈసారి శాశ్వత నిధి కోసం మీ ముందుకు వచ్చింది. ఇవాళ ఉన్న విప్లవోద్యమ ప్రత్యేక పరిస్థితుల్లో అరుణతార అవసరం ఎంత ఉన్నదో పాఠకులకు తెలుసు. తెలుగు నేల మీద, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న అసంఖ్యాక విప్లవాభిమానులు తలా ఒక చేయి వేస్తే శాశ్వత నిధి సమకూరడం కష్టమేమీ కాదని మా నమ్మకం. దాంతోనే మీ ముందుకు వచ్చాం. విప్లవోద్యమ రాజకీయ, సాంస్కృతిక వేదిక అరుణతారకు మీవంతు విరాళాలు ఇవ్వాలని, ఇప్పించాలని కోరుకుంటూ...

అరసవిల్లి కృష్ణ,- విరసం అధ్యక్షుడు, **ఎంఎ బాసిత్**-ఉపాధ్యక్షుడు, **కాశీం**-కార్యదర్శి, **రివేరా**-సహాయకార్యదర్శి,
వరవరరావు, టి. కృష్ణాబాయి, సిఎస్ఆర్ ప్రసాద్, జి. కళ్యాణరావు, వి. చెంచయ్య, అల్లం రాజయ్య,
ఎం. రత్నమాల, పాణి, పి. వరలక్ష్మి, రాంకీ

చందాలు, విరాళాలు పంపాల్సిన చిరునామా :

అరసవిల్లి కృష్ణ, 6-1/16-7A/1, పెద్దిరాజు స్ట్రీట్, ప్రైజర్‌పేట, విజయవాడ-520001

చెక్‌లు/డ్రాఫ్టులు/ఆన్‌లైన్‌లో పంపడానికి :

A. Krishna, Bank : State Bank of India, A/c. No. 52018355595, IFSC : SBIN0020714,
Branch : Vagu Center, Vijaywada.

If undelivered please return to:

ARUNATAARA
6-1/16-7A/1, Peddiraju Street
Prizer peta, Vijayawada - 520 001
Andhrapradesh

TO
Mr/Mrs.______________________

EDITED, PRINTED, PUBLISHED BY ARASAVILLI KRSIHNA AND OWNED BY DUVVURI VENKATA KRISHNA RAO. PRINTED AT VISALAANDHRA VIGNANA SAMITHI, CHANDRAM BUILDINGS, CHANDRA RAJESWARA RAO ROAD, MACHAVARAM (PO), VIJAYAWADA - 520 004, ANDHRAPRADESH STATE (New Declaration Filed). PUBLISHED AT 6-1/16-7A/1, PEDDIRAJU STREET, PRIZER PETA, VIJAYAWADA - 520 001, ANDHRAPRADESH STATE. EDITOR : ARASAVILLI KRISHNA

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M196
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	nazma
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good